www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

16 అనంతపురం

గురువారం 24 ఆగస్టు 2017



విదేశీ నిధుల కోసమేనా?

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

యువర్స్ ఫౌండేషన్ తీరుపై

వైద్య శాఖ అడిషనల్ డైరెక్టర్ సీరియస్



- ఎవరి అనుమతితో వ్యాక్సిన్ వేస్తున్నారని ఆగ్రహం
- డిగ్రీ విద్యార్థులకు ఎంఆర్ వ్యాక్సిన్ వేయడమేంటి?
- స్వయంగా జోక్యం చేసుకున్న అడిషనల్ డైరెక్టర్
- తక్షణమే నివేదిక పంపాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓకు ఆదేశాలు
- ఫౌండేషన్ సభ్యుడి క్లినిక్‌లో తనిఖీలు
- కనీస ప్రమాణాలు కూడా పాటించని యువర్స్ ఫౌండేషన్
- కాలం తీరనున్న వాక్సిన్ బాటిళ్లు స్వాధీనం

12



రొద్దంలోని వ్యవసాయ కార్యాలయం వద్ద బుధవారం ప్రత్యామ్నాయ విత్తనం కోసం బారులు తీరిన రైతులు

తీరని వ్యథ!



రెండో రోజూ.. అస్తవ్యస్తమే!

- ఉదయం 11.30 వరకే పనిచేసిన సర్వర్
- ఆపై సాయంత్రం వరకూ మొరాయింపు
- ప్రత్యామ్నాయ విత్తన పంపిణీకి అంతరాయం
- గంటల తరబడి రైతుల ఎదురుచూపు
- వేలాది మంది నిరాశతో వెనక్కి
- పట్టించుకోని ఉన్నతాధికారులు

12



ఉత్త గ్యాస్!



బుక్కరాయసముద్రం మండలం వెంకటాపురం ఉన్నత పాఠశాలలో ఆరుబయటే కట్టెల పొయ్యిపై వంట చేస్తున్న దృశ్యం

పొగలేని బువ్వకు కాసుల కష్టాలు

- డబ్బులు లేవంటూ ఉపాధ్యాయుల గుర్రు
- 639 పాఠశాలలకు మాత్రమే కొనుగోలు
- విద్యాశాఖ కొత్త నాటకం
- దాతల నుంచి సేకరించాలని సలహా
- కొనుగోలు చేస్తే రీయింబర్స్‌మెంట్ చేస్తామని మెలిక

అనంతపురం అర్బన్

'పొగలేని బువ్వ'ను కాసుల కష్టాలు వెంటాడుతున్నాయి. గ్యాస్ కనెక్షన్ల కొనుగోలుకు పైసలు లేక ఉపాధ్యాయులు అవస్థలు పడుతున్నారు. అందుకే కొంతమంది మాత్రమే కనెక్షన్లు తీసుకున్నారు. అధికారిక లెక్కల ప్రకారం 639 పాఠశాలలు మాత్రమే గ్యాస్ కనెక్షన్లు తీసుకున్నట్లు తెలుస్తోంది. మిగిలిన పాఠశాలల్లో కొన్నిచోట్ల డబ్బులు లేవంటూ ఆ పాఠశాలల ఉపాధ్యా యులు తిరుగుబాటు చేస్తుండగా.. మరికొన్ని చోట్ల.. 'గ్యాస్ కనెక్షన్ తీసుకోవచ్చు.. అయితే గ్యాస్ సరఫరా ఎలా?' అంటూ మెలికపెట్టి మిన్నకుండిపోతున్నారు. దీంతో విద్యాశాఖ కూడా కొత్తనాటకానికి తెరలేపింది. పూర్వ విద్యార్థులు, దాతల నుంచి నిధులు సేకరించి గ్యాస్ కనెక్షన్లు తీసుకోవాలని ఉచిత సలహా ఇస్తోంది. ఒకవేళ పాఠశాల నిధులు లేకపోతే హెచ్‌ఎంలు సొంత నిధులతో కొనుగోలు చేస్తే.. వారికి రీయింబర్స్‌మెంట్ చేస్తామని చెబుతోంది. అయితే ఆచరణలో విద్యాశాఖ ఆదేశాలు అమలు కాలేదు. దీంతో ఆరు బయటే వంట చేసి పిల్లలకు వడ్డిస్తున్నారు. వివరాలు కింది విధంగా ఉన్నాయి.

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వంటలు గ్యాస్ స్టవ్‌పైనే చేసి పిల్లలకు వడ్డించాలని ప్రభుత్వం ఆదేశించింది. పాఠశాలల నిధుల నుంచి గ్యాస్ కనెక్షన్లు కొనుగోలు చేయాలని, ఆ తర్వాత రీయింబర్స్‌మెంట్

మిగతా 12లో

రోడ్డెక్కిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు

- ఏఈలపై సస్పెన్షన్ ఎత్తివేయాలంటూ కలెక్టర్‌కు వినతి
- తొలుత పనితనం చూపాలన్న కలెక్టర్
- న్యాయం కోసం అధికారుల డిమాండ్
- నల్ల రిబ్బన్లతో ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం వద్ద నిరసన
- నేటి నుంచి సామూహిక సెలవులో ఉద్యోగులు

6

అంతర్మథనంలో ఆర్‌డబ్ల్యూఎస్

అధికారులు

- ఏఈల సస్పెన్షన్‌పై అంతర్గత సమావేశం
- సస్పెన్షన్లు బాధాకరం..
- ఐక్యత, బాధ్యత ఎంతైనా అవసరం



ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం వద్ద నల్లరిబ్బన్లతో నిరసన తెలుపుతున్న అధికారులు

జీసీడీఓ నియామకం దిశగా

ఎస్‌ఎస్‌ఏ అడుగులు

మహిళా స్కూల్ అసిస్టెంట్లకు అవకాశం

అనంతపురం అర్బన్: సర్వశిక్ష అభియాన్(ఎస్‌ఎస్‌ఏ)లో అత్యంత కీలకమైన గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (జీసీడీఓ) పోస్టు భర్తీ దిశగా అడుగులు పడుతున్నాయి. ప్రస్తుతం ఆ శాఖలో ఈ పోస్టు ఖాళీగా ఉంది. పోటీ పరీక్షల్లో ప్రతిభ చూపిన మహిళాప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీ శిరీష ఎంపికైనా బాధ్యతలు చేపట్టడానికి ఆమె నిరాకరించారు. దీంతో తాజాగా మరోసారి జిల్లా కలెక్టర్ ఆమోదం తీసుకుని దరఖాస్తుల స్వీకరణకు నోటిఫికేషన్ ఇచ్చారు. ఉన్నత పాఠశాలల మహిళా ప్రధానోపాధ్యాయులు, మహిళా డైట్ లెక్చరర్స్‌కు అవకాశం కల్పించారు. కానీ జిల్లా నుంచి ఒక్కరుకూడా దరఖాస్తు చేసుకోవడానికి ముందు కు రాలేదు. దీంతో నెలలతరబడి జీసీడీఓ పోస్టు ఖాళీగానే ఉంది. దీంతో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ(కేజీబీవీ)ల పర్యవేక్షణ అటకెక్కింది. ఈ క్రమంలో జీసీడీఓ నియామకంపై ఎస్‌ఎస్‌ఏ అధికారులు దృష్టి సారించారు. బుధవారం జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీడీ గుర్రం శ్రీనివాస్, అడిషనల్ ఎస్పీడీ మధుసూదన్‌రావు ఈ పోస్టు విషయమై జిల్లా ఎస్‌ఎస్‌ఏ పీఓతో చర్చించారు. ఎవరూ ఆసక్తి చూపడం లేదని, ఒక్కరు కూడా దరఖాస్తు చేసుకోలేదని పీఓ వారి దృష్టికి తీసుకెళ్లగా.. రాష్ట్ర అధికారులు అవాక్కయ్యారు. దీంతో ప్రత్యామ్నాయ ఆలోచన చేశారు. కింది కేడర్ స్థాయివారికి అవకాశం కల్పిస్తే వచ్చేవారుంటారా..? అని ప్రశ్నించారు. మహిళా స్కూల్ అసిస్టెంట్లకు అవకాశమిస్తే వచ్చే అవకాశముంటుందని పీఓ సూచించారు. అయితే వెంటనే ఆ మేరకు రాష్ట్రశాఖకు లేఖ పంపండి.. ఆమోదం వేసి పంపుతామని ఎస్పీడీ సూచించారు. దీంతో మహిళా స్కూల్ అసిస్టెంట్లకు జీసీడీఓ బాధ్యతలు అప్పగించేందుకు ఎస్‌ఎస్‌ఏ నిర్ణయించింది. త్వరలో ఈ ప్రక్రియ చేపట్టే అవకాశముందని పీఓ తెలిపారు.

ప్రత్యామ్నాయ విత్తనాలందజేయండి

అనంతపురం కలెక్టరేట్: ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హులైన రైతులకే ప్రత్యామ్నాయ విత్తనాలు పంపిణీ చేయాలని జేసీ-2 ఖాజామొహిద్దీన్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సీజన్‌లో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకునే రైతులు మాత్రమే ప్రభుత్వం అందించే సబ్సిడీ విత్తనాలు తీసుకోవాలన్నారు. ఈ క్రాపింగ్ ఆధారంగా పంట వేయని రైతులకు వందశాతం సబ్సిడీతో ప్రత్యామ్నాయ విత్తనాలు ఇవ్వనున్నామన్నారు. వాటిని తీసుకుని సాగు చేయకపోతే రికవరీ చేస్తామన్నారు. అలాగే రాబోయే కాలంలో రాయితీ విత్తనం పొందేందు కు అనర్హులుగా ప్రకటిస్తామన్నారు. ప్రైవేటు హైబ్రిడ్ రకాలయిన ప్రొద్దుతిరుగుడు, సజ్జ, జొన్న, మొక్కజొన్న తదితర విత్తనాలకు గరిష్టంగా కేజీపై రూ.50ల రాయితీ అందించనున్నామన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

క్రాప్ హాలిడేకి రైతులు సంసిద్ధులు కావాలి

పంటలు వేసుకోవద్దని హెచ్చెల్సీ ఈఈ సూచన

కణేకల్లు: ప్రస్తుతం తుంగభద్ర డ్యామ్‌లో జిల్లా ప్రజల తాగునీటి అవసరాలకు సరిపడా నీరు కూడా లేనందున ఎగువకాలువ (హెచ్చెల్సీ) ఆయకట్టు కింద క్రాప్ హాలిడేకి రైతులు సంసిద్ధులు కావాలని హెచ్చెల్సీ ఈఈ వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. స్థానిక హెచ్చెల్సీ అతిథి గృహంలో బుధవారం కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాలకు చెందిన నీటి సంఘాల అధ్యక్షులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం డ్యామ్‌లో ఉన్న 54 టీఎంసీల నీటిలో 8.11 టీఎంసీల నీటిని హెచ్చెల్సీకి కేటాయించనున్నారన్నారు. జిల్లాలో తాగునీటికి 10.5 టీఎంసీల నీరు అవసరం ఉండగా.. 8.11 టీఎంసీలు మాత్రమే ఇస్తే.. ఇంకా తాగునీటికే రెండు టీఎంసీల నీరు తక్కువగా వచ్చే పరిస్థితులుంటాయన్నారు. వర్షాభావ పరిస్థితుల వల్ల పూర్తిస్థాయిలో తాగునీరే అందించలేకుండా పోతున్నామని, ఇలాంటి పరిస్థితుల్లో రైతులు పం టలు సాగు చేసుకుంటే వారికి ఎట్టిపరిస్థితుల్లోను నీరివ్వడం సాధ్యపడదన్నారు. కాబట్టి ఆయకట్టు భూముల రైతులు తడి, ఆరుతడి పంటలు ఏవీ సాగు చేసుకోకుండా ఈ ఏడాది క్రాప్ హాలిడే పాటిస్తే బాగుంటుందని ఆయన సూచించారు. తాగునీటి అవసరాలకు గుంతకల్లు బ్రాంచ్ కెనాల్(జీబీసీ), పీఏబీఆర్ డ్యామ్, ఎంపీఆర్ సౌత్ కెనాల్, సీబీఆర్, మైలవరం రిజర్వాయర్‌తో పాటు రాయదుర్గం, గడేకల్లు, కొనకొండ్ల, గుంతకల్లు మున్సిపాలిటీ, అనంతపురం నగర పాలక సంస్థ, సత్యసాయి స్కీమ్ పరిధిలోని 700 గ్రామాలు, శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం, కళ్యాణదుర్గం, హిందూపురం, బుక్కరాయసముద్రం, కదిరి, పుట్టపర్తి, పులివెందుల, ధర్మవరం, జమ్మలమడుగు, మైలవరం వంటి అనేక ప్రాంతాలకు నీటిని కేటాయించనున్నామన్నారు. ఈ ఏడాది హంద్రీనీవా నీరు కూడా రాని పరిస్థితి ఉండడంతో అనంతపురం, కడప, కర్నూలు జిల్లాలు కేవలం హె చ్చెల్సీ నీటిపైనే ఆధారపడే పరిస్థితి ఏర్పడిందన్నారు. మనకు కేటాయించిన 8.11 టీఎంసీల నీటిని రోజూ 9వేల క్యూసెక్కుల ప్రకారం డ్రా చేసి నవంబర్ 12 వరకు వాడుకునేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఒకవేళ రాబోయే రోజుల్లో డ్యామ్‌లో నీటి పరిస్థితి ఆశాజనకంగా ఉంటే ఆరుతడి పంటలకైనా అవకాశమిచ్చేలా చర్యలు తీసుకోవాలని నీటి సంఘం అధ్యక్షులు ఈఈ దృష్టికి తీసుకువచ్చారు. అలాగే అక్రమ నీటిచౌర్యాన్ని అరికట్టి, పోలీసు భద్రత పెంచాలని వారు డిమాండ్ చేశారు. క్రాప్ హాలిడే ప్రకటిస్తే రైతులు తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి ఉన్నందున ప్రభుత్వం రైతులకు పరిహారం ఇప్పించేలా తగిన చర్యలు తీసుకోవాలని 7వ డిస్ట్రిబ్యూటరీ సంఘం అధ్యక్షుడు మాబూసాబ్ కోరారు. ఇప్పటికే వర్షాలు లేక మెట్ట భూముల రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారని, ప్రతిఏటా కొంతమేరకైనా పంటలు సాగు చేసుకునే హెచ్చెల్సీ రైతుల పరిస్థితి ప్రస్తుతం దయనీయంగా మారిందని, ఇలాంటి పరిస్థితుల్లో వారు ఆత్మహత్యలే శరణ్యంగా భావించాల్సి వస్తుందన్నారు. ఏదిఏమైనప్పటికీ ఈ ఏడాది ఎట్టి పరిస్థితుల్లోనూ పంటలు సాగు చేసుకోకూడదని అధికారులు కరాఖండిగా చెప్పడంతో రైతులు తీవ్ర నిరుత్సాహంలో మునిగిపోయారు. ఈ కార్యక్రమంలో డీఈ రామసంజన్న, డీసీ కమిటీ అధ్యక్షుడు కేశవరెడ్డి, ఉపాధ్యక్షుడు చంద్ర, కాంతారావు, రమేష్, మోహన్‌దాస్, తిప్పేస్వామి, గంగాధర, ఏఈలు దివాకర్‌రెడ్డి, నరేంద్ర మారుతి, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హెచ్చెల్సీ ఈఈ వెంకటరమణారెడ్డి

ఇసుక మాఫియా, బెల్ట్ షాపుల

నిర్మూలనపై పటిష్ట చర్యలు

అనంతపురం కలెక్టరేట్: జిల్లాలో ఇసుక మాఫియా, బెల్ట్ షాపుల నిర్మూలనపై పటిష్ట చర్యలు తీసుకోవాలని ప్రభుత్వప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ ఆదేశించారు. జిల్లా కలెక్టర్లతో బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన ప్రభుత్వ పథకాల అమలు తీరుపై సమీక్షించారు. జిల్లాలోని అన్ని ప్రాంతాలు,సరిహద్దు ప్రాంతాల్లో ఇసుక అక్రమ రవాణా పూర్తిగా నిరోధించాలన్నారు. ఇతర రాష్ట్రాలకు అక్రమ రవాణాను అరికట్టాలన్నారు. చెక్‌పోస్టుల వద్ద తనిఖీలతోపాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఆ మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. బెల్ట్ షాపుల నిర్మూలనకు ప్రత్యేకచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వనం-మనంకార్యక్రమం క్షేత్రస్థాయిలో అమలు జరిగేలా చూడాలన్నారు. ఎన్టీఆర్ గృహ నిర్మాణంలో పురోగతి సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్వచ్ఛభారత్‌లో భాగంగా వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంలో పురోగతి చూపాలన్నారు. కలెక్టర్ వీరపాండ్యన్ మాట్లాడుతూ... జిల్లాలో 1.06 కోట్ల మొక్కలకుగాను ఇప్పటివరకు 10.50 లక్షల మొక్కలు నాటినట్లు ఆ యన దృష్టికి తీసుకువెళ్లారు. ఇళ్ల నిర్మాణం వేగవంతం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ-2 ఖాజామొహిద్దీన్, డీఆర్ఓ మల్లీశ్వరి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ రఘునాథ్, డ్వామా పీడీ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

నంద్యాలలో 25 వేల మెజార్టీతో టీడీపీ గెలుపు ఖాయం

జగన్ ఇక చాప చుట్టేయాల్సిందే: ఎమ్మెల్యే గోనుగుంట్ల

ధర్మవరం: నంద్యాల ఉప ఎన్నికల్లో తెలుగు దేశం పార్టీ తరపున పోటీ చేసిన భూమా బ్రహ్మానందరెడ్డి 25 వేల మెజార్టీతో గెలుపొందడం ఖాయమని తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి, ధర్మవరం ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరుల స మావేశంలో ఆయన మాట్లాడుతూ...నంద్యాల ఉప ఎన్నికల ప్రచారంలో స్థానికుల నుంచి విశేష స్పందన లభించడం తమకెంతో ఆనందాన్నిస్తోందన్నారు. అభివృద్ధి చూసి ప్రజలు ఓటేశారన్నారు. వైఎస్.జగన్ 15 రోజుల పాటు నంద్యాలలోనే మకాం వేసి గల్లీ గల్లీ తిరిగి కిరాయిమనుషులతో ప్రచారం చేయించుకోవడం ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. జగన్ ఎన్ని రోజులు తిరిగినా వ్యర్థమన్నారు. ముఖ్యమంత్రిని కాల్చండి, ఉరి తీయండి అంటూ జగన్ చేసిన వ్యాఖ్యల పట్ల నంద్యాల ప్రజలే కాకుండా రాష్ట్ర ప్రజలంతా అసహ్యించుకుంటున్నారన్నారు. జగన్ ఎన్ని జిమ్మిక్కులు చేసినా 2019లో సీఎం పదవి కాదు కదా! ప్రతిపక్ష హోదా కూడా దక్కదన్నారు. ఇక వైసీపీ చాప చుట్టేసే కాలం ఆసన్నమైందన్నారు.

అనంతలో త్వరలో అన్న క్యాంటీన్లు

మేయర్ స్వరూప, కమిషనర్ మూర్తి



ఎన్టీఆర్ క్యాంటీన్ల ఏర్పాటుకు స్థలాలు పరిశీలిస్తున్న మేయర్ స్వరూప, కమిషనర్ మూర్తి

అనంతపురం కార్పొరేషన్: నగరంలో త్వరలో ఏడు అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేయనున్నట్లు మేయర్ స్వరూప పేర్కొన్నారు. బుధవారం కమిషనర్ మూర్తితో కలిసి నగరంలో ఆమె అన్న క్యాంటీన్ల ఏర్పాటుకు అనువుగా ఉన్న స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...నగరానికి ఏడు అన్న క్యాంటీన్లు మంజూరయ్యాయన్నారు. రూ. 5 లకే భోజనం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. నగరంలోని టవర్ క్లాక్ వద్ద గల మున్సిపల్ కాంప్లెక్స్, తాడిపత్రి బస్టాండు వద్ద గల వాటర్ ట్యాంక్, వాల్మీకి స్కూల్, కమ్మ భవన్, బళ్లారి బైపాస్, బస్టాండు, రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాల్లో వాటి ఏర్పాటు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. వారం రోజుల్లో వాటిని ఏర్పాటుచేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ క్యాంటీన్లను ఇ స్కాన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యుడు కృష్ణకుమార్, ఇస్కాన్ సభ్యులు పాల్గొన్నారు.

ఆలయ సమాచారం

కసాపురం

కసాపురంలోని శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయంలో గురువారం తెల్లవారుజామున 4 గంటలకు అభిషేకాలు, అలంకారాలు, పూజా కార్యక్రమాలు. 5 గంటలకు సర్వదర్శనం. మధ్యాహ్నం 12 గంటలకు మహానివేదన, మహా మంగళ హారతి. మధ్యాహ్నం ఆలయం మూసివేత. 2 గంటలకు ఆలయంలో పూజల పునఃప్రారంభం. సాయంత్రం స్వామివారికి ప్రత్యేక పూజలు జరుగుతాయి. రాత్రి 8 గంటలకు మహామంగళ హారతి.



ఖాద్రి

శ్రీ ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో 24 గురువారం ఉదయం 5.30 గంటల నుంచి 7 గంటల వరకు శ్రీవారి దర్శనం ఉంటుంది. 7.30 గంటల నుంచి 10 గంటల వరకు అభిషేకాలు ఉంటాయి. 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శ్రీవారి దర్శనం ఉంటుంది. సాయంత్రం 4.30 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు శ్రీవారి దర్శనం ఉంటుంది.



మినీ లోకం



డాక్టర్‌గారు థర్మామీటర్ పెట్టమన్నది నోట్లో..!!



రైల్వేస్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న జీఎం అరుణ్‌గుప్తా

రైల్వే స్టేషన్ తనిఖీ చేసిన జీఎం

హిందూపురం టౌన్: సౌత్ వెస్ట్రన్ బెంగళూరు డివిజన్ రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌గుప్తా బుధవారం హిందూపురం రైల్వే స్టేషన్‌ను తనిఖీచేశారు. ఈ సందర్భంగా మలుగూరు వద్ద ట్రాక్ పనులు, 268 బ్రిడ్జి పనులు, పెనుకొండ రైల్వే స్టేషన్‌ను తనిఖీచేశారు. అనంతరం హిందూపురం చేరుకుని రైల్వేస్టేషన్, ప్లాట్ ఫాం ట్రాక్‌ను, పార్కింగ్, టికెట్ కౌంటర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇక్కడి అధికారులతో కొన్ని సమస్యలపై ఆరా తీశారు. ముఖ్యంగా డబుల్ ట్రాక్ పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇటీవలి రైలు ప్ర మాదాల నేపథ్యంలో ట్రాక్ పనులు పటిష్టంగా చేయాలని, సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ సందర్భంగా సౌత్ వెస్ట్రన్ మజ్దూర్ యూనియన్ నాయకులు ఆయనను సత్కరించారు. జీఎం వెంట డీఆర్ఎం ఆర్ఎస్ సక్సేనా, సీఏఓ అశోక్‌గుప్తా, స్థానిక రైల్వే అధికారులు ఉన్నారు.

ట్రెజరీకి టీచర్ల బదిలీల జాబితా

జీతాలపై వీడిన ఉత్కంఠ

అనంతపురం అర్బన్: బదిలీ టీచర్ల జీతాలపై ఉత్కంఠ వీడింది. బదిలీ అయిన ఉపాధ్యాయుల వివరాలను జిల్లా ఖజానాశాఖకు జిల్లా విద్యాశాఖ అందజేసింది. డీఈఓ లక్ష్మీనారాయణ, ఏఎ్‌సఓ జయచంద్రనాయుడు స్వయంగా వెళ్లి జిల్లా ఖజానాశాఖాధికారిని కలిసి జాబితా అందజేశారు. గతంలో ఎన్నడూ లేనివిధం గా ఈసారి 7వేల మందికి పైగా ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లారు. కొత్త పాఠశాలల్లో వేతనాలు అందాలంటే వారి వివరాలను విద్యాశాఖ అధికారికంగా ఖజానా శాఖకు అందజేయాల్సి ఉంటుంది. అయితే రేషనలైజేషన్ ప్రక్రియలో కొన్ని పాఠశాలలకు అదనంగా ఉన్న నిధులనే రెండు బిల్లులకు కేటాయించారనే ప్ర చారం జరిగింది. నార్పల మండలం బండ్లపల్లి, గూగూడు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఇలాగే ఒక్కొక్కచోట రెండేసి నిధులు కేటాయించారని తేలింది. బదిలీల్లో కేటాయించినా.. ఆ పోస్టులు ఎక్కడినుంచి సర్దుబాటు చేశారో చూపలేదు. కేడర్ స్ట్రెంగ్త్‌లో కూడా ఆ పోస్టులు చూపలేదు. దీంతో జీతాల సమస్య ఏర్పడింది. ఇలాగే మరికొన్ని ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లోనూ స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీ టీచర్లను కేటాయించినట్లు ఫిర్యాదులు వచ్చాయి. ఈనేపథ్యంలో ఈ నెల వేతనాలు అందుతాయా? లేదా? అనే అనుమానాలు వ్యక్తమవుతూ వచ్చాయి. అయితే ఆయా పోస్టులను రెక్టిఫై చేసి ఇచ్చామని, ఎక్కడా జీతాల సమస్య ఉం డదని డీఈఓ, ఏఎ్‌సఓ ఆంధ్రజ్యోతికి తెలిపారు. దీంతో జీతాలపై కొనసాగుతున్న ఉత్కంఠకు తెరపడినట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఉపాధ్యాయులు ఊపిరి పీల్చుకుంటున్నారు.

వైద్యసేవల్లో నిర్లక్ష్యం తగదు

ఎన్‌సీడీ సేవలు పూర్తిస్థాయిలో అందించాలి

మాతాశిశు మరణాలు నివారించాలి

అడిషనల్ డైరెక్టర్ గీతాప్రసాదిని



ఎన్‌సీడీ సెంటర్‌ను ప్రారంభిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ ఏడీ గీతాప్రసాదిని

అనంతపురం వైద్యం: ప్రభుత్వాస్పత్రుల్లో పని చేస్తున్న వైద్యులందరూ రోగులకు సకాలంలో వైద్యసేవలందించాలని, ఇందులో ఏమాత్రం నిర్లక్ష్యం చేయరాదని వైద్యఆరోగ్యశాఖ అడిషనల్ డైరెక్టర్ గీతాప్రసాదిని పేర్కొన్నారు. జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో నూతనంగా నిర్మించిన ఎన్‌సీడీ (నాన్‌కమ్యూనికబుల్ డిసీజెస్) కేంద్రాన్ని బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా పలు విభాగాల పనీతీరు, ఉద్యోగాల భర్తీ, ఖాళీలు తదితర విషయాలపై ఆరా తీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎన్‌సీడీ సేవల్లో భాగంగా రోగుల్లో వివిధ రకాల రోగాలను గుర్తించి వారికి సకాలంలో వైద్యసేవలందించాలన్నారు. ఎప్పటికప్పుడు జిల్లాలో పూర్తి సమాచారం నమోదు చేసుకుని ఉన్నతాధికారులకు పంపాలన్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలను ప్రోత్సహించి.. సురక్షితంగా ప్రసవాలు చేసి మాతా శివు మరణాలను నివారించాలన్నారు. హైరిస్క్ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన నివారణ చర్యలు చేపట్టాలన్నారు. డెంగీ, మలేరియా వ్యాధులపై వైద్యులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వైద్యఆరోగ్యశాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను త్వరగా భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ వెంకటరమణ, డీసీహెచ్ఎస్ రమేష్‌నాథ్, అడిషనల్ డీఎంహెచ్ఓ పద్మావతి, అనిల్‌కుమార్, గంగాధర్, డాక్టర్ ఇర్షాద్, డాక్టర్ నీహారిక, మౌనిక, విజయకుమార్, ఎన్‌సీడీ నోడల్ ఆఫీసర్ దేవ ప్రసాద్ పాల్గొన్నారు.

బీటెక్ ఫలితాల విడుదల

జేఎన్‌టీయూ: అనంతపురం జేఎన్‌టీయూ పరిధిలో జూన్ 2017వ సంవత్సరంలో జరిగిన బీటెక్ మూ డవ సంవత్సరం ఒకటవ సెమిస్టర్ (ఆర్13) సప్లి మెంటరీ, బీటెక్ ఒకటవ సంవత్సరం (ఆర్13) సప్లి మెంటరీ, బీఫార్మసీ ఒకటవ సంవత్సరం (ఆర్13)సప్లిమెంటరీ ఫలితాలు విడుదల చేసినట్లు పరీక్షల విభాగాధిపతి ఆచార్య శశిధర్ ఒక ప్రకటనలో తెలిపారు.


జడ్పీ నూతన సీఈఓగా

శోభా స్వరూపరాణి

అనంతపురం జిల్లాపరిషత్తు: జడ్పీ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ)గా శోభా స్వరూపరాణి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం బుధవా రం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఆరుగురు జిల్లా పంచాయతీ అధికారుల(డీపీఓ)కు జడ్పీ సీఈఓలుగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు అనంత జడ్పీ సీఈఓగా శోభా స్వరూపరాణిని నియమించారు. ఈమె ప్రస్తుతం చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తి విస్తరణ శిక్షణ కేంద్రం(ఈటీసీ) గెజిటెడ్ ఇన్‌స్ట్రక్టర్ గా విధులు నిర్వర్తిస్తున్నారు. గతంలో కర్నూలు జిల్లా డీపీఓగా పనిచేశారు. గతంలో ఇక్కడ జడ్పీ సీఈఓగా పనిచేస్తున్న రామచంద్రను నెల రోజుల క్రితం తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) డిప్యూటీ ఈఓగా బదిలీ చేసిన విషయం విదితమే. ఆ స్థానంలో శోభా స్వరూపరాణి నియమితులయ్యారు.

ఉపాధ్యాయులకు సన్మానం

కంబదూరు (తిమ్మాపురం): మండల పరిధిలోని తిమ్మాపురం ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. బుధవారం పాఠశాల ఆవరణంలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. బదిలీపై వెళ్లిన భాగ్యమ్మ, ఆంజినేయులు, శైలజ, సోమశేఖర్, అనిత, కళ్యాణి, అబూఉన్నీసా, వెంకటరామయ్య, సురేంద్రబాబు, మల్లికార్జునరావు, ఆరీఫాబేగంలను ఘనంగా సన్మానించి, వారి సేవలపై కొనియాడారు. పాఠశాలలో విద్యాభివృద్ధి వీరి కృషి అభినందనీయమన్నారు. వీరి స్ఫూర్తి అందరికి ఆదర్శం కావాలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు హనుమంతరాయుడు, ఉపాధ్యాయులు, జూనియర్ అసిస్టెంట్ రమేష్ పాల్గొన్నారు.



ఇన్‌పుట్ సబ్సిడీ కోసం ఎదురుచూపు



కంబదూరు వ్యవసాయ కార్యాలయం

అధికారుల చుట్టూ అన్నదాతల ప్రదక్షిణలు - మీనమేషాలు లెక్కిస్తున్న అధికారులు

కంబదూరు: ప్రభుత్వం ఇచ్చే ఇన్‌పుట్ సబ్సిడీ కోసం కార్యాలయాల చుట్టూ రైతులు ప్రదక్షిణలు చేస్తున్నా అధికారులు కనికరించడం లేదు. అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారే తప్పా ఇన్‌పుట్ సబ్సిడీ రైతుల ఖాతాల్లో జమకావడం లేదని, 2016కు సంబంధించి మండలానికి 13,500మంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరు చేశారు. అప్పట్లో అధికారులు హడివిడి చేసి కొద్దిమంది రైతుల ఖాతాల్లోకి మాత్రమే జమచేశారు. ఇంకా వేలాదిమంది రైతుల ఖాతాల్లోకి ఇన్‌పుట్ సబ్సిడీ జమకాలేదు. దీంతో కార్యాలయం వద్ద రైతులు ప్రతిరోజు పడిగాపులు కాస్తున్నారు. ఆధార్, వ్యక్తిగత ఖాతా నెంబరు సక్రమంగా లేకపోవడంతో చాలామంది రైతులకు జమకాలేదని స్థానిక అధికారులు చెబుతున్నప్పటికీ, అన్ని సక్రమంగా ఉన్న రైతుల ఖాతాల్లోకి ఎందుకు కావడం లేదని అధికారులు రైతులకు సమాధానం చెప్పలేకపోతున్నారు. ట్యాబ్‌లలో రైతుల ఆధార్ నెంబర్ నమోదు చేయగానే మీ ఖాతాల్లోకి క్రెడిట్ అయినట్లు చూపిస్తున్నప్పటికీ బ్యాంకుకు వెళ్లి చూడగానే జమకానట్లు కనిపిస్తోంది. అయితే దీనికి సమాధానం చెప్పాల్సిన అధికారులు మౌనం వహిస్తున్నారు. రెండవ, అదనపు జాబితా అంటూ రైతులను తిప్పుకుంటున్నారే తప్పా వారి ఖాతాల్లోకి జమ చేసిన పాపాన పోలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అర్హులైన రైతులకు వెంటనే అందజేయాలని కోరుతున్నారు.

ఆరు వందల మంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ జమకావాలి



మండలవ్యాప్తంగా సుమారు ఆరు వందల మంది రైతుల ఖాతాల్లోకి ఇన్‌పుట్ సబ్సిడీ జమ కావాలి. ఇప్పటికే ఆ రైతులకు సంబంధించిన వివరాలన్నీ అప్‌లోడ్ చేశాం. పది రోజుల్లో వారి వ్యక్తిగత ఖాతాల్లో జమ అవుతాయి. సాంకేతిక కారణాల వల్ల ఇబ్బందులు పడుతున్నాం. త్వరలోనే ఖాతాల్లో జమ అవుతాయి. రైతులు అధైర్య పడాల్సిన అవసరం లేదు.

- సరస్వతి, వ్యవసాయాధికారి, కంబదూరు

నెల రోజుల నుంచి అడుగుతున్నాం



ఇన్‌పుట్ సబ్సిడీ జమకాలేదని నెలరోజుల నుంచి అడుగుతున్నాం. అదిగో ఇదిగో అంటున్నారే తప్పా ఖాతాల్లోకి మాత్రం జమకాలేదు. ఇలా రైతులు ఇంకా ఎన్ని రోజులు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాలో అధికారులే చెప్పాలి.

- యంగ్‌ఇండియా బాషా, కంబదూరు.

ఇంతవరకు జమకాలేదు



నాకున్న ఐదు ఎకరాల పొలానికి ఇంతవరకు ఇన్‌పుట్ సబ్సీడీ జమకాలేదు. ఇప్పటికే మూడుసార్లు అర్జీలిచ్చాం. జాబితాలో పేరు ఉన్నప్పటికీ ఖాతాల్లో మాత్రం జమకాలేదు. అధికారులు స్పందించి రైతులను ఆదుకోవాలి.

- నాగరాజు, రాళ్ల అనంతపురం

లోకల్ గైడ్

localguide

ఎమ్మెల్యే డైరీ

కళ్యాణదుర్గం టౌన్: శాసనసభ్యులు, ఉన్నం హనుమంతరాయ చౌదరి గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు.

కళ్యాణదుర్గం మార్కెట్‌లో కూరగాయల ధరలు



టమోట 40, పచ్చిమిర్చి 50, వంకాయలు 60, లావుమిర్చి 50, ఎర్రగడ్డలు 40, ఆలుగడ్డలు 20, బెండ 30, బీరకాయలు 30, బీన్స్ 40, కాకర 40, చౌడే కాయలు 30, క్యాబేజి 30, బీట్‌రూట్ 40, క్యారెట్ 60

కళ్యాణదుర్గంలో మాంసం ధరలు

మటన్ : 340, చికెన్ : 180, నాటుకోడి : 260
చేపలు : 120, కోడి గుడ్లు(డజన్) : 48

కళ్యాణదుర్గం సినిమాలు

సౌభాగ్య : జయజానకి నాయక , **వెంకటేశ్వర** : నేనే రాజు నేను మంత్రి, **నూర్‌ముబారక్** : ఫిదా

రైతులకు ప్రత్యామ్నాయ విత్తనాల పంపిణీ



కంబదూరులో ఎండలోనే పర్మిట్లు తీసుకుంటున్న దృశ్యం

కళ్యాణదుర్గం రూరల్: రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ఉచితంగా ప్రత్యామ్నాయ విత్తనాల పంపిణీ కార్యక్రమం చేపట్టింది. ఇందులో భాగంగా బుధవారం స్థానిక మార్కెట్‌యార్డులో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 76మంది రైతులకు 19క్వింటాళ్ల ఉలవలు, అలసందలు పంపిణీచేసినట్లు వ్యవసాయాధికారి జగదీష్ తెలిపారు. అయితే మధ్యాహ్నం రెండు గంటల పాటు సర్వర్ మొరాయించడంతో రైతులు ఇబ్బంది పడ్డారు. గతంలో వేరుశెనగ తీసుకోని రైతులకు మాత్రమే ప్రత్యామ్నాయ విత్తనాలు పంపిణీ చేస్తామన్నారు. గురువారం తూర్పుకోడిపల్లి, వర్లి గ్రామాల రైతులకు పంపిణీ చేపడుతామన్నారు.

కంబదూరు: వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యామ్నాయ పంటల్లో భాగంగా ఉలవలను పంపిణీచేయడంతో రైతులు ఆయా గ్రామాల నుంచి తరలి వస్తున్నారు. బుధవారం కర్తనపర్తి, రాళ్లపల్లి, రాళ్లఅనంతపురం పంచాయతీలకు ఉలవలను పంపిణీచేశారు. బయోమెట్రిక్ ద్వారా ఒక్కో రైతుకు రూ. 25కేజీల ఉలవలను పంపిణీ చేశారు. ఎండను సైతం లెక్కచేయకుండా విత్తనాల కోసం అలాగే ఎగబడ్డారు. అధికారులు ఎటువంటి నీడ సౌకర్యం కల్పించలేదు. ప్రతిఒక్క రైతు ప్రత్యామ్నాయ విత్తనాల వైపు ఆసక్తి చూపుతున్నారు.



కళ్యాణదుర్గంలో విత్తన పంపిణీని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న దుర్గమ్మ దేవత

దుర్గమ్మకు ప్రత్యేక పూజలు

కుందుర్పి: మండల కేంద్రంలో నూతనంగా వెలసిన దుర్గమ్మ ఆలయంలో రెండు రోజుల పాటు పూజా కార్యక్రమాలు చేపట్టారు. మంగళవారం, బుధవారం రెండు రోజుల పాటు క్షీరాభిషేకం తదితర కార్యక్రమాలు బ్రాహ్మణుల మంత్రాలతో ప్రత్యేక పూజలు చేపట్టారు. అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కుబడులు తీర్చుకున్నారు. మాజీ ఎంపీటీసీ మల్లికార్జున, కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలను పంచిపెట్టారు.

29న రుణమేళా సదస్సు

కళ్యాణదుర్గం: సోషియల్ వెల్ఫేర్ ఫైనాన్స్ కార్పొరేషన్లలో రుణాలు పొందేందుకు ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకున్న దరఖాస్తుదారులు ఈ నెల 29వ తేదీన స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఉదయం 10:30గంటలకు ప్రారంభించే రుణమేళా సదస్సుకు హాజరుకావాలని ఎంపీడీఓ షహన్నా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు కమిటీ సభ్యులు, అధికారులు హాజరు కావాలన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి : డీఎఫ్ఓ

కళ్యాణదుర్గం రూరల్: అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని, అందులోను గ్యాస్ లీకేజీలతో ప్రమాదాలు చోటుచేసుకున్నప్పుడు ప్రాణనష్టం జరిగే అవకాశం ఉందని డీఎఫ్ఓ సత్యనారాయణ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎస్వీజీఎం డిగ్రీ కళాశాలలో యువజన సంక్షేమ శాఖ సహకారంతో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ విపత్తు స్పందన సర్వీసు శాఖ సంయుక్తంగా అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి డీఎఫ్ఓతో పాటు కళాశాల ప్రిన్సిపాల్ నిర్మల, ఏడీఎఫ్ఓ శ్రీధర్‌లు పాల్గొన్నారు. విద్యార్థులకు విపత్తులు, ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ప్రధానంగా గ్యాస్ లీకేజీతో అగ్ని ప్రమాదాలు చోటుచేసుకుంటే వాటిని ఏవిధంగా నివారించవచ్చో ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఓ చిన్నప్పయ్య, వైస్ ప్రిన్సిపాల్ శశికళ, రెడ్‌క్రాస్ సొసైటీ ఫీల్డ్ ఆఫీస్ రమేష్ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న డీఎఫ్ఓ

వ్యక్తిగత పరిశుభ్రత పాటించండి : తహసీల్దార్

కంబదూరు (జెక్కిరెడ్డిపల్లి): వ్యాధుల నివారణకు ప్రతిఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తేనే అరికట్టవచ్చని తహసీల్దార్ రఫీక్ అహమ్మద్ తెలిపారు. బుధవారం మండల పరిధిలోని జెక్కిరెడ్డిపల్లిలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని తహసీల్దార్ పరిశీలించారు. అక్కడే ఉన్న వైద్యాధికారిణి రంగవేణితో రోగుల పరిస్థితులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. జ్వరాలు అదుపులోకి వచ్చినా ఒళ్ల నొప్పులు తగ్గకపోవడంతో మెరుగైన వైద్య చికిత్సలు తీసుకోవాలని అక్కడే ఉన్న రోగులకు సూచించారు. అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లుకుని, అబెట్ స్ప్రే చేయాలని తహసీల్దార్ వైద్య సిబ్బందికి సూచించారు. ప్రజలు కూడా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అప్పుడే రోగాలు దరి చేరవన్నారు. దోమలు ప్రబలకుండా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



జెక్కిరెడ్డిపల్లిలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రఫీక్ అహ్మద్

బోరుబావులను పూడ్చకపోతే కఠిన చర్యలు : తహసీల్దార్

కుందుర్పి: మండలంలో నిరుపయోంగా ఉన్న బోరుబావులను మూసివేయకపోతే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ రమేషన్ పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మండలంలో 113 బోరుబావులు నిరుపయోగకరంగా ఉన్నట్లు గుర్తించామన్నారు. ఆయా గ్రామాల్లోకి వీఆర్ఓలు వెళ్లి బోరుబావులను పూడ్చే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు.

మండలంలో బోరు వేయాలంటే జిల్లా కలెక్టర్ అనుమతి తీసుకోవాలన్నారు. అనుమతి లేనిదే బోర్లు వేస్తే రిగ్గను స్వాధీనం చేసుకుని రైతులపై కూడా చర్యలు చేపడుతామని హెచ్చరించారు. అధికారుల అనుమతితోనే బోర్లు వేసుకోవాలని సూచించారు.

రాయదుర్గం సమాచారం

బస్సులో ఎక్కించుకోలేదని విద్యార్థుల ఆందోళన


ఎస్ఐతో మాట్లాడుతున్న విద్యార్థులు

కణేకల్లు : ప్రైవేటు బస్సుల్లో తమని ఎక్కించుకోవడం లేదని పలువురు విద్యార్థులు ఆందొళన వ్యక్తం చేశారు. దీనిపై ఎస్ఐ యువరాజుకు విద్యార్థులు ఫిర్యాదు చేశారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, మోడల్ స్కూలుకు మండలంలోని యర్రగుంట, జక్కలవడికి, గోనేహాళ్, అంబాపురంతో పాటు బొమ్మనహాళ్ మండలానికి చెందిన 200 మంది విద్యార్థులు సాయంత్రం వేళల్లో బళ్లారి నుంచి వచ్చే ప్రైవేటు బస్సులు శరణ్యమవుతుండగా ఈ రహదారిలో ఆర్టీసీ బస్సులు రావడం లేదు. 200 మంది విద్యార్థులు ప్రైవేటు బస్సులను ఆశ్రయిస్తుండటంతో వారు ఎక్కించుకోవడం లేదన్నారు. ఎస్ఐ మాట్లాడుతూ సమస్యను అధికారులు, ప్రైవేటు బస్సు యాజమాన్యాల దృష్టికి తీసుకెళతామన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు తిప్పేస్వామి, చక్రి, వన్నూరుస్వామి, అమీర్, అజీజ్, పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ విత్తనాల పంపిణీకి చర్యలు

కణేకల్లు : వేరుశనగ పంట సాగు చేయని రైతులకు ప్రత్యామ్నాయ విత్తనాలు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వ్యవసాయ శాఖ జేడీఏ శ్రీరామమూర్తి పేర్కొన్నారు. బుధవారం స్థానిక వ్యవసాయ విత్తనోత్పత్తి క్షేత్రంలో రైతులకు ఉచితంగా అందిస్తున్న ప్రత్యామ్నాయ విత్తన పంపిణీ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీసీడ్స్ మేనేజర్ రెడ్డప్పరెడ్డి, ఏవో శ్రీనివాసులు, ఏఈవో విజయ్‌కుమార్, ఏజెన్సీ నిర్వాహకులు చాంద్ బాషా, పలువురు ఎంపీఈవోలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ విద్యార్థులకు యూనిఫాం పంపిణీ

కణేకల్లు : స్థానిక అంగన్‌వాడీ విద్యార్థులకు వైస్ఎంపీపీ సుజాత, టీడీపీ నాయకుడు నాగార్జున యూనిఫాం పంపిణీ చేశారు. 90 మంది విద్యార్థులకు వీరు ఉచితంగా యూనిఫామ్‌లను అందజేశారు. కార్యక్రమంలో సీడీపీవో పార్వతి, సర్పంచ్ భవాని, సూపర్‌వైజర్ నాగరత్నమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రన్న బీమా కింద ఆర్థిక సహాయం అందజేత

డీ హీరేహాళ్ : ఎం హనుమాపురంలో చంద్రన్న భీమా కింద వంద్రప్ప అనే వ్యక్తి మృతి చెందడంతో ఆయన కుటుంబీకులకు రూ. 5 లక్షల చెక్కును ఆర్థిక సహాయం అందజేసినట్లు వెలుగు సీసీ వన్నూరుస్వామి తెలిపారు. ఎం హనుమాపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు లోకేష్ చెక్కును అందజేశారు.

ఉద్దేహాళ్‌ను సందర్శించిన స్మార్ట్ ప్రతినిధులు

బొమ్మనహాళ్ : జిల్లాలోనే రెండవ స్మార్ట్‌వార్డు, స్మార్ట్ విలేజ్‌గా ఎంపికైన ఉద్దేహాళ్‌ను బుధవారం స్మార్ట్ విలేజ్, స్మార్ట్ ఫౌండేషన్స్ సీపీవో శేషాద్రి అధికారులతో కలిసి సందర్శించారు. గ్రామంలో ప్రస్తుతం ఉన్న రోడ్లు, వీధి దీపాలు, మౌలిక సదుపాయాలు, పచ్చదనం, పరిశుభ్రతతో పాటు పాఠశాలలు, పాఠశాల భవనాలు, ప్రభుత్వ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రహరీ గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మారుతీప్రసాద్, ఈవోఆర్డీ కొండయ్య, ఎంఈవో భీమప్ప, ఏపీఎం రియాజ్‌బేగ్, ఏఈలు సుధాకర్, లక్ష్మీనారాయణ, ఖలీలుల్లా బేగ్, హెల్త్ సూపర్‌వైజర్ బాబురాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి, ఆర్ఐ ఎంఎం వీరేష్, వీఆర్వో సూర్యనారాయణ, కార్యదర్శి ప్రదీప్ కుమార్, జన్మభూమి కమిటీ సభ్యులు బాబు, శ్రీరాములు పాల్గొన్నారు.

ఉద్దేహాళ్‌లో వైద్యశిబిరం

బొమ్మనహాళ్ : సీజనల్ వ్యాధులపై జాగ్రత్త వహించాలని, వృద్ధులు,పసిపిల్లలు క్రమంగా వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలని వైద్యాధికారి గౌతమి సూచించారు. బుధవారం స్థానిక ఆరోగ్య ఉప కేంద్రంలో వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ బాబురాజు, హెల్త్ అసిస్టెంట్లు గోవర్ధన్, రమాదేవి, శశికళ, ఆశా కార్యకర్తలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

214 యూనిట్లకు ఇంటర్వ్యూలు

బొమ్మనహాళ్ : మండలంలోని నిరుద్యోగులు, విద్యావంతులు, రైతులు ఔత్సాహికులకు రుణాల పంపిణీ కోసం బుధవారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపీడీవో గంగన్న, సీనియర్ అసిస్టెంట్ మురళీధర్, బ్యాంకు మేనేజర్లు మునిరాజారెడ్డి, మోహన్‌రావు, ఎస్ జైన్, నరసింహులు ఆధ్వర్యంలో నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు మల్లికార్జున, అప్పారావు, రామదాసు, కార్యదర్శులు శివయ్య, మహబూబ్ బాషా, బెల్లీ బాబు సిబ్బంది పాల్గొన్నారు.

అందరికీ సంక్షేమ పథకాలు అందాలి : ఎమ్మెల్యే


మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే

కుందుర్పి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడమే తెలుగుదేశం పార్టీ ధ్యేయమని ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని యర్రగుంట గ్రామంలో వెలుగు ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యర్రగుంట నుండి అల్లాపురం వరకు రోడ్డుకు ఇరువైపుల మొక్కలు నాటుతున్నామన్నారు. అదేవిధంగా మండలంలోని ప్రతి పంచాయతీలో రోడ్డుకు ఇరువైపుల మొక్కలు నాటుతున్నామన్నారు. యర్రగుంట గ్రామంలో కమ్యూనిటీ భవన నిర్మాణానికి రూ.10లక్షల నిధులు మంజూరయ్యాయని, ఇందుకు ఎమ్మెల్యే చేతులమీదుగా భూమిపూజ చేశారు. అదేవిధంగా రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడమే పార్టీ ధ్యేయమన్నారు. ప్రతి కార్యకర్త సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించాలని వారు పేర్కొన్నారు. ప్రధానంగా రైతులకు రుణమాఫీ, నిరంతర విద్యుత్, సుజల స్రవంతి, ఆర్అండ్‌బీ రోడ్ల నిర్మాణం, తదితర పథకాలను చేపట్టామన్నారు. వచ్చే ఎన్నికల్లో కూడా తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రతి ఇంటి వద్ద ఒక మొక్కను నాటుకుని సంరక్షించాలన్నారు. మొక్కలు నాటడం వల్ల వాతావరణ కాలుష్య నివారణకు తోడ్పడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మల్లికార్జున, వైస్ ఎంపీపీ రవి, సర్పంచ్ శివలింగ, వెలుగు ఏపీఎం గుణస్వామి, మండల కోఆర్డినేటర్ నాగేంద్ర, ఎంపీటీసీ మారెక్క, కన్వీనర్ ధనుంజయ, నాయకులు ఈరన్న, రమేష్, వడ్లప్ప, యువరాజు, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

బస్సుకోసం లక్ష్మంపల్లిలో విద్యార్థుల ధర్నా

గంటపాటు నిలిచిన రాకపోకలు


ధర్నా చేస్తున్న విద్యార్థులు, గ్రామస్థులు

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం, శెట్టూరు వయా మాకొడికి బస్సును సక్రమంగా నడపాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు శెట్టూరు మండలం లక్ష్మంపల్లి వద్ద బుధవారం గంటసేపు ధర్నా చేశారు. పలువురు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు రోడ్డుపై బైఠాయించి తమ నిరసన వ్యక్తం చేశారు. దీంతో నాగేపల్లి గేటు, కుందుర్పి, అనంతపురం, మాకొడికి తదితర ప్రాంతాలకు వెళ్లే బస్సులు నిలిచిపోవడంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సీపీఐ నాయకులు మహదేవప్ప తదితరులు విద్యార్థులకు మద్దతు పలికారు. గంటసేపు బస్సులు నిలిచిపోవడంతో విధులకు హాజరయ్యే ఉపాధ్యాయులు, ఇతర ఉద్యోగులు వారి గమ్యస్థానాలకు సకాలంలో చేరుకోలేకపోయారు. కళ్యాణదుర్గం నుంచి మాకొడికి, చింతర్లపల్లి మీదుగా శెట్టూరుకు వెళ్లే బస్సును ఇష్టానుసారంగా నడుపుతున్నారని, గతంలో మాదిరిగా సాయంత్రం 4:30గంటలకు నడపడం లేదని, దీంతో రాత్రి వరకు బస్సు కోసం కళ్యాణదుర్గం బస్టాండులో పడిగాపులు కాయాల్సి వస్తోందని పలువురు విద్యార్థులు వాపోయారు. ఈ విషయమై పలుమార్లు డిపో మేనేజర్‌కు విన్నవించినా నిర్లక్ష్యంగా మాట్లాడుతూ, విద్యార్థుల పట్ల చులకన భావనతో సమాధానాలు చెబుతున్నారంటూ విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డిపో మేనేజర్ బస్సులు నడుపుతుండడంలో నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శిస్తుండడంతో తాము అర్థాంతరంగా చదువులకు స్వస్థి పలకాల్సి వస్తోందని విద్యార్థులు వాపోయారు. విద్యారుల ఆందోళనను తెలుసుకొన్న శెట్టూరు హెడ్ కానిస్టేబుల్ రామాంజినేయులు, కానిస్టేబుల్ వెంకటేశులు లక్ష్మంపల్లికి చేరుకుని, విద్యార్థులు, సీపీఐ నాయకులు, డిఎంతో చర్చించి సమస్యను పరిష్కరించారు. గురువారం నుంచి బస్సులు సక్రమంగా నడపకపోతే ఆందోళనలను ఉధృతం చేస్తామని విద్యార్థులు హెచ్చరించారు. ఇదిలా ఉండగా కళ్యాణదుర్గం నుంచి చెళ్లికెరకు వెళ్లే బస్సును సక్రమంగా నడపడం లేదని, ఎప్పుడుపడితే అప్పుడు రద్దు చేస్తున్నాడని, ఎర్రబోరేపల్లికి బస్సు నడపాలనిఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి సూచించినా డీఎం పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోయారు.

డిపోమేనేజర్ ఏమన్నారంటే...

మాకొడికి మీదుగా శెట్టూరుకు వెళ్లే బస్సును ఇక మీదట సక్రమంగా నడుపుతామని డిపో మేనేజర్ పెంచలయ్య ఆంధ్రజ్యోతికి తెలిపారు. లక్ష్మంపల్లి వద్ద బస్సు కోసం విద్యార్థులు చేపట్టిన ఆందోళనను డీ.ఎం దృష్టికి ఆంధ్రజ్యోతి తీసుకురాగా, పైవిధంగా స్పందించారు. డ్రైవర్ల కొరతతో బస్సును సకాలంలో నడపలేకపోతున్నామన్నారు. అలాగే కుందుర్పి మీదుగా చెళ్లికెరకు వెళ్లే బస్సును కూడా సకాలంలో నడుపుతామని పేర్కొన్నారు. ఈ సమస్యను అధిగమించి బస్సులను సక్రమంగా నడుపుతామని డిపో మేనేజర్ తెలిపారు.

వినాయక విగ్రహాల ఏర్పాటుకు
అనుమతి తప్పనిసరి : ఎస్ఐ

శెట్టూరు: మండలవ్యాప్తంగా 16గ్రామ పంచాయతీల్లో వినాయక విగ్రహాల ఏర్పాటుకు పోలీసు అనుమతి తప్పనిసరి అని ఎస్ఐ శ్రీకాంత్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు అనుమతి కోసం పోలీస్ స్టేషన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనుమతి పొందకుండా విగ్రహాలను ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

వ్యక్తిగత మరుగుదొడ్ల పరిశీలన


గ్రామస్థులతో మాట్లాడుతున్న అధికారులు

శెట్టూరు: మండలవ్యాప్తంగా సంపూర్ణ పారిశుధ్య గ్రామాలుగా ఎంపికచేసిన ఐదుకల్లు, యాటకల్లు, చిన్నంపల్లి, చెర్లోపల్లి గ్రామాల్లో బుధవారం వ్యక్తిగత మరుగుదొడ్లను పరిశీలించారు. తహసీల్దార్ సుబ్రమణ్యం, ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి, ఏపీఓ సుధాకర్‌బాబు, ఎంఈఓ శ్రీధర్‌లు బృందాలుగా ఏర్పడి గ్రామాల్లో పర్యటించి వ్యక్తిగత మరుగుదొడ్ల ప్రగతిని పరిశీలించారు. లబ్ధిదారులతో చర్చించి త్వరితగతిన నిర్మాణాలు పూర్తిచేయాలని తెలిపారు.

ఘనంగా టంగుటూరి జయంతి



కంబదూరు, శెట్టూరులో టంగుటూరు ప్రకాశం పంతులుకు నివాళులర్పిస్తున్న అధికారులు

శెట్టూరు: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో ఆంధ్రరాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ జయంతి వేడుకల్లో ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి, ఈఓఆర్డీ పద్మలు పాల్గొన్నారు. టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆంధ్రరాష్ట్ర అభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. నేటి యువతరం టంగుటూరి అడుగుజాడల్లో నడవాలన్నారు.

కంబదూరు: టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను కార్యాలయాల్లో అధికారికంగా జరుపుకున్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో టంగుటూరి ప్రకాశం చిత్రపటానికి తహసీల్దార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలపై తహసీల్దార్ కొనియాడారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్, వీఆర్ఓలు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈలు, హాజరైన డీఈలు, ఏఈలు

అంతర్మథనంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు

అనంతపురం కార్పొరేషన్: జిల్లాలోని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల్లో అంతర్మథనం మొదలయింది. వ్యక్తిగత మరుగుదొడ్ల లక్ష్యం పూర్తి చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై జిల్లా కలెక్టర్ వీరపాండ్యన్ సస్పెన్షన్ వేటు వేయడంతో ఒక్కసారిగా అధికారులు ఉలికిపాటుకు గురయ్యారు. తమ శాఖ వారినే ఎక్కువ శాతం బాధ్యులను చేయడంపై ఆ శాఖ ఉద్యోగుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. మిగిలిన శాఖల అధికారుల ప్రమేయం ఉన్నా..తమ శాఖ వారిని మాత్రమే ఎక్కువ మందిని బాధ్యులను చేయడంపై వారు పెదవి విరిచారు. ఆర్‌డబ్ల్యూఎస్ విభాగానికి చెందిన ముగ్గురు ఏఈలపై కలెక్టర్ సస్పెన్షన్ వేటు వేయడంతో బుధవారం ఆ శాఖ అధికారులు అంతర్గత సమావేశం నిర్వహించారు. స్థానిక ఆ శాఖ కార్యాలయంలోని మోక్షగుండం విశ్వేశ్వరయ్య మీటింగ్ హాల్‌లో ఈఈలు, డీఈలు, ఏఈలు తమ సమస్యలు, సాదక బాదకాలు, హక్కుల పరిరక్షణపై చర్చించుకున్నారు. ఈ సందర్భంగా ఈఈలు శ్రీనివాసరావు, సాంబశివరావు తదితరులు మాట్లాడారు. ప్రభుత్వం ఉద్యోగం ఇచ్చి జీతాలు చెల్లిస్తున్నందున బాధ్యతగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. అయితే 1.53 లక్షల మరుగుదొడ్ల నిర్మాణ లక్ష్యం స్వల్పకాలంలో పూర్తి చేయడం కష్టమైన పనేనన్నారు. వాటి టార్గెట్ పూర్తి చేయడంలో ఇతర శాఖల భాగస్వామ్యం కూడా ఉందన్నారు. మిగిలిన శాఖల అధికారులు పూర్తిస్థాయిలో ఈ విషయంపై దృష్టి సారించకపోవడం కూడా లక్ష్యం చేరుకోకపోవడానికి కారణమన్నారు. అయితే ఇందుకు తమ శాఖ అధికారులను మాత్రమే బాధ్యులను చేస్తూ ముగ్గురు ఏఈలను సస్పెండ్ చేయడం బాధాకరమన్నారు. కనీసం వివరణ తెలుసుకునే అవకాశం కూడా వారికి ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. క్షేత్రస్థాయిలో తమ శాఖ అధికారులకు ఉన్న సమస్యలను కూడా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాల్సి ఉందన్నారు. ఉద్యోగులు బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. ఇకపై తమ శాఖ ఉద్యోగుల హక్కుల రక్షణకు, ఐక్యంగా ముందుకు కదలాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తమ శాఖ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను కలెక్టర్, ఇతర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు. అలాగే ముగ్గురు ఉద్యోగులపై సస్పెన్షన్‌ఎత్తివేసేలా కలెక్టర్‌ను కలిసి తమ విన్నవిస్తామని వారు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

రోడ్డెక్కిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు

అనంతపురం కార్పొరేషన్: జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, సిబ్బంది రోడ్డెక్కారు. స్థానిక ఆర్‌డబ్ల్యూఎస్ సర్కిల్ కార్యాలయం వద్ద బుధవారం సాయంత్రం రోడ్డుపై కూర్చుని నిరసన తెలిపారు. నల్ల రిబ్బన్లు ధరించి మౌనంగా నిరసన వ్యక్తం చేశారు. గురువారం నుంచి జిల్లావ్యాప్తంగా గల ఇంజనీర్లు, ఇతర సిబ్బంది సామూహిక సెలవులో వెళ్లనున్నారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించిన ముగ్గురు ఆ శాఖ ఉద్యోగులను కలెక్టర్ మంగళవారం సస్పెండ్ చేసిన విషయం విదితమే. దీంతో ఏపీ ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం కలెక్టర్‌ను కలిసి క్షేత్రస్థాయిలో తలెత్తుతున్న సమస్యలు వివరించారు. ముగ్గురు ఏఈల సస్పెన్షన్ వెంటనే ఎత్తివేయాలని వారు కోరారు. అయితే కలెక్టర్ అందుకు ససేమిరా అన్నారు. ముందు పనుల్లోకి వెళ్లాలని, పని చేసి చూపించాలని, తరువాతే సస్పెన్షన్లు ఎత్తివేస్తానని ఆయన స్పష్టం చేశారు. కలెక్టర్ సమాధానంతో శాంతించని, సంతృప్తి చెందని ఉద్యోగులు అక్కడి నుంచి నేరుగా ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమావేశమై.. నిరసనకు సన్నద్ధమయ్యారు. ఆ శాఖ కార్యాలయం ఎదుట రోడ్డుపై నల్ల రిబ్బన్లు ధరించి.. బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఇంజనీరు సంతోష్, ఇతర ఉద్యోగులు మాట్లాడుతూ... 1.50 లక్షల మరుగుదొడ్ల నిర్మాణానికి సుమారు రూ. 225 కోట్లు ఖర్చు అవుతుందన్నారు. అయితే జిల్లా స్థాయిలో అందుకు తగిన ఏర్పాట్లు చేయకుండా తమ శాఖ అధికారులపై చర్యలు తీసుకోవడం సబబుకాదన్నారు. అలాగే గతంలో 40 వేల మరుగుదొడ్ల నిర్మాణానికి రెండేళ్ల సమయం పట్టిందన్నారు. అలాంటిది కేవలం 15 రోజుల్లో 1.50 లక్షల మరుగుదొడ్లు నిర్మించాలని టార్గెట్ పెట్టడమంటే పని ఒత్తిడి పెంచడమేనన్నారు. తమ సమస్యలు పట్టించుకోకుండా తమ శాఖ ఏఈలపై సస్పెన్షన్ వేటు వేయడం బాధాకరమన్నారు. సస్పెన్షన్లు వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. తమకు న్యాయం జరిగే వరకూ జిల్లా వ్యాప్తంగా గల ఇంజనీర్లు, ఉద్యోగులు సామూహిక సెలవులో వెళ్లనున్నట్లు వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్ల అసోసియేషన్ నాయకులు రాజ్‌కుమార్, ఫియాజ్ మొహిద్దీన్, ప్రవీణ్‌కుమార్, హరికుమార్, శ్రీధర్, నవీన్, రియాజ్ బాషా, ఇతర మహిళా ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తులో డీజీ లాకరే కీలకం

ప్రతి ఒక్కరికీ అకౌంట్ తప్పనిసరి

దీని ద్వారానే ఉద్యోగ నియామకాలు

పైలెట్ ప్రాజెక్టుగా బీకేఎస్ మండలం

జిల్లా కలెక్టర్ వీరపాండ్యన్



మాట్లాడుతున్న కలెక్టర్ వీరపాండ్యన్

బుక్కరాయసముద్రం: ఇకపై ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలంటే.. దరఖాస్తు ఫారాలతో పని ఉండదని, ఆన్‌లైన్‌లో డీజీ లాకర్ ద్వారా దరఖాస్తు చేసుకుంటే చాలునని జిల్లా కలెక్టర్ వీరపాండ్యన్ పేర్కొన్నారు. భవిష్యత్తులో డీజీ లాకర్ ద్వా రానే అన్ని పనులూ జరుగుతాయని, ఉద్యోగ నియామకాలు కూడా దాని ద్వా రానే జరుగుతాయన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం డీజీ లాకర్‌పై ప్రభుత్వ ఉద్యోగులకు ఆయన అవగాహన కల్పించారు. జిల్లాలో బుక్కరాయసముద్రం మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. ఇందులో భా గంగానే బుధవారం మండలంలోని విద్యాశాఖ, రెవెన్యూ, ఐసీడీఎస్‌తో పాటు అన్ని శాఖల అధికారులకు డీజీ లాకర్ అకౌంట్ ఓపెన్ చేసే విధానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథులుగా జిల్లా కలెక్టర్ వీరపాండ్యన్‌తో పాటు జేసీ రమామణి, పలువురు జిల్లా అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ వీరపాండ్యన్ మాట్లాడుతూ డీజీ లాకర్ ప్రతి ఒక్కరికీ ఉపయోగ పడుతుందన్నారు. భవిష్యత్తులో డీజీ లాకర్ ద్వారానే ప్రతిదానికీ దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఉద్యోగాలు, డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్టు, గ్యాస్ కనెక్షన్.. ఇలా ప్రతిదానికీ డీజీ లాకర్ ద్వారానే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. కాబట్టి ప్రతిఒక్కరూ డీజీ లాకర్ అకౌంట్ ఓపెన్ చేసుకోవాలని సూచించారు. ఇందులో విలువైన పత్రాలు, సర్టిఫికెట్లు, ఆధార్, డ్రై వింగ్‌లైసెన్స్, పాన్‌కార్డు, భూమి పత్రాలతో పాటు.. ఎలాంటి విలువైన పత్రా లయినా జాగ్రత్తగా అప్‌లోడ్ చేసి భద్రపరుచుకోవచ్చున్నారు. తన అకౌంట్‌కు లాగిన్ అయి.. తాను పొందుపరిచిన ప్రతాలు, సర్టిఫికెట్లను కలెక్టర్ చూపించారు. రాబోయే పదిరోజుల్లో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసుకుని వేగవంతంగా అకౌంట్లు ఓపెన్ చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అనంతపురం ఆర్డీఓ మలోల, డీఐఓ దీక్షితులు , డీఈఓ లక్ష్మీనారాయణ, ఐసీడీఎస్ సీడీపీఓ వనజాక్షమ్మ, తహసీల్దార్ రామక్రిష్ణయ్య, ఎంపీడీఓ ప్రదీప్, ఎంఈఓ గురుప్రసాద్, ఏఓ చిన్నమ్మ పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు వర్కులపై జీఎస్టీ తొలగించాలి

డీఆర్‌ఎం కార్యాలయం ఎదుట కాంట్రాక్టర్ల ధర్నా

గుంతకల్లు: జీఎస్టీ చట్టం అమల్లోకి రాకముందు తాము ప్రారంభించిన కాం ట్రాక్టు వర్కులపై కొత్తగా పన్ను విధించరాదని రైల్వే కాంట్రాక్టర్లు డిమాండ్‌చేశారు. జీఎస్టీకి వ్యతిరేకంగా గుంతకల్లు రైల్వే డివిజన్‌లోని రైల్వే కాంట్రాక్టర్లు, కూలీలు స్థానిక డీఆర్‌ఎం కార్యాలయం వద్ద బుధవారం ఉదయం ధర్నా నిర్వహించారు. జూలై 1వ తేదీ కంటే ముందు ప్రారంభమైన కాంట్రాక్టు పనులపై కూడా జీఎస్టీ విధించడాన్ని తీవ్రంగా నిరసిస్తూ దేశవ్యాప్తంగా గల రైల్వే కాంట్రాక్టర్లు ఒక్కతాటిపై నిలిచి టూల్ డౌన్‌చేసిన సంగతి విదితమే. వీరు ఇండియన్ రైల్వే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రొవైడర్స్ అసోసియేషన్ పేరిట సంఘాన్ని ఏర్పాటుచేసుకుని ఈ నెల 21వ తేదీ నుంచి కాంట్రాక్టు పనులు నిలిపివేశారు. దీంతో అనంతపురం, కర్నూలు, కడప, చిత్తూరు, నెల్లూరు, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాల్లో కాంట్రాక్టు పనులు ఎక్కడివక్కడ నిలిచిపోయాయి. ధర్నాలో రైల్వే కాంట్రాక్టర్ల సంఘం నాయకుడు కే సురేశ్ మాట్లాడుతూ త్వరలో తమ సంఘ నాయకులు కేంద్ర ప్రభుత్వంతో చర్చలకు వెళతారని, అప్పుడు సానుకూలంగా స్పందించి పాత వర్కులపై జీఎస్టీ మినహాయించేలా నిర్ణయం తీసుకోవాలంటూ డిమాండ్‌చేశారు. లేనిపక్షంలో తాము చేపట్టిన సమ్మెను నిరవధికంగా కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైల్వే కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

పడగొట్టినవారితోనే

నిర్మింపజేయాలి

పురం ఘటనపై సీఎంకు నివేదిస్తాం: ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

హిందూపురం టౌన్: వాసవీమాత భజన మందిరం కూల్చివేసి.. అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేసిన వ్యక్తుల చేతే తిరిగి ఇక్కడ భజనమందిరం ఏర్పాటు చేయించాలని ఆర్యవైశ్యం రాష్ట్ర అధ్యక్షుడు జయంతి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. హిందూపురం పట్టణంలోని బాలాజీనగర్‌లో అమ్మవారి విగ్రహం ధ్వం సం చేసిన ప్రాంతాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దీనికి బాధ్యులయినవారిని అరెస్ట్‌చేసి చేతులు దులుపుకోవడం కాదని, వెంటనే భజనమందిరం ఏర్పాటుచేసి అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించకపోతే ఈ సంఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు నివేదిస్తామన్నారు. దేశంలో ప్రార్థనా మందిరాలకు మంచి భద్రత ఉందని, అయితే హిందూపురంలో అలాంటి పరిస్థితి కనిపించలేదన్నారు. ముఖ్యంగా ఇక్కడి ఆర్యవైశ్యులను చులకనగా చూస్తున్నారని మండిపడ్డారు. 24గంటల్లోగా భజనమందిరం నిర్మింపజేయాలని కోరారు. శాంతియుతంగా ఉన్న హిందూపురంలో ఇలాంటివి చోటుచేసుకోవడం బాధాకరమన్నారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించి కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే ఆర్యవైశ్యుల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తున్నామన్నారు. దీనిపై ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ కూడా స్పందించాలని కోరారు. ఆర్యవైశ్యులకు వెయ్యికోట్లతో కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే వచ్చే ఎన్నికల్లో రాజకీయ పార్టీలకు గుణపాఠం చెబుతామన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు శబరి, రాఘవేంద్ర, సంతోష్, క్రిష్ణమూర్తి, మున్సిపల్ వైస్ చైర్మన్ జేపీకే రాము, దాసా సందేశ్, శ్యామ్‌బాబు, రఘు, చైతన్య, తదితరులు పాల్గొన్నారు.

తండ్రి హంతకుడికి యావజ్జీవం

హిందూపురం టౌన్/ధర్మవరం అర్బన్: తండ్రిని కడతేర్చిన తనయుడికి యావజ్జీవ శిక్ష విధిస్తూ పురం అదనపు జిల్లా జడ్జి సీహెచ్ రామచంద్రమూర్తి బుధవారం తీర్పును వెలువరించారు. ధర్మవరం పట్టణంలోని రాజేంద్రనగర్‌కు చెందిన బీరే చంద్రశేఖర్‌కు సోమందేపల్లి వాసి అనితతో 1996లో వివాహమైంది. కొన్నేళ్లపాటు అన్యోన్యంగా ఉన్నారు. తరువాత మనస్పర్థలు రావడంతో భర్త వద్దే పిల్లలను వదిలేసి, అనిత పుట్టింట్లో ఉంది. భర్తపై కేసు పెట్టడంతో అది హైకోర్టులో నడుస్తోంది. ఈ నేపథ్యంలో ఖర్చులకు డబ్బులివ్వాలని 2007 డిసెంబర్ 21న మధ్యాహ్నం బీరే చంద్రశేఖర్.. తండ్రి రామకేశవులును ఒత్తిడి చేశాడు. తన వద్ద డబ్బు లేదనడంతో తండ్రిపై దాడి చేశాడు. తల్లి సుబ్బమ్మ అడ్డురావడంతో ఆమెను వంట గదిలో బంధించాడు. కుమారులు అడ్డు వస్తుండటంతో వారిని మరో గదిలో బంధించి, తండ్రిని హింసించి అదేరోజు రాత్రి హత్య చేశాడు. తెల్లవారుజామున రామకేశవులు భార్య సుబ్బమ్మ, మనవళ్లు అరవడంతో స్థానికులు వచ్చి తలుపులు తీశారు. అప్పటికే రామకేశవయ్య మృతిచెందాడు. సుబ్బమ్మ ఫిర్యాదు మేరకు బీరే చంద్రశేఖర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిపై విచారించి నిందితుడిని కోర్టులో హాజరు పరిచారు. సాక్షులను విచారించిన న్యాయమూర్తి బీరే చంద్రశేఖర్‌ను హంతకుడిగా పరిగణిస్తూ.. యావజ్జీవ శిక్షతోపాటు రూ.100 జరిమానా విధించారు. బాధితుల తరఫున ఏపీపీ రాజశేఖర్ వాదించారు. బీరే చంద్రశేఖర్ కుమారులు కృష్ణకుమార్, హేమంత్‌కుమార్ తమ తాతను తండ్రే చంపాడని సాక్ష్యం చెప్పడంతో న్యాయమూర్తి శిక్ష ఖరారు చేశారు.

కట్నం వేధింపుల కేసులో ముగ్గురికి జైలు

ముదిగుబ్బ: వరకట్న వేధింపుల కేసులో ముగ్గురు నిందితులకు కదిరి మెజిస్ట్రేట్ వాణి ఏడాది జైలు శిక్ష విధిస్తూ.. బుధవారం తీర్పు వెల్లడించారు. ముదిగుబ్బ ఏఎస్ఐ భాస్కర్‌రాజు, కోర్టు కానిస్టేబుల్ చంద్రానాయక్ కేసు పూర్వాపరాలను వెల్లడించారు. ధర్మవరం పట్టణానికి చెందిన కవితతో ముదిగుబ్బ వాసి వెంకటనారాయణకు వివాహమైంది. ఈ నేపథ్యంలో భర్త, మామ చౌడప్ప, ఆడపడుచు సరస్వతి తనను అదనపు కట్నం కోసం వేధిస్తున్నారంటూ 2010 డిసెంబర్‌లో కవిత.. ముదిగుబ్బ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి, నిందితులను కోర్టులో హాజరు పరిచారు. ఈ కేసులో సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి వాణి.. నిందితులను దోషులుగా పరిగణిస్తూ ఏడాది జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.

యువతి అదృశ్యం

ఆంధ్రజ్యోతి, అనంతపురం: జిల్లా కేంద్రంలోని అరవింద నగర్‌కు చెందిన యువతి నందిని అదృశ్యమైనట్లు ఆమె తండ్రి నారాయణ బుధవారం రాత్రి టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో యువతి ఇంటి నుంచి బయటకొచ్చింది. ఆమె చీకటి పడినప్పటికీ ఇంటికి చేరుకోలేదు. దీంతో ఆమె తల్లిదండ్రులు.. బంధువులు, స్నేహితులతో ఆరా తీశారు. ఆచూకీ లభించకపోవడంతో టూటౌన్ పోలీసులను ఆశ్రయించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసుల అదుపులో గంజాయి విక్రేత!

హిందూపురం టౌన్: చిన్న ప్యాకెట్ల రూపంలో గంజాయిని విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని, విచారిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. మంగళవారం రాత్రి తూముకుంట చెక్‌పోస్టుకు చెందిన ఓ వృద్ధుడు గంజాయి విక్రయిస్తున్నట్లు పెనుకొండ డీఎస్పీ కరీముల్లా షరీఫ్‌కు సమాచారం అందింది. వెంటనే వృద్ధుడిని అదుపులోకి తీసుకుని, అతడి వద్ద ఉన్న గంజాయిని స్వాధీనం చేసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. అతడి వెనుక ఎవరున్నారన్న కోణంలో ఆరా తీస్తున్నారు. అతడికి గంజాయి ఎక్కడి నుంచి అందుతోంది? హిందూపురంలో ఇంకెవరైనా విక్రయిస్తున్నారా? అనే కోణంలో విచారణ చేపట్టినట్లు ఓ పోలీసు అధికారి తెలిపారు.

పురం సీఐపై డీఐజీ ఆగ్రహం?

హిందూపురం టౌన్: తాను ఆదేశించినా సకాలంలో స్పందించలేదంటూ పురం సీఐపై డీఐజీ ప్రభాకర్‌రావు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. బుధవారం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. స్థానిక పోలీసులు న్యాయం చేయడం లేదంటూ పట్టణానికి చెందిన ఇద్దరు వ్యక్తులు డీఐజీ వద్దకెళ్లినట్లు తెలిసింది. ఆ కేసును ఆయన స్థానిక పోలీసు స్టేషన్‌కు పంపించారు. అయినా.. ఇక్కడి పోలీసులు అలసత్వం వహించారంటూ డీఐజీ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. స్టేషన్‌లో రికార్డులు, పనితీరుపై అసహనం చెందినట్లు తెలిసింది. స్టేషన్‌కు వచ్చే వారికి న్యాయం చేయకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించినట్లు సమాచారం.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

ముగ్గురికి తీవ్ర గాయాలు..





కళ్యాణదుర్గం వద్ద ప్రమాదంలో మృతిచెందిన బొజ్జన్న, గాయపడిన నారాయణస్వామి, ముత్యాలప్ప మృతదేహం

కళ్యాణదుర్గం/పామిడి: జిల్లాలో వేర్వేరుచోట్ల బుధవారం రెండు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందగా.. ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. కళ్యాణదుర్గం మండలం యర్రంపల్లి గేటు వద్ద బుధవారం సాయంత్రం ద్విచక్రవాహనాలు ఢీకొన్న ప్రమాదంలో కుర్లపల్లికి చెందిన బొజ్జన్న (24) మృతిచెందగా, ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. కంబదూరుకు చెందిన నారాయణస్వామి, మరొకరితో కలిసి కళ్యాణదుర్గం నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా.. యర్రంపల్లి గేటు వద్ద కుర్లపల్లి నుంచి బొజ్జన్న, అతడి చిన్నాన్న కూతురు మీనాక్షి వస్తున్న బైక్ ఢీకొంది. ప్రమాదంలో బొజ్జన్న అక్కడికక్కడే మృతిచెందాడు. ఇతడు బెంగుళూరులో పెయింటర్‌గా పనిచేస్తుండేవాడు. మంగళవారం గ్రామంలో నిర్వహించిన మారెమ్మ జాతరకు వచ్చి, మృతిచెందడంతో బంధువుల రోదనలు మిన్నంటాయి. ప్రమాదంలో కంబదూరు నారాయణస్వామి, మీనాక్షి, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. నారాయణస్వామి కన్ను, తలకు తీవ్ర గాయాలవగా.. ఎడమచేయి విరిగినట్లు బంధువులు తెలిపారు. ప్రమాదంలో గాయపడిన వారిని కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం అనంతపురం తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ నబీరసూల్ కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు.

నీలూరు వద్ద..

పామిడి మండలంలోని నీలూరు సమీపాన 44వ జాతీయ రహదారిపై ఆటో బోల్తాపడి డ్రైవర్ ముత్యాలప్ప (39) మృతిచెందాడు. ఇతడు ఆటోలో అనంతపురానికి వెళ్తుండగా.. నీలూరు సమీపంలో కుక్క అడ్డు వచ్చింది. దానిని తప్పించే ప్రయత్నంలో ఆటో బోల్తా పడింది. ముత్యాలప్పకు స్వల్ప గాయాలయ్యాయి. పెద్ద గాయాలు లేకపోవడంతో అతడు ఆటోలో అనంతపురం వెళ్లాడు. ఇంటికెళ్లాక.. వాంతులై, అస్వస్థతకు లోనయ్యాడు. అనంతపురం సర్వజనాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

ధీరోదాత్తుడు ప్రకాశం పంతులు



ప్రకాశం పంతులుకు నివాళులర్పిస్తున్న కమాండెంట్ తదితరులు

ఆంధ్రజ్యోతి, అనంతపురం: స్వాతంత్ర్య సంగ్రామంలో తనకంటూ ప్రత్యేకతను చాటుకున్న ధీరోదాత్తుడు టంగుటూరు ప్రకాశం పంతులని ఏపీఎస్పీ 14వ బెటాలియన్ కమాండెంట్ జగదీశ్‌కుమార్ పేర్కొన్నారు. ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరు ప్రకాశం పంతులు 145వ జయంతిని పురస్కరించుకుని పీటీసీలోని బెటాలియన్ కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. కమాండెంట్ జగదీశ్‌కుమార్ మాట్లాడుతూ... దేశానికి, రాష్ట్రానికి ప్రకాశం పంతులు చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. స్వాతంత్ర్య పోరాటంలో ఆయన అనేక ఉద్యమాల్లో తనవంతు పాత్ర పోషించారన్నారు. ఆయన అడుగు జాడల్లో నడుస్తూ సమాజాభివృద్ధికి ప్రతిఒక్కరూ నడుం బిగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ సుబ్రహ్మణ్యం, అసిస్టెంట్ కమాండెంట్ కోలార్ కృష్ణ, ఆనంద్‌కన్నా, ఆర్ఐ దస్తగిరి, ఆర్ఎస్ఐ రఘురాం, కేవీబీ వర్మ, మల్లికార్జున పాల్గొన్నారు.

మానసిక, శారీరక బలంతోనే లక్ష్య సాధన

వ్యక్తిత్వ వికాస నిపుణుడు సీఎస్ బాలచందర్

ఆంధ్రజ్యోతి, అనంతపురం: విధి నిర్వహణలో రాణించాలంటే మానసిక, శారీరక బలం అవసరమని వ్యక్తిత్వ వికాస నిపుణుడు సీఎస్ బాలచందర్ పేర్కొన్నారు. తద్వారానే లక్ష్యాలను సాధించవచ్చన్నారు. ఈ మేరకు బుధవారం పీటీసీలో శిక్షణ పొందుతున్న ఎస్ఐలకు వ్యక్తిత్వ వికాసంపై ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. పీటీసీ ప్రిన్సిపాల్ వెంకటరామిరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బాలచందర్ వ్యక్తిత్వ వికాసంపై ట్రైనీ ఎస్ఐలకు శిక్షణ ఇచ్చారు. ఇతర విభాగాల్లో సేవ చేయడం ఒక ఎత్తయితే... పోలీసు శాఖలో పనిచేయడం మరో ఎత్తన్నారు. చట్ట పరిధిలో తమకున్న అధికారంతో బాధితులకు న్యాయం చేయవచ్చన్నారు. ఆ ధైర్యం పోలీసులకు ఒక్కరికే ఉంటుందన్నారు. ఆ ధైర్యాన్ని ప్రతి పోలీసు అందిపుచ్చుకోవాలన్నారు. విధుల పట్ల నిజాయితీ, నిబద్ధత ఉండాలన్నారు. విలువలు పాటిస్తే విధుల్లో రాణించగలరన్నారు. ప్రతి పోలీసూ సామాజిక బాధ్యతగా తన కర్తవ్యాన్ని నిర్వర్తిస్తే సమాజానికి మేలు చేకూరుతుందన్నారు. ఆ దిశగానే ప్రతి పోలీసూ పయనించాలని ఆయన వివరించారు. పీటీసీ ప్రిన్సిపాల్ వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ... విధి నిర్వహణలో మంచి అధికారిగా గుర్తింపు పొందాలంటే శిక్షణలో అలవర్చుకున్న అంశాలను అమలు పరచాల్సిన అవసరముందన్నారు. ఆ దిశగానే ప్రతి పోలీసూ నడుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీలు రామచంద్రారెడ్డి, శ్రీనివాసరెడ్డి, సాయిసంస్థ అధ్యక్షుడు విజయసాయికుమార్, కిరణ్‌కుమార్, జయమ్మ, నగేష్, రాఘవ, బాలగంగాధర్ పాల్గొన్నారు.



ట్రైనీ ఎస్ఐలకు వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ ఇస్తున్న బాలచందర్

కుటుంబ సమస్యలతో వివాహిత ఆత్మహత్య

ఉరవకొండ: స్థానిక బళ్లారి రోడ్డు ప్రాంతానికి చెందిన జబీనా (22) కుటుంబ సమస్యలతో మంగళవారం అర్ధరాత్రి ఆత్మహత్య చేసుకుంది. కణేకల్లుకు చెందిన ఈమెకు ఉరవకొండ వాసి బషీర్‌తో ఐదేళ్ల క్రితం వివాహమైంది. బషీర్ ట్యాక్సీ డ్రైవర్. మద్యానికి బానిసయ్యాడు. మద్యం మానేయాలని పలుమార్లు భర్తకు జబీనా సూచించినా.. అతడు పట్టించుకోలేదు. దీంతో మనస్తాపం చెందిన ఆమె ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకుంది. గమనించిన బంధువులు ఆమెను వెంటనే ఉరవకొండ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. జబీనా తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు. జబీనాకు కుమారుడున్నాడు.

దొంగ అరెస్టు

వెలుగుప్ప: మండలంలోని బ్రాహ్మణపల్లి వన్నూరుస్వామి ఇంట్లో చోరీ కేసులో నిందితుడు కుబేర్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్ఐ నాగస్వామి బుధవారం వెల్లడించారు. కుబేర రెడ్డి ఓ హత్య కేసులో నిందితుడు. ఈ నేపథ్యంలో బ్రాహ్మణపల్లిలోని వన్నూరుస్వామి ఇంట్లో చొరబడ్డాడు. బీరువాను పగులగొట్టి, జత బంగారు కమ్మలను అపహరించుకెళ్లాడు. దీనిపై బాధితుడి ఫిర్యాదు మేరకు ఈనెల 10న పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణలో భాగంగా నిందితుడిని గుండ్లపల్లి క్రాస్ వద్ద అరెస్టు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

బెల్టుషాపు నిర్వాహకుడి అరెస్టు

ఆంధ్రజ్యోతి, అనంతపురం: నగరంలోని బళ్లారి బైపాస్ కూడలిలో కూల్‌డ్రింక్ షాపు ముసుగులో బెల్టుషాపు నిర్వహిస్తున్న రామాంజనేయులును నాలుగో పట్టణ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. అతడి నుంచి 15కిపైగా మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. శారదానగర్‌కు చెందిన రామాంజనేయులు కొంతకాలంగా బళ్లారి బైపాస్ కూడలిలో కూల్‌డ్రింక్ షాపు నిర్వహిస్తున్నాడు. షాపులోనే మద్యం బాటిళ్లు విక్రయిస్తున్నాడు. రాబడిన సమాచారం మేరకు సీఐ శ్యామ్‌రావు సిబ్బందితో కలిసి కూల్‌డ్రింక్ షాపుపై దాడి చేశారు. దీంతో బెల్ట్ షాపు గుట్టు రట్టయింది.

వ్యాన్ ఢీకొని వృద్ధురాలి మృతి

ధర్మవరం అర్బన్: మండలంలోని పోతుకుంట గ్రామ సమీపాన బుధవారం రాత్రి వ్యాన్ ఢీకొన్న ప్రమాదంలో అంకే లింగమ్మ (65) మృతిచెందింది. పోతుకుంట బీసీ కాలనీకి చెందిన ఈమె నీటి బిందెను ఎత్తుకుని, రోడ్డు దాటుతుండగా మామిళ్లపల్లి నుంచి వస్తున్న వ్యాన్ ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన లింగమ్మను స్థానికులు ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. వ్యాన్ డ్రైవర్ పోలీసు స్టేషన్‌లో లొంగిపోయాడు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

మట్టి వినాయక విగ్రహాల వైపు మొగ్గు చూపుతున్న ప్రజలు..

పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తున్న వైనం..

పలు ప్రాంతాల్లో ఉచితంగా పంపిణీకి సిద్ధం..



సరోజిని రోడ్డులో పంపిణీకి సిద్ధంగా ఉన్న మట్టి గణపతులు

మట్టి గణపయ్యా మా మంచి దేవుడయ్యా!







అనంతపురం టౌన్

ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ వినాయక విగ్రహాలతో ముంచుకొస్తున్న ముప్పును ప్రజలు ఇప్పుడిప్పుడే గుర్తిస్తున్నారు. మట్టి గణపయ్యే మేలని గ్రహిస్తున్నారు. దీంతో మట్టి వినాయకులను పూజించే వారి సంఖ్య పెరుగుతోంది. వాటిని ఉచితంగా ఇచ్చే పర్యావరణ ప్రేమికులు సైతం అధికమవుతున్నారు. దీంతో వినాయకచవితి వేళ మట్టి విగ్రహాల రూపంలో బుజ్జి గణపయ్యలు సందడి చేస్తున్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో చేసిన విగ్రహాలకు స్వస్తి చెప్పాలనీ, మట్టి గణపతులనే పూజించాలంటూ ఐదేళ్లుగా ప్రభుత్వం ప్రచారం చేస్తోంది. దీంతో జనం కూడా పర్యావరణానికి హాని కలిగించకూడదని మట్టి గణపయ్యలపైనే ఆసక్తి కనబరుస్తున్నారు. వివిధ ప్రాంతాల్లో అరడుగు నుంచి 9 అడుగుల వరకు మట్టి విగ్రహాలను తయారు చేస్తున్నారు. వీటి ధరలు కూడా రూ.10 నుంచి రూ.9వేల వరకు ఉంటున్నాయి. గతంలో మట్టి వినాయకులకు ఆదరణ తక్కువగా ఉండేది. ఏడాదికేడాదికీ వీటిపై ప్రజలూ ఆసక్తి కనబరుస్తున్నారు. మట్టి విగ్రహాలను పూజించి, పర్యావరణాన్ని కాపాడవలసిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందంటున్నారు పర్యావరణవేత్తలు. ఏది ఏమైనా చాలామంది వీటిని పూజించేందుకే ప్రాధాన్యమిస్తున్నారు. ఈ నేపథ్యంలో సేవాసంస్థలు, పలువురు వ్యక్తులు మట్టి విగ్రహాలను ప్రజలకు ఉచితంగా అందించి, పర్యావరణ పరిరక్షణలో తామూ భాగస్వాములయ్యేందుకు ముందుకు వస్తున్నారు.

బాధ్యతగా భావిస్తున్నాం

నాలుగేళ్లుగా టీటీడీ హిందూ ధర్మప్రచార మండలి ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్నాం. ఈ కార్యక్రమం ద్వారా పర్యావరణ పరిరక్షణను బాధ్యతగా భావిస్తున్నాం. అందుకే ఏటా 2వేలకు పైగా ప్రజలకు ఉచితంగా విగ్రహాలను అందిస్తున్నాం. ఈ ఏడాది గురువారం ఉదయం 9.30 గంటలకు సరోజిని రోడ్డులోని శ్రీపాద భవన సముదాయంలో 2500 విగ్రహాలను వితరణ చేస్తాం. కావాల్సిన వారు 08554-232232 నెంబర్‌లో సంప్రదించగలరు.



- శ్రీపాద వేణు, జిల్లా అధ్యక్షుడు, టీటీడీ హిందూ ధర్మ ప్రచార మండలి

అందరితో కలిసి పండుగ చేసుకోవడం ఆనందం

ప్రస్తుతం మట్టి విగ్రహాలను పూజించడానికే అందరూ ఇష్టపడుతున్నారు. అందుకే మా సంస్థ ఆధ్వర్యంలో ఎనిమిదేళ్లుగా మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్నాం. ప్రకృతి ప్రేమికులందరితో కలిసి పండుగ చేసుకోవడం ఆనందంగా ఉంది. ఈ ఏడాది కూడా అదే తరహాలో గురువారం ఉదయం ఆర్టీఏ కార్యాలయం ఎదుట వున్న అప్నా గ్రూప్స్ కార్యాలయం వద్ద 3 వేల విగ్రహాలకుపైగా ఉచితంగా పంపిణీ చేసేందుకు ఏర్పాటు చేశాం. వివరాలకు 9246365655 నెంబర్‌లో సంప్రదించగలరు.



- పురుషోత్తంరెడ్డి, సాయి అప్నా గ్రూప్స్

వెండి వినాయకుడు



120 కిలోల వెండి వినాయకుడు

గుంతకల్లు

అత్యంత ఎక్కువ బరువు కలిగిన ఘనపు (సాలిడ్) వెండి వినాయక విగ్రహంగా లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించిన రజత వినాయకుడు గుంతకల్లులో కొలువుదీరనున్నాడు. పట్టణంలోని శ్రీ ఆర్యవైశ్య సంఘం నాయకులు చందాలను వసూలు చేసి, 1998లో 78 కేజీల బరువున్న వెండి వినాయకుడిని తయారు చేయించారు. విగ్రహంతోపాటు ప్రభావళి, పీఠం కలిపి 95 కేజీలకు ఆ విగ్రహం చేరింది. తర్వాత చేయించిన ఇతర వస్తువలు కలిపి దాదాపు 120 కేజీలైంది. ఈ వినాయక విగ్రహం లోపలి భాగం డొల్ల లేకుండా సాలిడ్ వెండితో తయారు చేయడంతో ఈ మూర్తి లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించుకుంది. ఈ విగ్రహాన్ని వినాయక చవితికి కొలువు దీర్చి, నాలుగు రోజులపాటు పూజలు చేస్తారు. అనంతరం స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ లోని లాకర్‌లో భద్రపరచడం ఆనవాయితీ. ఈనెల 25న శుక్రవారం వినాయక చవితి కావడంతో ఆర్యవైశ్య సంఘానికి అనుబంధంగా ఉన్న అవోపా వినాయక ఉత్సవ సమితి నాయకులు ఒకరోజు ముందుగానే గురువారమే విగ్రహాన్ని తీసుకురానున్నారు.

పూజా కార్యక్రమ వివరాలు..

గురువారం ఉదయం ఎస్‌బీహెచ్ లాకరు నుంచి వెండి వినాయకుడిని తీసుకొచ్చి, అవోపా రాష్ట్ర అధ్యక్షుడు పువ్వాడి చంద్రశేఖర్ ఇంటికి తీసుకువెళ్లి తొలి పూజ నిర్వహిస్తారు. అనంతరం ఊరేగింపు చేపడతారు. శాశ్వత ఉయ్యాల సేవా దాత భాస్కర రంగయ్య ఇంటి వద్ద వెండి పుష్పాలతో స్వామి వారిని ఆహ్వానించి, మంగళవాయిద్యాలతో వెండి వినాయకుడిని శ్రీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయానికి తెస్తారు. సాయంత్రం 6 గంటలకు పంచగంగలతో స్వామివారిని అభిషేకించి ఊంజల్ సేవ, అష్టదళ పాదపద్మార్చన, మంగళహారతి కార్యక్రమాలను నిర్వహిస్తారు. 25న ఉదయం 10 గంటలకు వెండి వినాయకుడికి చరప్రతిష్ఠ, పూజలు చేస్తారు. 26న ఉదయం ఏడున్నరకు హోమాలు ప్రారంభిస్తారు. గణపతి, రుద్ర, వాస్తు పురుష, నవగ్రహ, శాంతి, సర్వతో భద్రమండల దేవతా హోమాలను, పూర్ణాహుతి గావిస్తారు. 27న ఉదయం ఎనిమిదిన్నరకు కుంకుమార్చన, 11-30 గంటలకు ఊరేగింపు నిర్వహిస్తారు. సాయంత్రం ఆలయంలో ఏర్పాటైన మట్టి వినాయకుడిని పుష్పవాహనంపై నిమజ్జనోత్సవానికి పంపి, వెండి వినాయకుడిని ఉపసంహరించి, బ్యాంకు లాకరుకు చేరుస్తారు.

మట్టి గణపతినే పూజిద్దాం

అనంతపురం టౌన్: వినాయక చవితి పర్యావరణ స్పృహ పెంచింది. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసిన భారీ విగ్రహాలతో పర్యావరణ సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ సమస్యకు పరిష్కారం మట్టితో చేసిన గణపతిని పూజించి నిమజ్జనం చేయడమే. గణపతిని ఆకులు, పూలతో పూజించడం వెనుక పర్యావరణ కోణం ఉంది. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాల వల్ల ఇదేమీ నెరవేరకపోగా అదనంగా తీవ్ర సమస్యలు వస్తున్నాయి. అందువల్ల మట్టి గణపతినే పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుకుందాం.. అనే నినాదం ముందుకొచ్చింది.

- వినాయక చవితి వచ్చిందంటే ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసిన భారీ విగ్రహాలను ప్రతిష్ఠించడం ఆనవాయితీగా మారింది. వీటిని నీటిలో నిమజ్జనం చేయడం వల్ల నీరు, గాలి, వాతావరణం తీవ్ర వినాశనానికి గురవుతున్నాయి. పర్యావరణ సంక్షోభం కొని తెచ్చుకున్నట్టవుతోంది. అందువల్ల మట్టి గణపతి మనసా స్మరామి అనే చైతన్యం పెరుగుతోంది. మట్టి విగ్రహాలను ఎంచుకొని పూజించాలి.

తేడా సులభంగా పసిగట్టేలా..

మట్టి ప్రతిమలపై వెలుతురు పడినపుడు అవి మెరవవు. రసాయనాలతో రూపొందించిన విగ్రహాలపై వెలుతురు పడగానే ధగధగమెరుస్తాయి. కాంతి వేడిని అవి స్వీకరించకుండా రేడియేషన్ రూపంలో తిరిగి గాలిలో కలుస్తాయి.

- మట్టి ప్రతిమలకు పది రోజులపాటు వివిధ ద్రవ్యాలతో పూజలు చేసినా.. ఆ ప్రాంతం చల్లగా ఉంటుంది. అదే రసాయనాలు ఎక్కువగా వినియోగించిన ప్రతిమ వద్ద వేడి ఉంటుంది. ఎక్కువ సేపు అక్కడ ఉండలేం. కూర్చోలేనంత వేడి ఉంటుంది.

మట్టి విగ్రహాల నిమజ్జనం సులువు..

మట్టితో తయారు చేసిన ప్రతిమలు నీటిలో తేలికగా కరిగిపోతాయి. వాటితో కాలుష్యం కూడా ఉండదు. అదే రసాయనాలతో కూడిన ప్రతిమలు నీటిలో కలిసేందుకు 45 రోజుల నుంచి ఏడాది వరకు పడుతుంది. నీరు, నేల, గాలి, వాతావరణాన్ని అవి కలుషితం చేస్తాయి.

- మట్టి ప్రతిమలకు వాడిన రంగులు నీటిలో ఆక్సీకరణం చెంది నీటి శుద్ధికి కారణం అవుతాయి. రసాయనాలతో కూడిన విగ్రహాలు నీటిలో కరగక రేడియేషన్ రూపంలో నీరు, నేలను కలుషితం చేస్తాయి. విషపదార్థాలను విడుదల చేస్తాయి.

ఈ హెచ్చరికలను పరిశీలిద్దాం..

రసాయనాలతో కూడిన విగ్రహాలతో వాతావరణం కాలుష్యం ఏర్పడి, అది పర్యావరణం, ప్రజలకు తీవ్ర నష్టం కలిగిస్తుందని కేంద్ర, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి హెచ్చరిస్తోంది. మట్టి ప్రతిమలతో కాలుష్యం ఉండదనీ, రంగుల ప్రతిమలు అనారోగ్య హేతువులని ప్రచారం చేస్తున్నాయి.

- రసాయనాలతో కూడిన విగ్రహాలు మనుషులకే కాకుండా జంతువులకు కూడా ముప్పు తెస్తున్నాయి. అవి నీటిలో కరగక ముందే నీరు, నేల కలుషితమై విషపదార్థాలను విడుదల చేస్తూ నీటిలో జంతుజలాన్ని చంపేస్తున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

విషాన్ని విడుదల చేసే రసాయనాల వాడకం పెరగడంతో కేన్సర్ వ్యాధిగ్రస్థుల సంఖ్య రోజు రోజుకీ పెరుగుతోంది.

ఇలా చేద్దాం..

రసాయన విగ్రహాలతో వాటిల్లే నష్టాలపై కళాజాతాలు, సినిమా హాళ్లు, గోడపత్రికలు, కరపత్రాలతో విస్తృత ప్రచారం చేయాలి. పర్యావరణహితంగా చవితి వేడుకలను నిర్వహించుకునే పంచాయతీలు, పట్టణాల్లోని కాలనీలకు ప్రోత్సాహకాలను అందజేయాలి.

వినూత్నంగా ఆలోచించాలి..

చవితి వేడుకలు పర్యావరణహితంగా నిర్వహించుకునే కృషి పాఠశాలల నుంచి మొదలవ్వాలి. పిల్లలతో మట్టి ప్రతిమలను తయారు చేయించాలి. వాటి ఉపయోగాలను వివరించాలి. రసాయనాల జోలికెళ్తే వాటిల్లే నష్టాలను తెలియపరచాలి. ఇలా చేయడంతో నేటి, రాబోయే తరాలు సహజసిద్ధ ప్రతిమలతో పండుగ అసలు ఉద్దేశాన్ని నెరవేరుస్తాయి.

ప్రయోగాత్మకంగా అనంతలో ఏర్పాటుకు శ్రీకారం.. 4000 ట్రీగార్డులు తెప్పించిన అధికారులు..

ఏడు అడుగుల ఎత్తున్న ప్లాస్టిక్ ట్రీగార్డులు



ప్లాస్టిక్ ట్రీ గార్డులొచ్చేశాయ్!

మొక్కలకు రక్షణగా ఇనుప, సిమెంటు ట్రీ గార్డులు ఏర్పాటు చేయడం చూస్తుంటాం. అనంతలో ప్లాస్టిక్ ట్రీ గార్డులు ఏర్పాటవుతున్నాయి. జిల్లాలోనే మొదటగా అనంతలో ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

అనంతపురం, కార్పొరేషన్

నగరంలో మొక్కలకు రక్షణగా ఏర్పాటు చేసే ట్రీగార్డుల్లో కొత్త ప్రయోగానికి అనంత మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు శ్రీకారం చుట్టారు. ఐరన్, సిమెంటు ట్రీ గార్డులను ఇన్నాళ్లూ పంపిణీ చేసినా.. వాటిని దుండగులు చోరీ చేస్తుండటం, ధ్వంసం చేస్తుండటంతో కొత్త ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. జిల్లాలోనే మొదటి సారిగా ప్లాస్టిక్ మెష్ ట్రీగార్డులను పంపిణీ చేసేందుకు సన్నద్ధమయ్యారు. ఒక్కో ట్రీగార్డు విలువ రూ.200. గ్రీన్ కార్పొరేషన్‌తో ప్రత్యేకంగా మాట్లాడి రూ.100 ప్రకారం సుమారు 4000 ప్లాస్టిక్ ట్రీగార్డులను తెప్పించారు. ఇందుకు రూ.4 లక్షలు వెచ్చించారు. వీటిని నగర పాలక సంస్థకు చెందిన సమ్మర్ స్టోరేజి ట్యాంకు సమీపంలో నిల్వ చేశారు. ఈ ట్రీ గార్డులకు వెదురు కర్రలను కూడా తెప్పించనున్నారు. నగరంలో ఒక్కో వెదురు కర్ర రూ.15 పలుకుతుండటంతో రూ.5.50కి ఒంగోలు నుంచి తెప్పించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. త్వరలో వీటిని తెప్పించి, ప్లాస్టిక్ మెష్ ట్రీగార్డులను పంపిణీ చేయనున్నారు.



ఎస్ఎస్ ట్యాంకు వద్ద నిల్వ ఉంచిన ప్లాస్టిక్ ట్రీగార్డులు

గతంలో నగరంలో పెద్దఎత్తున మొక్కలు నాటారు. వాటి సంరక్షణకు ట్రీగార్డులు ఏర్పాటు చేశారు. ముఖ్యంగా ఐరన్ మెష్, సిమెంటు షీట్ ట్రీగార్డులను ఏర్పాటు చేశారు. వీటికి భారీ స్థాయిలో వ్యయం చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. గతేడాది నగరంలో భారీగా సిమెంటు షీట్స్ ట్రీగార్డులు ఏర్పాటు చేసినా... చాలా చోట్ల అవి ధ్వంసమయ్యాయి. మరికొన్ని అధికారులు, సిబ్బంది నిర్వాకం వల్ల నిరుపయోగమయ్యాయి.

వెరైటీకి శ్రీకారం...

ఐరన్ మెష్, సిమెంట్ షీట్ ట్రీగార్డులను తరచూ చోరీ చేస్తున్నారు. రోడ్లకిరువైపులా, పార్కులు, ఇతర పబ్లిక్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఇలాంటి ట్రీ గార్డులు మాయమవుతున్నాయి. దీనిని గుర్తించిన అధికారులు అలాంటి వారికి చెక్ పెట్టాలంటే... ప్లాస్టిక్ ట్రీగార్డులే నయమని ఆలోచించారు. ప్లాస్టిక్ మెష్ ట్రీగార్డులు చోరీ చేసి తీసుకెళ్లినా... అవి పెద్దగా ఉపయోగపడవు. పైగా ఇవి వ్యయం కూడా తక్కువ. త్వరలో వీటిని నగరంలో పంపిణీ చేయనున్నారు. ఈ నెలలో నగరంలో మొక్కల పంపిణీకి శ్రీకారం చుట్టనున్నారు. ఈ ట్రీగార్డులను కూడా పంపిణీ చేసేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో మొక్కలు తెప్పించి, పంపిణీ చేయనున్నారు. సుమారు 4 వేల మొక్కలను అటవీ శాఖ నుంచి తెప్పించనున్నారు. వీటిలో సీతాఫలం, జామ వంటివి ఇవ్వనున్నారు. నెలాఖరులోపు పంపిణీని పూర్తి చేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు.

తక్కువ ఖర్చుతో ఎక్కువ ఉపయోగం

ప్లాస్టిక్ ట్రీ గార్డులను గ్రీన్ కార్పొరేషన్ నుంచి తెప్పించాం. రూ.200 ధర చెప్పినా.. కార్పొరేషన్ ఎండీతో మా ట్లాడి, ఒక్కో ట్రీ గార్డుపై రూ.100 త గ్గింగచ లిగాం. వీటికి ఖర్చు తక్కువ, ఉపయోగాలు ఎక్కువ. వీటిని నెలాఖరులోపు మొక్కలతోపాటు పంపిణీ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.



– పీవీవీఎస్ మూర్తి, కమిషనర్, అనంతపురం

కూరగాయల ఖిల్లా!

సాగు పట్ల ఎద్దులపల్లి రైతుల ఆసక్తి..

అంతర్‌పంటగా సైతం సాగు చేస్తున్న వైనం..

ధరలు బాగుండటంతో లాభాలు గడిస్తున్న అన్నదాతలు..



సాంబారు దోసను గ్రేడింగ్ చేస్తున్న మహిళ

పామిడి:

మండల కేంద్రానికి 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎద్దులపల్లి గ్రామం కూరగాయల సాగుకు చిరునామాగా నిలుస్తోంది. వేరుశనగ సాగుతో నష్టాలు మూటగట్టుకున్న రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించారు. కూరగాయల సాగు చేపట్టి, లాభాలు గడిస్తున్నారు. టమోటా, బెండ, వంకాయ, గోరుచిక్కుడు, సాంబారుదోస, అనప తదితర కూరగాయల పంటలను సాగు చేస్తున్నారు. బోరు బావుల కింద తక్కువ విస్తీర్ణంలోనే ఈ ప్రత్యామ్నాయ పంటలను సాగు చేస్తూ లాభాలు గడించి ఔరా అనిపించుకుంటున్నారు. తెగుళ్ల సోకకుండా ఎప్పటికప్పుడు మందులు పిచికారీ చేసుకుంటూ పైర్లను సంరక్షించుకుంటున్నారు. తక్కువ నీటితోనే ఎక్కువ దిగుబడులు సాధిస్తూ.. భూగర్భ జలాలను సైతం పొదుపుగా వినియోగించుకుంటున్నారు. ఉద్యాన తోటల్లో అంతర్‌పంటలుగా సాంబారు దోస, టమోట కూరగాయలను సాగు చేస్తున్నారు. గ్రామంలో 70 ఎకరాల్లో టమోటా, 26 ఎకరాల్లో బెండ, 29 ఎకరాల్లో సాంబారు దోస, 19 ఎకరాల్లో వంగ, 23 ఎకరాల్లో అనప పంటలను సాగుచేస్తున్నారు. ప్రస్తుతం దిగుబడులు ఆశాజనకంగా ఉండటంతోపాటు మంచి ధరలు లభిస్తుండటంతో రైతుల పంట పండింది. లక్షల్లో లాభాలు గడిస్తున్నారు.



సాగు చేసిన టమోటా



బెండ కమతంలో కాయలు కోస్తున్న దృశ్యం



వంగ తోట

పెట్టుబడి కొద్దీ దిగుబడి: ఆంజనేయులు, రైతు, ఎద్దులపల్లి



ఏటా టమోటా సాగు చేస్తున్నా. ప్రస్తుతం 7 ఎకరాల్లో పంట పెట్టా. పెట్టుబడి పెట్టేకొద్దీ దిగుబడి వస్తుంది. టమోటా మొక్కలు నాటినప్పటి నుంచి కంటికి రెప్పలా కాపాడుకోవాలి. ఎండుతెగుళ్ల, వైరస్, పచ్చపురుగు ఆశించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. టమోటాపై ఇప్పటి వరకూ రూ.3లక్షలకుపైగా పెట్టుబడి పెట్టా. కాపు ఆశాజనకంగానే ఉంది. మరో వారం రోజుల్లో మొదటి కోత వస్తాయి. ధరపై ఆశలు పెట్టుకున్నా.

ధర ఉంటే దశ తిరిగినట్లే: కేశవరెడ్డి, రైతు



మూడెకరాల జామ, మామిడి తోటల్లో సాంబారు దోసను అంతర్‌పంటగా సాగు చేస్తున్నా. ధర ఉంటే జాక్‌పాట్ కొట్టినట్లే. పంట సాగుకు ఎకరాకు రూ.15వేలకుపైగానే వెచ్చించా. మొదటి కోతలో సుమారు రూ.45వేలు వచ్చాయి. రెండో కోతకు రూ.50వేల వరకూ సమకూరింది. మూడో కోత సమయానికి ధర బాగుంటే రూ.లక్ష గిట్టుబాటు అయినట్లే. మంచిధర లభిస్తే సాంబార్‌దోసతోనే దశ తిరుగుతుంది.

బెండతో బెంగ తీరనుంది: శంకర్, కౌలు రైతు



కొన్నేళ్లుగా పొలాలను కౌలుకు తీసుకుని, బెండ సాగు చేస్తున్నా. గతేడాది ఈ పంటతో రూ.లక్ష చేతికందింది. బూడిద తెగుళ్ల, వైరస్, పచ్చపురుగు, దోమపోటు సోకుతోంది. ఎప్పటికప్పుడు మందులు పిచికారీ చేస్తున్నా. రెండెకరాలకు రూ.80 వేల వరకు పెట్టుబడి పెట్టా. ఈ ఏడాది మంచి దిగుబడితో పాటు ధర లభిస్తే బెంగ తీరుతుంది.

'బల్గేరియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ-2017'విజేత?

1. 2017కి గాను 'మాలతి చందూర్' సాహిత్య పురస్కారానికి ఎంపికైనది?
ఎ) రంగనాయకమ్మ బి) కనపర్తి వరలక్ష్మి
సి) శివరాజు సుబ్బలక్ష్మి
డి) యద్దనపూడి సులోచనరాణి

2. కమ్యూనికేషన్ రంగంలో విశిష్ట సేవలందించి నందుకు 'మార్కోని సొసైటీ జీవన సాఫల్య పురస్కారం-2017'కి ఎంపికైన ఇండో అమెరికన్?
ఎ) థామస్ కైలత్ బి) శంకర్ సుబ్రమణ్యం
సి) వెంకట్రామన్ రామకృష్ణన్
డి) పురుషోత్తందాస్ మహర్

3. ఎకనమిక్స్ ఇంటెలిజెన్స్ యూనిట్ 140 దేశాలపై నిర్వహించిన సర్వేలో 2017కిగాను అత్యంత నివాసయోగ్య నగరంగా తొలిస్థానంలో నిలిచింది?
ఎ) వాంకోవర్(కెనడా) బి) గ్విమాసున్(చైనా)
సి) వియన్నా(ఆస్ట్రియా) డి) మెల్‌బోర్న్(ఆస్ట్రేలియా)

4. షాంఘై ర్యాంకింగ్ కన్సల్టెన్సీ 2017కిగాను ప్రకటించిన 'అకడమిక్ ర్యాంకింగ్స్ ఆఫ్ వరల్డ్ యూనివర్సిటీ' నివేదికలో తొలిస్థానం పొందింది?
ఎ) హార్వర్డ్ యూనివర్సిటీ(అమెరికా)
బి) సింగువా యూనివర్సిటీ(చైనా)
సి) మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (అమెరికా)
డి) టోక్యో యూనివర్సిటీ(జపాన్)

5. 2017 ఆగస్టు 17న రక్షణ శాఖ రూ.4168 కోట్లతో ఆరు అపాచీ హెలికాప్టర్ల కొనుగోలుకు ఆమోదం తెలిపింది. వీటి తయారీ సంస్థ బోయింగ్ ఏ దేశానికి చెందింది?
ఎ) ఇటలీ బి) జర్మనీ సి) అమెరికా డి) ఫ్రాన్స్

6. 'బల్గేరియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ-2017' పురుషుల సింగిల్స్ విజేత?
ఎ) పీటర్ గేడ్(డెన్మార్క్) బి) లక్ష్యసేన్(ఇండియా)
సి) లిన్‌డాన్(చైనా)
డి) జ్వొనిమిర్ దుర్కిన్‌జాక్(క్రొయేషియా)

7. ఫోర్బ్స్ పత్రిక-2017కిగాను ప్రకటించిన అత్యధిక రెమ్యూనరేషన్ పొందుతున్న హీరోయిన్ల జాబితాలో తొలిస్థానం పొందింది?
ఎ) జెన్నిఫర్ లోపెజ్ బి) జెన్నిఫర్ అనిస్టోన్
సి) అలిసియా వికెందర్ డి) ఎమ్మాస్టోన్

8. ఇండియాటుడే ఇటీవల భారత ప్రధానుల సమర్థతపై 'మూడ్ ఆఫ్ ద నేషన్' పేరిట నిర్వహించిన సర్వేలో 33 శాతం ఓట్లతో అత్యంత సమర్థుడైన ప్రధానిగా నిలిచింది?
ఎ) అటల్ బిహారి వాజ్‌పేయి
బి) జవహర్‌లాల్ నెహ్రూ
సి) ఇందిరాగాంధీ డి) నరేంద్రమోదీ

9. మదర్సాల ఆన్‌లైన్ నమోదుకు ఇటీవల ప్రత్యేక పోర్టల్‌ను ప్రారంభించిన రాష్ట్రం?
ఎ) గుజరాత్ బి) ఉత్తరప్రదేశ్
సి) బిహార్ డి) కేరళ

10. ఇన్ఫోసిస్ ఎం.డి. విశాల్‌సిక్కా రాజీనామాతో తాత్కాలిక ఎం.డి.గా ఎవరు నియమితులయ్యారు?
ఎ) ప్రవీణ్‌రావు బి) సంజయ్ బంగా
సి) సబీర్ భాటియా
డి) విజయ్ శేఖర్ శర్మ

11. తెలంగాణలో తొలి స్మార్ట్ పోలీస్‌స్టేషన్‌ను 2017 ఆగస్టు 18న ఎక్కడ ప్రారంభించారు?
ఎ) జమ్మికుంట(కరీంనగర్) బి) బెజ్జంకి(సిద్ధిపేట)
సి) నవీపేట(నిజామాబాద్)
డి) దోమకొండ(నిజామాబాద్)

12. 2017 ఆగస్టు 19న మహిళ భద్రత కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించిన టోల్‌ఫ్రీ నంబరు?
ఎ) 181 బి) 1551 సి) 112 డి) 999


ఎస్.మహిపాల్‌రెడ్డి
సీనియర్ ఫ్యాకల్టీ

జి.కె. అండ్ కరెంట్ అఫైర్స్

13. ఇండియన్ కౌన్సెల్ ఆఫ్ ఫుడ్ అండ్ అగ్రికల్చర్ అందించే 'వ్యవసాయ నాయకత్వ అవార్డు-2017'కి ఎంపికైనది?
ఎ) శివరాజ్‌సింగ్ చౌహాన్(మధ్యప్రదేశ్)
బి) నితిష్ కుమార్(బీహార్)
సి) కె.చంద్రశేఖర్‌రావు(తెలంగాణ)
డి) విజయన్(కేరళ)

14. 2017కి గాను ఫోర్బ్స్ పత్రిక ప్రకటించిన అత్యధిక ఆదాయం గల మహిళ క్రీడాకారుల జాబితాలో తొలిస్థానం పొందింది?
ఎ) సెరెనా విలియమ్స్(టెన్నిస్)
బి) మరియా మజుచిక్(చెస్)
సి) పి.వి.సింధు(బ్యాడ్మింటన్)
డి) స్మృతి మంధన(క్రికెట్)

15. 'ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్- 2017'కి ఆతిథ్యమిస్తున్న నగరం?
ఎ) కౌలాలంపూర్(మలేషియా)
బి) గ్లాస్గో(బ్రిటన్) సి) బ్యాంకాక్(థాయ్‌లాండ్)
డి) హాంగ్జ్(చైనా)

16. ఎవరి జయంతిని పురస్కరించుకొని ఆగస్టు 20న 'సద్భావన దివస్'గా నిర్వహిస్తారు?
ఎ) రవీంద్రనాథ్ ఠాగూర్ బి) రాజీవ్‌గాంధీ
సి) ఇందిరాగాంధీ డి) పండిట్ రవిశంకర్

17. భారత నౌకా దళానికి చెందిన ఆరుగురు మహిళ అధికారులు ప్రపంచ యాత్ర లక్ష్యంగా చేపట్టిన 'నావికా సాగర్ పరిక్రమ' ప్రాజెక్టులో ఉపయోగిస్తున్న నౌక?
ఎ) ఐఎన్ఎస్‌వి తరిణి
బి) ఐఎన్ఎస్‌వి మహదేవి
సి) ఐఎన్ఎస్‌వి సింధురక్షక్
డి) ఐఎన్ఎస్‌వి తల్వార్

18. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నూతనంగా విడుదల చేయనున్న రూ.50 నోటుపై ఉన్న చిహ్నం 'సాంస్కృతిక రథాన్ని' ఎక్కడి నుంచి గ్రహించారు?
ఎ) జైపూర్(రాజస్థాన్) బి) హంపి(కర్ణాటక)
సి) శ్రావణబెళగొళ(కర్ణాటక) డి) పింప్రి(మహారాష్ట్ర)

19. 'నికోలాయ్ కుద్‌షెవ్' ఇటీవల ఏ దేశం తరపున భారత్‌లో రాయబారిగా నియమితులయ్యారు?
ఎ) రష్యా బి) మంగోలియా
సి) కజకిస్థాన్ డి) ఇజ్రాయెల్

20. భారత్‌లో పాకిస్తాన్ నూతన హైకమిషనర్‌గా ఇటీవల ఎవరు నియమితులయ్యారు?
ఎ) అబ్దుల్ బాసిత్ బి) మలీహాలోధి
సి) సొహెల్ మహమ్మద్ డి) రియాల్ షరీఫ్

21. పి.ఆర్.శేషాద్రి ఇటీవల ఏ బ్యాంక్‌కు మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు?
ఎ) కెనరా బ్యాంక్ బి) లక్ష్మీవిలాస్ బ్యాంక్
సి) బ్యాంక్ ఆఫ్ బరోడా డి) కరూర్ వైశ్యా బ్యాంక్

22. 2017కిగాను 'స్పానిష్ సూపర్ కప్' ఫుట్‌బాల్ టోర్నీ విజేత?
ఎ) రియల్ మాడ్రిడ్ క్లబ్ బి) బార్సిలోనా క్లబ్
సి) ఇంగ్లీష్ ప్రీమియర్ క్లబ్ డి) రివర్స్ ప్లేటో క్లబ్

23. 2017 ఆగస్టులో ప్రపంచ ఆరోగ్య సంస్థ ఏ దేశాన్ని 'పోలియో రహిత దేశం'గా ప్రకటించింది?
ఎ) సెనెగల్ బి) కాంగో
సి) సోమాలియా డి) పాకిస్తాన్

24. 'అండర్-19 ప్రపంచ కప్ క్రికెట్ టోర్నీ-2018'కి ఆతిథ్యం ఇస్తున్న దేశం?
ఎ) ఆస్ట్రేలియా బి) న్యూజిలాండ్
సి) ఇండియా డి) శ్రీలంక

25. భారత వ్యవసాయ శాఖ 2016-17కి గాను విడుదల చేసిన గణాంకాల ప్రకారం దేశంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి(మిలియన్ టన్నుల్లో)
ఎ) 110.15 బి) 384.76 సి) 314.16 డి) 275.68

26. భారత్ ఏ దేశంతో కుదుర్చుకొన్న మేధోహక్కుల పరస్పర అవగాహన ఒప్పందాన్ని కేంద్ర కేబినెట్ ఇటీవల ఆమోదించింది?
ఎ) ఆస్ట్రియా బి) స్వీడన్ సి) ఫ్రాన్స్ డి) అమెరికా

27. హిందుస్తాన్ కాపర్ లిమిటెడ్ నూతన చీఫ్ మేనేజింగ్ డైరెక్టర్?
ఎ) సంతోష్‌శర్మ బి) మన్నెల్లి లక్ష్మీకాంతం
సి) సంజయ్‌గుప్తా డి) హర్షకుమార్ భన్వాల్

28. ఇటీవల విడుదలైన 'ఇండియా ఎట్ 70; స్నాప్ షాట్ సిన్స్ ఇండిపెండెన్స్' పుస్తక రచయిత?
ఎ) ఎస్.సి.ఉల్లేఖ్ బి) రోషెన్ దలాల్
సి) అమృత వర్షిణ్ డి) అరుంధతిరాయ్

29. మహారాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన 'నమో యువ రోజ్‌గార్ కేంద్ర' ప్రధాన ఉద్దేశం?
ఎ) యువ పారిశ్రామికవేత్తలకు రుణసౌకర్యం
బి) ఆర్గానిక్ కూరగాయలను తక్కువ ధరకు ప్రజలకు చేరువ చేయడం
సి) యువజన సంఘాల ఏర్పాటు ద్వారా ఐక్యత పెంపొందించడం
డి) రాష్ట్ర నిర్మాణంలో యువత నైపుణ్యాల వినియోగం

30. 2017 ఆగస్టు 18న దోమలను నిరోధించే ప్రత్యేక రైలును ప్రవేశపెట్టిన నగరం?
ఎ) ఢిల్లీ బి) బెంగళూరు
సి) చెన్నై డి) కోయంబత్తూర్

31. కేంద్రమంత్రి స్మృతి ఇరానీ ప్రారంభించిన చేనేత ఉత్పత్తి, ఎగుమతి సంస్థ 'ఓరియంట్ క్రాఫ్ట్ లిమిటెడ్' ఏ రాష్ట్రానికి చెందింది?
ఎ) ఛత్తీస్‌గఢ్ బి) జార్ఖండ్ సి) మధ్యప్రదేశ్ డి) కేరళ

32. 'ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సెల్ 2017 ఆగస్టులో ప్రకటించిన వన్డే ర్యాంకింగ్స్‌లో తొలిస్థానం పొందిన బ్యాట్స్‌మన్?
ఎ) కేన్ విలియమ్సన్ బి) షకిబుల్ హసన్
సి) విరాట్ కోహ్లి డి) ఎవరూ కాదు

33. శ్రీలంక నేవీ చీఫ్‌గా నియమితులైన తమిళ సంతతి వ్యక్తి?
ఎ) కదిరగమర్. ఆర్ బి) డబ్ల్యూ.హెచ్.పెరెర
సి) పెరియార్ మురుగన్ డి) ట్రావిస్ సిన్నియా

34. ఎదగకుండా జన్మించిన శిశువుల పరిరక్షణ కోసం కృత్రిమ గర్భసంచిని రూపొందించింది?
ఎ) యూనివర్సిటీ ఆఫ్ వెస్టర్న్ ఆస్ట్రేలియా
బి) మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, అమెరికా
సి) టోక్యో యూనివర్సిటీ, జపాన్ డి) ఎ, సి

35. స్కూల్ టీచర్ల కోసం 'మేఘశాల' అనే మొబైల్ యాప్‌ను ప్రారంభించిన రాష్ట్రం?
ఎ) రాజస్థాన్ బి) తమిళనాడు
సి) కర్ణాటక డి) హర్యానా

క్రీడా పురస్కారాలు

36. 2017కిగాను 'రాజీవ్‌గాంధీ ఖేల్‌రత్న, అర్జున' అవార్డుల ఎంపిక కమిటీ చైర్మన్?
ఎ) ఎస్.కె.శర్మ బి) సి.కె.ఠక్కర్
సి) మేరికోం డి) కరణం మల్లీశ్వరి

37. 2017కిగాను 'ధ్యాన్‌చంద్, ద్రోణాచార్య' అవార్డుల ఎంపిక కమిటీ చైర్మన్?
ఎ) మేరికోం బి) కరణం మల్లీశ్వరి
సి) అభినవ్ బింద్రా డి) పుల్లెల గోపీచంద్

38. 2017కిగాను 'రాజీవ్‌గాంధీ ఖేల్‌రత్న'కి ఎంపికైన పారా అథ్లెట్ దేవేంద్ర ఝఝారియా ఏ క్రీడకు చెందిన వ్యక్తి?
ఎ) హైజంప్ బి) టెన్నిస్
సి) జావెలిన్ త్రో డి) షాట్‌పుట్

39. దేవేంద్రతోపాటు 2017కిగాను 'ఖేల్‌రత్న' పొందిన మరో క్రీడాకారుడు?
ఎ) ఎస్.ఎస్.పి.చౌరాసియా - గోల్ఫ్
బి) సర్దార్‌సింగ్ - హాకీ
సి) జ్యోతిసురేఖ - షూటింగ్
డి) విరాట్ కోహ్లి - క్రికెట్

40. 2017కిగాను 'ధ్యాన్‌చంద్' అవార్డుకి ఎంపికైన ముగ్గురిలో లేనిది?
ఎ) సత్తిగీత - అథ్లెటిక్స్
బి) భూపేందర్‌సింగ్ - అథ్లెటిక్స్
సి) సయ్యద్ షాహిద్ హకీం - ఫుట్‌బాల్
డి) సుమరయి టెటె - హాకీ

41. 2017కిగాను 'ద్రోణాచార్య' అవార్డుకి ఎంపికైన ఏడుగురిలో మరణానంతరం పొందిన వ్యక్తి?
ఎ) హీరానంద్ కటారియా - కబడ్డీ
బి) బ్రిజ్‌భూషణ్ మహంతి - బాక్సింగ్
సి) పి.ఎ.రాఫెల్ - హాకీ
డి) డాక్టర్ ఆర్.గాంధీ - అథ్లెటిక్స్

42. 2017కిగాను 'అర్జున' అవార్డు పొందిన 17 మందిలో సరైన వారిని గుర్తించండి?
1. ప్రశాంతసింగ్ - బాస్కెట్ బాల్
2. చటేశ్వర్ పుజారా - క్రికెట్
3. ఎస్.వి. సునీల్ - హాకీ
4. మరియప్పన్ తంగవేలు - పారా అథ్లెట్
5. వరుణ్ సింగ్ బాటి - పారా అథ్లెట్
6. సాక్షి మాలిక్ - రెజ్లింగ్
ఎ) అన్నీ సరైనవే
బి) 6 మినహా అన్నీ సరైనవే
సి) 1, 2, 4 సరైనవి డి) 2 మాత్రమే సరైనది

సమాధానాలు

1) సి	7) డి	13) సి	19) ఎ	27) ఎ	35) సి
2) ఎ	8) డి	14) ఎ	20) సి	28) బి	36) బి
3) డి	9) బి	15) బి	21) డి	29) బి	37) డి
4) ఎ	10) ఎ	16) బి	22) ఎ	30) ఎ	38) సి
5) సి	11) ఎ	17) ఎ	23) సి	31) బి	39) బి
6) బి	12) ఎ	18) బి	24) బి	32) సి	40) ఎ
			25) డి	33) డి	41) డి
			26) బి	34) డి	42) బి

JOBS ఉద్యోగాలు

బిసిపిఎల్

గెయిల్ ఇండియా లిమిటెడ్, ఆయిల్ ఇండియా లిమిటెడ్, న్యూమలీఘర్ రిఫైనరీ లిమిటెడ్, అసోం ప్రభుత్వం ఉమ్మడిగా నిర్వహిస్తున్న బ్రహ్మపుత్ర క్రాకర్ & పాలిమర్ లిమిటెడ్ (బిసిపిఎల్)- కింది పోస్టుల భర్తీకోసం దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 14

పోస్టులు - ఖాళీలు: సీనియర్ మేనేజర్(హెచ్ఆర్)2, మేనేజర్(కెమికల్ 2, ఎఫ్& ఎ 1), డిప్యూటీ మేనేజర్(కెమికల్ 2, హెచ్ఆర్ 1), సీనియర్ ఇంజనీర్ (ఎలక్ట్రికల్ 1, ఇన్‌స్ట్రుమెంటేషన్ 1, మెకానికల్ 1), సీనియర్ ఆఫీసర్(లా 1, మార్కెటింగ్ 2)

అర్హత: పోస్టును అనుసరించి 50 శాతం మార్కులతో డిగ్రీ/ ఎంబిఏ/(పీజీ/ పీజీ డిప్లొమా)(పర్సనల్ మేనేజ్‌మెంట్/ పర్సనల్ మేనేజ్‌మెంట్& ఇండస్ట్రియల్ రిలేషన్స్)/ ఎల్ఎల్‌బీ/ ఎల్ఎల్ఎం/ బిటెక్(కెమికల్/ పెట్రో కెమికల్/ కెమికల్ టెక్నాలజీ/ పెట్రో కెమికల్ టెక్నాలజీ/ ఎలక్ట్రికల్/ ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్స్/ ఇన్‌స్ట్రుమెంటేషన్/ ఇన్‌స్ట్రుమెంటేషన్ & కంట్రోల్/ ఎలక్ట్రానిక్స్ & ఇన్‌స్ట్రుమెంటేషన్/ మెకానికల్/ ప్రొడక్షన్/ ప్రొడక్షన్ & ఇండస్ట్రియల్/మాన్యుఫ్యాక్చరింగ్/ మెకానికల్ & ఆటోమొబైల్)/ సీఏ/ ఐసిడబ్ల్యుఏ ఉత్తీర్ణులై ఉండాలి.

వయసు: పోస్టును అనుసరించి 30 నుంచి 45 ఏళ్ల మధ్య ఉండాలి.

దరఖాస్తు ఫీజు: రూ.200

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 21

వెబ్‌సైట్: w w

ఎన్‌బిసిసి

ఎన్‌బిసిసి ఇండియా లిమిటెడ్ - కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది

మొత్తం ఖాళీలు: 94

పోస్టులు - ఖాళీలు: జనరల్ మేనేజర్ (ఫైనాన్స్) 1, అడిషనల్ జనరల్ మేనేజర్ (ఫైనాన్స్) 2, డిప్యూటీ జనరల్ మేనేజర్ (ఫైనాన్స్) 6, ప్రాజెక్ట్ మేనేజర్ (సివిల్) 5, డిప్యూటీ ప్రాజెక్ట్ మేనేజర్ (సివిల్ 10, ఎలక్ట్రికల్ 5), డిప్యూటీ మేనేజర్(లా) 2, అసిస్టెంట్ మేనేజర్(లా 2), సీనియర్ ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్(సివిల్ 10, ఎలక్ట్రికల్ 3), అసిస్టెంట్ మేనేజర్(హెచ్ఆర్ఎం 2, రాజ భాష 2), జూనియర్ ఇంజనీర్(సివిల్ 40, ఎలక్ట్రికల్ 4)

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 26

వెబ్‌సైట్: w w

సుభాష్ చంద్రబోస్‌ను 'నేతాజీ' అని తొలిసారి పిలిచింది?

ఆధునిక భారతదేశ చరిత్ర



ఎస్. రాజా చక్రధర్
సీనియర్ ఫ్యాకల్టీ

1. **'నాకు రక్తమివ్వండి. మీకు స్వాతంత్ర్యం ఇస్తాను' అని ప్రకటించిన జాతీయోద్యమ నేత?**
ఎ) భగత్‌సింగ్ బి) చంద్రశేఖర్ అజాద్
సి) సుభాష్ చంద్రబోస్ డి) ఖుదీరాంబోస్

2. **1897 జనవరి 23న సుభాష్ చంద్రబోస్ జన్మించిన ప్రాంతం?**
ఎ) కలకత్తా బి) కాన్పూర్ సి) ఢాకా డి) కటక్

3. **సుభాష్ చంద్రబోస్ జన్మించిన భవనం నేడు చారిత్రక ప్రాధాన్యత పొందింది. దాని పేరు?**
ఎ) ప్రగతి భవన్ బి) జానకీనాథ్ భవన్
సి) జననీ భవన్ డి) జాగృతి భవన్

4. **ఐసిఎస్ ఉద్యోగాన్ని వదులుకొని సుభాష్ చంద్రబోస్ జాతీయోద్యమంలోకి ప్రవేశించిన సంవత్సరం?**
ఎ) 1919 బి) 1920 సి) 1921 డి) 1922

5. **సుభాష్ చంద్రబోస్ వ్యక్తిత్వంపై ప్రభావం చూసిన జాతీయోద్యమ నేత?**
ఎ) మోతీలాల్ నెహ్రూ బి) చిత్తరంజన్ దాస్
సి) బిపిన్ చంద్రపాల్ డి) గాంధీజీ

6. **గాంధీజీని జాతిపితగా అభివర్ణించిన జాతీయ నాయకుడు?**
ఎ) గోపాలకృష్ణ గోఖలే బి) రవీంద్రనాథ్ ఠాగూర్
సి) సిఆర్.దాస్ డి) సుభాష్ చంద్రబోస్

7. **సుభాష్ చంద్రబోస్ ఏ ఉద్యమం ద్వారా జాతీయోద్యమంలో ప్రవేశించారు?**
ఎ) చంపారన్ సత్యాగ్రహం
బి) ఖిలాఫత్ ఉద్యమం
సి) సహాయనిరాకరణ ఉద్యమం
డి) ఉప్పు సత్యాగ్రహం

8. **గాంధీజీ ఏ ఉద్యమంలో చేపట్టిన సుదీర్ఘ పాదయాత్రను సుభాష్ చంద్రబోస్ నెపోలియన్స్ ఎల్బాదీవి నుంచి చేపట్టిన యాత్రతో పోల్చారు?**
ఎ) సహాయనిరాకరణ ఉద్యమం
బి) ఉప్పు సత్యాగ్రహం సి) వ్యక్తి సత్యాగ్రహం
డి) క్విట్ ఇండియా ఉద్యమం

9. **సుభాష్ చంద్రబోస్‌ను 'నేతాజీ' అని తొలిసారి పిలిచింది?**
ఎ) గాంధీజీ బి) నెహ్రూ
సి) సి.ఆర్.దాస్ డి) బిపిన్ చంద్రపాల్

10. **ఏ జాతీయ కాంగ్రెస్ సమావేశానికి అధ్యక్షుడిగా బోస్ 1938లో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు?**
ఎ) కలకత్తా బి) లక్నో
సి) బొంబాయి డి) హరిపురి

11. **ప్రణాళిక సంఘాన్ని స్థాపించి, భారతదేశాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలని సూచించింది?**
ఎ) గాంధీజీ
బి) మోక్షగుండం విశ్వేశ్వరయ్య
సి) సుభాష్ చంద్రబోస్
డి) నెహ్రూ

12. **గాంధీజీ బలపర్చిన భోగరాజు పట్టాభి సీతారామయ్యను బోస్ ఏ కాంగ్రెస్ సమావేశంలో ఓడించారు?**
ఎ) త్రిపురి బి) హరిపురి
సి) కలకత్తా డి) లక్నో

13. **సుభాష్ చంద్రబోస్ 'ఫార్వర్డ్ బ్లాక్' రాజకీయ పార్టీని ఎప్పుడు స్థాపించారు?**
ఎ) 1937 బి) 1938 సి) 1939 డి) 1940



14. **ఆంగ్లేయులను దేశం నుంచి తరిమికొట్టేందుకు బోస్ గృహనిర్బంధం నుంచి తప్పించుకొని భారత్‌ను వదిలిన సంవత్సరం?**
ఎ) 1939 బి) 1940 సి) 1941 డి) 1942

15. **కాబూల్, మాస్కో మీదుగా బోస్ ఏ నగరానికి చేరుకొన్నాడు?**
ఎ) బెర్లిన్ బి) పారిస్ సి) లిస్బన్ డి) జెనీవా

16. **సుభాష్ చంద్రబోస్ ఏ దేశంలోని రేడియో కేంద్రం ద్వారా భారతీయులను ఉద్దేశించి ప్రసంగించారు?**
ఎ) రష్యా బి) ఫ్రాన్స్ సి) జర్మనీ డి) జపాన్

17. **భారతదేశ స్వాతంత్ర్య పోరాటానికి సాయం చేస్తామని బోస్‌కు హామీ ఇచ్చిన దేశం?**
ఎ) జర్మనీ బి) జపాన్ సి) రష్యా డి) ఏదీకాదు

18. **టోక్యోలో సుభాష్ చంద్రబోస్‌తో చర్చలు జరిపిన 'టోజో' ఏ పదవిలో ఉన్నారు?**
ఎ) జపాన్ అధ్యక్షుడు బి) ప్రధాన మంత్రి
సి) సైన్యాధికారి డి) విదేశాంగ మంత్రి

19. **1943 నుంచి సుభాష్ చంద్రబోస్ ఏ దేశంలో తన సైనిక కార్యక్రమాలు ప్రారంభించారు?**
ఎ) జర్మనీ బి) జపాన్
సి) సింగపూర్ డి) ఇండోనేషియా

20. **'భారత జాతీయ సైన్యం' ఏర్పాటుకు పునాది వేసింది?**
ఎ) కెప్టెన్ మోహన్‌సింగ్
బి) రాజ్‌బిహారీ బోస్
సి) ఖుదీరాంబోస్ డి) ఎవరూ కాదు

21. **1942లో టోక్యోలో ప్రవాస భారతీయ సమావేశాన్ని ఏర్పాటు చేసింది?**
ఎ) కెప్టెన్ మోహన్‌సింగ్ బి) లాల్ హరిదయాళ్
సి) సుభాష్ చంద్రబోస్ డి) రాజ్‌బిహారీ బోస్

22. **సుభాష్ చంద్రబోస్ 'అజాద్ హింద్ ఫౌజ్'ను ఎక్కడ వ్యవస్థీకరించారు?**
ఎ) టోక్యో బి) బెర్లిన్ సి) సింగపూర్ డి) మాస్కో

జనరల్ స్టడీస్ - ఇండియన్ హిస్టరీ

23. **అజాద్ హింద్ ఫౌజ్‌లోని మహిళ రెజిమెంట్‌కి గల పేరు?**
ఎ) ఝాన్సీరాణి రెజిమెంట్
బి) దుర్గావతి రెజిమెంట్
సి) రాణి అబ్బక్క రెజిమెంట్
డి) మహిళశక్తి రెజిమెంట్

24. **భారత జాతికి సుభాష్ చంద్రబోస్ అందించిన నినాదాలు?**
ఎ) జైహింద్ బి) చల్లో ఢిల్లీ సి) డూ ఆర్ డై డి) ఎ, బి

25. **మొట్టమొదటి భారత ప్రభుత్వాన్ని నేతాజీ ఎక్కడ ఏర్పాటు చేశారు?**
ఎ) టోక్యో బి) రంగూన్
సి) సింగపూర్ డి) మలేషియా

26. **నేతాజీ ఏర్పాటు చేసిన భారత ప్రభుత్వాన్ని గుర్తించిన తొలి దేశం?**
ఎ) రష్యా బి) జర్మనీ సి) జపాన్ డి) ఏదీకాదు

27. **1943లో టోక్యోలో జరిగిన తూర్పు ఆసియా దేశాల సమావేశానికి సుభాష్ చంద్రబోస్ ఏ హోదాలో హాజరయ్యారు?**
ఎ) భారత సైన్యాధినేత బి) విదేశాంగ ప్రతినిధి
సి) భారత ప్రభుత్వాధినేత డి) ఏదీకాదు

28. **అజాద్ హింద్ ఫౌజ్ పాలన కిందకి వచ్చిన తొలి భారత భూభాగం?**
ఎ) అండమాన్ నికోబార్ దీవులు బి) నాగాలాండ్
సి) మణిపూర్ డి) సిక్కిం

29. **అండమాన్ నికోబార్ దీవులకు సుభాష్ చంద్రబోస్ పెట్టిన పేరు?**
ఎ) స్వరాజ్ దీవులు బి) షాహీద్ దీవులు
సి) అజాదీ దీవులు డి) ఎ, బి

30. **సుభాష్ చంద్రబోస్ నేతృత్వంలో జాతీయ సేనకు, బ్రిటీష్‌వారికి మధ్య ప్రత్యక్ష యుద్ధం జరిగిన సంవత్సరం?**
ఎ) 1943 బి) 1944 సి) 1945 డి) 1946

31. **బ్రిటీష్‌వారిని ఓడించి ఆజాంద్ హింద్‌ఫౌజ్ జాతీయ పతాకాన్ని ఎక్కడ ఎగురవేసింది?**
ఎ) మౌడక్ బి) మయన్మార్
సి) అండమాన్ దీవులు డి) ఏదీకాదు

32. **ఆంగ్లేయుల నుంచి జాతీయ సైనం స్వాధీనం చేసుకొన్న ప్రాంతాలు?**
ఎ) మౌఢక్ బి) కోహిమా సి) ఇంఫాల్ డి) పైవన్నీ

33. **భారత జాతీయ సైన్యం సాగించిన సమరం ఆగిపోవడానికి కారణం?**
ఎ) జపాన్‌పై అమెరికా అణుదాడి
బి) బ్రిటీషర్లు రంగూన్‌ను ఆక్రమించడం
సి) జపాన్ సైనికుల తిరోగమనం
డి) పైవన్నీ

34. **తైవాన్ దీవుల్లో సుభాష్ చంద్రబోస్ ప్రయాణించే విమానం ప్రమాదానికి గురైన సంవత్సరం?**
ఎ) 1945 ఆగస్టు 15 బి) 1946 ఆగస్టు 16
సి) 1946 ఆగస్టు 17 డి) 1946 ఆగస్టు 18

35. **బ్రిటీషర్లకు బంధీలుగా చిక్కి ఎర్రకోటలో న్యాయ విచారణ ఎదుర్కొన్న జాతీయ సైన్యం ప్రతినిధులు?**
ఎ) షాన్‌వాజ్‌ఖాన్ బి) కల్నల్ టి.కె.షెనగల్
సి) బి.ఎస్.ధిల్లాన్ డి) పైవారందరూ

36. **భారత సైనికాధికారుల తరపున వాదించి, వారి విడుదలకు తోడ్పడినవారు?**
ఎ) బల్లూభాయ్ దేశాయ్ బి) అసఫ్ అలీ
సి) తేజ్ బహదూర్ సప్రూ డి) పైవారందరూ

సమాధానాలు

1) సి	6) డి	11) సి
2) డి	7) సి	12) ఎ
3) బి	8) బి	13) సి
4) ఎ	9) ఎ	14) సి
5) బి	10) డి	15) ఎ

16) సి	23) ఎ	30) బి
17) బి	24) డి	31) ఎ
18) బి	25) సి	32) డి
19) సి	26) సి	33) డి
20) ఎ	27) సి	34) డి
21) డి	28) ఎ	35) సి
22) సి	29) డి	36) డి

JOBS ఉద్యోగాలు

ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్

ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ లిమిటెడ్ - **గ్రౌండ్ డ్యూటీ** పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది

ఖాళీలు: 28 **కాంట్రాక్ట్ వ్యవధి:** అయిదేళ్లు

పోస్టులు - ఖాళీలు: మేనేజర్(ఫ్లయిట్ డిస్పాచ్) 14, మేనేజర్(ఆపరేషన్ ఎక్స్‌ప్యాట్ సెల్) 1, సీనియర్ ఆఫీసర్(ఫ్లయిట్ డిస్పాచ్) 6, ఆఫీసర్ - కాక్ పిట్ 1, అసిస్టెంట్ టెక్నికల్ (లైబ్రరి) 1, డిప్యూటీ మేనేజర్(ఫ్లయిట్ సేఫ్టీ) 1, సీనియర్ ఆఫీసర్(ఫ్లయిట్ సేఫ్టీ) 1, సింథటిక్ ఫ్లయిట్ (ఇన్‌స్ట్రక్టర్) 2, అసిస్టెంట్ ట్రైనింగ్ 1

వయసు: 21 ఏళ్లు

అర్హత: పోస్టును అనుసరించి ఇంటర్(ఎంపిసి) / డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. అదనపు అర్హతల వివరాలకోసం వెబ్‌సైట్‌లోని ప్రకటన చూడవచ్చు.

ఎంపిక: రాత పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ, మెడికల్ ఎగ్జామినేషన్ ద్వారా

దరఖాస్తు ఫీజు: రూ.500

ఆసక్తిగల అభ్యర్థులు తమ దరఖాస్తును కింది చిరునామాకు పంపాలి

దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ: ఆగస్టు 31

చిరునామా: The Chief of HR, Air India Express Limited, Airlines House, Durbar Hall Road, Near Gandhi Square, Kochi 682016

వెబ్‌సైట్: www.airindiaexpress.in

సిఇఐఎల్

సర్టిఫికేషన్ ఇంజనీర్స్ ఇంటర్నేషనల్ లిమిటెడ్(సిఇఐఎల్)- కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది

మొత్తం ఖాళీలు: 23

పోస్టులు - ఖాళీలు: ఇంజనీర్స్(క్యూసీ/ క్యూఏ) 4, సీనియర్ ఇంజనీర్స్ (క్యూసీ/ క్యూఏ) 5, డిప్యూటీ మేనేజర్ (క్యూసీ/ క్యూఏ) 5, ఇంజనీర్ స్పెషలిస్ట్ 6, సీనియర్ ఇంజనీర్ స్పెషలిస్ట్ 2, ఆఫీసర్ 1

అర్హత: పోస్టును అనుసరించి కనీసం 50 శాతం మార్కులతో బిఇ/ బిటెక్(మెకానికల్/ ప్రొడక్షన్/ మెటలర్జికల్)/ఎంబిఏ(హెచ్‌ఆర్)/ పీజీ(పర్సనల్ మేనేజ్‌మెంట్ & లేబర్ వెల్ఫేర్) ఉత్తీర్ణులై ఉండాలి.

వయసు: 30 నుంచి 45 ఏళ్ల మధ్య ఉండాలి

వెబ్‌సైట్: www.ceil.co.in

ఎన్ఐసిఇడి

కోల్కతాలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కలరా & ఎంటరిక్ డిసీజెస్(ఎన్ఐసిఇడి)- కింది పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

మొత్తం ఖాళీలు: 19

మెడికల్ ఎపిడెమియోలజిస్ట్(సైంటిస్ట్ సి)
ఖాళీలు: 1
అర్హత: ఎంబిబిఎస్ ఉత్తీర్ణతతోపాటు పబ్లిక్ హెల్త్ రీసెర్చ్ విభాగంలో ఆరేళ్ల అనుభవం ఉండాలి.

సీనియర్ రీసెర్చ్ ఫెలో(మెడికల్) **ఖాళీలు:** 12
అర్హత: ఎంబిబిఎస్ ఉత్తీర్ణులై ఉండాలి

సీనియర్ రీసెర్చ్ ఫెలో(నాన్ మెడికల్) **ఖాళీలు:** 1
అర్హత: 60 శాతం మార్కులతో ఎమ్మెస్సీ(లైఫ్ సైన్సెస్) ఉత్తీర్ణులై ఉండాలి.

ఫీల్డ్ కన్సల్టెంట్ / మేనేజర్ **ఖాళీలు:** 1
అర్హత: డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి

డేటా మేనేజర్ **ఖాళీలు:** 1
అర్హత: (డిగ్రీ/ పీజీ)(కంప్యూటర్ అప్లికేషన్స్/ ఐటి/ కంప్యూటర్ సైన్స్) ఉత్తీర్ణులై ఉండాలి. కంప్యూటర్ ప్రోగ్రామింగ్‌లో అయిదేళ్ల అనుభవం ఉండాలి.

అసిస్టెంట్ డేటా మేనేజర్/ డేటా సెక్రటరీ
ఖాళీలు: 1
అర్హత: డిగ్రీ(కంప్యూటర్ అప్లికేషన్స్/ ఐటి/ కంప్యూటర్ సైన్స్) ఉత్తీర్ణత + కంప్యూటర్ ప్రోగ్రామింగ్‌లో రెండేళ్ల అనుభవం ఉండాలి.

అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ / అకౌంటెంట్ **ఖాళీలు:** 2
అర్హత: ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. సంబంధిత విభాగంలో అయిదేళ్ల అనుభవం ఉండాలి.

ఇంటర్వ్యూ తేదీ: సెప్టెంబరు 5

వేదిక: National Institute of Cholera & Enteric Diseases, (NICED II Building within ID & BG Hospital Campus), 57, Beliaghata Main Road, Kolkata - 700010

వెబ్‌సైట్: www.niced.org.in/

ఎన్‌సిఇఆర్‌టి - డిఇఇ

న్యూఢిల్లీలోని నేషనల్ కౌన్సెల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ & ట్రైనింగ్ (ఎన్‌సిఇఆర్‌టి) ఆధ్వర్యంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డిఇఇ)- తాత్కాలిక ప్రాతిపదికన **జూనియర్ ప్రాజెక్ట్ ఫెలో**ల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది. **ఖాళీలు:** 6

అర్హత: కనీసం 55 శాతం మార్కులతో పీజీ(ఎడ్యుకేషన్/ ఇంగ్లీష్/ మేథమెటిక్స్/ మేథమెటిక్స్ ఎడ్యుకేషన్/ ఇంగ్లీష్) పూర్తిచేసి ఉండాలి.

వయసు: 40 ఏళ్లలోపు ఉండాలి.

వేతనం: నెట్ అర్హత పొందిన అభ్యర్థులకు నెలకు రూ.16,000 కాగా నెట్ స్కోరు లేని అభ్యర్థులకు రూ.14000

ఇంటర్వ్యూ తేదీ: ఆగస్టు 29

వేదిక: Department of Elementary Education(DEE), 4th Floor, Room No. 415, G.B Pant Block, NCERT, Sri Aurobindo Marg, New Delhi- 110016

వెబ్‌సైట్: www.ncert.nic.in

ఉత్తగ్యాస్!

(మొదటిపేజీ తరువాయి)

చేస్తామని సూచించింది. ఈ మేరకు గత శుక్రవారం జిల్లా విద్యాశాఖ ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేసింది. అయితే ఇది గందరగోళానికి దారి తీసింది. విద్యాసంవత్సరం ప్రారంభమై మూడు నెలలు కావస్తున్నా.. ఎస్ఎస్ఏ, ఆర్ఎంఎస్ఏ ద్వారా ఎలాంటి మెయింటెనెన్స్ నిధులు పాఠశాలలకు మంజూరు కాలేదు. పైగా ఇటీవల పెద్ద ఎత్తున బదిలీలు జరిగాయి. 80 శాతం పాఠశాలల్లో హెచ్ఎంలు మారిపోయారు. ఉన్న నిధులన్నీ ఖర్చుపెట్టి వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలో గ్యాస్ కనెక్షన్ కొనుగోలుకు డబ్బులు లేవు. దీంతో ఎలా కొనుగోలు చేయాలంటూ ఉపాధ్యాయులు గుర్రుమంటున్నారు. పైగా ఒక కనెక్షన్ కోసం రూ. 2237లు చెల్లించాల్సి ఉంటుంది. ఇలా ఒక్కో పాఠశాలకు పిల్లల సంఖ్యను బట్టి గ్యాస్ సిలిండర్లు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. 500 నుంచి 1000 మందికిపైగా ఉన్న ఉన్నత పాఠశాలలకు అయితే కనీసం వారానికి ఆరు నుంచి ఏడు సిలిండర్లు అవసరమవుతాయంటున్నారు. అలాంటప్పుడు ఆ సిలిండర్ల కొనుగోలుకు రూ. 10 నుంచి రూ. 15 వేల వరకూ చెల్లించాల్సి ఉంటుంది. అసలే డబ్బులు లేక ఇబ్బంది పడుతోంటే..అంత డబ్బు ఎలా చెల్లించగలమని ఉపాధ్యాయులు మండిపడుతున్నారు. అందుకే చాలాచోట్ల గ్యాస్‌కనెక్షన్లు తీసుకోవడానికి వారు ముందుకు రావడం లేదు. జిల్లాలో 3798 పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అమలవుతోంది. ఇందులో కేవలం 639 పాఠశాలల్లో మాత్రమే గ్యాస్ కనెక్షన్లు తీసుకున్నారు. ఇక్కడ కూడా కళ్యాణదుర్గం ఆర్డీఓ రామారావు సహకారంతో కుందుర్పి, కళ్యాణదుర్గం మండలాల్లోని పూర్తిస్థాయి పాఠశాలలకు గ్యాస్ కనెక్షన్లు ఇప్పించినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. మిగిలిన చోట్ల పైసలు లేవంటూ ఎంఈఓలు, హెచ్ఎంలు చేతులెత్తేస్తున్నారు. డబ్బుల్లేవంటూ ఉపాధ్యాయులు తమపై గొడవకు వస్తున్నారని జిల్లా విద్యాశాఖాధికారులకు ఫోన్ ద్వారా కొందరు ఎంఈఓలు చెప్పినట్లు సమాచారం. దీంతో విద్యాశాఖ కొత్త నాటకానికి తెరలేపింది. పూర్వ విద్యార్థులు, ఆయా గ్రామాల్లోని దాతల నుంచి విరాళాలు సేకరించి గ్యాస్ కనెక్షన్లు తీసుకోవాలని ఉచిత సలహా ఇస్తోంది. అలా వీలుకాక పోతే హెచ్ఎంలు తమ సొంత సొమ్ముతో కనెక్షన్ తీసుకోవాలని సూచిస్తున్నారు. ఆ బిల్లులు జిల్లా కార్యాలయంలో ఇస్తే రీయింబర్స్‌మెంట్ చేస్తామంటున్నారు. ఈ మేరకు రాష్ట్రవిద్యాశాఖ నుంచి కూడా ఉత్తర్వులు వచ్చాయని జిల్లా అధికారులు చెబుతున్నారు. అయినా ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు మాత్రం ససేమిరా అంటున్నారు. ఈ నేపథ్యంలో బడిలో పొగలేని బువ్వ అమలు సాధ్యమేనా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.





అనంతలో ప్రత్యామ్నాయ విత్తనాల కోసం బారులు తీరిన రైతులు

రెండో రోజూ అస్తవ్యస్తమే..!

అనంతపురం కలెక్టరేట్: విత్తన పంపిణీకి సర్వర్ సమస్య తీరని వ్యథగా మారింది. వరుసగా రెండవ రోజూ సర్వర్ డౌన్ కావడంతో ప్రత్యామ్నాయ విత్తన పంపిణీకి అంతరాయం ఏర్పడింది. దీని వల్ల పంపిణీ ప్రక్రియ అస్తవ్యస్తంగా మారింది. విత్తనాల కోసం ఎంతో ఆశగా బుధవారం ఉదయమే పంపిణీ కేంద్రాలకు చేరుకున్న రైతులకు.. పంపిణీకి అన్నీ సిద్ధం చేసుకున్న అధికారులు, సిబ్బందికి సర్వర్ సమస్య చుక్కలు చూపించింది. నాలుగవ రోజు బుధవారం కూడా జిల్లావ్యాప్తంగా పలు మండలాల్లో ప్రత్యామ్నాయ విత్తన పంపిణీ కొనసాగింది. మంగళవారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు సతాయించిన సర్వర్... బుధవారం ఉదయం 11.30 గంటల వరకే పనిచేసింది. ఆ తర్వాత పూర్తిగా పనిచేయకుండా మొరాయించింది. దీంతో గంటల తరబడి క్యూలో నిల్చోలేక మహిళా రైతులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం వరకు నిరీక్షించినా సర్వర్ పనిచేయకపోవడంతో చేసేదేమీ లేక రైతులు ఇంటిముఖం పట్టారు. పలు మండలాల అధికారులు ఉన్నతాధికారులను సంప్రదించగా ఈ రోజు సర్వర్ పనిచేయడం కష్టమని చెప్పడం గమనార్హం. అయితే సర్వర్ సమస్యపై పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఖరీఫ్‌లో వేరుశనగ సాగు విస్తీర్ణం తగ్గిపోవడంతో ప్రత్యామ్నాయ విత్తన పంపిణీకి ప్రాధాన్యత ఏర్పడింది. వేరుశనగ తరహాలోనే ప్రత్యామ్నాయ విత్తనాలకు బయోమెట్రిక్ ద్వారానే పంపిణీ చేయాలని నిర్ణయించారు. అయితే ఆ మేరకు సర్వర్ సమస్య ఉత్పన్నం కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంలో వ్యవసాయ శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు శ్రద్ధ చూపలేదు. రెండు రోజులుగా సర్వర్ సతాయింపే ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. బుధవారం జిల్లావ్యాప్తంగా 1221 మంది రైతులకు 1103 క్వింటాళ్ల ప్రత్యామ్నాయ విత్తనాలు పంపిణీ చేశారు. ఇప్పటి వరకు 8340 మంది రైతులకు 6797.60 క్వింటాళ్ల విత్తనాలు పంపిణీ చేశారు.

అధికారులపై తిట్లపురాణం...

ఎన్నో కష్టాలు పడి విత్తన పంపిణీ కేంద్రాలకు వస్తే సర్వర్ పనిచేయడం లేదని చెబుతారా? అంటూ పలు మండలాల్లో వ్యవసాయ అధికారులు, సిబ్బందిపై మహిళా రైతులు, వృద్ధులు తిట్ల దండకం అందుకున్నారు. దీంతో వాటిని వినలేక ఆయా ప్రాంతాల్లోని అధికారులు, సిబ్బంది పక్కకు వెళ్లిపోవడం కనిపించింది. విత్తనాలు ఇవ్వనప్పుడు తమను రావాల్సిందిగా ఎందుకు చెప్పారని మరికొందరు వృద్ధులు ఆవేదనతో ప్రశ్నించారు. అయితే వారికి సమాధానం చెప్పలేక అధికారులు అవస్థలు పడాల్సి వచ్చింది. ఉన్నతాధికారుల పర్యవేక్షణాలోపం వల్లే అటు రైతులు ఇటు మండల స్థాయి అధికారులు, సిబ్బంది నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం చొరవ తీసుకుని రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి సర్వర్ సమస్యను తీసువెళ్లి భవిష్యత్తులో పునరావృతం కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సి ఉంది.

విదేశీ నిధుల కోసమేనా?

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

ధర్మవరం: 'ఎవరి అనుమతి తీసుకుని ఎం-ఆర్ వ్యాక్సిన్లు వేస్తున్నారు? ఇష్టారాజ్యంగా వ్యాక్సిన్ వేస్తూ పిల్లల జీవితాలతో ఆడుకుంటారా? ఎవరికి పడితే వా రికి వ్యాక్సిన్ వేయడం వల్ల తలెత్తే అనర్థాలకు ఎవరు బాధ్యత వహిస్తారు? ప్రభుత్వం స్పష్టంగా 9నెలల నుంచి 15 సంవత్సరాల్లోపు వారికే ఎం-ఆర్ వ్యాక్సిన్ వేయాలని ప్రకటించింది కదా? ప్రభుత్వ ఆదేశాలను పాటించకపోతే ఎలా? పైగా ఇది కేవలం ప్రభుత్వ శాఖ ద్వారానే అమలు కావాలి. బయటివారు వ్యాక్సిన్ వేయాలంటే తప్పనిసరిగా వైద్య ఆరోగ్యశాఖ అనుమతి తీసుకోవాలి. అయితే ధర్మవరంలో కొందరు యువర్స్‌ఫౌండేషన్ పేరుతో ఇష్టారాజ్యంగా వ్యాక్సిన్లు వేస్తున్నారు. రేపు జరగరానిది ఏదైనా జరిగితే.. ఆ అపవాదు ఎవరిపై పడుతుంది? అదీ 5 రోజుల్లో కాలపరిమితి తీరనున్న వ్యాక్సిన్లు వేస్తారా? బయటి విద్యార్థులంటే వారికి అంత అలుసా? తక్షణమే అక్కడికి వెళ్లి విచారించి, ఆ ఫౌండేషన్ సంగతేమిటో తేల్చి నివేదిక పంపండి' అంటూ స్థానిక డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ యుగంధర్‌పై రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ హెల్త్ గీతాప్రసాదిని సీరియస్ అయ్యారు. వివరాలు కింది విధంగా ఉన్నాయి.

ధర్మవరం యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీసాయి డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు ఎం-ఆర్ వ్యాక్సిన్ వేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు 9నెలల నుంచి 15 సంవత్సరాల్లోపు వారికే ఈ వ్యాక్సిన్ వేయాలని నిర్దిష్టమైన ఆదేశాలున్నాయి. వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలోనే ఈ కార్యక్రమం చేపట్టాల్సి ఉంది. ఇతరులెవరైనా ఈ కార్యక్రమం నిర్వహించాలంటే తప్పనిసరిగా వైద్యఆరోగ్యశాఖ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అయితే ప్రభుత్వ ఆదేశాలను యువర్స్‌ఫౌండేషన్ తుంగలో తొక్కి ఏకంగా 20 సంవత్సరాలు, అంతకు పైగా వయస్సున్న విద్యార్థులకు వ్యాక్సిన్ వేసింది. ఇలా చేయడం వల్ల భవిష్యత్తులో పిల్లలకు జరగరానిది ఏదైనా జరిగితే అందుకు ఎవరు బాధ్యులు అనేది వైద్యఆరోగ్యశాఖ నుంచి ఉత్పన్నమైన ప్రశ్న. ఈ విషయమై ఆంధ్రజ్యోతిలో 'నిబంధనలకు విరుద్ధంగా వ్యాక్సిన్' శీర్షికన బుధవారం కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. దీంతో ఆరోగ్యశాఖ అడిషనల్ డైరెక్టర్ గీతాప్రసాదిని, యువర్స్‌ఫౌండేషన్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. పిల్లల జీవితాలో చెలగాటమాడుతారా? ఎవరి అనుమతి తీసుకుని ఇలాంటి పని చేశారు? అది వికటించి ఉంటే బాధ్యత ఎవరు వహిస్తారంటూ తీవ్రంగా మండిపడినట్టు సమాచారం. క్షేత్రస్థాయిలో పూర్తిగా విచారించి ఆ సంస్థ సంగతి తేల్చాలంటూ డిప్యూటీ డీఎంఅండ్ హెచ్ఓను ఆదేశించడంతో అసలు బాగోతం బయట పడింది.

వారంలో కాలపరిమితి తీరనున్న వ్యాక్సిన్ ఉపయోగించడమా?

మరో వారం రోజుల్లో.. అంటే ఆగస్టు 31తో కాలపరిమితి తీరనున్న ఎంఆర్ వ్యాక్సిన్‌ను యువర్స్‌ఫౌండేషన్ పంపిణీ చేసినట్టు విచారణలో తేలింది. అయితే దీన్ని ఇప్పటి వరకు పిల్లలకు ఎందుకు ఉపయోగించలేదు. కాలపరిమితి తీరే సమయంలో ఎందుకు ఇంత ఆర్భాటంగా వ్యాక్సిన్ వేయాల్సి వచ్చిందనే విషయంపై పట్టణ వాసులే ప్రశ్నిస్తున్నారు. సామాజిక సేవ, పిల్లల పట్ల మానవత్వం ఉన్నట్టయితే ఆ వ్యాక్సిన్‌ను ఇంత వరకు వేయకుండా ఎందుకు దాచుకున్నారు అనేది పలు అనుమానాలకు దారి తీస్తోంది.

విదేశీ నిధుల కోసమేనా?

విదేశీ నిధుల కోసమే యువర్స్ ఫౌండేషన్ ఇలాంటి కార్యక్రమాలు చేపట్టిందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పలువురు ఇదే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం విచారణలో కూడా ఆ విషయంపై చర్చ జరిగినట్టు విశ్వసనీయ సమాచారం. ఏదిఏమైనా పిల్లల జీవితాలతో చెలగాటమాడిన యువర్స్‌ఫౌండేషన్‌పై ఎటువంటి చర్యలు తీసుకుంటారో వేచిచూడాల్సిందే.

డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ యుగంధర్ ఏమంటున్నారంటే..

డిగ్రీ కాలేజి విద్యార్థులకు ఎంఆర్ వ్యాక్సిన్ వేయడాన్ని రాష్ట్ర ఆరోగ్యశాఖ చాలా సీరియస్‌గా తీసుకుంది. రాష్ట్రశాఖ ఆదేశాల మేరకు సమగ్ర విచారణ చేపట్టాం. యువర్స్‌ఫౌండేషన్ సభ్యులు ఇష్టారాజ్యంగా మా అనుమతి లేకుండా విద్యార్థులకు ఎంఆర్ వ్యాక్సిన్లు వేశారు. దీనిపై ముందుగా మాకు ఎటువంటి సమాచారం ఇవ్వలేదు. ఆ వ్యాక్సిన్లను మా నుంచి పొందలేదు. ఫౌండేషన్‌లో ఒక సభ్యుడికి సంబంధించి ప్రైవేటు క్లినిక్ నుంచి వాటిని సేకరించారని విచారణలో తేలింది. పైగా కనీస ప్రమాణాలు కూడా పాటించలేదు. మరో వారంరోజుల్లో కాలపరిమితి తీరనున్న వ్యాక్సిన్లను వాడడం నన్ను ఆశ్చర్యానికి గురిచేసింది. ఇక్కడ జరిగిన విషయాన్నంతా నివేదిక రూపంలో ఉన్నతాధికారులకు అందజేశా.

'పురం' ట్రాన్స్‌కోలో బినామీ ఉద్యోగులు

ఏడీ అనుమతి లేకుండా మూడు నెలలుగా జీతాలు

ప్రశ్నించినందుకు ఏడీపై ఎల్ఐ దాడి

లంచం ఇవ్వనందుకే తప్పుడు ఫిర్యాదులు : ఎల్ఐ

హిందూపురం అర్బన్: ఇక్కడి ట్రాన్స్‌కోలో బినామీ ఉద్యోగుల పర్వం కొనసాగుతోంది. సీఎండీ అనుమతులు లేకుండా కొంతమంది కాంట్రాక్టు ఉద్యోగులను చేర్చుకుని వారికి జీతాలు కూడా చెల్లిస్తున్న వైనం హిందూపురం ట్రాన్స్‌కో కార్యాలయంలో వెలుగుచూసింది. వివరాల్లోకి వెళితే.. చిలమత్తూరు మండలంలో నరహరి అనే వ్యక్తి పోల్ టు పోల్ కాంట్రాక్టు ఉద్యోగిగా విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే కొంత కాలంగా అతడికి కళ్లు సరిగ్గా కనిపించలేదని ఆ స్థానంలో రాజశేఖర్‌రెడ్డి అనే వ్యక్తిని నియమించారు. అయితే రూరల్ పరిధిలో తనకు కూడా తెలియజేయకుండా లైన్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్‌నాయక్, డీఈ శేషగిరిరావు రాజశేఖర్‌రెడ్డి నుంచి రూ. 2లక్షలు లంచం తీసుకున్న ట్లు ఏడీ రామకృష్ణ బహిరంగంగా ఆరోపిస్తున్నారు. అయితే డబ్బు చేతికి రాకుండా చేస్తున్నాడంటూ ఎల్ఐ లక్ష్మణ్ నాయక్ తనపై దాడికి దిగాడంటూ లిఖితపూర్వకంగా ఈ నెల 1వ తేదీన డీఈకి ఏడీ ఫిర్యాదు చేశారు. 23 రోజులు గడిచినా ఉన్నతాధికారిపై దాడికి దిగిన వ్యక్తిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన చెందారు. ఈ విషయంపై బుధవారం ఎస్సీ, ఎస్టీ విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు డీఈ కార్యాలయంలో ఆందోళనకు దిగారు. ఏడీకి న్యాయం చేసేంతవరకు కదిలేదిలేదని భీష్మించారు. 1987 నుంచి లక్ష్మణ్‌నాయక్‌పై అనేక ఫిర్యాదులు ఉన్నాయన్నారు. లేపాక్షి మండలం కొండూరులో అనుమతులు లేని సర్వీసులను వినియోగదారులకు అందించి ఇటీవల లక్షలాది రూపాయల సొమ్ము కాజేశాడని, ఈ విషయాలు రుజువు కావడంతో కక్ష కట్టి తనపై దాడికి దిగాడని ఏడీ పేర్కొన్నారు. ఇటీవల అతనిపై కోర్టులో క్రిమినల్ కేసు కూడా నడుస్తోందన్నారు. పోల్‌టు పోల్ ఉద్యోగం నుంచి ఎవరినైనా తొలగిస్తే ఆ స్థానంలో మరొకరిని నియమించకూడదని స్పష్టమైన ఆదేశాలున్నా లెక్కచేయకుండా కింది స్థాయి అధికారులతో చేతులు కలిపి డీఈ కూడా అవినీతికి పాల్పడ్డారని, ఈ విషయంపై డిపార్ట్‌మెంట్ అధికారులతో పాటు ఏసీబీ అధికారులు కూడా విచారణ జరిపి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్టీ యూనియన్ నాయకులు కోరారు. లైన్ ఇన్‌స్పెక్టర్లు సిబ్బందితో కలిసి బుధవారం రాత్రి డీఈ కార్యాలయం వద్ద బైఠాయించి నిరసన తెలిపారు.

లంచం ఇవ్వనందుకే తప్పుడు ఫిర్యాదులు : ఎల్ఐ లక్ష్మణ్‌నాయక్

పోల్ టు పోల్ ఉద్యోగంలో ఎవరినైనా చేర్చుకుంటే రూ. 2లక్షలు లంచం ఇవ్వాలని ఏడీ రామకృష్ణ డిమాండ్ చేశారు. ఉద్యోగంలో తన బావమరిదిని నియమించుకునేందుకు ఆయన పన్నాగం పన్నారు. అయితే ఈ విషయం మా దృష్టికి రావడంతో ఆయన్ను నిలదీశాం. దీంతో కక్ష ధోరణితో నాపై తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారు. నాలుగు నెలలుగా ఏడీకి తెలియకుండా వేరొకరు విధులు నిర్వర్తిస్తుంటే అతనెందుకు చర్యలు తీసుకోలేదు.

విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం - డీఈ శేషగిరిరావు

ఎవరు తప్పు చేసినా సహించేది లేదు. దీనిపై పూర్తి విచారణ జరిపి ఉన్నతాధికారులను సంప్రదించి చర్యలు తీసుకుంటాం. అయితే నేను కూడా లంచం తీసుకున్నట్లు ఆరోపిస్తున్నారు. విచారణకు సిద్ధంగా ఉన్నా.

దేశ సేవలో టంగుటూరి పాత్ర చిరస్మరణీయం


రాయదుర్గం : టంగుటూరు ప్రకాశం పంతులు దేశం కోసం చేసిన త్యాగం చిరస్మరణీయంగా నిలిచిపోయిందని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో టంగుటూరి ప్రకాశం పంతులు 145వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన అడుగుజాడల్లో నడిచేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు.

రాయదుర్గంరూరల్‌లో : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నాగరాజు ఆధ్వర్యంలో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

లోకల్ గైడ్
localguide

ఎమ్మెల్యే డైరీ

రాయదుర్గం : శాసనసభ్యులు, గ్రామీణ గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కాలవ శ్రీనివాసులు గురువారం అనంతపురంలో ఉంటారు.



రాయదుర్గం : **మధు :** నేనే రాజు నేనే మంత్రి
కేబీ ప్యాలెస్ : జయ జానకి నాయక
ఎస్‌వీ సినిమాక్స్ : లై
కణేకల్లు - **శ్రీ చిక్కణ్ణేశ్వర :** జయ జానకి నాయక
ఉద్దేహాళ్ : **తాజ్ :** నిన్నుకోరి

రుణాల కోసం అభ్యర్థులకు ఇంటర్వ్యూలు

కణేకల్లు : సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు బుధవారం పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. 930 మంది అభ్యర్థులు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, కాపు రుణాల కోసం దరఖాస్తు చేసుకోగా వారందరికీ ఇంటర్వ్యూలు చేశారు. ఎంపీపీ షేక్ ఫాతిమాబీ, ఎంపీడీవో రెహానాబేగమ్, ఈవోఆర్డీ బారెన్‌సాబ్‌ల ఆధ్వర్యంలో పలువురు బ్యాంకు అధికారులు హాజరై రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. త్వరలోనే అర్హుల జాబితాను ప్రకటిస్తామని అధికారులు తెలియజేశారు.

రాయదుర్గంరూరల్‌లో : మండలంలోని నిరుద్యోగ యువతీ యువకులకు సబ్సిడీ రుణాలకై గురువారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు స్టేట్ బ్యాంకు, ఆంధ్ర బ్యాంకు, కార్పొరేషన్ బ్యాంకు, అనంత గ్రామీణ బ్యాంకు అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ప్రతి పౌరుడు పోలీసులా భావించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ చలపతిరావు

రాయదుర్గంటౌన్ : సమాజంలో ప్రతి పౌరుడూ పోలీసులా భావిస్తే నేరాలు ఉండవని సీఐ చలపతిరావు పేర్కొన్నారు. పట్టణంలోని పోలీసు సర్కిల్ కార్యాలయంలో బుధవారం 25 మంది యువతను కమ్యూనిటీ పోలీస్ ఆఫీసర్లుగా ఏర్పాటు చేశారు. సీఐ మాట్లాడుతూ కమ్యూనిటీ పోలీస్ ఆఫీసర్లు పండుగ, బందోబస్తు సమయాల్లో సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ మహానంది, యువకులు పాల్గొన్నారు.

మిలియన్ మార్చ్‌ను విజయవంతం చేయండి



పోస్టర్లను విడుదల చేస్తున్న విద్యాధికారిణి నాగమణి తదితరులు

రాయదుర్గంటౌన్ : సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ ఏపీ సీపీఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1వ తేదీన విజయవాడలో నిర్వహిస్తున్న మిలియన్ మార్చ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం తాలుకా కోఆర్డినేటర్ కట్టయ్య పిలుపు నిచ్చారు. పట్టణంలోని ఎంఈవో కార్యాలయంలో మిలియన్ మార్చ్‌కు సంబంధించిన పోస్టర్లను ఎంఈవో నాగమణి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సీపీఎస్ ఉద్యోగుల పోరాట ఫలితంగా గ్రాడ్యుటీ, ఫ్యామిలీ పెన్షన్ సాధించుకోవడం జరిగిందని తెలిపారు. సంఘటితంగా పోరాడి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీసీపీఎస్ అధ్యక్షులు లక్ష్మీనారాయణ, కార్యదర్శి నాగేంద్ర, సభ్యులు నాగభూషణ, ప్రేమ్‌నాథ్, నాగరాజు, గోపి పాల్గొన్నారు.





ఇంటర్వ్యూలను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్, ఇంటి స్థలాల కోసం భూమిని పరిశీలిస్తున్న జ్యోతి

అర్హులకే సబ్సిడీ రుణాలు : చైర్‌పర్సన్

రాయదుర్గంటౌన్ : అర్హులకే సబ్సిడీ రుణాలు మంజూరు చేయనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ ఎం జ్యోతి పేర్కొన్నారు. పురపాలక సంఘం కార్యాలయంలోని ఆమె చాంబర్‌లో బుధవారం సబ్సిడీ రుణాల మంజూరుకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ బ్యాంకు మేనేజర్ పంకజ్, ఆంధ్రా బ్యాంకు మేనేజర్ వేణుగోపాల్‌రెడ్డి, స్టేట్ బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ ప్రియాంక, సిండికేట్ బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ కర్ణ, అనంత గ్రామీణ బ్యాంకు మేనేజర్ గుణప్రసాద్ పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి స్థలం అనువుగా లేదు : పురపాలక సంఘం పరిధిలోని కణేకల్లు రోడ్డులో లబ్ధిదారులకు ఇచ్చిన స్థలాలు అనువుగా లేవని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎం జ్యోతి పేర్కొన్నారు. కణేకల్లు రోడ్డులోని సర్వే నెంబర్ 497, 498, 499లను బుధవారం ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ కడ్డిపూడి మహబూబ్ బాషా, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పసుపులేటి రాజు, మున్సిపల్ టీపీఎస్ మారుతీప్రసాద్, వీఆర్వో హరి పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ పురపాలక సంఘం పరిధిలోని ప్రతి వార్డులో పది మంది లబ్ధిదారుల చొప్పున 300 మందిని ఎంపిక చేశారన్నారు. స్థలం చదునుగా లేకపోవడంతో పాటు కొండలు, గుట్టలు ఉండటంతో సమస్యగా మారిందన్నారు. ఏహెచ్‌ఎఫ్ఎ పథకం కింద పురపాలక సంఘానికి 1110 ఇళ్లు మంజూరయ్యాయన్నారు. ఆయా లబ్ధిదారులకు ఒకొక్కరికి 365 చదరపు అడుగుల్లో రూ.6 లక్షలతో అపార్ట్‌మెంట్ నిర్మించనున్నట్లు ఆమె తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

కణేకల్లు : ప్రజాసమస్యలు తీర్చేందుకు అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్సీ దీపక్‌రెడ్డి కోరారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు దాటిందని, కొన్ని గ్రామాల్లో ప్రజలు అక్కడక్కడ సమస్యలు ఎదుర్కొంటున్నట్లు తమ దృష్టికి వస్తున్నాయన్నారు. ఆయా శాఖల అధికారులు సమస్యలను పరిష్కరించి ప్రజలకు జవాబుదారీగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ షేక్ ఫాతిమాబీ, ఉప సర్పంచ్ ఆనంద్, ఎంపీటీసీ ఫకృద్దీన్, కన్వీనర్ లాలెప్ప, టీడీపీ నాయకులు చంద్రశేఖర్ గుప్తా, వేలూరు మరియప్ప, రాఘవేంద్ర గుప్తా, మాబూసాబ్, కేశవరెడ్డి, రమేష్, చాంద్ బాషా, ఈరప్ప, వంద్రప్ప, ఎంపీడీవో రెహానాబేగమ్, సీడీపీవో పార్వతి, ఈవోఆర్డీ బారెన్ సాబ్, ఎంఈవో బసవరాజుగౌడ్, హౌసింగ్ ఏఈ వాసంతి, వెలుగు ఏపీఎం సర్దానప్పతో పాటు పలు శాఖల అధికారులు, నాయకులు, కార్యకర్త అస్లాం బాషా పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దీపక్‌రెడ్డి

ఘనంగా సిడిమానోత్సవం

రాయదుర్గంటౌన్ : పట్టణంలోని మారెమ్మ దేవాలయం వద్ద బుధవారం సిడిమహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కోట ప్రాంతంలోని మారెమ్మ దేవాలయం, నేసేపేటలోని దండుమారెమ్మ దేవాలయాల వద్ద భక్తులు పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆరు గంటలకు ఆలయం వద్ద సిడి తిప్పడాన్ని తిలకించేందుకు వేలాదిమంది భక్తులు తరలివచ్చారు. భక్తులతో ఆ ప్రాంతమంతా కిటకిటలాడింది. ఉదయం నుంచి ఉపవాసం ఉండి అమ్మవారి సేవలో ఉన్న బాలుడిని సిడిమానుకు కట్టి తిప్పుతారు. వేలాదిమంది భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. పట్టణ ప్రముఖులు, ఉత్సవ కమిటీ నాయకులు, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

రాయదుర్గంరూరల్‌లో : ఆర్‌బీ వంక గ్రామంలో ప్రతి ఏడాది నిర్వహించే మారెమ్మ సిడిమానోత్సవాన్ని గ్రామ పెద్దల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి గంగపూజ, కుంకుమార్చన, పుష్పాలంకరణ, వస్త్రాలంకరణ, ప్రత్యేక ఆకు పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం గావించారు.





సిడిమానోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్సీ, ఉత్సవానికి సిద్ధం చేస్తున్న సిడిమాను

నేడు ప్రైవేట్ పాఠశాలల బంద్

రాయదుర్గంటౌన్ : ఇటీవల కర్నూలు పట్టణంలో ప్రైవేటు పాఠశాలల సంఘం అధ్యక్షుడిపై జరిగిన దాడికి నిరసిస్తూ గురువారం ప్రైవేటు పాఠశాలల బంద్ పాటిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు రామనాథం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యంపై దాడులు పునరావృతం కాకుండా ప్రభుత్వం ప్రత్యేక చట్టాలను రూపొందించాలని కోరారు.

ఘనంగా మారెమ్మ ఉత్సవం

బొమ్మనహాళ్ : లింగదహాళ్‌లో వెలిసిన మారెమ్మ దేవత ఉత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి గ్రామదేవతకు పవిత్ర గంగాజలాభిషేకం, కుంకుమార్చన, ప్రత్యేకాలంకరణ, నూతన దుస్తుల అలంకరణ, పసుపు, కుంకుమలు, గాజుల అలంకరణ, ఆకుపూజలు నిర్వహించారు. సర్పంచ్ సునీత, ఎంపీటీసీ రామారావు, లింగప్ప, తిప్పేస్వామి, గిడ్డయ్య, నాగేంద్ర, శీన, శివ, గోపాల్, తిదితర గ్రామపెద్దలు, యువకులు పాల్గొన్నారు. అనంతరం అన్నదానం చేశారు.

వందశాతం విత్తనాలు రైతులకు అందించాలి



గోడౌన్‌ను తనిఖీ చేస్తున్న జేడీ శ్రీరామమూర్తి

రాయదుర్గంరూరల్ : ప్రభుత్వం వంద శాతం సబ్సిడీతో అందిస్తున్న ప్రత్యామ్నాయ విత్తనాలు రైతులందరికీ అందేలా చూడాలని వ్యవసాయ శాఖాధికారులకు జేడీ శ్రీరామమూర్తి సూచించారు. బుధవారం వ్యవసాయ శాఖ కార్యాలయంలో ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు అవగాహన కల్పిస్తూ విత్తనాలను తీసుకెళ్లే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ మద్దిలేటి, ఏవో విజయ్‌జ్యోత్‌కుమార్, ఏఈవో చక్రపాణిరెడ్డి, ఎంపీఈవోలు పాల్గొన్నారు.

వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయండి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

రాయదుర్గంరూరల్ : గ్రామంలో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీవో శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం టీ వీరాపురం గ్రామంలో అధికారులు పర్యటించి మరుగుదొడ్లను నిర్మించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ వన్నూరప్ప, పంచాయతీ కార్యదర్శి శ్రీదేవి, వీఆర్వో పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

గుమ్మఘట్ట : మండలంలోని కేపీకుంట శివార్లలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. కర్ణాటక ప్రాంతంలోని గౌరసముద్రం వద్ద జరిగిన మారెమ్మ సిడి ఉత్సవాలకు వెళ్లి ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తుండగా తాళ్లకెర గ్రామానికి చెందిన నాగార్జున (18) వాహనాన్ని ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. మరో వ్యక్తి గొల్ల నాగన్న ద్విచక్రవాహనంపై కేపీకుంట శివార్లలో వేగంగా వెళుతూ కింద పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఇద్దరినీ రాయదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించగా ప్రథమ చికిత్సలు అందించి మెరుగైన చికిత్స నిమిత్తం బళ్లారి విమ్స్ ఆస్పత్రికు తరలించారు.

ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఫోన్ నెంబర్లు పంపాలి

ప్రతి పైసా ఎస్ఎంసీ ద్వారానే ఖర్చు చేయాలి

దాతల విరాళాల వివరాలు పంపాలి

రవాణా భత్యం సమాచారం సేకరించండి

ఎస్ఎస్ఏ అధికారులకు ఎస్పీడీ ఆదేశం

అనంతపురం అర్బన్: అన్ని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రుల ఫోన్ నెంబర్లు సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేసి పంపాలని సర్వ శిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ) అధికారులను ఎస్పీడీ గుర్రం శ్రీనివాస్ ఆదేశించారు. అమరావతి నుంచి బుధవారం ఆయన జిల్లా ఎస్ఎస్ఏ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు అంశాలపై సమీక్షించారు. ముఖ్యమంత్రి ప్రత్యేకంగా వారి ఫోన్‌నెంబర్లు అడిగారన్నారు. ముఖ్యమంత్రి నేరుగా వారితో మాట్లాడే అవకాశం ఉందన్నారు. కాబట్టి ఫోన్ నెంబర్లు వెంటనే సేకరించి పంపాలని ఆదేశించారు. విద్య పథకాలకు సంబంధించిన నిధులు పాఠశాల యాజమాన్య కమిటీల తీర్మానాల మేరకే ఖర్చు చేయాలన్నారు. కొన్ని చోట్ల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు నిర్ణయం తీసుకుని నిధులు ఖర్చు పెడుతున్నారన్నారు. ఈ విషయంలో ఎస్ఎస్ఏ అధికారులు పక్కాగా పరిశీలించాలని ఆదేశించారు. పాఠశాలల అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమన్నారు. ఇందుకోసమే ప్రత్యేకంగా 'మీ బడి రుణం తీర్చుకుందాం' కార్యక్రమం చేపట్టామన్నారు. పూర్వ విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు,


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న పీడీ తదితరులు

గ్రామస్థులు, ప్రజా ప్రతినిధుల ద్వారా విరాళాలు సేకరించి పాఠశాలల అభివృద్ధికి బాటలు వేయాలన్నారు. దాతల వివరాలు ఎప్పటికప్పుడు రాష్ట్రశాఖకు పంపాలన్నారు. విరాళాల ద్వారా వచ్చిన నిధులతో ఏఏ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారో..ఆధారాలతో సహా తెలియజేయాలన్నారు. ఎక్కువ విరాళాలు సేకరించి ఆ వివరాలు పంపితే.. అలాంటి ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా రాష్ట్ర శాఖ నుంచి ప్రశంసా పత్రాలు పంపిస్తామన్నారు. విద్యార్థుల రవాణా భత్యంపై సమాచారం సేకరించాలన్నారు. కలెక్టర్ ద్వారా నోటిఫికేషన్ జారీ చేయించి నిబంధనల మేరకు పిల్లల వివరాలు నమోదు చేసి పంపాలన్నారు. ఆ జాబితా కేంద్రానికి పంపుతామన్నారు. విద్యార్థి గణనలో ఇంకా నిర్లక్ష్యం వహించడంపై ఎస్పీడీ ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలో 40శాతం మాత్రమే పూర్తయిందని..ఏడు మండలల్లో 20శాతం లోపు ఉండగా..మరో 17 మండలాల్లో 30శాతంలోపు ఉందన్నారు. ఈనెల 31వ తేదీలోగా వందశాతం విద్యార్థి గణన పూర్తికావాలని ఆదేశించారు. లేదంటే సంబంధిత అధికారులు, సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఎస్ఎస్ఏ పీఓ సుబ్రహ్మణ్యం, ఈఈ విజయశేఖర్, సెక్టోరల్స్ చెన్న క్రిష్టారెడ్డి, రవినాయక్, ఆనంద్, గోపాల్‌నాయక్, బాల మురళి, ఆనందభాస్కర్‌రెడ్డి, నారాయణస్వామి, కమలాక్షి, డీఈలు చిదంబరయ్య తదితరులు పాల్గొన్నారు.

రొళ్ల ఎంపీపీ రాజీనామా ఆమోదించిన జడ్పీ ఇన్‌చార్జి సీఈఓ

అనంతపురం జిల్లాపరిషత్తు: తెలుగుదేశం పార్టీకి చెందిన మడకశిర నియోజకవర్గం రొళ్ల మండల ప్రజాపరిషత్తు అధ్యక్షుడు(ఎంపీపీ) పాండురంగప్ప తనపదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు బుధవారం జడ్పీ ఇన్‌చార్జి సీఈఓ సూర్యనారాయణను కలిసి రాజీనామా లేఖ అందజేశారు. ముందుగా చేసుకున్న ఒప్పందం మేరకు ప్రస్తుతం ఎంపీపీగా ఉన్న పాండు రంగయ్య మొదట, తరువాత వైస్ ఎంపీపీ పదవిలో ఉండేలా నిర్ణయించారు. నిర్ణయించిన గడువు ముగిసిన నేపథ్యంలో ఎంపీపీ తన పదవికి రాజీనామా చేశారు. ఆయన రాజీనామాను జడ్పీ ఇన్‌చార్జి సీఈఓ సూర్యనారాయణ ఆమోదించారు.

పెనుకొండ పరిసరాల్లో గోత్రా సినిమా షూటింగ్

పెనుకొండ టౌన్: పెనుకొండ మండలం అడదాకులపల్లి వికారపోర్ట్, మడకశిర ఘాట్ రోడ్డులో బుధవారం కన్నడ సినిమా గోత్రాకు సంబంధించిన సన్నివేశాలు చిత్రీకరించారు. ఇది ప్రేమకథా నేపథ్యమున్న యాక్షన్ చిత్రమని దర్శకుడు నవదీప్ తెలిపారు. బెంగళూరులో ముహూర్తపు సన్నివేశం చిత్రీకరించామన్నారు. అనంతరం పెనుకొండ ప్రాంతంలో హీరోను పోలీసులు వెంబడించి అరెస్ట్ చేయడాన్ని మొదటి సన్నివేశంగా చిత్రీకరించామన్నారు. ఇందులో కథానాయకుడిగా నినాదం సతీష్, కథానాయకిగా శ్రద్ధ శ్రీనాథ్ నటిస్తున్నారన్నారు. సమూహ టాకీస్ పతాకంపై లీడర్ సినిమావారు దీన్ని నిర్మిస్తున్నారన్నారు. మరో రెండు రోజులపాటు పెనుకొండ ప్రాంతంలో సన్నివేశాలు చిత్రీకరిస్తామన్నారు. పెనుకొండ ప్రాంతం సినిమా షూటింగ్‌కు అనువైన ప్రదేశమన్నారు. ఇక్కడ చారిత్రక నేపథ్యంతోపాటు ఆకర్షణీయమైన వాతావరణం, మంచి లొకేషన్లు ఉన్నాయన్నా రు. భవిష్యత్తులో ఇక్కడ మరిన్ని సినిమాలు చిత్రీకరిస్తారన్నారు. కో డైరెక్టర్ మంజు తదితరులు పాల్గొన్నారు.


సినిమా యూనిట్ సభ్యులు

అన్ని పోలీసు స్టేషన్లలో కౌన్సెలింగ్ కేంద్రాలు: ఎస్పీ

గుంతకల్లుటౌన్: జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్లలో కౌన్సెలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని ఎస్పీ జీవీజీ అశోక్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 400 కానిస్టేబుల్ పోస్టులు భర్తీ చేయనున్నారన్నారు. రాత్రి వేళల్లో రోడ్డు ప్రమాదాలు తగ్గాయన్నారు. ప్రతి అధికారి ఉదయం, సాయంత్రం రోడ్లపై వాహనాల తనిఖీ చేపట్టాలని ఆదేశించామన్నారు. జరిమానాలు విధించడం తమ లక్ష్యం కాదన్నారు. ప్రమాదాలపై, లైసెన్సులపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. త్వరలో కమ్యూనిటీ పోలీసు సిస్టం ఏర్పాటు చేయనున్నామన్నారు. కమ్యూనిటీ పోలీసులు రాత్రి వేళల్లో గస్తీ తిరుగుతారన్నారు. వీరిని గణేశ్ ఉత్సవాల్లో వాడుకుంటామన్నారు. శిథిలావస్థకు చేరుకున్న పోలీసు క్వార్టర్స్ మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపామన్నారు. ఇరానీ, పికారీ గ్యాంగులపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ఈ సమావేశంలో డీఎస్పీ శ్రీధర్‌రావు, అర్బన్ సీఐ రాజా, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్పీ

సినిమా గైడ్

అనంతపురం

గంగ	: లై
గౌరి	: ఫిదా
గాయత్రి	: జయదేవ్
గౌతమి	: గౌతమ్‌నంద
త్రివేణి	: ఆనందో బ్రహ్మ
తరంగిణి	: నక్షత్రం
తేజస్విని	: ప్రతిక్షణం
శాంతి	: నేనే రాజు నేనే మంత్రి
సుధ	: జయ జానకి నాయక
స్వప్న	: గజ్జెల గుర్రం
శ్రీవెంకటేశ్వర	: జయ జానకి నాయక
నీలిమా	: రారండోయ్.. వేడుకచూద్దాం...

రైతుల ఖాతాల్లోకి ఒకేసారి రుణమాఫీ సొమ్ము జమ చేయాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్

అనంతపురం టౌన్: జిల్లాలో రైతులకు ఇవ్వాల్సిన మూడు విడతల రుణమాఫీని ఒకేసారి రైతుల ఖాతాల్లోకి జమ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం జిల్లా కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో మొత్తం 8,06,722 మంది రైతులకు గాను.. మొత్తం రూ.2727.94కోట్ల రుణమాఫీ చెల్లించాల్సి ఉండగా మొదటి విడత కింద రూ.1062.37కోట్లు మంజూరు చేసిందన్నారు. రెండవ విడత కింద రూ.416.64కోట్లు బాండ్లరూపంలో అందజేసిం దన్నారు. ఇక మిగిలిన మూడు విడతల కింద రూ.1248.93కోట్లను రైతుల ఖాతాల్లోకి ఒకేసారి జమ చేయాలని డిమాండు చేశారు. అలాగే జిల్లాకు సరిపడా ప్రత్యామ్నాయ విత్తనాలు తెప్పించి రైతులకు సరఫరా చేయాలన్నారు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల నుంచి రైల్వే వ్యాగిన్ల ద్వారా తాగునీరు తెప్పించి కొరత తీర్చాలన్నారు. కర్ణాటక ప్రభుత్వంతో చర్చించి వెంటనే తుంగభద్ర ఎగువ కాలువ కు నీరు విడుదల చేసేలా చూడాలన్నారు. జిల్లాలో ఉపాధిహామీ పథకం కింద పనిచేసిన 9,39,810మంది కూలీలకు 13 వారాలుగా రూ.85,51,63,093 కోట్లు బకాయి పడ్డారన్నారు. తక్షణమే వాటిని చెల్లించాలని కోరారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బీహెచ్ రాయుడు, నాగేంద్రకుమార్, రాప్తాడు డివిజన్ కార్యదర్శి రామాంజనేయులు పాల్గొన్నారు.

దినఫలాలు

అదృష్టసంఖ్యలు: 5, 7


మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): వృత్తి, వ్యాపారాల్లో లక్ష్య సాధనకు భాగస్వామి సహకారం లభిస్తుంది. కృషి రంగంలో కొత్త పరిచయాలు ఏర్పడతాయి. సంకల్పం నెరవేరుతుంది. ప్రియతములతో విందు వినోదాల్లో పాల్గొంటారు.


వృషభరాశి: (ఏప్రిల్21-మే20): చిన్నారులు, ప్రియతముల విషయాల్లో శుభపరిణామాలు సంభవం. సృజనాత్మకంగా వ్యవహరించి వృత్తి, వ్యాపారాల్లో లక్ష్యాలు సాధిస్తారు. క్యాటరింగ్, వ్యవసాయం, పరిశ్రమల రంగాల వారికి అనుకూలం.


మిథునరాశి: (మే21-జూన్21): ఇంటి కోసం విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు. లక్ష్యాలు సాధిస్తారు. ప్రియతముల రాకతో ఇంట్లో సందడి వాతావరణం నెలకొంటుంది. విద్యాసంస్థల్లో ప్రవేశం కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి.


కర్కాటకరాశి: (జూన్22-జూలై23): కుటుంబ సభ్యులతో ప్రయాణాలు ఉల్లాసం కలిగిస్తాయి. బంధుమిత్రుల కలయిక ఆనందం కలిగిస్తుంది. రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాల వారికి ప్రోత్సాహకరం. సమావేశాలకు ఏర్పాట్లు చేస్తారు.



సింహరాశి: (జూలై24-ఆగస్టు23): రవాణా, ఏజెన్సీలు, బోధన రంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం. పెట్టుబడులకు సంబంధించిన చర్చలు ఫలిస్తాయి. ఆర్థిక విషయాల్లో సన్నిహితుల సహకారం అందుకుంటారు. కాంట్రాక్టులు, అగ్రిమెంట్లు లాభిస్తాయి.


కన్యారాశి: (ఆగస్టు24-సెప్టెంబర్23): పొదుపు పథకాలు లాభిస్తాయి. వ్యక్తిగత సౌకర్యాల కోసం ఖర్చు చేస్తారు. ఆర్థిక వ్యవహారాల్లో కొత్త ప్రయోగాలకు తగిన సమయం. సంకల్పం నెరవేరుతుంది.



తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాల్లో లక్ష్యాలు సాధిస్తారు. వాయిదా పడుతున్న పనులు పట్టుదలతో పూర్తి చేస్తారు. రాజకీయ, సినీరంగాల వారికి ఉల్లాసంగా ఉంటుంది. ఒక సమాచారం ఆహ్లాదం కలిగిస్తుంది.


వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): బంధుమిత్రులతో వేడుకల్లో పాల్గొంటారు. దీర్ఘకాలిక పెట్టుబడులకు అనుకూలం. సినీ, రాజకీయ, ఫొటోగ్రఫీ, ఎగుమతుల రంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం. ఒక సమాచారం ఉత్సాహం కలిగిస్తుంది.


ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు సంబంధించిన పనులు పూర్తవుతాయి. ఆర్థిక వ్యవహారాల్లో పెద్దల సహకారం లభిస్తుంది. వృత్తి, వ్యాపారాల్లో ప్రోత్సాహకరం. సమావేశాల్లో ప్రముఖులను కలుసుకుంటారు.


మకరరాశి(డిసెంబర్22-జనవరి21): వేడుకలు, సమావేశాల్లో ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి. ప్రమోషన్లు, ఇంక్రిమెంట్ల కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. వృత్తి, వ్యాపారాల్లో వ్యూహాత్మకంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు.


కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): బంధుమిత్రులతో సమావేశాలు ఉల్లాసం కలిగిస్తాయి. పూర్వమిత్రులను కలుసుకుంటారు. లక్ష్య సాధనలో గత అనుభవం తోడ్పడుతుంది. ప్రయాణాలకు అవసరమైన నిధులు సర్దుబాటవుతాయి.


మీనరాశి:(ఫిబ్రవరి19మార్చి20): ఆర్థిక విషయాల్లో భాగస్వామి సహకారం లభిస్తుంది. భాగస్వామి కోసం విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. ఆరోగ్యంపై దృష్టి సారించాలి. స్పెక్యులేషన్లు, పందాలు, పోటీల్లో పాల్గొంటారు.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

సూక్తి

సేవను మించిన ఆనందం లేదు సంతోషాన్ని మించిన సంపద లేదు

టంగ్ ట్విస్టర్స్

1. Rory the warrior and Roger the worrier were reared wrongly in a rural brewery.
2. Chester Cheetah chews a chunk of cheep cheddar cheese.
3. Real rock wall, real rock wall, real rock wall
4. A gazillion gigantic grapes gushed gradually giving gophers gooey guts.

నవ్వుల్ నవ్వుల్

టీచర్ : ఏ రోజు పని ఆ రోజే చేయడం ఉత్తముల లక్షణం. అర్థమైందా?

బంటు : అర్థమైంది టీచర్. రేపటి హోంవర్క్ రేపే చేయాలి. ఈ రోజు కాదు!

టీచర్ : !!!!!!!!

ఓటమే లేకుండా..

ఏ ఆటలోనైనా గెలుపు-ఓటములు తప్పవు. కానీ కెరీర్ మొదలుపెట్టిన నాటి నుంచి ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోకుండా విజయాలు సాధించడం మామూలు విషయం కాదు. పుణేకు చెందిన జూనియర్ గోల్ఫర్ ఆర్యమన్ సింగ్ అదే చేసి చూపించాడు . నాలుగేళ్లుగా విజయాలే సాధిస్తూ దూసుకుపోతున్నాడు. 'ఇండియన్ గోల్ఫ్ యూనియన్- వెస్ట్ జోన్' అందించే 'ఆర్డర్ ఆఫ్ మెరిట్'ను వరుసగా మూడు సార్లు సాధించాడు. జోనల్ లెవల్‌లోనూ, జాతీయ స్థాయిలోనూ ఈ జూనియర్ గోల్ఫర్‌కు తిరుగులేదు. జూనియర్ గోల్ఫ్ చరిత్రలో 1,266 రోజులుగా ఓటమి ఎరుగని అజేయుడిగా నిలిచి సరికొత్త రికార్డు సాధించాడు.



ఆర్యమన్ సింగ్ వయసు పదేళ్లు. ప్రొఫెషనల్ ప్లేయర్‌గా గోల్ఫ్ ఆడటం మొదలెట్టి నాలుగేళ్లు అవుతోంది. జోనల్ లెవల్‌లో ఇంతవరకు ఆర్యమన్‌కు తిరుగులేదు. ఈ ఛోటా గోల్ఫర్ తన కెరీర్‌లో ఒక్క మ్యాచ్‌ను కూడాచేజార్చుకోలేదు. 1,266 రోజులుగా తన విజయ యాత్ర కొనసాగిస్తూ జూనియర్ లెవల్ గోల్ఫ్‌లో సరికొత్త చరిత్ర సృష్టించాడు.

'నా నాలుగో ఏట నుంచి గోల్ఫ్ ఆడటం మొదలుపెట్టాను. రెండు సంవత్సరాల పాటు గోల్ఫ్ సాధన చేశాను. ఆట గురించే ఎప్పుడూ ఆలోచించేవాడిని. జిల్లా, జోనల్, రాష్ట్ర స్థాయుల్లో జరిగే ప్రతి గోల్ఫ్ టోర్నమెంట్‌లో పాల్గొనేవాడిని. అహ్మదాబాద్‌లోని 'కెన్స్‌విల్లే గోల్ఫ్ కోర్సు'లో జరిగిన మ్యాచ్‌లో తొలిసారిగా విజయం సాధించాను. ఆనాటి నుంచి ప్రతి మ్యాచ్‌లోనూ విజయం సాధిస్తూ వస్తున్నాను. మూడేళ్లుగా 'జస్టిన్ పార్కన్స్' నాకు కోచింగ్ ఇస్తున్నాడు. గోల్ఫ్ క్రీడలో పేరుగాంచిన మార్క్ రోయ్, డేవిడ్ స్టాక్టన్, విజయ్ దివెచ వంటి దిగ్గజాల దగ్గర ఎన్నో మెలకువలు నేర్చుకున్నాను. నేనింకా గోల్ఫ్ నేర్చుకునే దశలోనే ఉన్నాను. భవిష్యత్తులో ఈ క్రీడలో మరింత రాణించాలని అనుకుంటున్నాను. నాకు గోల్ఫ్‌తో పాటు క్రికెట్, బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్, టెన్నిస్ క్రీడలంటే కూడా ఎంతో ఇష్టం. సమయం చిక్కితే అవి కూడా ఆడుతుంటాను. టీవీ చూస్తాను. స్కూల్‌వర్క్ కంప్లీట్ చేసుకున్న తర్వాతే ఆటలు ఆడతాను'

- ఆర్యమన్



ఔనా!

ఉడుము ఊపిరి తీసుకోకుండా నీటిలో అరగంట పాటు ఉండగలదు.



చుక్కలు కలపండి



మీకు తెలుసా?



58 శాతం మంది మహిళలు ప్రతిరోజూ నెయిల్ పాలిష్ వేసుకుంటారని ఓ అధ్యయనంలో తేలింది.

చెప్పగలరా?

నాడిలో ఉన్నా కానీ కోడిలో లేను

జూలులో ఉన్నా కానీ జూన్‌లో లేను


గుడిలో ఉన్నా కానీ బడిలో లేను

అయితే ఇంతకీ నేనెవర్నో చెప్పగలరా?

రంగులు వేయండి



బొమ్మ గీయండి




జంబ్లింగ్ వర్డ్స్

ఈ కింది పదాలను సరిచేయండి

1. KJOE ▸ ....
2. HAET ▸ ....
3. THBA ▸ ....
4. RSHU ▸ ....

దారి కనుక్కోండి



జవాబులు

చెప్పగలరా? : నాలుగు

జంబ్లింగ్ వర్డ్స్ :

1. JOKE 2. HATE/HEAT 3. BATH 4. RUSH

అప్రమత్తంగా మెలగండి

చవితి వేడుకలు ప్రశాంతంగా జరగాలి

అవాంఛనీయ ఘటనలకు తావివ్వకండి

పోలీసు అధికారులకు ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశం

ఆంధ్రజ్యోతి, అనంతపురం: జిల్లాలో వినాయక చవితి వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరిగేవిధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ జీవీజీ అశోక్‌కుమార్ ఆ శాఖ అధికారులను ఆదేశించారు. వేడుకలు ముగిసేంతవరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. మతాలకు అతీతంగా జరిగే ఈ వేడుకల్లో అవాంఛనీయ సంఘటనలకు తావివ్వవద్దని సూచించారు. ఈ మేరకు ఆయన బుధవారం పోలీసు అధికారులకు తన కార్యాలయం నుంచి ఆదేశాలు జారీ చేశారు. ఇదే సందర్భంలో పలు సూచనలు చేశారు. ప్రజల మనోభావాలు, భక్తి భావానికి ఆ టంకం కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. వినాయక ప్రతిమల ఏర్పాటు కోసం ఆయా స్టేషన్లలో దరఖాస్తు చేసుకుని అనుమతి తప్పనిసరిగా తీసుకునేవిధంగా చూడాలన్నారు. ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలిగేవిధంగా మంటపాలు, ప్రతిమలు ఏర్పాటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆ మేరకు నిర్వాహకులకు సూచనలు చేయాలన్నారు. ఏ ప్రాంతానికి ఆ ప్రాంతంలో సం బంధిత పోలీసు అధికారులు వేడుకల ఏర్పాట్లు పర్యవేక్షించాలన్నారు ప్రతిమల ఏర్పాటుకు ఆ ప్రదేశం అనువైందా? కాదా? ప్రజలకు, వాహనాల రాకపోకలకు అసౌకర్యం కలిగించేవిధంగా ఉందా? అనే విషయాలు పరిశీలించాలన్నారు. ఈ క్రమంలో మున్సిపల్ అధికారుల సూచనలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ఎలాంటి ఇబ్బందీ లేని పక్షంలో వినాయక ప్రతిమల ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలన్నారు. గాలి, వర్షాలకు మంటపాలు కూలిపోకుండా, విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ జరగకుండా చూడాలని నిర్వాహకులకు సూచనలు ఇవ్వాలన్నారు. భక్తి భావనకు విరుద్ధంగా మద్యం, జూదం రికార్డ్ డాన్సులు వంటి కార్యకలాపాలు మంటపాల పరిసరాల్లో చేపట్టరాదన్నారు. రాజకీయ ప్రసంగాలు, నినాదాలకు తావుండకూడదన్నారు. భారీ మంటపాలు ఏర్పాటు చేసుకునేవారు తప్పనిసరి గా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎక్కడా బలవంతపు నిధుల సేకరణ జరగకూడదన్నారు. మంటపాల వద్ద టపాసులు, పేలుడు పదార్థాలు ఉం చకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ సరఫరా విషయంలో నిబంధనల ప్రకారం సంబంధిత అధికారుల అనుమతులు తీసుకోవాలన్నారు. మంటపాల వద్ద ప్రతిమల ఏర్పాటు మొదలు నిమజ్జనం వరకు 24గంటల పాటూ సేవలందించేందుకు ముగ్గురు వాలంటీర్లను నియమించుకోవాలన్నారు. మంటపాల వద్ద ఏవైనా సంఘటనలు జరిగినా.. జరిగేందుకు అవకాశమున్నా డయల్-100 లేదా 9989819191 వాట్సప్ నెంబర్‌కు సమాచారం అందించేలా ప్రజలను చైతన్యం చేయాలన్నారు. అగ్ని ప్రమాదాల నివారణ కోసం అందుబాటులో నీళ్లు, ఇసుకతో నింపిన బకెట్లు ఉంచుకోవాలన్నారు. ఉదయం ఆరు గంటల నుంచి రాత్రి 10గంటల వరకు మాత్రమే సౌండ్ సిస్టమ్‌లు వినియోగించుకోవాలన్నారు. అందులోనూ భక్తిపాటలనే వినిపించాలన్నారు. విద్యాసంస్థలు, ఆసుపత్రులు, న్యాయస్థానాలకు వందమీటర్ల పరిధి వరకు నిశ్శబ్ద జోన్‌గా టౌన్‌ప్లానింగ్ అధికారులు ప్రకటించిన నేపథ్యంలో ఈ విషయాన్ని నిర్వాహకులకు సూచించాలన్నారు. పండుగ ముగిసేంతవరకు గస్తీ, నిఘా కొనసాగాలన్నారు. మంటపాల పరిసరాల్లో ఈవ్‌టీజింగ్ తదితర అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా దృష్టి సారించాలని ఆయన ఆదేశించారు.

తుంగభద్ర జలాశయ సమాచారం

23-8-17	ప్రస్తుతం	గత ఏడాది
నీటిమట్టం (అడుగులు)	1618.62	1617.91
సామర్థ్యం (టీఎంసీలు)	54. 57	52. 75
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	10, 337	9, 362
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	700	8, 478



పంతాలకు పోయి పరువుతీయకండి

అధికారులందరూ మాకు సమానమే

పని చేయండి.. లేదంటే వెళ్లిపోండి

అభివృద్ధిలో రాప్తాడు ఆదర్శం కావాలి

అధికారులకు మంత్రి సునీత చురకలు

అనంత పురం అర్బన్: 'అధికారులందరూ మాకు సమానమే. ఎవరిపైన ప్రత్యేకమైన ప్రేమ, కోపం ఉండవు. మీ మధ్య విభేదాలు పెట్టుకుని.. పంతాలకు పోయి పరువుతీస్తే ఊరుకునేది లేదు' అని మంత్రి పరిటాల సునీత అధికారులకు చురకలంటించారు. నగరంలోని తన స్వగృహంలో రాప్తాడు నియోజకవర్గంలోని ఆరు మండలాల రెవెన్యూ, గృహనిర్మాణ శాఖల అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ప్రధానంగా ఎన్టీఆర్ పక్కా ఇళ్ల నిర్మాణాలపైనే సు దీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారుల తీరుపై ఆమె తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. 'మాకు పని చేసేవారు కావాలి. అలా చేయలేకపోతే వెళ్లిపోవచ్చు. మీ నుంచి మాకు నష్టం వస్తుందంటే ఒప్పుకునే ప్రశక్తేలేదు. మేమేమైనా ఇబ్బంది పెడుతున్నామా...? ఎవరైనా పైసలడుగుతున్నారా..? మీ పని మీరు చేసుకుపోవడానికి ఇబ్బంది ఏమిటి? ఏ విషయం అడిగినా పనిభా రం ఉంది అంటారు. మాకు లేదా? నేనూ రాష్ట్రంలోని అన్ని జిల్లాలూ తిరుగుతున్నా. మళ్లీ మా కుటుంబం, నియోజకవర్గం చూసుకోవడం లేదా?' అని ప్ర శ్నించారు. 'కష్టపడనివారు మాకు అవసరం లేదు. చిన్నచిన్న సమస్యలను పెద్దవిగా చేసుకుని సమస్యలు సృష్టిస్తారా?' అని మండిపడ్డారు. ' సీఎం వచ్చి ఎన్ని రోజులయింది? మిగిలిన ఇళ్ల నిర్మాణాలు పూర్తికావాలని సూచించాం. నెల రోజులవుతున్నా పట్టించుకోరా?' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇళ్ల నిర్మాణాల్లో డీఈలు, జేఈలదే పూర్తి బాధ్యతన్నారు. ఒకరిపై ఒకరు భేదాభిప్రాయాలు పెట్టుకుని పరువు తీయవద్దని హితబోధ చేశారు. అభివృద్ధిలో రాప్తాడు నియోజకవర్గం అన్ని విధాలుగా ఆదర్శంగా ఉండాలనేదే తన లక్ష్యమన్నారు. కాంగ్రెస్ హయాంలో ఇళ్లు కట్టుకోకపోయినా ఒక్కొక్కరికి నాలుగైదు ఇళ్ల బిల్లులు చేశారని, అదే టీడీపీ వాళ్లు ఇళ్లు కట్టుకుని బిల్లులడిగితే ఇవ్వలేరా అని ప్రశ్నించారు. ఎలాంటి ఇబ్బందులున్నా, సమస్యలున్నా వాస్తవాలు తమకు, ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. 15 రోజుల్లోగా పక్కా ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావాలని ఆదేశించారు. ఈ నెలాఖరులోగా ముక్తాపురంలో అన్ని ఇళ్లూ పూర్తి కావాల్సిందేనన్నారు. అనేక గ్రామాల్లో ఇంటి పట్టాలు ఇవ్వాలని, ఇందుకు స్థలాలు చూడాలని చెబుతూనే ఉన్నానని, కానీ ఇంతవరకూ ఆ సమస్య పరిష్కరించలేదని తహసీల్దార్ తీరుపై మంత్రి అసంతృప్తి వ్యక్తంచేశారు. నెలరోజుల్లోగా నిర్ణయించిన గ్రామాల్లో ఇంటి స్థలాల సమస్య పరిష్కరించాలని రెవెన్యూ అధికారులకు ఆదేశించారు. సమావేశంలో ఆర్డీఓ బాలానాయక్, హౌసింగ్ డీఈలు, జేఈలు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి సునీత

రాయదుర్గంలో ఘనంగా సిడి మహోత్సవం



రాయదుర్గం పట్టణంలోని మారెమ్మ దేవాలయం వద్ద బుధవారం సిడి మహోత్సవం ఘనంగా జరిగింది. భక్తులు పెద్దఎత్తున ఉత్సవాన్ని తిలకించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సీఆర్‌టీలకు ఏప్రిల్ జీతం జమ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అనంతపురం అర్బన్: సీఆర్‌టీలకు ఏప్రిల్ జీతం బ్యాంకు ఖాతాలో జమయింది. మే నెల జీతం చెల్లింపునకూ ఓకే చేశారు. 'దేవుడా..బతికేదెలా' శీర్షికన ఆంధ్రజ్యోతిలో బుధవారం కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. నాలుగు నెలలుగా జీతాలందక కేజీబీవీల సీఆర్‌టీలు పడుతున్న కష్టాల గురించి అందులో వివరించిన విషయం విదితమే. ఈ కథనంపై ఉన్నతాధికారులు స్పందించారు. దీంతో ఏప్రిల్ నెల జీతాలను బుధవారం మధ్యాహ్నామే బ్యాంకుకు పంపి జమచేయించారు. మేనెల జీతంపై కొనసాగుతున్న వివాదానికి ఎస్పీడీ గుర్రం శ్రీనివాస్ తెరదించారు. బుధవారం జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో పీఓ సుబ్రహ్మణ్యం మే నెల జీతం సమస్యను ఎస్పీడీ దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు ఆయన స్పందించి సీఆర్‌టీలకు మేనెల జీతం చెల్లించాలని ఆదేశించారు. వినాయక చవితి పండుగ అనంతరం మే, జూన్, జూలై మూడు నెలల వేతనాలు ఒకేసారి చెల్లిస్తామని పీఓ తెలిపారు.

నగరంలో వర్షం...!

అనంతపురం కార్పొరేషన్: నగరంలో బుధవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. రాత్రి 8.45 గంటల నుంచి అరగంటపాటు వర్షం పడింది. జిల్లాలో పలు ప్రాంతాల్లో కొద్దిరోజులుగా వర్షం కురుస్తున్నా...నగరంలో దాని జాడే లేదు. అలాంటిది ఒక్కసారిగా వర్షం కురవడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వానలో తడుస్తూనే వారు పనుల్లో నిమగ్నమయ్యారు. వినాయక చవితి పండుగకు గణేష్ విగ్రహాలు, పూలు, ఇతర వస్తువుల కొనుగోలుకు బజారుకు వెళ్లిన ప్రజలు వానలో తడుస్తూనే తమ పనులు చక్కబెట్టుకున్నారు. పండుగ నేపథ్యంలో వినాయక మండపాల వద్ద యువత ఏర్పాట్లలో తలమునకలయ్యారు. అలాగే పూల వ్యాపారులు, గణేష్ విగ్రహాల విక్రేతలు వర్షంతో కాస్త ఇబ్బంది పడ్డారు. అయితే ఇంతకాలం జాడలేని వాన ఒక్కసారిగా బుధవారం రాత్రి కురవడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



వర్షం పడుతుండటంతో ఇబ్బందిపడుతున్న పూల వ్యాపారులు

రాష్ట్రస్థాయి చెస్ టోర్నీకి విద్యుత్ ఉద్యోగుల ఎంపిక

అనంతపురం సప్తగిరిసర్కిల్: రాష్ట్రస్థాయి చెస్ టోర్నీ పోటీలకు విద్యుత్ ఉద్యోగుల ఎంపికయ్యారు. బుధవారం ఎస్ఈ కార్యాలయంలోని మీటింగ్ హాల్ ఈ ప్రక్రియ నిర్వహించారు. జిల్లాలోని ఐదు డివిజన్ల నుంచి ఉద్యోగులు హాజరయ్యారు. ఎస్ఈ వరకుమార్, ఎస్ఏఓ విజయ్‌భాస్కర్, డీఈలు సంపత్‌కుమార్, సత్యానందం, ఏడీఈ సుధాకర్ సెలెక్షన్ సభ్యులుగా వ్యవహరించారు. మొత్తం ఐదు టీమ్‌లను ఎంపిక చేసినట్లు సెలెక్షన్ కమిటీ సభ్యులు తెలిపారు. పోటీలకు ఎంపికైన ఉద్యోగులు సెప్టెంబరు 2,3 తేదీల్లో వైజాగ్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు.

ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయం ఏఓ బదిలీ

అనంతపురం సప్తగిరిసర్కిల్: ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయంలో పనిచేస్తున్న ఏఓ శంకర్‌రెడ్డి కడపకు బదిలీ అయ్యారు. ఆ మేరకు ఆర్టీసీ ఉన్నతాధికారుల నుంచి ఉత్వర్వులు అందాయి. అదే విధంగా కడపలో ఏఓగా పనిచేస్తున్న కుమార్‌రాజా అనంతపురం ఆర్ఎం కార్యాలయానికి బదిలీపై రానున్నారు.

నేడు కడపకు ఆర్టీసీ అధికారులు

అనంతపురం సప్తగిరిసర్కిల్: కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఈడీ) రామారావు గురువారం జోన్ పరిధిలోని ఆర్టీసీ ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా ఆర్టీసీ ఉన్నతాధికారులు గురువారం కడపకు వెళ్లనున్నారు. ఆర్ఎం, డిప్యూటీ సీటీఎం, సీఎమ్ఈ తదితరులు కడపకు వెళుతున్నారు. ఆర్టీసీ నష్టాలు, పురోగతి తదితర అంశాలపై చర్చించినున్నట్లు ఆ శాఖ వర్గాల ద్వారా తెలిసింది.

నేడు మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

అనంతపురం సప్తగిరిసర్కిల్: అనంత విద్య, వైద్య సామాజిక హక్కుల అవినీతి వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో గురువారం మట్టి వినాయక విగ్రహాల పంపిణీ చేస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు రాయల్ కొండయ్య పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. టవర్‌క్లాక్ సమీపంలోని సరస్వతి బుక్‌స్టాల్ ఎదుట సాయంత్రం 4:30 గంటలకు కార్యక్రమాన్ని ని ర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి కమలాకర్‌రెడ్డి హాజరవుతారన్నారు. నగర ప్ర జలు మట్టి వినాయకులను తీసుకెళ్లి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు.

ప్రకాశం పంతులు విగ్రహాలు ఏర్పాటు చేయాలి

అనంతపురం టౌన్ : సమాజానికి ఆదర్శంగా నిలిచిన ప్రకాశం పంతులు విగ్రహాలను నవ్యాంధ్రలోని 13 జిల్లాల్లోను ఏర్పాటు చేయాలని ఏపీ బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు జ్వాలాపురం శ్రీకాంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టంగుటూరి ప్రకాశం పంతులు 146వ జయంతిని పురస్కరించుకుని బుధవారం రాయలసీమ సహకార శిక్షణాకేంద్రం ఆవరణలోని ప్రకాశంపంతులు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రకాశం పంతులు ఆశయాలను కొనసాగిస్తూ, సమసమాజ స్థాపనకోసం ఆయన చేసిన కృషిని తెలియజేసేందుకు ప్రతి జిల్లాలోనూ ప్రభుత్వమే విగ్రహాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో వి శ్రాంత ఏఎస్పీ సత్యనారాయణ, విశ్రాంత డీఎస్పీ రాఘవేంద్ర, క మలాకర్, మారుతి, శ్రీనివాస్, శ్రీనాథ్, పద్మావతి, సీతామాలక్ష్మి, శ్యామలాదేవి పాల్గొన్నారు.

సెయింట్ థామస్‌లో వినాయక చవితి వేడుకలు

అనంతపురం కలెక్టరేట్ : నగరంలోని సెయింట్ థామస్ పాఠశాలలో బుధవారం వినాయక చవితి వేడుకలు నిర్వహించారు. పర్యావరణాన్ని కాపాడేందుకు ఆ పాఠశాల యాజమాన్యం మట్టి వినాయక ప్రతిమలను ఏర్పాటు చేశారు. పాఠశాల కరస్పాండెంట్ వీవీ వందన గణపతి స్వామికి పూజలు చేశారు. అనంతరం వినాయక చవితి విశిష్టతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌ప్రసాద్‌లతో పాటు ఏఓ విజయభాస్కర్‌రెడ్డి,కంప్యూటర్ ఆపరేటర్ అనూషలతోపాటు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పెంచిన డీఏ చెల్లించాలి

అనంతపురం వైద్యం : జిల్లా వైద్యఆరోగ్యశాఖ పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్టు పారా మెడికల్ సిబ్బంది, మగ, మహిళ ఆరోగ్య కార్యకర్తల, ల్యాబ్ టెక్నిషియన్లు, ఫార్మాసిస్టలకు సంబంధించి పెరిగిన డీఏల ప్రకారం అందించాలని ఏపీ తెలుగునాడు మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు లక్ష్మన్న, జిల్లా సెక్రటరీ నాగరాజు బుధవారం డీఎంహెచ్ఓ వెంకటరమణను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆ యూనియన్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

27 నుంచి జాతీయస్థాయి క్రీడా పోటీలు

అనంతపురం స్పోర్ట్స్ : జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 27, 28, 29 తేదీల్లో జిల్లాస్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు డీఎస్‌డీఓ బాషా మొయినుద్దీన్ పేర్కొన్నారు. హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని 27న స్థానిక నీలం సంజీవరెడ్డి స్టేడియంలో అథ్లెటిక్స్ వాలీబాల్ పోటీల్లో భాగంగా బాస్కెట్‌బాల్, బాక్సింగ్ పోటీలు ఉంటాయన్నారు. ఇండోర్ స్టేడియంలో ఈ నెల 28న కబడ్డీ పోటీలు, 29న జాతీయ క్రీడల్లో పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులకు సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

'ఆంధ్రకేసరి ఆశయాలను కొనసాగిద్దాం'




ప్రకాశం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మేయర్, ఇతర అధికారులు, జేఎన్‌టీయూలో నివాళులు అర్పిస్తున్న ఆచార్యులు

అనంతపురం కార్పొరేషన్/ కలెక్టరేట్/అర్బన్/ వైద్యం : ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు ఆశయాలను కొనసాగిస్తూ ముందుకు కదలాలని మేయర్ స్వరూప పిలుపునిచ్చారు. బుధవారం ప్రకాశం పంతుల 146వ జయంతిని పురస్కరించుకుని మేయర్ స్వరూప చాంబర్‌లో ప్రకాశం పంతుల జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్ర ప్రథమ ముఖ్యమంత్రిగా ప్రకాశం పంతులు రాష్ట్ర ప్రగతికి బాటలు వేసిన మహోన్నతుడన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ కృష్ణమూర్తి, డిప్యూటీ కమిషనర్ సన్యాసిరావు, కార్పొరేటర్ రహమత్ బీ, కార్యదర్శి జ్యోతిలక్ష్మి, డీఈలు లక్ష్మీనరసింహులు, షఖూర్, మేనేజర్లు నవనీత్‌కృష్ణ, విజయ్‌కుమార్, అకౌంటెంట్ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో: స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్ర రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులుకు ప్రభుత్వ ఉద్యోగులు ఘనంగా నివాళులు అర్పించారు. ప్రకాశం పంతులు జయంతిని పురష్కరించుకొని బుధవారం కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి జేసీ-2 ఖాజామొహిద్దీన్, డీఆర్ఓ మల్లీశ్వరి, ఫారెస్ట్ సెటిల్‌మెంట్ ఆఫీసర్ గాయత్రిదేవి, ఏఓ విజయలక్ష్మి, సమాచార శాఖ ఏడీ జయమ్మ, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అదే విధంగా జిల్లా పౌరసరఫరాల శాఖ కార్యాలయంలోడీఎస్ఓ శివరాంప్రసాద్, ఏఎస్ఓ శోభారాణి, కార్యాలయ అధికారులు,సిబ్బంది ప్రకాశం పంతులకు ఘనంగా నివాళులు అర్పించారు.

ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో : ప్రకాశం పంతులు జయంతిని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఈ హరేరాంనాయక్, పర్సనల్ అడ్వైజర్ మల్లికార్జునప్ప, సర్కిల్ కార్యాలయ అధికారులు పాల్గొన్నారు.

రహమత్‌నగర్ పాఠశాలలో: టంగుటూరి ప్రకాశం పంతులు సేవలు వెలకట్టలేనివని రహమత్ నగర పాలక పాఠశాల హెచ్ఎం శ్రీనివాసులు పేర్కొన్నారు. ప్రకాశం పంతుల చిత్రపటానికి పూలమాలలువేసి నివాళుల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జయరాం, కరుణజ్యోతి, సుబ్బలక్ష్మి, రమాదేవి, ఉమా పాల్గొన్నారు.

జడ్పీలో: ఆంధ్ర రాష్ట్రానికి మొదటి ముఖ్యమంత్రిగా పని చేసి టుంగుటూరి ప్రకాశం పంతులు ఆదర్శనీయులని జడ్పీ ఇన్‌చార్జ్ సీఈఓ సూర్యనారాయణ పేర్కొన్నారు. స్థానిక జడ్పీ హాల్‌లో ప్రకాశం పంతులు జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ సీఈఓ మాట్లాడుతూ ప్రకాశం పంతులు సేవలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్తు అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

డ్వామాలో: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు డ్వామా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి పీడీ నాగభూషణం నివాళులర్పించారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన మహనీయులు జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలి

జేఎన్‌టీయూలో: దేశంకోసం ప్రాణాలను సైతం అర్పించిన మహనీయుల జీవితాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ ఎస్ కృష్ణయ్య పేర్కొన్నారు. జేఎన్‌టీయూ విశ్వవిద్యాలయంలో ఆంధ్రకేశరి టంగుటూరి పంతులు జయంతి వేడుకలను పరిపాలన భవనంలో ఘనంగా నిర్వహించారు. ప్రకాశం పతులు చిత్రపటానికి రెక్టార్ సుబ్బారావు, రిజిస్ట్రార్ కృష్ణయ్య, వర్శిటీ ఆచార్యులు, సిబ్బంది పూలమాలలు వేసి నివాళలర్పించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటాలలో ప్రాణాలకు తెగించి సైతం బ్రిటిష్ వారిని ఎదిరించిన త్యాగశీలి, ధైర్యశాలి ప్రకాశం పంతులు అని పేర్కొన్నారు. 1953లో ఆంధ్రరాష్ట్రానికి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించి అప్పట్లోనే ఎన్నో సంస్కరణలను ప్రవేశపెట్టి ప్రజాదరణ పొందారన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు శంకర్, విజయకుమార్, సుదర్శనరావు, సత్యానారాయణ, ప్రశాంతి, పౌరసంబంధాల అధికారి అంకారావు, ఫైనాన్స్ ఆఫీసర్ రమణానాయక్, డీఆర్ రాజేశ్వరి, దనుంజయ, సిబ్బంది పాల్గొన్నారు.



ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో నివాళి అర్పిస్తున్న ఉద్యోగులు



నివాళులర్పిస్తున్న డ్వామా పీడీ నాగభూషణం

హెచ్చెల్సీ కార్యాలయంలో: నగరంలోని హెచ్చెల్సీ కార్యాలయంలో ఎస్ఈ శేషగిరిరావు ఆధ్వర్యంలో బుధవారం టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వే డుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటాలనికి పూలమాలలు వేసి ఉద్యోగులతో కలసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటిషు వారి గుండెల్లో దడ పుట్టించిన దీశాలి మన టంగుటూరి ప్రకాశం పంతులని కొనియాడారు. కార్యక్రమంలో ఆ శాఖ ఉద్యోగులు తదితరలు పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జన స్థలాల పరిశీలన

అనంతపురం కార్పొరేషన్ : వినాయక చవితి నేపథ్యంలో నగరంలో నీరు అందుబాటులో లేకపోవడంతో గణేష్ నిమజ్జనానికి అవసరమైన స్థలాలను మేయర్ స్వరూప, నగపాలక సంస్థ, రెవెన్యూ, పోలీసు అధికారులు పరిశీలించారు. హెచ్చెల్సీ కెనాల్‌లో నీరు లేకపోవడంతో మేయర్ బుధవారం అధికారులతో కలసి శింగనమల చెరువును పరిశీలించారు. స్థానికంగా ఎక్కడెక్కడ నిమజ్జనానికి అనువైన స్థలాలున్నాయో చూశారు. ఆర్డీఓ మలోల, కమిషనర్ మూర్తి, డీఎస్పీ మల్లికార్జున వర్మతో కలసి నిమజ్జన ఏర్పాట్లపై చర్చించారు. నిమజ్జనానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు మూడు శాఖల ఆధ్వర్యంలో జరిగేలా చూడాలని ఆమె తెలిపారు. కార్యక్రమంలో గణేష్ ఉత్సవ సమితి నాయకులు, ఇతర నాయకులు పాల్గొన్నారు.



శింగనమల చెరువును పరిశీలిస్తున్న మేయర్, ఆర్డీఓ, కమిషనర్

ఎంపవర్ ఇండియాపై అవగాహన ర్యాలీ



నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న శ్రీచైతన్య విద్యార్థులు

అనంతపురం అర్బన్ : కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఎంపవర్ ఇండియా - మేక్ ఇన్ ఇండియా కార్యక్రమంపై శ్రీచైతన్య విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. బుధవారం రుద్రంపేట శ్రీచైతన్య బ్రాంచ్ విద్యార్థులు రామ్‌నగర్, ప్రభుత్వాస్పత్రి మీదుగా క్లాక్‌టవర్ వరకు ర్యాలీ కొనసాగించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్లకార్డులు ప్రదర్శిస్తూ, నినాదాలు చేస్తూ ప్రదర్శన సాగించారు.

నలుగురు డ్రైవర్లపై కేసులు నమోదు

ఆంధ్రజ్యోతి అనంతపురం : రోడ్డు భద్రతా చర్యల్లో భాగంగా త్రీటౌన్ సీఐ మురళీకృష్ణ ఎస్ఐలు, సిబ్బందితో కలిసి బుధవారం ఆ స్టేషన్ పరిధిలోని పలు కూడళ్లలో వాహనాల తనిఖీ చేపట్టారు. డ్రైవింగ్ లైసెన్సులు లేకుండా వాహనాలు నడపడంతో పాటు అధికలోడుతో వెళ్తున్న నాలుగు ఐచర్ వ్యాన్లను తనిఖీ చేశారు. డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనాలు నడుపుతుండటంతో ఆ నాలుగు వాహనాల డ్రైవర్లపై కేసులు నమోదు చేశారు.

డీఓటీ ఫీజు చెల్లించకుంటే దుకాణాలు సీజ్

అనంతపురం కార్పొరేషన్ : నగరంలో ఇప్పటి వరకూ పెండింగ్ ఉన్న ట్రేడర్లు డేంజర్ అఫెన్స్ ట్రేడ్ లైసెన్స్ (డీఓటీ) ఫీజు 24 గంటల్లో చెల్లించాలని శానిటరీ సూపర్ వైజర్ గంగిరెడ్డి హెచ్చరించారు. బుధవారం శానిటరీ ఇన్‌స్పెక్టర్లు జానయ్య, నాగార్జునతో కలసి పాతూరు గాంధీ బజార్‌లో సుమారు వంద దుకాణాల్లో ట్రేడ్ లైసెన్సు ఫీజుపై ఆరా తీశారు. ఎంతమంది ఫీజు చెల్లించారు..? డీఓటీ సర్టిఫికెట్ రెన్యూవల్ చేయించారో లేదో ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎస్ఎస్ గంగిరెడ్డి మాట్లాడుతూ....పెండింగ్ ఉన్న డీఓటీ ఫీజును నగరపాలక సంస్థకు వెంటనే జమ చేయాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న వారి దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.కార్యక్రమంలో మేస్త్రీలు, పబ్లిక్ హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

ఐదో రోజుకు చేరిన గోపాల మిత్రల ధర్నా

అనంతపురం కలెక్టరేట్ : పశుసంవర్ధక శాఖ కార్యాలయం ఎదుట గోపాలమిత్రలు చేపట్టిన ధర్నా బుధవారం ఐదో రోజుకు చేరుకుంది. ధర్నా శిబిరంలో పలువురు గోపాల మిత్రలు మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు వెంకటేష్ మాట్లాడుతూ... గత ఏడాది అన్యాయంగా తొలగించిన 66 మంది గోపాల మిత్రలను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్‌చేశారు. సంబంధిత అధికారుల నిర్ణయాల మూలంగానే గోపాల మిత్రల కుటుంబాలురోడ్డున పడ్డాయన్నారు. ఐదు రోజులుగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించాలని కోరారు. గోపాల మిత్రలను తిరిగి విధుల్లోకి తీసుకునేంత వరకూ ఆందోళనకార్యక్రమాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

విద్య సమాజానికి ఉపయోగపడాలి

ఎస్కేయూ: అభ్యసించిన విద్యాసమాజానికి ఉపయోగపడాలని చదువుతో పాటూ సంస్కారం కలిగిన విద్యార్థులు నిత్యజీవితంలో రాణిస్తారని ఎస్కేయూ రెక్టార్ ఆచార్య లజపతిరాయ్ పేర్కొన్నారు. శ్రీకృష్ణదేవరాయ యూనివర్శిటీ పాలిమర్ సైన్స్ అండ్ టెక్నాలజి విభాగంలో సెంట్రల్ ఇన్సిట్యూట్ ఆప్ ప్లాస్టిక్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ సంస్థ పాలిమర్ సైన్స్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 12 రోజుల ప్రాజెక్ట్ వర్క్ దిగ్విజయంగా పూర్తీ చేసిన సందర్భంగా బుధవారం సర్టిఫికెట్లు జారీ చేశారు. ఈ సందర్భంగా రెక్టార్ మాట్లాడుతూ... పాలిమర్ సైన్స్ రంగంలో విస్తృత ఉద్యోగ అవకాశాలున్నాయని నైపుణ్యం పెంచుకోవడం ద్వారా విద్యార్థులు తమ లక్ష్యం చేరుకోవచ్చన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య సుధాకర్ మాట్లాడుతూ.... పాలిమర్ సైన్స్ రంగంలో ఉన్న ఉద్యోగ అవకాశాలను ఎస్కేయూ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య రంగస్వామి, ఆచార్యులు సుబ్బారావు, హుస్సేనన్‌రెడ్డి, చౌడేజీ రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

అనంతపురం వైద్యం : ప్రస్తుతం జిల్లాలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా ప్రభుత్వం ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు కృషి చేయాలని ప్రజారోగ్య పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ వీరభద్రయ్య పేర్కొన్నారు. ఈమేరకు బుధవారం ఆ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులతో సతమతమవుతున్న హైరిస్కు ప్రాంతాల్లో ప్రభుత్వం శుభ్రం చేయించడం, తగిన నివారణ చర్యలు చేపట్టడం, రోగులకు తగిన మందులు, వైద్యసేవలు, అదేవిధంగా ఉచితంగా దోమతెరలు పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఆ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతులు వేగవంతం చేయండి

అనంతపురం కార్పొరేషన్ : నగరంలోని సూర్యానగర్ రోడ్డులో ఉన్న వంతెన ప్రహరీ మరమ్మతులను వేగవంతం చేయాలని కమిషనర్ మూర్తి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన నగరంలోని పలు ప్రాంతాల్లో శానిటేషన్‌తోపాటు పలు పనులను పరిశీలించారు. సూర్యానగర్‌లో వంతెన ప్రహరీ పడిపోయి ఉండటంతో...దానిని పరిశీలించారు. శ్రీకంఠం సర్కిల్ జరుగుతున్న కాలువ పూడిక తీత పనులను పరిశీలించి, నాణ్యతా ప్రమాణాలను పాటించాలని పబ్లిక్‌హెల్త్ సిబ్బంది ఆదేశించారు.

వైసీపీ, సీపీఎం కార్యకర్తలు టీడీపీలో చేరిక

పేదలకు అండగా పరిటాల కుటుంబం.. సహకరించండి, అభివృద్ధి చేసి చూపిస్తాం : శ్రీరామ్


శ్రీరామ్ ఆధ్వర్యంలో పార్టీలోకి చేరిన వైసీపీ, సీపీఎం కార్యకర్తలు

అనంతపురం అర్బన్: పరిటాల కుటుంబం పేదల కోసం చేస్తున్న అభివృద్ధి సేవా కార్యక్రమాలకు ఆకర్షితులై పలువురు వైసీపీ, సీపీఎం కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరారు. రూరల్ మండల పరిధిలోని కొడిమి ఎస్సీ కాలనీ, ప్రజా చైతన్యకాలనీ, తాటిచెర్ల గ్రామాలకు చెందిన దాదాపు 70 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలోకి చేరాయి. టీడీపీ మండల ఇన్‌చార్జ్ పరిటాల మహేంద్ర నేతృత్వంలో తాటిచెర్ల గ్రామానికి చెందిన రామక్రిష్ణ, రామాంజనేయులు, రమేష్, నవీన్, ధనుంజయ, కుమార్, నగేష్, పవన్‌కుమార్, సుబ్బరాయుడు, పెద్ద రమేష్, వినయ్, వీరాంజినేయులు, గోపి, శంకర్, రాము, తిమ్మప్ప, కొడిమి ఎస్సీ కాలనీ , ప్రజాచైతన్య కాలనీకి చెందిన ఇర్షాద్, షేక్షా, ఆనంద్, సూరి, యోగి, దాదాపీర్, రిజ్వానా, అన్నపూర్ణ, నాగమణి, శ్రీరాములు, క్రిష్ణానాయక్ ఆధ్వర్యంలో తరలివచ్చారు. జిల్లా కేంద్రంలోని మంత్రి పరిటాల సునీత స్వగృహంలో యువనేత పరిటాల శ్రీరామ్ వారిని పార్టీలోకి ఆహ్వానించారు. కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించారు. ఈ సందర్భంగా ఆయా కాలనీలు , గ్రామాల ప్రజలు వివిధ సమస్యలను శ్రీరామ్ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... పేదలకు పరిటాల కుటుంబం అండగా ఉంటుందన్నారు. ప్రజా చైతన్య కాలనీలో తగిన సౌకర్యాలు కల్పించాలని నాయకులు, అధికారులలకు తమ తల్లి ఆదేశాలు జారీచేశారన్నారు. కొందరు అభివృద్ధిని అడ్డుకోవడానికి చూస్తున్నారని మాయమాటలు విని మోసపోవద్దన్నారు. మీరు సహకరిస్తే అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. ప్రజా చైతన్య కాలనీలో అర్హులందరికి ఇంటి పట్టాలు ఇప్పిస్తామన్నారు. కొడిమి ఎస్సీ కాలనీ, తాటిచెర్ల గ్రామాల అభివృద్ధికి సహకరిస్తామన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు వేణుగోపాల్, రూరల్ మండల కన్వీనర్ చల్లా జయక్రిష్ణ, నాయకులు లక్ష్మీనారాయణ, పాముదాయి వెంకటేశ్, చంటి, బాలన్న, కిష్టప్ప, ఆనంద్, సన్నప్పయ్య, మునిరెడ్డి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ టోర్నీలో అనంత జట్టు విజేత

అనంతపురం స్పోర్ట్స్ : ఆంధ్రా అండర్ 14 సబ్ జూనియర్ ఫుల్‌బాల్ టోర్నీ ఆతిథ్య జట్టు అనంతపురం జట్టు విజేతగా నిలిచింది. చివరి పోటీల్లో సెమీస్‌లో విజయం సాధించిన అనంతపురం, విశాఖపట్నం జట్లు ఫైనల్స్‌లో తలపడ్డాయి. బుధవారం స్థానిక అనంత క్రీడా గ్రామంలో జరిగిన చివరి రోజు నాకౌట్ పోటీలు ఉత్కంఠ భరితంగా సాగాయి. సెమీ ఫైనల్ పోటీలో అనంతపురం,కడప జట్ల మధ్య ఉత్కంఠ పోరులో మొదటి హాఫ్‌లో ఇరుజట్లు చెరోగోల్ చేశారు. రెండో హాఫ్‌లో అనంతపురం జట్టు గోల్ చేసి మ్యాచ్‌పై పట్టు బిగించి విజయం సాధించి ఫైనల్స్‌కు చేరారు. మరో సెమీస్‌లో విశాఖపట్నం,చిత్తూరు జట్లు తలపడ్డాయి. ఏకపక్షంగా సాగిన పోటీలో డిఫెండింగ్ చాంపియన్ విశాఖపట్నం జ ట్టు 3-1 గోల్స్ తేడాతో చిత్తురు జట్టుపై విజయం సాధించి ఫైనల్స్‌కు చేరారు. చిత్తూరు జట్టుతో తలపడిన కడప జట్టు 4-0 గోల్స్ తేడాతో విజయంసాధించి మూడో స్థానాన్ని దక్కించుకుంది.

'గోవిందంపల్లి భూబాధితులను ఆదుకోండి'


ఎస్పీ అశోక్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న శ్రీకాంత్, గోవిందంపల్లి గ్రామస్థులు

అనంతపురం టౌన్ : బుక్కరాయసముద్రం మండలం గోవిందంపల్లిలో కబ్జాకు గురైన సర్వే నెం.272-1, 280, 281 భూముల బాధితులను ఆదుకోవాలని ఏపీ బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు జ్వాలాపురం శ్రీకాంత్ డిమాండ్ చేశారు. బుధవారం భూబాధితులతోపాటు సమాఖ్య నాయకులు ఎస్పీ జీవీజీ అశోక్ కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జ్వాలాపురం శ్రీకాంత్ మాట్లాడుతూ... గోవిందంపల్లిలోని భూముల్లో దాదాపు 220 మంది పేద బ్రాహ్మణ, పురోహిత, వంటవాళ్లు నెలవారీ కంతులు కట్టి 1987లో ఏఆర్ రాధాక్రిష్ణారావు వద్ద కొనుగోలు చేసి రిజిస్టర్ చేయించుకున్నారన్నారు. 2011 జనవరి 1న బీజేపీ నాయకుల అండతో కొందరు భూకబ్జాదారులు ఈ స్థలాల్లో కొట్టాల ను వేశారన్నారు. ఇదే అంశంపై బుక్కరాయసముద్రం తహసీల్దార్‌కు అర్జీ ఇవ్వగా అదేనెల 9న పోలీసుల సమక్షంలో కబ్జాదారులను ఖాళీ చేయించగా... అదేరోజు రాత్రి కబ్జాదారులు తిరిగి ఆ స్థలాలను కబ్జా చేసారన్నారు. కలెక్టర్‌ను కలిసిన తర్వాత సంబంధిత భూరికార్డులు దొరకని కారణంగా హైకోర్టు నుంచి భూ హక్కుదారులుగా ఉత్తర్వులు తెచ్చుకున్నట్లు తెలిపారు. బాధితులకు స్థలాలను ఇప్పించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సమాఖ్య నాయకులు ఎన్‌వీజీ శాస్త్రి, సత్యానందం, హుస్సేన్ పీరా, మురళి, ప్రసాదాచారి, గోవిందంపల్లి గ్రామప్రజలు పాల్గొన్నారు.

సేవలందించడంలో నిర్లక్ష్యం చేయకండి


సేవలపై ఆరా తీస్తున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి కమలాకర్‌రెడ్డి

అనంతపురం వైద్యం : జిల్లాలోని నలుమూలల నుంచి మానసిక వైద్యం సెంటర్‌కు వచ్చే వారికి అనుగుణంగా సేవలందించాలని డీఎల్ఎస్ఏ కార్యదర్శి కమలాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన సర్వజనాస్పత్రిలోని మానసిక వైద్యం సెంటర్, సఖీ కేంద్రం సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ సమస్యలతో వచ్చే మహిళలకు కౌన్సెలింగ్‌ను అందించి వారిలో ఆత్మస్థైర్యం పెంపొందించాలన్నారు. వారికి అందించే సేవల్లో మాత్రం అలసత్వం వహించరాదన్నారు. కార్యక్రమంలో సఖీ సెంటర్ లీగల్ కౌన్సిలర్ నర్మద, సోషల్ కౌన్సిలర్ ఉమాదేవి పాల్గొన్నారు.

'పార్కింగ్ స్థలాల్లోనే వాహనాలు నిలపాలి'

ఆంధ్రజ్యోతి, అనంతపురం : ఎస్పీ జీవీజీ అశోక్‌కుమార్ ఆదేశాలు అమలుకు రూపుదిద్దుకుంటున్నాయి. జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ క్రమబద్దీకరించి ప్రజలకు అసౌకర్యం లేకుండా చూడాలని ఆయన ట్రాఫిక్ పోలీసులను ఆదేశించిన విషయం తెలిసిందే. సుభాష్‌రోడ్డును పైలెట్ ప్రాజెక్టుగా ఎంచుకుని ట్రాఫిక్ క్రమబద్దీకరించాలని ఆదేశించారు. ఈ క్రమంలో నగర పాలక సంస్థ అధికారుల సహకారం తీసుకోవాలని ఆయన సూచించారు. ట్రాఫిక్ డీఎస్పీ నరసింగప్ప నగరపాలక సంస్థ కమిషనర్ మూర్తి, టీపీఓ మునిచంద్ర శేఖర్‌లతో కలిసి బుధవారం ట్రాఫిక్ క్రమబద్దీకరణ చర్యలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ముందుగా దుకాణదారులు బహుళ అంతస్తుల భవనాల యజమానులకు నోటీసులు జారీ చేశారు. ఎవరికి వారు తమ దుకాణాలు, వ్యాపార సముదాయాలకు సంబంధించి నిర్దేశించిన పార్కింగ్ స్థలంలోనే వాహనాలను పార్కింగ్ చేసి ప్రజలకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెల 26నుంచి ఆ నిబంధనలు పాటించాలని సూచించారు. ఎవరైనా ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని ట్రాఫిక్ డీఎస్పీ నరసింగప్ప పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ లక్ష్మినారాయణ, ఆర్ఎస్ఐలు వీరేష్, బాబు, సురేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఒరిఎంటేషన్ తరగతులు

ఎస్కేయూ: విద్యార్థులకు విద్యాతోపాటూ సంస్కారం, క్రమశిక్షణ, నైపుణ్యాలు అత్యవసరమని ఎస్కేయూ రిజిస్ట్రార్ ఆచార్య సుధాకర్‌బాబు పేర్కొన్నారు. శ్రీకృష్ణదేవరాయ యూనివర్శిటీ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రథమ సంవత్సరం బీటెక్ విదార్థులకు ఓరియంటేషన్ తరగతులు నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఆచార్య రాఘవేంద్రరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా జేఎన్‌టీయూ పరీక్షల విభాగాధిపతి ఆచార్య శశిధర్ హాజరయ్యారు. ఈ సందర్భంగ రిజిస్ట్రార్ మాట్లాడుతూ.... ఇంజనీరింగ్, డిగ్రీ పూర్తీ చేసిన పది నుండి పదిహేను శాతం మంది విద్యార్థులు మాత్రమే ఉద్యోగాలు పొందుతున్నారని, సంస్థలు, లేదా పరిశ్రమలు విద్యార్థుల మార్కులు శాతం కన్నా నైపుణ్యాలకే ప్రాధాన్య ఇస్తున్నారు. ఆంగ్లంలో నైపుణ్యాలు తప్పనిసరిగా పెంపొందించుకోవాలన్నారు. హార్డ్‌వర్క్ ఒక్కటే విజయానికి రాజమార్గమని ప్రిన్సిపాల్ రాఘవేంద్రరావు, కళాశాల ప్రాముఖ్యతను గురించి వివరించారు. సమావేశంలో రెక్టార్ లజపతిరావు పాల్గొన్నారు.

తక్షణమే పెండింగ్ స్టైపెండ్ చెల్లించాలి

అనంతపురం వైద్యం : ప్రభుత్వస్పత్రిలో పనిచేస్తున్న హౌస్‌సర్జన్‌ల పెండింగ్ స్టైపెండ్ వేతనాలను తక్షణమే చెల్లించాలని..లేనిపక్షంలో నిరసనలు ఇలాగే కోనసాగిస్తామని పలువురు జూనియర్ వైద్యులు పేర్కొన్నారు. ఈమేరకు రెండో రోజైనా బుధవారం కూడా హౌస్‌సర్జన్‌లు సర్వజనాస్పత్రి ఓపీ విభాగం వద్ద నిరసనలు చేపట్టారు. సుమారు 3గంటల పాటు తమ నిరసనలు తెలియ జేశారు.

ప్రత్యామ్నాయ విత్తనాల పంపిణీలో మొరాయించిన సర్వర్

బత్తలపల్లి: మండల కేంద్రమైన బత్తలపల్లిలో బుధవారం ప్రత్యామ్నాయ పంటల విత్తనాల పంపిణీని ప్రారంభించారు. అయితే ఉదయం నుంచే సర్వర్ సక్రమంగా పని చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విత్తనాల కోసం వచ్చిన రైతులు సాయంత్రం వరకు పంపిణీ కేంద్రం వద్దే పడిగాపులు కాసి విసిగిపోయారు. చివరకు విత్తనాలు పొందకుండానే నిరాశతో వెనుదిరిగారు. లబ్దిదారులకు, ఈక్రాప్ బుకింగ్‌కు లింకు పెట్టడంతో చాలా మంది రైతులు ప్రత్యామ్నాయ విత్తనాల కోసం ఆసక్తి చూపలేదు. వచ్చిన రైతులకు కూడా విత్తనాలు దక్కలేదు.



గ్రామాల్లో నిలిచిన బట్వాడా

సమ్మెలో తపాలా ఉద్యోగులు.. ఇబ్బందుల్లో ప్రజలు

ధర్మవరంఅర్బన్

గ్రామీణ తపాల ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారంకోసం సమ్మెబాటపట్టారు. దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న తమడిమాండ్ల సాధన కోసం వారు గత వారం రోజులుగా సమ్మెలో పాల్గొంటున్నారు. దీంతో తంతి తపాలశాఖ కార్యకలాపాలు పూర్తిగా స్తంభించి పోతున్నాయి. వారం రోజులుగా ఉత్తరాల బట్వాడా నిలిచిపోయింది. దీంతో సమాచారం అందక ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ధర్మవరం డివిజన్‌లో 28 బ్రాంచ్ కార్యాలయాలు ఉన్నాయి. ఇందులో మొత్తం 590 మంది తపాల ఉద్యోగులు పనిచేస్తున్నారు. అయినప్పటికీ వారికి కేవలం ప్రభుత్వం రూ.10-12వేల వేతనాన్ని మాత్రమే చెల్లిస్తోంది. దీంతో గ్రామీణ తంతితపాల ఉద్యోగులు దుర్భరజీవితం గడుపుతున్నారు. తమకు వేతనం పెంచడంతో పాటు వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గతంలో పలు మార్లు ఉద్యమ బాట పట్టారు. అయితే ప్రభుత్వం అప్పట్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంతో మరోసారి తపాల ఉద్యోగులు సమ్మెకు దిగారు. దీంతో మండలాల్లో బట్వాడ నిలిచిపోయింది.

తపాలా ఉద్యోగుల డిమాండ్లు...

- సీనియారిటీ ప్రకారం వేతనాలు పెంచాలి
- ప్రతి ఉద్యోగికి కనీస వేతనం రూ.20వేలు అందించాలి
- సీడీఎస్‌లకు 8గంటల పని కల్పించి ఉద్యోగాన్ని రెగ్యులర్ చేయాలి
- కోర్టు తీర్పు ప్రకారం పెన్షన్ సౌకర్యం కల్పించాలి
- టార్గెట్‌ల పేరుతోనే జీడీఎస్‌లను వేధించకూడదు.

సీనియారిటీ ప్రకారమే వేతనం చెల్లించాలి



27సంవత్సరాలుగా తంతితపాలా శాఖలో పనిచేస్తున్నా. అయినప్పటికీ ప్రభుత్వం రూ.12,440 మాత్రమే చెల్లిస్తోంది. ఉద్యోగంలో చేరినప్పుడు రూ.460 వచ్చేది. అయితే ప్రస్తుతం పెరిగిన నిత్యావసర సరుకులతో జీతం చాలడం లేదు. కావున సీనియారిటీ బట్టి వేతనాలు పెంచాలి.

- ఈశ్వరయ్య, తపాలా ఉద్యోగి, ధర్మవరం

పెన్షన్ సౌకర్యం కల్పించకపోతే రోడ్డు పడతాం



35ఏళ్లుగా తపాలా శాఖలో పనిచేస్తున్నా. రూ.175 జీతం నుంచి విధులు నిర్వహిస్తున్నా. త్వరలో పదవీవిరమణ పొందుతున్నా. అయితే ఇప్పటికీ ప్రభుత్వం రూ.10,350 మాత్రమే చెల్లిస్తోంది. పదవీ విరమణ పొందిన తరువాత పెన్షన్ సౌకర్యం కల్పించకపోతే కుటుంబం రోడ్డున పడుతుంది.

- రామాంజినేయులు, బద్రాపురం, కనగానపల్లి మండలం



స్వర్ణరథంపై దర్శనమిస్తున్న సత్యసాయి

స్వర్ణరథంపై సత్యసాయి విహారం

బత్తలపల్లి: మండల కేంద్రమైన బత్తలపల్లిలో బుధవారం సత్యసాయిబాబా స్వర్ణ రథంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బాబాకు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమం సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగింది.

ఎన్టీఆర్ వైద్యసేవలను సద్వినియోగం చేసుకోండి

ధర్మవరంఅర్బన్: ప్రతి ఒక్కరు ఎన్టీఆర్ వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ యుగంధర్ పెన్షనర్లకు సూచించారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో బుధవారం ఎన్టీఆర్ వైద్యసేవల గురించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిప్యూటీ డీఎంహెచ్‌ఓ యుగంధర్ మాట్లాడుతూ ఎన్టీఆర్ వైద్యసేవలను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. అనంతపురం పట్టణంలో 6 ఆస్పత్రులలోనూ, ధర్మవరం పట్టణంలో స్పందన ఆస్పత్రిలో ఈ ఎన్టీఆర్ వైద్యసేవలు అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలోకో ఆర్డీనేటర్ సౌజన్యకుమార్, మేనేజర్ ప్రసాద్,సిబ్బంది యల్లప్ప, శివశంకర్, సుధాకర్, విశ్రాంత ఉద్యోగులు సంజీవరెడ్డి, ఆరోగ్యమిత్రులు రవి, రాజేంద్ర ప్రసాద్, ఓబుళకాంతమ్మలు పాల్గొన్నారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు

ధర్మవరంఅర్బన్: 2012 సంవత్సరానికి ముందున్న కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని సుప్రీం కోర్టు తీసుకున్న నిర్ణయంతో కక్షిదారులు ఇబ్బందులు పడే అవకాశం ఉందని బుధవారం న్యాయవాదులు విధులను బహిష్కరించారు. సుప్రీం కోర్టు తీసుకున్న నిర్ణయంతో ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని న్యాయవాదులు పేర్కొన్నారు. ధర్మవరంలోని కోర్టు ఆవరణంలో బుధవారం బార్ అసోషియేషన్ అధ్యక్షుడు శంకర్‌నారాయణ రెడ్డి, ఉపాధ్యక్షుడు నల్లప్ప, ప్రధానకార్యదర్శి సుబ్బారావు, కార్యదర్శి విజయ రాఘవేంద్ర, కోశాధికారి డీఎల్ ఎన్ మూర్తి, గ్రంథాలయ కార్యదర్శి సుమలత, అబ్దుల్లా తదితరులు విలేకరులతో మాట్లాడారు. వెను వెంటనే వెలువడే తీర్పుతో అందరికి నిజమైన న్యాయం జరగదని వారు అభిప్రాయపడ్డారు. అందుకే సుప్రీంకోర్టు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ రెండు రోజులపాటు విధులను బహిష్కరిస్తున్నామన్నారు. సోమవారం న్యాయవాదులంతా సమావేశం కావాలని వారు తీర్మానించారు.



విలేకరులతో మాట్లాడుతున్న న్యాయవాదులు

గ్రంథాలయాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు : సంస్థ చైర్మన్

ధర్మవరంఅర్బన్: జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయించి ప్రగతికి బాటలు వేస్తామని గ్రంథాలయశాఖ జిల్లా చైర్మన్ జిరాయతి గౌస్‌మోద్దీన్ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం గ్రంథాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులు పోటీపరీక్షలకు శిక్షణ ఇవ్వడానికి జిల్లా కేంద్రంలో రూ.35 లక్షలతో ఆడిటోరియాన్ని నిర్మిస్తున్నట్టు వివరించారు. ప్రతి బ్యాచ్‌లో 800 మందికి శిక్షణతో పాటు ఉచిత భోజనవసతి కూడా కల్పిస్తామన్నారు. ఆర్డీటీ సంస్థ సహకారంతో జిల్లా కేంద్రంలో రూ. 1.30 కోట్లతో పక్కాభవనాన్ని నిర్మిస్తామని వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న గౌస్‌మోద్దీన్

సబ్సిడీ రుణాలకు ఇంటర్వ్యూలు

బత్తలపల్లి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం సబ్సిడీ రుణాలకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు భారీగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మీబాయి, ఎస్‌బీఐ మేనేజర్ ఉమామహేశ్వర్‌వర్దన్, కార్పొరేషన్ బ్యాంకు అధికారి దినేశ్ తదితరులు పాల్గొన్నారు.



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

లోకల్ గైడ్
localguide

ఎమ్మెల్యే డైరీ

ధర్మవరం: ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ గురువారం నియోజకవర్గంలో అందుబాటులో ఉంటారు. ఉదయం తాడిమర్రిలోని ఉన్నతపాఠశాలలో గ్లాసులు, ప్లేట్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. ధర్మవరం టీడీపీ కార్యాలయానికి చేరుకుని ముదిగుబ్బ, తాడిమర్రి నాయకులతో సమీక్షిస్తారు. సాయంత్రం ధర్మవరం మోడల్‌స్కూల్‌లో మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డితో కలిసి హాస్టల్ భవనాన్ని ప్రారంభిస్తారు.

ధర్మవరం మార్కెట్‌లో కూరగాయల ధరలు



పచ్చిమిర్చి 30, వంకాయలు 30, కాకర 50 టమోట 30, క్యారెట్ 60, బీన్స్ 50, ఎర్రగడ్డలు 20, బంగాళాదుంప 20, ముల్లంగి 20, క్యాబేజి 40, చౌడేకాయలు 30, బీరకాయలు 40, బీట్‌రూట్ 30, బెండ 40.

ధర్మవరం సినిమాలు

సిద్దార్థ: ఫిదా, **లక్ష్మీనారాయణ:** శమంతకమణి, **లక్ష్మీచక్రవర్తి:** రాక్షసి, **వరలక్ష్మి:** లై, **విజయలక్ష్మి:** నిన్నుకోరి, **రంగా సెంట్రల్:** నిన్నుకోరి, గౌతమ్‌నంద, జయజానకీనాయక, ఆనందోబ్రహ్మ

ధర్మవరం డిపో నుంచి ఆర్టీసీ బస్ సర్వీస్‌లు

ధర్మవరం-హైదరాబాద్ : ఉదయం 11.30 గంటలకు, మధ్యాహ్నం 1.30, 3.30, రాత్రి 8.30, 9.30, ధర్మవరం-చెన్నై: రాత్రి 8 గంటలకు, ధర్మవరం-విజయవాడ: సాయంత్రం 4.30, 6.30 గంటలకు, ధర్మవరం-నెల్లూరు: సాయంత్రం 6.15కు, ధర్మవరం-ఒంగోలు : మధ్యాహ్నం 3.30గంటలకు, ధర్మవరం-తిరుపతి : సాయంత్రం 4.30గంటలకు

విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి



తాడిమర్రిలో నిర్వాహకులకు సూచనలిస్తున్న ఎస్ఐ

తాడిమర్రి: వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని తాడిమర్రి ఎస్ఐ రాంభూపాల్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వినాయక ఉత్సవ నిర్వాహకులకు తగు సూచనలిచ్చారు. ప్రతి ఒక్కరు మంచి వాతావరణంలో విగ్రహాలను ఏర్పాటు చేసుకుని కులమతాలకు అతీతంగా కలిసికట్టుగా, శాంతియుతంగా విగ్రహాలను నిమజ్జనం చేసుకోవాలన్నారు. విగ్రహాలను ఏర్పాటు చేసుకునే వారు తప్పకుండా స్థానిక పోలీసులను కలిసి అనుమతి పొందాలన్నారు. అనుమతి కోసం వచ్చేవారు ఆధార్‌కార్డు, ఫోన్‌నెంబర్ వివరాలు ఇచ్చి పోలీస్ స్టేషన్‌లో నమోదు చేయించుకోవాలని కోరారు.

రౌడీషీటర్లకు కౌన్సిలింగ్: మండలంలోని రౌడీషీటర్లకు ఎస్ఐ రాంభూపాల్ కౌన్సిలింగ్ ఇచ్చారు. గ్రామీణ వాతావరణాన్ని కలుషితం చేసేలా ఎలాంటి చర్యలకు పాల్పడినా వారిని కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. గ్రామాల్లో మీకు తెలియకుండా ఏమైనా అసాంఘిక కార్యక్రమాలు జరుగుతుంటే తమ దృష్టికి తీసుకు రావాలని సూచించారు.

ముదిగుబ్బ: వినాయక విగ్రహాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరి అని ఏఎస్ఐ భాస్కర్‌రాజు తెలిపారు. బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ విగ్రహాల ఏర్పాటులో నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. నిమజ్జన సాయంత్రంలోపు పూర్తి చేయాలని, చిన్నపిల్లల్ని తీసుకెళ్లరాదన్నారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి యువకుడు మృతి


మృతి చెందిన శ్రీనివాసులు

బత్తలపల్లి: మండలంలోని మాల్యవంతం - వెంకటగారిపల్లి గ్రా మ మధ్యలో బుధవారం రాత్రి బైకు అదుపుతప్పి ఓ యువకుడు మృతి చెందాడు. ధర్మవరం మండలం, సుబ్బరావుపేటకు చెందిన దాసరి శ్రీనివాసులు(25) భార్య గర్భవతి కావడంతో శిలంకూరుకు తీసుకెళ్ళి అత్తగారి ఇంటిలో వదిలి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగిందని ఎస్‌ఐ హరున్ బాషా తెలిపారు. కొనఊపిరితోఉన్న శ్రీనివాసులను ఆటో డ్రైవర్ ఆర్డీసీ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

స్వాతంత్ర్య సమరంలో టంగుటూరి పాత్ర కీలకం

ప్రకాశం పంతులు జయంతి వేడుకలో ఎమ్మెల్యే గోనుగుంట్ల



టంగుటూరికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణ - గ్రంథాలయంలో...


డిగ్రీ కళాశాలలో...

ధర్మవరం: భారతావనికి స్వాతంత్ర్య సిద్ధి కోసం గాంధీ మహాత్ముడితో కలిసి అనేక కార్యక్రమాలు చేపట్టి స్వాతంత్ర్యం తీసుకురావడంలో టంగుటూరి ప్రకాశం పంతులు చేసిన కృషి ఎనలేనిదని ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ పేర్కొన్నారు. టంగుటూరి ప్రకాశం పంతులు 146వ జయంతిని పురస్కరించుకుని స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఎమ్మెల్యే నివాళులర్పించారు. 23-08-1872లో నెల్లూరులో జన్మించిన ఈయన విద్యాభ్యాసం నెల్లూరు, మద్రాసులో సాగిందన్నారు. 1907లో పురపాలక సంఘం అధ్యక్షుడి అనంతరం మహాత్మా గాంధీతో పాటు స్వాతంత్ర్య ఉద్యమంలో ముఖ్యపాత్ర పోషించారన్నారు. 1928లో సైమన్ కమిషన్ ఉద్యమంలో పాల్గొని ఎదురొడ్డి నిలిచిన మహనీయుడన్నారు. అనంతరం ఆయన వీరోచిత పోరాటాలకు ఆంధ్రకేసరి బిరుదును కూడా పొందారన్నారు. 1946లో మద్రాసు ముఖ్యమంత్రిగా 13 నెలలపాటు పని చేశారన్నారు. ఆయన ఆశయసాధన కోసం అందరూ కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈకార్యక్రమంలో మున్సిపల్, మార్కెట్‌యార్డ్ ఛైర్మన్లు బీరే గోపాలకృష్ణ, కమతం కాటమయ్య, పట్టణాధ్యక్షుడు చిప్పల మల్లికార్జున, జడ్పీటీసీ మేకల రామాంజినేయులు, గొట్లూరు శీనా, ఎంపీపీ వేణుగోపాల్‌రెడ్డి, కౌన్సిలర్లు లడ్డు బాబు, ఇనయతుల్లా, కేహెచ్.ప్రకాశ్, నీలూరి ప్రకాశ్, నాయకులు తలారి చంద్రమోహన్ బాబు, పఠాన్‌బాబుఖాన్, వీరన్న, బొట్టు శీనా, బొట్టు కిష్ట, కేశవరెడ్డి, గంగారపు రవి తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరంఅర్బన్: ఆంధ్రరాష్ట్ర(మద్రాసు ప్రెసిడెన్సి) మాజీ ముఖ్య మంత్రి, స్వాతంత్ర్య సమరయోదుడు ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 145వ జయంతి వేడుకలను బుధవారం పట్టణంలో అధికారులు ఘనంగా జరుపుకున్నారు. ముందుగా ఆర్డీఓ కార్యాలయంలో టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటాన్ని ఏర్పాటు చేసి ఆర్డీఓ బాలానాయక్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆర్డీఓ బాలానాయక్ మాటాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రిగా స్వాతంత్ర్య సమరయోధుడిగా ఆయన చేసిన సేవల గురించి కొనియాడారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మహబూబ్‌బాషా, అధికారులు హంపయ్య, నాగప్పనాయక్ పాల్గొన్నారు.

గ్రంథాలయంలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకల సందర్భంగా గ్రంథాలయాధికారి క్రిష్టారెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాల వేసినివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది కావేరి, రమణా నాయక్ పాల్గొన్నారు.

కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను ప్రిన్సిపల్ సురేశ్, అధ్యాపకులు, విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ చాంద్‌బాషా, ఎన్ఎస్ఎస్ పీఓ క్రిష్టయ్య, అధ్యాపకులు ప్రసాద్‌రెడ్డి, షామీర్, విశ్వనాథ్‌రెడ్డి, ఆదినారాయణ, శివప్రసాద్, నవీన్‌కుమార్, పుష్పావతమ్మ, ఉషారాణి, కిరణ్‌కుమార్, ఖాదర్‌వలి, అంజన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎస్వీజూనియర్ కళాశాలలో బుధవారం టంగుటూరి ప్రకాశం పంతులు జయంతివేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ నరేంద్ర, యాజమాన్యం ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కరస్పాండెంట్ చాంద్‌బాషా మాట్లాడుతూ ఎంతో మంది స్వాతంత్ర్యసమరయోదులుబ్రిటీష్ వారిని ఎదిరించి మనకు స్వాతంత్ర్యం తెచ్చిన వారిలో ప్రకాశం పంతులు ఒకడన్నారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు పోలా ప్రభాకర్, డాక్టర్ సుబ్బారావు, బండ్లపల్లి రంగనాథం, జయశంకర్, రమణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


బత్తలపల్లిలో టంగుటూరుకి నివాళులర్పిస్తున్న దృశ్యం

బత్తలపల్లి: టంగుటూరు ప్రకాశం పంతులు 145వ జయంతి సందర్భంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూజలు చేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియ ర్ అసిస్టెంట్ సురేష్, ఆర్ఐ అనూరాధ, నాగమణి, వీఆర్‌ఓలు పెద్దన్న, రామాంజనేయులు, నరసింహమూర్తి, జగదీశ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలను అరికట్టాలి

ధర్మవరంఅర్బన్: బాల్య వివాహాలతో పాటు బాలల అక్రమరవాణాను అడ్డుకోవాలని తహసీల్దార్ మహబూబ్ బాషా, ఎంఈఓ నూర్ అహ్మద్‌లు పేర్కొన్నారు. స్థానిక ఎన్జీఓహోంలో బుధవారం గర్ల్స్ అడ్వకసీ అలయన్స్ ప్రోగ్రామ్, హ్యూమన్ న్యాచురల్ రీసోర్సెస్ డెవలప్‌మెంట్ సొసైటీ సంయుక్తంగా బాల్యవివాహాలు, అక్రమరవాణాపై రెవిన్యూ డివిజన్ స్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్య వివాహాలతోచిన్నపిల్లల జీవితాలు అంధకారంలోకి పోతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు రామాంజినేయులు, గొట్లూరు సర్పంచ్ శివయ్య, సీఐ హరినాథ్, డీసీపీఓ సుబ్రహ్మణ్యం, లేబర్ ఆఫీసర్ క్రిష్ణారెడ్డి, హెల్త్ కోఆర్డినేటర్ కొండప్ప, నారాయణస్వామి, రామాంజి నేయులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ: బాల్యవివాహాలను విద్యార్థులే అడ్డుకోవాలని పట్నం ఎస్‌ఐ రాఘవ పేర్కొన్నారు. మండలంలోని యనమలవారిపల్లిలో బుధవారం విద్యార్థులకు బాల్యావివాహాలు, రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. రోడ్డు భద్రతాసూత్రాల ప్రకారం మేరకే వాహనాలను నడపాలని, విద్యార్థులు వాటిపై అవగాహన కలిగివుండాలన్నారు. బాల్యావివాహాలను చేయడం వల్ల బంగారు భవిష్యత్తు నాశనమవుతుందన్నారు. కావున చిన్నవయసులోనే వివాహాలు చేస్తుంటే తోటి విద్యార్థులు పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా స్వాధీనం : ఒకరి అరెస్టు

ముదిగుబ్బ: మండలంలోని బూదనంపల్లి గ్రామంలో నాటుసారాను విక్రయిస్తున్న బొంత రామిరెడ్డి అనే వ్యక్తిని అరెస్టు చేసి రెండులీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ నరసానాయుడు తెలిపారు. నాటుసారాను విక్రయించినా, తయారు చేసినా, బెల్టుషాపులను నిర్వహించినా కఠిన చర్యలు తప్పవన్నారు. ఎక్కడైనా నాటుసారా తయారు చేస్తున్నట్లు, విక్రయిస్తున్నట్లు తెలిస్తే 9440902562 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. ప్రభుత్వం బెల్టుషాపులను రద్దు చేసింది కావున వాటిని నిర్వహించరాదన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐ మోహన్‌బాబు, హెడ్‌కానిస్టేబుల్ శంకరనారాయణ, పీసీలు భీముడు, నరసింహులు, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ధర్మవరంఅర్బన్: ధర్మవరం ఎక్సైజ్ ప్రొహిబిషన్ పరిధిలోని యర్రగుంట గ్రామంలో ఓబుళమ్మ అనే మహిళ ఇంటిలో ఏడు మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని అమెను అరెస్టు చేసినట్లు సీఐ నరసానాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మద్యం విక్రయించరాదని ఎన్నిసార్లు చెప్పిన అధికారుల మాటలను బేఖాతర్ చేసి మద్యం అమ్ముతూ పట్టుబడిన అమెపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా మద్యం అమ్ముతున్నట్లు తెలిస్తే 9440902562 నెంబర్‌కు ఫోన్‌చేయాలన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐ మో హన్ బాబు, హెడ్‌కానిస్టేబుల్ శంకరనారాయణ, కాని స్టేబుళ్లు భీముడు, నాగభూషణ, సుధాకర్‌రెడ్డి ఉన్నారు.

ఉపాధ్యాయులకు టెలీకాన్ఫరెన్స్

ధర్మవరంఅర్బన్: ప్రాథమికోన్నత, ఉన్నతపాఠశాలల్లో పని చేస్తున్న సహాయకులు, బాషాపండితులకు స్థానిక బీఎస్ఆర్ పాఠశాలలో ఎస్‌సీఈఆర్‌టీ బుధవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. 60 మంది ఉపాధ్యాయులకు టెలికాన్ఫరెన్స్‌లో ఎస్‌సీఈఆర్ వారు సలహాలు, సూచనలు ఇచ్చారు. విధివిధానాలు, పాఠశాల అభివృద్ధి తదితర విషయాలను వివరించారు.

నేడు కాపు రుణాల ఇంటర్వ్యూలు : ఈఓఆర్డీ

తాడిమర్రి: వివిధ కార్పొరేషన్ల ద్వారా మంజూరు చేసే సబ్సిడీ రుణాలకు అర్హులను ఎంపిక చేయడంలో భాగంగా కాపు కార్పొరేషన్ ద్వారా పంపిణీ చేసే రుణాలకు కూడా గురువారం ఎంపికలు నిర్వహిస్తామని ఈఓఆర్డీ గంగావతి తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు..వారి ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 10 గంటలకు ఎంపీడీఓ కార్యాలయానికి హాజరుకావాలని కోరారు.

మండలానికి చేరిన ప్రత్యామ్నాయ విత్తనాలు

ముదిగుబ్బ: కరువు రైతును ఆదుకోవడానికి ప్రభుత్వం వందశాతం సబ్సిడీతో అందిస్తున్న ప్రత్యామ్నాయ విత్తనాలు ముదిగుబ్బ మండలానికి చేరాయి. 22 టన్నుల పెసలు, 21 టన్నుల ఉలవలు, 10 టన్నుల అలసందలు, 5 టన్నుల జొన్నలు వచ్చినట్లు ఏఈస్సీ డీలర్ లింగానాయుడు తెలిపారు.

ముదిగుబ్బలో దోమలపై దండయాత్ర

ముదిగుబ్బ: సీజనల్ వ్యాధులు సోకకుండా దోమలపై దండయాత్ర చేపడదామని తహసీల్దార్ మాధవరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ దోమల వల్ల మలేరియా, డెంగీ, చికున్ గున్యా, మెదడువాపు తదితర వ్యాధులు సోకుతున్నాయని, వాటి నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. అందు కోసం రెవెన్యూ, పంచాయతీ, ఆస్పత్రి సిబ్బందితో కలిసి సంయుక్తంగా దోమల నివారణ చర్యలు చేపడతామన్నారు. రక్షిత మంచినీటి పథకాల వద్ద నీరు నిల్వ ఉంటే తొల గించడంతో పాటు బ్లీచింగ్ చేయించడం, ప్రతి శనివారం డ్రైడే పాటించడంపై అవగాహన కల్పిస్తామన్నారు. ప్రజలు కూడా ఇంటి పరిస రాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అప్పుడే రోగాలు దరి చేరవన్నారు. దోమలు ప్రబలకుండా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్నకుమార్, ఆర్ఐ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సక్రమంగా సత్యసాయి నీటిని వదలాలి

బసంపల్లి గ్రామస్థుల ఆందోళన

ధర్మవరంఅర్బన్: తమ గ్రామంలో 15 రోజులకొకసారి సత్యసాయినీరు వస్తోందని, దీంతో తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని చెన్నేకొత్తపల్లి మండలం బసంపల్లి గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ గ్రామస్థులు ధర్మవరంలోని సత్యసాయి వాటర్ సప్లై కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ గతంలో సత్యసాయినీరు రోజు సక్రమంగా వచ్చేదని, ప్రస్తుతం 15రోజుకు ఓసారి వస్తోందన్నారు. దీంతో వ్యవసాయబావుల వద్ద గంటల తరబడి నిలబడి నీటిని తెచ్చుకుంటున్నామన్నారు. కావున నీటిని రోజు సరఫరా చేయాలని కోరారు. సత్యసాయి అధికారులు మాటాడుతూ పెద్దకోట్లలో మోటార్లు మరమత్తులకు గురయ్యాయని, పూర్తయిన వెంటనే సరఫరా చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో నరసమ్మ,సాలమ్మ, లింగమ్మ, అంజినమ్మ, వెంకటన్న, కుళ్లాయప్ప, బొజ్జన్న తదితరులు పాల్గొన్నారు.

'రెడ్డి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి'

ధర్మవరంఅర్బన్: జాతీయ రెడ్డి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి రెడ్డి సామాజికవర్గ అభివృద్ధికి తక్షణమే రూ.10 వేల కోట్లు కేటాయించాలని జాతీయ రెడ్డి ఐక్య వేదిక సంఘం అధ్యక్షుడు కరుణారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక రెడ్డి సంఘం కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణా తదితర రాష్ట్రాల్లో రెండుకోట్ల మందికి పైగా నిరుపేద రెడ్డిలు ఉన్నారని, వీరి అభివృద్ధి కోసం కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణా సీఎం కేసీఆర్ రెడ్డి భవనం కోసం 10 ఎకరాల స్థలం, రూ.10 కోట్ల నిధులు కేటాయించారని, అదే తరహాలో ఏపీ సీఎం చంద్రబాబు కూడా చర్యలు చేపట్టాలని కోరారు. అగ్రవర్ణాల కోసం ఓసీ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన సీఎం, అధికారంలోకి వచ్చాక మరిచారన్నారు. రెడ్డిల అభివృద్ధికి విశాఖపట్నం, తిరుపతి, కర్నూలులో మహాగర్జన నిర్వహించి వచ్చేనెల ఢిల్లీలో భారీ ప్రదర్శన నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు శేషాద్రిరెడ్డి, పట్టణాధ్యక్షుడు నారాయణరెడ్డి, గౌరవాధ్యక్షుడు చందమూరు శివారెడ్డి, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు కృపాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ పోస్టర్ల విడుదల

గుంతకల్లుటౌన్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏపీ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో బుధవారం అంబేడ్కర్ విగ్రహా విష్కరణ పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏపీ ఎమ్మార్పీఎస్ రాయలసీమ అధ్యక్షుడు కేవెల్ స్వామిదాస్ మాట్లాడుతూ కళ్యాణదుర్గం మండలం దాసంపల్లిలో ఈ నెల 31వ తేదీ ఉదయం 10 గంటలకు అంబేడ్కర్ విగ్రహా విష్కరణ చేస్తామన్నారు. కార్యక్రమానికి రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు ఎంఎస్ రాజు హాజరవుతారన్నారు. కార్యక్రమం లో ఏపీ ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బీ అనంద్, మండల అ ధ్యక్షుడు శ్రీరాములు, ప్రచార కార్యదర్శి జయరాం, నాయకులు గంపన్న, తదితరులు పాల్గొన్నారు.

29న సాగునీటి సాధనకు రైతు సదస్సు

గుంతకల్లు: హంద్రీనీవా నుంచి గుంతకల్లు నియోజకవర్గానికి సాగునీటిని సాధించడంలో భాగంగా రైతులను సమీకరించడానికి ఈ నెల 29న సదస్సును నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి డీ జగదీశ్ పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు వద్ద గుంతకల్లు మండల రైతు సంఘ నాయకులు, వ్యవసాయదారులతో సీపీఐ నాయకులు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జగదీశ్ మాట్లాడుతూ హంద్రీనీవా ద్వారా పత్తికొండ, ఉరవకొండ, కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాలకు ఆయకట్టును స్థిరీకరించి, గుంతకల్లు నియోజకవర్గానికి మాత్రం మొండిచేయి చూపారని విమర్శించారు. ఈ నియోజకవర్గానికి హెచ్చెల్సీ ద్వారా జీఎస్‌బీసీకి తుంగభద్ర నీరు లభించాల్సి ఉండగా అక్కడా అన్యాయమే జరిగిందన్నారు. జీఎస్‌బీసీకి నీరు రాని కారణంగా 16 వేల ఎకరాల ఆయకట్టు బీడుప డిందన్నారు. కనీసం హంద్రీనీవా ద్వారానైనా నీరొస్తుం దనుకుంటే అక్కడా మోసం చేశారని ఆరోపించారు. హంద్రీనీవాలో రాగులపాడు పంప్ హౌస్ వద్ద కాలు వను తవ్వి గూళ్లపాళ్యం వద్ద వంకకు నీరందిస్తే గుంత కల్లు మండలంలోని పలు గ్రామాల చెరువులకు నీరం దుతుందన్నారు. దీనికి అధికారులు అంచనాలను తయారుచేయగా, రెండు సంవత్సరాలైనా ప్రభుత్వం నుంచి స్పందన లేదన్నారు. తన పుట్టినరోజున పామిడి లో నిర్వహించిన పైలాన్ ప్రాజెక్టు ప్రారంభోత్సవ సందర్భంగా సీఎం ఈ ప్రాజెక్టుకు రూ. 42 కోట్లను ఇస్తామని హామీ కూడా ఇచ్చారన్నారు. జల వనరుల శాఖ మంత్రి ఉమా మహేశ్వరరావు ఆగస్టులో హంద్రీనీవాపై పాదయాత్ర చేస్తానని చెప్పి, నీరు రాకపోవడంతో కనిపించకుండాపోయారన్నారు. కొనకొండ్ల వద్ద ఒక లిఫ్టును ఏర్పాటు చేసినా ఎన్నో చెరువులకు నీరొస్తుందన్నారు. ఈ డిమాండ్ల సాధనకు రైతులను చైతన్యపరచడానికి ఈ నెల 29న పాత గుంత కల్లులోని బీరప్ప ఆలయం కళ్యాణ మండపంలో సదస్సును నిర్వహించ తలపెట్టినట్లు వెల్లడించారు. సీపీఐ డివిజన్ కార్యదర్శి బీ గోవిందు, జిల్లా సమితి భ్యుడు అబ్దుల్ వహాబ్, పట్టణ కార్యదర్శి వీరభద్ర స్వామి, నాయకుడు మహమ్మద్ గౌస్, రైతుల సంఘ నాయకులు జయన్న, సంజీవరెడ్డి, కదిరప్ప, పుల్లారెడ్డి, నాగిరెడ్డి, రామాంజనేయులు, ఓబయ్య, పోతప్ప పాల్గొన్నారు.




రైతు సదస్సు కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

లోకల్ గైడ్

ఎమ్మెల్యే డైరీ

గుంతకల్లు: స్థానిక ఎమ్మెల్యే జితేంద్రగౌడ్ గురువారం సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు క్యాంపు కార్యాలయంలో ప్రజలు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటారు.

కూరగాయల ధరలు



కిలో.. టమోట రూ. 30, మిరప రూ. 30, బీరకాయ రూ. 30, ఉర్లగడ్డ రూ. 20, వంకాయ రూ. 30, బెండకాయ రూ. 20, క్యారెట్ రూ. 40, ఉల్లిగడ్డ రూ. 40

సినిమా గైడ్

గుంతకల్లు

వాసవి : జయ జానకి నాయక
చైతన్య : ఆనందో బ్రహ్మ
కేపీఎస్: నేనే రాజు నేనే మంత్రి

గుత్తి

అమృత్: నేనే రాజు నేనే మంత్రి
కేపీఎస్ : జయ జానకి నాయక

పామిడి

మంజు: నేనే రాజు నేనే మంత్రి
హనుమాన్ : జయ జానకి నాయక

ప్రతి విద్యార్థి మొక్కలను పరిరక్షించాలి : ఎస్ఐ

గుత్తి: నాటిని ప్రతి మొక్కకు ప్రతి విద్యార్థి బాధ్యతగా నీళ్లు పోస్తూ రక్షించాలని ఎస్ఐ చాంద్‌బాషా పేర్కొన్నారు. పట్టణంలోని కోటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుంకన్న ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం కోసం ప్రతి ఒక్కరూ మొక్కలను పెంచాలన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి వంద మొక్కలు నాటారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, స్థానికులు పాల్గొన్నారు.



మొక్కలను నాటుతున్న ఎస్ఐ చాంద్‌బాషా

ప్రకృతి పరిరక్షణ ఓ బాధ్యత

పామిడి : ప్రకృతి పరిరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని శ్రీ నలంద స్కూల్ డైరెక్టర్లు ఎండీ రవి, ఎం మల్లికార్జున పేర్కొన్నారు. బుధవారం ఆ స్కూల్‌లో విద్యార్థులతో ప్రకృతి పండుగను నిర్వహించారు. ప్రకృతి పట్ల మానవాళి బాధ్యతను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు మొక్కల పెంపకం, నీటి పొదుపుపై ప్రదర్శించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీ కృష్ణుడి విగ్రహం ఊరేగింపు



పామిడి : పట్టణంలోని నూతన ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ప్రబోధ సేవా సమితి - ఇందూ జ్ఞాన వేదిక వారి ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు బుధవారం ముగిశాయి. ఈనెల 14 నుంచి ఈ వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రతి రోజూ ఉదయం శ్రీ కృష్ణుని పూజ, ఆధ్యాత్మిక ప్రవచనాలు, భక్తి పాటలు, ఆధ్యాత్మిక నాటికలు నిర్వహించారు. చివరిరోజు వివిధ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో శ్రీ కృష్ణుని విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు. ఊరేగింపునకు భారీగా భక్తులు తరలివచ్చారు.

బీరప్ప స్వాముల ఊరేగింపు



స్వాములను ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: బీరప్ప స్వాముల ఊరేగింపును బుధవారం నిర్వహించారు. పట్టణంలోని నాగసముద్రం బావి వద్ద స్వాములకు పూజలు చేశారు. స్వాములను మేళతాళాల మధ్య పాత గుంతకల్లులోని నెలగొండ వసీకెరప్ప దేవాలయం వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. కార్యక్రమంలో పూజారి బసప్ప, నాగప్ప, మందాలప్ప, నాగన్న, సంజప్ప, భక్తులు పాల్గొన్నారు.

భోగేశ్వరాలయంలో హుండీ లెక్కింపు



హుండీని లెక్కిస్తున్న కమిటీ సభ్యులు

పామిడి : పట్టణంలోని భోగేశ్వర స్వామి దేవాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం హుండీని లెక్కించారు. 8 నెలలో రూ.83268లు హుండీ ద్వారా ఆదాయం చేకూరిందని ఆలయాల కార్యనిర్వహణాధికారి కిష్టయ్య తెలిపారు. అలాగే ఏడాది పాటు భోగేశ్వర, చెన్నకేశవస్వామి దేవాలయాల్లో శుభకార్యాలకు సప్లయర్స్‌ను అద్దెకివ్వడం కోసం బహిరంగ వేలంలో రూ.1.21 లక్షలకు కే శ్రీనివాసులు దక్కించుకున్నారన్నారు. గత ఏడాదికంటే ఈ ఏడాది రూ.29 వేలు అధిక ఆదాయం వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఆలయాల కమిటీ చైర్మన్ పీఆర్‌కే బాబు, ధర్మకర్త ఓబులేసు, అర్చకులు సోమశేఖర్‌శర్మ, రామేశ్వరశర్మ, భక్తులు మల్లికార్జున, ఓబులేసు, పవన్ పాల్గొన్నారు.

నేడు సంకల్ప సిద్ధి వేడుకలు

గుంతకల్లురూరల్: జిల్లా కేంద్రంలోని జడ్పీ కార్యాలయంలో గురువారం నిర్వహిస్తున్న సంకల్ప సిద్ధి వేడుకలకు ఎంపీటీసీలు, సర్పంచులు, జడ్పీటీసీ సభ్యులు హాజరు కావాలని ఎంపీడీఓ శంకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్విట్ ఇండియా ఉద్యమం ప్రారంభమయ్యి 75 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా ఈ కార్యక్రమంలో నిర్వహిస్తున్నారన్నారు.

రుణ లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు చేస్తున్న బ్యాంకు అధికారులు

గుంతకల్లురూరల్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో స్వయం ఉపాధి కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని 24 పంచాయతీలకు చెందిన 750 మంది అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యులు రావడంతో కార్యాలయ ప్రాంగణమంతా కిటకిటలాడింది. మండలానికి 247 యూనిట్లు వచ్చాయన్నారు. ఎస్సీలకు 37, ఎస్టీలకు 15, బీసీలకు 80, కాపులకు 80, మైనార్టీలకు 15 యునిట్లు వచ్చినట్లు తెలిపారు. ఎస్‌బీఐ, ఎస్‌బీహెచ్, కెనరా, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు, ఆంధ్ర బ్యాంకు విజయ బ్యాంకు అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

న్యాయవాదులు విధుల బహిష్కరణ

గుత్తి: బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం న్యాయవాదులు విధులను బహిష్కరించి స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయంలో ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2012కు ముందు ఉన్న కేసులను వెంటనే పరిష్కరించాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. దీంతో న్యాయమూర్తులకు, న్యాయవాదులకు పని ఒత్తిడి పెరుగుతుందన్నారు. హైకోర్టు ఉత్తర్వులను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. గురువారం కూడా విధులను బహిష్కరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జయరామి రెడ్డి, కార్యదర్శి రాంమోహన్, సీనియర్ న్యాయవాదులు ఇస్మాయిల్, విజయభాస్కర్, ఫకృబాష, రవి, మనోహర్‌బాబు, ధనుంజయ, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు జిప్సం పంపిణీ

గుత్తిరూరల్: మండలంలోని పెద్దొడ్డి గ్రామంలో బుధవారం వ్యవసాయ అధికారి వెంకటరాముడు, ఎంపీటీసీ సభ్యుడు గోవర్ధన్‌గౌడ్ రైతులకు ఉచితంగా జిప్సం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు ఉచితంగా జిప్సం అందజేస్తుందన్నారు. పట్టాదారు పాసుపుస్తకానికి ఆరు బస్తాలను బయోమెట్రిక్ ద్వారా పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీఈఓ లోకేశ్, రైతులు పెద్దిరెడ్డి యాదవ్, రమేశ్ గౌడ్, రంగస్వామి, తదితరులు పాల్గొన్నారు.



జిప్సంను పంపిణీ చేస్తున్న ఏఓ

అంత్యోదయ మిషన్‌కు మూడు పంచాయతీల ఎంపిక

పామిడి : మండలంలోని పాళ్యం, పాళ్యంతండా, ఎద్దులపల్లి పంచాయతీలు అంత్యోదయ మిషన్-2019కు ఎంపికైనట్లు ఈఓఆర్డీ చంద్రమోహన్ తెలిపారు. ఈ గ్రామాల్లో రాబోయే రోజుల్లో ప్రతి కుటుంబానికి నెలకు రూ.10వేల ఆదాయం చేకూరేలా ప్రణాళికలు రూపొందిస్తారన్నారు. అలాగే అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. మండలంలోని ఎద్దులపల్లి, పాళ్యం తండా, రామగిరి, నీలూరు పంచాయతీలు చెత్త నుంచి సంపద పొందేందుకు ఎంపికయ్యాయన్నారు. ఈ పంచాయతీల్లో చెత్తను, ఘన పదార్థాలను సేకరించి వర్మీ కంపోస్టు తయారీకి అవసరమైన షెడ్డు నిర్మాణాలకు రూ.5లక్షలు మంజూరయ్యాయన్నారు. వెంటనే షెడ్ల నిర్మాణాలను పూర్తిచేయాలని పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులకు ఆయన ఆదేశించారు.

నేడు ప్రైవేట్ విద్యాసంస్థల బంద్

గుత్తి: కర్నూలు జిల్లాలో ఓ ప్రైవేట్ విద్యా సంస్థ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డిపై విద్యార్థి సంఘాల నాయకులు అకారణంగా దాడి చేసినందుకు నిరసనగా గురువారం ప్రైవేట్ విద్యాసంస్థల బంద్ పాటిస్తున్నట్లు స్థానిక ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు షేక్షావలి, అల్లాబకాష్‌లు పేర్కొన్నారు. బుధవారం స్థానికంగా ఓ ప్రైవేట్ పాఠశాల ఆవరణలో అసోసియేషన్ సభ్యుల సమావేశం నిర్వహించి పాఠశాలల బంద్ పోస్టర్లను విడుదల చేశారు. విద్యా సంస్థల బంద్‌కు ప్రైవేట్ జూనియర్, డిగ్రీ కళాశాలతో పాటు ఇంజనీరింగ్ కళాశాలల కూడా మద్దతు ప్రకటించి బంద్ పాటిస్తున్నట్లు తెలిపారు. గుత్తి డివిజన్‌లోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం బంద్‌నుపాటించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఆంధ్రకేసరికి ఘన నివాళి


టంగుటూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ, అధికారులు

గుంతకల్లురూరల్: ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా బుధవారం స్థానిక తహసీల్దారు, ఎంపీడీఓ కార్యాలయాల్లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ రాయల రామయ్య మాట్లాడుతూ యువత టంగుటూరి అడుగుజాడలలో నడవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శంకర్, సూపరింటెండెంట్ మురళి, తహసీల్దారు హరిప్రసాద్, ఆర్ఐ కేశవరెడ్డి, వీఆర్వోలు భరత్, పవన్, గురుప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పామిడి: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఆంధ్రకేసరి టంగుటూరు ప్రకాశం పంతులు జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి తహసీల్దార్ రమణారెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. జూనియర్ అసిస్టెంట్ రాంబాబు, ఆర్ఐలు దివాకర్, శ్రీనివాసులు, వీఆర్వోలు అంజినేయులు, నిరంజన్‌రెడ్డి, వెంకటరాముడు, సునీత, రెవెన్యూ సిబ్బంది యేసయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ విత్తనాల కోసం బారులు తీరిన రైతులు

ఉరవకొండ: ప్రత్యామ్నాయ విత్తనం కోసం బుధవారం ఉదయం నుంచే విత్తన పంపిణీ కేంద్రాల వద్ద క్యూ కట్టారు. బుధవారం లత్తవరం, షేక్షానుపల్లి, రాచర్ల, కోనాపురం, పెన్నహోబిలం, ఉరవకొండ గ్రామాలకు ప్రత్యామ్నాయ విత్తనాలను పంపిణీ చేశారు. ఉలవల కోసం రైతులు ఎగబడుతున్నారు. కేటాయించిన 150 క్వింటాళ్ల స్టాక్ అయిపోవడంతో రైతులు ఆందోళనకు దిగారు.

వజ్రకరూరు: స్థానిక వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయ అధికారులు చాబాల, ధర్మపురి గ్రామాల రైతులకు ఉచితంగా ప్రత్యామ్నాయ విత్తనాలను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ మధుకర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు 30 మంది రైతులకు 800 కేజీల విత్తనాలను పంపిణీ చేశాం.

నాసిరకం మధ్యాహ్న భోజనంపై తల్లిదండ్రుల ధర్నా

ఉరవకొండ: పురుగుల అన్నం, నీళ్ల సాంబారును మధ్యాహ్న భోజన పథకంలో పిల్లలకు పెడుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు తహసీల్దారు కార్యాలయం వద్ద బుధవారం ఆందోళనకు దిగారు. స్థానిక కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నా చేట్టారు. ఉరవకొండలోని ఇందిరానగర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అందజేస్తున్న మధ్యాహ్న భోజనం అధ్వానంగా ఉందన్నారు. ఉడకని అన్నం, నీళ్ల సాంబార్‌ను వడ్డిస్తున్నారన్నారు. నాణ్యత లేని భోజనం పెట్టడం వలన తమ పిల్లలు వాంతులు, విరేచనాలతో పడిపోతున్నారన్నారు. ఏజెన్సీ నిర్వాహకులు తమ పిల్లలకు పంపించిన క్యారియర్లలోని ఆహారాన్ని తీసుకుని తింటున్నారని ఆరోపించారు. వెంటనే మధ్యాహ్న భోజన నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దారు అనిల్‌కుమార్, ఎంఈఓ ఈశ్వరయ్యలకు వినతి పత్రాలను అందజేశారు.

సీసీ కెమెరాలతో నేరాల అదుపు : ఎస్పీ

గుంతకల్లుటౌన్: సీసీ కెమెరాల ఏర్పాటు చేయడం వల్ల నేరాలు తగ్గుతాయని ఎస్పీ జీవీజీ అశోక్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద బుధవారం సాయంత్రం పైలెట్ ప్రాజెక్టు కింద సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్పీ జీవీజీ అశోక్ కుమార్, ఎమ్మెల్యే జితేంద్రగౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ 30 మంది చేసే పని ఒక సీసీ కెమెరా చేస్తుందన్నారు. సీసీ కెమెరాలతో నేరాలు, దొంగతనాలు, ట్రాఫిక్‌ను నియంత్రించవచ్చునన్నారు. వాణిజ్య సముదాయాలు, షాపింగ్ కాంప్లెక్సులు, బంగారు దుకాణాల వద్ద సీసీ కెరెరాలు ఏర్పాటు చేసుకుంటే ఎవరు వస్తున్నారో, వెళ్తున్నారో గమనించవచ్చునన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గుతకల్లులో నేరాల శాతం బాగా తగ్గిందన్నారు. పోలీసులు బాగా పని చేస్తున్నారని కితాబు ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనాథ్‌గౌడ్, టీడీపీపట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ ఈ చంద్రశేఖర్, డీఎస్పీ శ్రీధర్‌రావు,అర్బన్ సీఐ రాజ, వన్‌టౌన్ ఎస్ఐ నగేశ్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.


సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న ఎస్పీ, వైస్ చైర్మన్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే

శాస్త్రి పాఠశాలను సందర్శించిన ఎస్పీ

మోదినాబాద్‌లోని లాల్‌బహదూర్ శాస్త్రి ప్రాథమిక పాఠశాలను ఎస్పీ సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వెనకబడిన ప్రాంతంలో ప్రభుత్వ పాఠశాలను దత్తత తీసుకుని కార్పొరేట్ పాఠశాలలా తీర్చిదిద్దిన వన్‌టౌన్ ఎస్ఐ నగేశ్‌బాబును అభినందించారు. ఈ పాఠశాలలో మౌలిక వసతులు కల్పిస్తే కార్పొరేట్ పాఠశాలకు దీటుగా రాణిస్తారన్నారు. అనంతరం క్రమం తప్పకుండా పాఠశాలకు వస్తున్న ఐదుగురు విద్యార్థులకు ఎస్పీ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

ట్రాక్షన్ లైన్‌కు మరమ్మతులు

గుంతకల్లు: స్థానిక రైల్వే స్టేషన్‌లోని 4వ నెంబరు ప్లాట్‌ఫాం వద్ద పలుమార్లు విద్యుత్ వైరు తెగిపోవడంతో బుధవారం ఉదయం లైన్‌ను మార్చడానికి చర్యలు చేపట్టారు. విద్యుద్దీకరణకు వినియోగించిన వైరు నాసిగా ఉండటంతో తరచూ తెగిపోతోందని భావించిన ఎలక్ట్రిఫికేషన్ అధికారులు దాన్ని మార్చడానికి నిర్ణయం తీసుకున్నారు. ఈమేరకు బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ విద్యుత్ లైన్ నిర్మాణానికి వినియోగించే ప్రత్యేక రైలును తెచ్చి రిపేర్లు చేశారు. ఈ కారణంగా ఈ ప్లాట్‌ఫాంపై రావాల్సిన రైళ్లను పక్క ప్లాట్‌ఫారాలకు మళ్లించారు.

రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ డివిజన్ కార్యదర్శిగా మల్లికార్జున

గుంతకల్లు: రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ గుంతకల్లు రైల్వే డివిజన్ కార్యదర్శిగా పట్టణానికి చెందిన కే మల్లికార్జునను ఏకగ్రీవంగా ఎంపికచేశారు. స్థానిక సంఘ్ కార్యాలయంలో ఈ సంఘ డివిజన్ కార్యదర్శి ప్రభాకర్ ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంప్లాయీస్ సంఘ్ డివిజన్ కమిటీకి కొత్త కార్యవర్గాన్ని ఎంపికచేశారు. సంఘ్ డివిజన్ చైర్మన్‌గా కే శేషయ్య, వర్కింగ్ చైర్మన్‌గా ఎన్‌వీ ప్రకాశ్, వైస్ చైర్మన్లుగా జీఎన్ ప్రకాశ్‌బాబు, మహమ్మద్ అజీజ్, కార్యదర్శిగా కే మల్లికార్జున, సహాయ కార్యదర్శులుగా ఎస్ శేషుకుమార్, ఎన్ రజనీకాంత్, పీ రత్నకుమారి, బీ శ్రీనివాస్ నాయక్‌ను ఎంపికచేశారు. ఈ కార్యవర్గం రానున్న రెండేళ్లపాటు పదవీ బాధ్యతలను నిర్వహిస్తుందని ఈ సంఘ నాయకులు తెలియజేశారు.

అవకతవకలపై వీఆర్‌ఓను నిలదీసిన గ్రామస్థులు

బెళుగుప్ప : తమ భూములను ఇతరుల పేరిట పట్టాదారు పాసుపుస్తకాలు ఇచ్చి ఆన్‌లైన్‌లో నమోదు చేశారంటూ వీఆర్‌ఓను రైతులు నిలదీశారు. మండలంలోని గంగవరంకు చెందిన రైతుల భూములను ఇతరుల పేరున నమోదు చేసి అవకతవకలకు పాల్పడినట్లు వెలుగు చూడడంతో రైతులు ఆగ్రహించారు. స్థానిక వీఆర్‌ఓ గంగన్న ముడుపులు అందుకుని అక్రమాలకు పాల్పడ్డాడని, నీ ప్రమేయంతోనే జరిగిందంటూ గ్రామానికి వచ్చిన వీఆర్‌ఓను రెండు గంటలపాటు నిలదీశారు. గ్రామానికి చెందిన రైతు పోతన్న భూమి 80సర్వేనెంబర్‌లో 6ఎకరాల 70సెంట్లు, మరో రైతు నాగరాజుకు చెందిన సర్వే నెంబర్ 227లో 76సెంట్లు, 228సర్వేనెంబర్‌లో 34సెంట్లు, అదే గ్రామానికి చెందిన శ్రీకాంత్ అతని భార్య పేరున ఆన్‌లైన్‌లో నమోదైంది. ఈ భూములపై శ్రీకాంత్ అనే వ్యక్తి గ్రామీణ బ్యాంకు రూ. లక్షా 44వేలు అప్పులు తీసుకున్నట్లు వెలుగుచూసింది. పోతన్న, నాగరాజులు ఇన్‌పుట్ సబ్సిడీ, బీమా కోసం బ్యాంకుకు వెళ్లగా ఈ సర్వేనెంబర్‌లు మీపేరున లేవని, శ్రీకాంత్ అనే వ్యక్తి పేరున ఉన్నాయని బ్యాంకు అధికారులు స్టేట్‌మెంట్ ఇచ్చారు. ఇదిలా ఉండగా వీఆర్‌ఓ, ఆర్ఐ ఆన్‌లైన్‌లో నమోదుకు దరఖాస్తుపై సంతకాలు చేసిన తరువాతనే తహసీల్దార్ ఆ దరఖాస్తును పరిశీలించి వేలిముద్ర వేస్తేనే ఆన్‌లైన్‌లో నమోదు జరుగుతుంది. కానీ వీఆర్‌ఓ తమకు ఎలాంటి ప్రమేయం లేదని చెప్పడం గమనార్హం.

చవితిని ప్రశాంతంగా జరుపుకోండి : డీఎస్పీ


మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీధర్‌రావు

గుంతకల్లురూరల్: వినాయక చవితి వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో బుధవారం టీడీపీ, వైసీపీ, బీజేపీ, వివిధ సంఘాలతో శాంతి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి మున్సిపల్ చైర్‌పర్సన్ కోడెల అపర్ణ, వైస్‌చైర్మన్ శ్రీనాథ్‌గౌడ్, తహసీల్దారు హరిప్రసాద్, డీఎస్పీ శ్రీధర్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినాయక చవితి వేడుకలను చిన్నా పెద్దా తేడా లేకుండా, కులమతాలకు అతీతంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. పోలీసుల అనుమతితో వినాయకుడి విగ్రహాలను కొలువు దీర్చుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ఈసారి వినాయక నిమజ్జనం చేసేందుకు తగినంత నీరు జీబీసీలోనూ, హంద్రీనీవా కాల్వలలో లేదని ఎక్కడ నిమజ్జనం చేయాలంటూ శాంతి సమావేశానికి వచ్చిన ప్రజలు ప్రశ్నించారు. వినాయక ఘాట్ వద్దనే లైటింగ్ వేయించి జీబీసీలో ప్రత్యామ్నాయంగా నీటిని నిల్వ చేసి వేడుకలు జరుపుకునేలా చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ సమాధానమిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి, సీఐ రాజా, ఫైర్ ఆఫీసర్ యోగీశ్వర్‌రెడ్డి, నగర ఉత్సవసమితి సభ్యులు ఇల్లూరు లక్ష్మీనారాయణ, బండారు కృష్ణమూర్తి, సోమనాథ్, మంజుల వెంకటేష్, సోమశేఖర్, పురంధర్, దళిత మోర్చా మాజీ జిల్లా అధ్యక్షుడు రామాంజినేయులు, బీజేపీ నాయకుడు కట్టా శ్రీనివాస్, వైసీపీ నాయకుడు నూర్ నిజామి పాల్గొన్నారు.

గుత్తిరూరల్: పట్టణం, మండలంలోని గ్రామాల్లో వినాయక చవితి వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ చాంద్‌బాషా పేర్కొన్నారు. బుధవారం పోలీసుస్టేషన్ ఆవరణలో వినాయక ఉత్సవ కమిటీ సభ్యులతో ఆయన సమావేశం నిర్వహించారు. రోడ్లపై ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలిగేలా విగ్రహాలను ఏర్పాటు చేయరాదన్నారు. వినాయక నిమజ్జనాన్ని ప్రశాంతగా నిర్వహించుకోవాలన్నారు.

రైల్వే స్టేషన్‌కు డోర్ ఫ్రేం మెటల్ డిటెక్టర్

గుంతకల్లు: రైల్వే స్టేషన్‌లో భద్రతను పెంపొందింపజేయడానికి ఆ శాఖ గుంతకల్లు, తిరుపతి స్టేషన్లలో డోర్ ఫ్రేం మెటల్ డిటెక్టర్లను బిగించడానికి చర్యలను చేపట్టింది. తొలి విడతగా గుంతకల్లు స్టేషన్‌లో ఒకటి, తిరుపతిలో ఐదింటిని బిగించనున్నారు. బుధవారం ఉదయం గుంతకల్లులోని టికెట్ బుకింగ్ వద్ద డోర్ ఫ్రేం మెటల్ డిటెక్టర్‌ను దాన్ని తయారు చేసిన ఓమ్ని సెక్యూర్ సొల్యూషన్స్ సంస్థ ప్రతినిధి బిగించి, దాని పని విధానాన్ని ఆర్పీఎఫ్ అధికారులకు వివరించారు. సంస్థ మేనేజింగ్ డైరెక్టరు ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ రైల్వే స్టేషన్‌లోకి వచ్చే వ్యక్తులు దీనిగుండా వెళ్తే వారి వద్ద ఉన్న లోహాలను గుర్తిస్తుందన్నారు. వ్యక్తులను దీని నుంచి నడిచి చూపి పని విధానాన్ని డెమో ఇచ్చారు. ఆర్పీఎఫ్ ఎస్ఐ బీ కుమార్, డీఎస్ఓ ఆఫీసు కానిస్టేబుల్ విజయకుమార్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవనాలకు స్థల పరిశీలన

లేపాక్షి : మండల వ్యాప్తంగా ఐదు గ్రామాలకు అంగన్‌వాడీ నూతన భవనాలు మంజూరయ్యాయని వాటి నిర్మాణానికి తహసీల్దార్ ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో స్థల పరిశీలన చేశారు. మండల పరిధిలోని గలిబిపల్లి, కొత్తపల్లి, విభూతిపల్లి, కంచిసము ద్రం, మామిడిమాకులపల్లిలకు నూతన అంగనవాడీ భవనాలు మంజూరయ్యాయని, వీటి స్థల పరిశీలనకు ఎంపీడీఓ సులోచన, సర్వేయర్, ఐసీడీఎస్ సిబ్బందితో కలిసి తహసీల్దార్ బుధవారం గ్రామాల్లో పర్యటించారని ఎంఈఓనాగరాజునాయక్ తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ... అంగన్‌వాడీ భవనా నిర్మాణానికి స్థల పరిశీలన చేశామని త్వరలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

బాబోయ్.. ఈగలు..!

హుస్సేన్‌పురం, భూపసముద్రం వాసుల ఇక్కట్లు



గోడపై వాలిన ఈగలు



అన్నం ప్లేట్‌లో పడిన ఈగలు

చిలమత్తూరు : తినే తిండి, తాగేనీరు, టీ, కాఫీ... ఇలా అన్నింటిలోనూ ఈగలు గుంపులుగా దాడి చేస్తున్నాయి. వాటి వల్ల బాధ భరించలేకపోతున్నామని మండలంలోని హుస్సేన్‌పురం, భూపసముద్రం, దాదిరెడ్డిపల్లి, తండా తదితర గ్రామాల ప్రజల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆంధ్రా, కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో ఈ గ్రామాలున్నాయి. ఈ ప్రాంతంలో నాలుగు కోళ్ల ఫారాలు వెలిశాయి. కర్ణాటక రాష్ట్రంలోని బందార్లపల్లి, బుళ్లసముద్రం, కమటార్లపల్లిల్లో అవి ఉన్నాయి. వీరాపురం పంచాయతీ దాదిరెడ్డిపల్లిలో ఒక బ్రీడర్ కోళ్ల ఫాం వెలసింది. వీటి నుంచి భరించరాని దుర్వాసన రావడంతో ఆ పరిసర గ్రామాల ప్రజలు భరించలేకపోతున్నారు. ఇదిలా ఉండగా కోళ్లఫారాల వ్యర్థాలను ఆవాసాలుగా చేసుకున్న ఈగలు, వాటిలో లార్వాలు ఉత్పత్తి చేస్తున్నాయి. ఇలా విపరీతంగా వృద్ధి చెంది గుంపులు గుంపులుగా పరిసర ప్రాంత గ్రామాల్లోకి చొరబడుతున్నాయి. తమ దాడితో ఆ గ్రామాల్లోని ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. తినే తిండిలోనూ, తాగే కాఫీ, టీ, నీళ్లలో పడి తీవ్ర ఇబ్బందుల పాల్జేస్తున్నాయి. ఇలా ఈగలు పడుతుండటంతో ఏం చేయాలో పాలుపోక ఆయా గ్రామాల ప్రజలు తలలు పట్టుకుంటున్నారు. కోళ్లఫారాల యజమానులు ఈగల నివారణకు తగిన తీసుకోకపోవడంవల్ల ఈ సమస్య తలెత్తుతున్నట్లు వారు ఆరోపిస్తున్నారు. ఇలా ఈగలు వృద్ధి చెందకుండా కోళ్ల వ్యర్థ పదార్థాలపై సున్నం, బ్లీచింగ్ చల్లడంతో పాటు క్రమం తప్పకుండా క్రిమిసంహారక మందైన లార్విడ్‌ను నెలకోసారైనా స్ప్రే చేయాల్సి ఉంది. అయితే ఆ మందు స్ప్రే చేయడానికి సంవత్సరానికి రూ. లక్షకు పైగా ఖర్చు అవుతుంది. అందకే లార్విడ్ స్ప్రేచేయడానికి కోళ్లఫారాల యజమా నులు వెనకాడుతున్నట్లు సమాచారం. ఫలితంగా ఈగలు యథేచ్ఛగా వృద్ధి చెంది... జనావాసాలపై దాడి చేసి ప్రజలను ముప్పుతిప్పలు పెడుతున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు కోళ్లఫారాల యజమానులపై ఒత్తిడి తెచ్చి ఈగల నియంత్రణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కోళ్లఫారాలు యజమానులు మామాట వినడంలేదు

కోళ్లఫారాలు ఎక్కువభాగం కర్ణాటకలో ఉన్నాయి. గతంలో మేము బందార్లపల్లి, కమటమార్లపల్లి తదితర గ్రామాలకు వెళ్లి అక్కడ కోళ్లఫారాల యజమానులతో మాట్లాడాం. అయినప్పటికీ వారు స్పందించడం లేదు. ఈ విషయాన్ని డీఎంహెచ్ఓ దృష్టికి తీసుకెళ్తాం.

- శివన్న, మలేరియా సబ్ యూనిట్ అధికారి

కోళ్లఫారాల యజమానుల నిర్లక్ష్యం వల్లే...



కోళ్లఫారాల నిర్లక్ష్యం కారణంగానే ఈగల బెడద అధికమైంది. కోళ్లఫారాల నుంచి వెలువడే వ్యర్థాల్లో లార్వాలు ఉత్పత్తి అయి వాటి ద్వారా ఈగలు వృద్ధి చెందుతున్నాయి. వాటి నివారణకు కోళ్ల ఫారాల యజమానులు చర్యలు చేపట్టాలి.

- నరసింహారెడ్డి, హుస్సేన్‌పురం

ఈగల బాధ భరించలేకపోతున్నాం



ఈగల బాధ భరించలేకపోతున్నాం. తినే తిండి, తాగేనీళ్లలోనూ పడుతున్నాయి. అధికారులు జోక్యం చేసుకుని ఈ గల నియంత్రణకు కృషి చేయాలి. లేదంటే ఈగల బాధభరించలేక మేము గ్రామాలు ఖాళీ చేయాల్సి ఉంటుంది.

- ఆనందరెడ్డి, భూపసముద్రం

జనావాసాల మధ్య కోళ్లఫారాలా...?



నిబంధనలకు విరుద్ధంగా జనావాసాల మధ్య కోళ్లఫారాల ఏర్పాటుకు అనుమతి ఇవ్వడంతోనే సమస్య తలెత్తింది. కోళ్లఫారాల నుంచి వెలువడే దుర్గంధాన్ని భరించలేకపోతున్నాం. ఈగల వల్ల రోగాలు ప్రబలే ప్రమాదం ఉంది.

- రామచంద్రప్ప, హుస్సేన్‌పురం

చెత్త ప్రాసెసింగ్ యూనిట్‌ను

మరోచోట ఏర్పాటు చేయాలి

చిలమత్తూరు: స్థానిక వారపు సంత కాంప్లెక్స్ సమీపంలో గ్రామ పంచా యతీ వారు ఏర్పాటు చేయదలచిన ప్రాసెసింగ్ యూనిట్‌ను మరోచోటికి తర లించాలని ఆ పరిసరాలలో నివాసముంటున్న ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. చెత్తనుంచి సంపద తయారీ కార్యక్రమంలో భాగంగా స్థానిక గ్రామ పంచా యతీవారు ఆ యూనిట్‌ను ఏర్పాటు చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. ఆ పరిసరాల్లో సప్పలమ్మ దేవాలయం, ఉర్దూ పాఠశాల, మిత్ర వాటర్‌ప్లాంట్ ఉన్నాయన్నారు. జనావాసాల మధ్య చెత్త ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయడంపట్ల వారు అభ్యంతరం వ్యక్తంచేశారు. దీనివల్ల భవిష్యత్తులో సమస్యలు తలెత్తుతాయన్నారు. అందువల్ల చెత్త ప్రాసెసింగ్ యూనిట్‌ను మరోచోటికి తరలించాలని కోరారు.

'ఈఎస్ఐ ఆసుపత్రికి పక్కా భవనం నిర్మించాలి'

హిందూపురం రూరల్ : పట్టణంలోని ఈఎస్ఐ ఆసుపత్రికి 50పడకల పక్కా భవనం నిర్మించాలని కిరికెర సూపర్-ఏ ఏఐటీయూసీ, మజ్దూర్ యూనియన్ నాయకులు ఆదివారం ఓ ప్రకటనలో రీజనల్ డైరెక్టర్‌ను డిమాండ్ చేశారు. ఇటీవలి కాలంలో హిందూపురంతోపాటు కర్ణాటక రాష్ట్రం గౌరీబిదునూరులో పరిశ్రమ లు ఎక్కువగా ఏర్పాటయ్యాయన్నారు. దీం తో కార్మికులు, వారి కుటుంబ సభ్యుల సంఖ్య ఎక్కువైందన్నారు. ప్రస్తుత ఆసుపత్రి భవనం చిన్నదిగా ఉందని కావున 50పడకల పక్కా భవనంతోపాటు ముగ్గురేసి చొప్పున పురుష, మహిళా డాక్టర్లను నియమించాలని వారు కోరారు. అలాగే సభ్యులు పెరిగినందున ఆసుపత్రి స్టాఫ్‌ను పెంచాలన్నారు. ఈ ప్రాంతానికి దగ్గరగా ఉన్న బెంగళూరు ఈఎస్ఐ ఆసుపత్రినందు పూర్తిస్థాయి వైద్య పరీక్షలు అందేలా చూడాలని వారు కోరారు. ఉదయం 8గంటల నుంచి రాత్రి 8గంటల వరకు వైద్య సేవలను ఏర్పాటు చేయాలన్నారు. ఇతర ఆసుపత్రుల్లో చికిత్స పొందిన కార్మికులకు వెంటనే బిల్లులు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు హుస్సేన్, ఉపాధ్యక్షుడు నాగార్జునప్ప, గౌరవా. ధ్యక్షుడు శివప్ప తదితరులు ఉన్నారు.



సిమెంటు రోడ్డును తొలగించిన దృశ్యం

మలుగూరులో తాగునీటి సమస్య

రోడ్ల మరమ్మతులకు పైప్‌లైన్‌లు తొలగింపు వల్లే ఇబ్బందులు

హిందూపురం రూరల్ : మండలంలోని మలుగూరు పంచాయతీ గ్రామంలో గత ఆరు రోజుల నుంచి తాగునీటి సమస్య నెలకొందని గ్రామస్థులు వాపోతున్నారు. పగిలిన సిమెంటు రోడ్డులను తొలగించి వాటి స్థానంలో కొత్త సిమెంటు రోడ్డులను నిర్మించేందుకుగాను రోడ్లకు అటు ఇటుగా ఉన్న పైప్‌లైన్ తొలగించడంతో సమస్య ఉత్పన్నమైందని గ్రామ ప్రజలు తెలిపారు. రేపు, ఎల్లుండి వినాయక చవితి పండగ ఉందని రోజుల తరబడి తాగునీరు ఇవ్వకుండా కాలయాపన చేయడం మంచిదికాదన్నారు. ఇప్పటికైనా సర్పంచ్, గ్రామాధికారి స్పందించి వెంటనే తాగునీటి పైపులను పునరుద్ధరించి పండగపూటైనా తాగునీటిని అందించాలని మహిళలు డిమాండ్ చేస్తున్నారు.

లోకల్ గైడ్


localguide

హిందూపురం మార్కెట్‌లో కూరగాయల ధరలు



టమోట రూ.40, ఉల్లి 40, మిరప 60, బీరకాయ 40, ఉర్లగడ్డ 20, వంకాయ 30, బెండకాయ 40, క్యారెట్ 60, బీన్స్ 60, కోసు 30, మునగ 60, ముల్లంగి 40, బటాణి 120, సీమవంకాయ 60, నెమలికోసు 60, దొండకాయ 40, బీట్‌రూట్ 40, క్యాబేజీ 20, తెల్లగడ్డలు 100, కాకరకాయ 60, సొరకాయ 30, గోరు చిక్కుడు 40, చిక్కుడు 40, క్యాప్సికమ్ 80, అల్లం : 80

పట్టుగూళ్ల ధరలు



కనిష్ఠం (సీబీ) రూ.275.00, (బైవోల్టీన్) 302.00, గరిష్ఠం(సీబీ)395.00, (బైవోల్టీన్) 478.00, సగటు (సీబీ) 460.00, (బైవోల్టీన్) 393.00.

చింతపండు ధరలు

కర్పూలి 10 కిలోలు రూ.600-1575, ఫ్లవర్ రకం రూ.350-850, బోటురకం రూ.200-250

హిందూపురంలో సినిమాలు

శ్రీనివాస - నక్షత్రం -2, **విష్ణు** - ఫిదా,
గురునాథ్- జయ జానకి నాయక, **అమృత్** - దండుపాళ్యం,
లక్ష్మి - లై, **బాలాజీ** - గౌతమ్ నంద

ప్రకాశం పంతులు సేవలు చిరస్మరణీయం



చిలమత్తూరులో ప్రకాశం పంతులు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న దృశ్యం

చిలమత్తూరు : ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి అయిన ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు మన రాష్ట్రానికి ఎనలేని సేవలు చేశారని ఎంపీపీ నౌజియాబాను, జడ్పీటీసీ సభ్యుడు లక్ష్మీనారాయణ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం ప్రకాశం పంతులు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలులవేసి నివాళి అర్పించారు ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శివానందనాయక్, ఎంపీటీసీ సభ్యులు నాగమణి, కిష్టప్ప, చంద్రదండు రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్సార్‌అహ్మద్, నందీశ్, గాజుల కిష్టప్ప, మన్సూర్‌అహ్మద్, పెద్దసంఖ్యలో టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

లేపాక్షి : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం టంగుటూరి ప్రకాశం జయంతి వేడుకలను అధికారులు ఘనంగా నిర్వహించారు. ఆంధ్రకేసరి చిత్రపటానికి పూలమాలలువేసి ప్రత్యేక పూజలు నిర్వహించి నివాళి అర్పించారు. అన్ని ప్రభుత్వశాఖల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొనగా తహసీల్దార్ ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ టంగుటూరి ప్రకాశం ఆంధ్రరాష్ట్ర ప్రథమ ముఖ్యమంత్రి గా పనిచేశారని, స్వాతంత్ర్య పోరాటంలో ఆయన చూపిన ధైర్యసాహసాలకు ఆంధ్రకేసరి అనే బిరుదును కైవశం చేసుకున్నారన్నారు. ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సులోచన, ఎంఈఓ నాగరాజునాయక్, ఆర్ఐ మురళీ తదితరులు పాల్గొన్నారు.



లేపాక్షిలో టంగుటూరి చిత్రపటానికి పూజలు చేస్తున్న అధికారులు

నేటి నుంచి యథావిధిగా ప్రత్యామ్నాయ విత్తన పంపిణీ

పరిగి : ప్రభుత్వం రైతులకు వందశాతం సబ్సిడీతో అందిస్తున్న ప్రత్యామ్నాయ విత్తన పంపిణీ మంగళవారం కొంత గందరగోళంగా సాగింది. అయితే గురువారం నుంచి విత్తన ఉలవలను యథావిధిగా పంపిణీ చేయనున్నట్లు ఏఓ చైతన్య తెలిపారు. ఇప్పటికే 50క్వింటాళ్ల ప్రత్యామ్నాయ ఉలవలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని, రైతులు నిబంధనల ప్రకారం విత్తనాలు పొందవచ్చని ఆయన తెలిపారు. వేరుశనగ విత్తనం కొనుగోలు చేయని రైతులు, ఈ క్రాప్ బుకింగ్ నమోదు కాని రైతులకు విత్తన ఉలవలు పంపిణీ చేస్తామన్నారు.

నెలాఖరులోగా గృహనిర్మాణ

లబ్ధిదారుల ఎంపిక పూర్తి : డీఈ

చిలమత్తూరు : ఈ నెలాఖరులోగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తిచేసి కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపనున్నట్లు డీఈ తెలిపారు. హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం లబ్ధిదారుల ఎంపిక కోసం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ తీవ్ర కసరత్తు చేస్తున్నట్లు గృహనిర్మాణశాఖ డీఈ ఎంజీకే మూర్తి తెలిపారు. మండలంలోని మధుగిరేపల్లి సమీపం లో ఉన్న లక్ష్మీనారాయణ తోటలో ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. ఎన్టీఆర్ గృహనిర్మాణం పథకం కింద 2017-18సంవత్సరానికి సంబంధించి నియోజకవర్గానికి 2100ఇళ్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు. అందులో హిందూపురం రూరల్, లేపాక్షి, చిలమత్తూరు మండలాలకు 700 చొప్పున మంజూరు చేసినట్లు తెలిపారు. 2018-19సంవత్సరానికి సంబంధించి నియోజకవర్గానికి మరో 2100ఇళ్లు మంజూరైనట్లు తెలిపారు. ఇవికాక హిందూపురం మున్సిపాలిటీ పరిధిలో సొంత స్థలాలు ఉన్న వారికి 2017-18 సంవత్సరానికి సంబంధించి బీ ఎల్‌సీ స్కీం కింద 819ఇళ్లు మంజూరయ్యాయన్నారు. అదనంగా పట్టాలు ఇచ్చి ఇళ్లు మంజూరు చేయడానికి 2750ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు. గృహ రుణం రూ.1.50లక్షలు కాగా అందులో ఆంధ్రప్రదేశ్ గృహనిర్మాణ సంస్థ రూ.95వేలు, ఎన్ఆర్ఈజీఎస్ రూ.55వేలు చెల్లిస్తాయన్నారు. ఎంపిక ప్రక్రియను నిబంధనల మేరకు పారదర్శకంగా నిర్వహిస్తామన్నారు.

ద్విచక్రవాహనం ఢీకొని గాయపడ్డ జింక

లేపాక్షి : లేపాక్షి హిందూపురం ప్రధాన రహదారి చోళసముద్రం గ్రామం వద్ద ఉన్న హెరిటేజ్ డెయిరీవద్ద బుధవారం ద్విచక్ర వాహనం ఢీకొని జింక గాయపడింది. బాగేపల్లికి చెందిన ఆనంద్, తన ద్విచక్ర వాహనంలో హిందూపురం వెళ్తుండగా హెరిటేజ్ డెయిరీ వద్దకురాగానే చెట్ల పొదల్లోని జింక రోడ్డుకు అడ్డంగా వచ్చి, ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఆనంద్‌కు తీవ్రగాయాలుకాగా జింకకు కాలు విరిగింది. స్థానికులు 108సాయంతో ఆనంద్‌ను హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన జింకను స్థానిక పోలీసులకు అప్పగించగా పోలీసులు అటవీశాఖ సిబ్బందికి అప్పగించారు. వారు లేపాక్షి పశువైద్యశాలలో ప్రథమ చికిత్స నిర్వహించి అనంతరం పుట్టపర్తి ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు తెలిపారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

హిందూపురం టౌన్: రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలిగి సమాజంలో మంచి పేరు తెచ్చుకోవాలని రూరల్ సీఐ రాజగోపాల్‌నాయుడు సూచించారు. బుధవారం హిందూపురం రూరల్ సర్కిల్ పరిధిలోని 21మంది రౌడీషీటర్లతో సర్కిల్ కార్యాలయంవద్ద కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఉన్న రౌడీషీటర్లను మూడు విధాలుగా విభజించామన్నారు. మొదటి రకం వారిపై నిత్యం పర్యవేక్షణ ఉంటుందని, రెండో రకం వారిపై 15రోజులకోసారి నిఘా ఉంచుతామన్నారు. మిగిలిన వారిపై నిఘా ఉంచి వారి నడవడికపై పోలీసులు ఆరాతీస్తుంటారని తెలిపారు. చిలమత్తూరు ఎస్ఐ జమాల్‌బాషా, పరిగి ఎస్ఐ శరత్‌చంద్ర, ఏఎస్ఐలు పాల్గొన్నారు.

అంగనవాడీ ప్రీ స్కూల్‌లో ఎల్లో బ్లూమ్‌డే

హిందూపురం రూరల్ : హిందూపురం పట్టణంలోని సడ్లపల్లి ఎన్టీఆర్ కాలనీలో గల అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం ఏసీడీపీఓ శ్రీలత ఆధ్వర్యంలో ఎల్లో బ్లూమ్‌డే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఆనందమ్మ, కార్యకర్తలు లక్ష్మీదేవి, రాజేశ్వరీ, చిన్నారులు పాల్గొన్నారు.

'బ్రిడ్జి కింద నీటి సమస్య పరిష్కరించాలి'

హిందూపురం టౌన్ : రూ.లక్షలు వెచ్చించి నూతన ఆర్టీఓ కార్యాలయం ఎదు రుగా రైల్వే బ్రిడ్జి ఏర్పాటు చేశారు. అయితే సరైన ఏర్పాట్లు చేయక పోవడంతో కొద్దిపాటి వర్షానికే దాని కింద నీరు నిల్వ ఉంటున్నాయని రైల్వే జీఎం అరుణ్‌గుప్తాకు సీపీఎం నాయకులు వినతిని అందించారు. ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. రైల్వేస్టేషన్‌ను తనిఖీచేయడానికి బుధవారం వచ్చిన జీఎంను సీపీఎం నాయకులు కలిశారు. ఈ సందర్భంగా వారు జీఎంకు విన్నవిస్తూ... అక్కడ బ్రిడ్జి ఏర్పాటు చేశారని, అయితే వర్షం వచ్చినప్పుడు దాని కింది నీరు వెళ్లడానికి వీలు లేకపోవడంతో నిల్వ ఉంటున్నాయన్నారు. ఈ సమస్య పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని కోరారు. వినతిని అందించిన వారిలో సీపీఎం నాయకులు ప్రవీణ్‌కుమార్, రవీంద్రరెడ్డి, నారాయణప్ప, నారాయణస్వామి, లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

మట్టి గణపతులనే పూజిద్దాం





మట్టి వినాయక ప్రతిమలు అందజేస్తున్న డీఎస్పీ కరీముల్లా షరీఫ్, ప్రగతి పథం అసోసియేషన్ ఆధ్వర్యంలో...

హిందూపురం టౌన్: రసాయనాలతో తయారుచేసిన వినాయక ప్రతిమలకంటే మట్టి ప్రతిమలే ఎంతో మేలని డీఎస్పీ కరీముల్లాషరీఫ్ అన్నారు. బుధవారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో మట్టి వినాయకులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భాద్రపదమాసంలో వినాయక చవితి పర్వదినాన్ని జరుపుకోవడం అభినందనీయమని, అయితే మట్టి విగ్రహాలనే ప్రతి ఒక్కరూ ప్రతిష్ఠిస్తే బాగుంటుందని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ మధుభూషణ్, ఎస్‌లు పాల్గొన్నారు. అలాగే వినాయక చవితిని మట్టితో తయారుచేసిన విగ్రహాలనే పూజిద్దామని నెహ్రూ యువకేంద్రం ప్రగతి ప్రథం యూత్ అసోసియేషన్ నాయకులు కోరారు. యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం పాఠశాలలో మట్టి గణపతులను అందజేశా రు. ప్రతి ఒక్కరూ మట్టి గణపతులను ప్రతిష్ఠించేలా విద్యార్థులు వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కిషోర్, బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

సొంత ఊరిపై అభిమానం....

విద్యార్థులకు సహాయం

హిందూపురం అర్బన్: సొంత ఊరిపై ఉన్న మమకారంతో... ఉద్యోగరీత్యా దుబాయ్‌లో స్థిరపడిన వరలక్ష్మి పట్టణ పరిధిలోని సింగిరెడ్డిపల్లి పాఠశాల విద్యార్థులకు బుధవారం అట్లాలు, స్కూల్ బ్యాగ్‌లను వితరణగా అందించారు. అనాథలకు దుప్పట్లు అందించారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్ళిన ఉపాధ్యాయుడు సుబ్రహ్మణ్యంను ఘనంగా సన్మానించారు. దాత వరలక్ష్మి, హెచ్ఎం నాగభూషణం, ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు.

మరుగుదొడ్ల పనుల పరిశీలన

పరిగి : మండలంలోని కొడిగెనహళ్లిలో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణ పనులను బుధవారం తహసీల్దార్ సుబ్బారెడ్డి, ఎంపీడీఓ బాలమునయ్య, ఈఓఆర్‌డీ గురుప్రసాద్ తదితరులు పరిశీలించారు. ప్రతి ఇంటా వ్యక్తిగత మరుగుదొడ్డు నిర్మించుకుని స్వచ్ఛ గ్రామంగా మార్చాలన్నారు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేయడంతోపాటు సాంకేతిక నిపుణులు సహాయపడతారన్నారు.

సంరక్షణకేంద్రాలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

జువైనల్ డీపీఓ



ప్రేమ్ సదన్ సభ్యులతో చర్చిస్తున్న జువైనల్ అధికారులు

హిందూపురం టౌన్: జిల్లాలోని బాలల సంరక్షణ కేంద్రాలు ఏర్పాటుకు రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలని జిల్లా జువైనల్ డీపీఓ రామ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఆయన బుధవారం పట్టణంలోని ప్రేమ్‌సదన్ బాలల సంరక్షణ కేంద్రం, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంరక్షణ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ జిల్లాలో బాలల సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసుకోవాలంటే తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా సంరక్షణ కేంద్రాల్లో బాలలకు అందుతున్న ఆహారం, వసతిపై ఆరాతీశారు. రికార్డులను పరిశీలించారు. ఎవరైనా సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటే జువెనైల్ జస్టిస్‌యాక్ట్ సెక్షన్ 41 ప్రకారం ఈనెల 25లోగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. అలా చేయకపోతే సెక్షన్ 42ప్రకారం రూ.లక్ష వరకు జరిమానా విధిస్తారన్నారు. అంతే కాకుండా స్త్రీ శిశుసంక్షేమశాఖలో అనుమతి తీసుకున్న తరువాత రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.

ఈ కార్యక్రమంలో అధికారులు ప్రేమ్ సదన్ సభ్యులు వెంకటేశ్వర్లు, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అయితే ప్రేమ్‌సదన్‌లో అందుతున్న వసతులపై వారు సంతృప్తి వ్యక్తం చేశారు.

చిలమత్తూరులో రుణమేళా

చిలమత్తూరు : ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపుకార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాల మంజూరుకు లబ్ధిదారుల ఎంపిక కోసం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో బుధవారం ఇంటర్వ్యూలు జరిగాయి. మండలంలోని బూదిలి, కోడూరు, కొడికొండ ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్‌ల పరిధిలోని అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. మొత్తం 341అభ్యర్థులు ఆన్‌లైన్‌లో నమోదుచేసుకోగా 181మంది హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నౌజియాబాను, జెడ్పీటీసీ లక్ష్మీనారాయణరెడ్డి, ఎంపీడీఓ శివానందనాయక్, బ్యాంక్ మేనేజర్లు, లక్ష్మీకిరణ్, నాగరాజు జయశంకర్ తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం రూరల్‌లో...

హిందూపురం మండలపరిషత్ కార్యాలయంలో బుధవారం గ్రామీణ మండలంలోని పంచాయతీల పరిధిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు, కార్పొరేషన్ ద్వారా ఆయా బ్యాంకు అధికారుల ఆధ్వర్యంలో ముఖాముఖి ఇంటర్వ్యూల ద్వారా రుణమేళా నిర్వహించారు. 2017-18కుగాను ఆయా కార్పొరేషన్‌ల ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులను ఇంటర్వ్యూలకు పిలిచి అర్హులైన అభ్యర్థులను ముఖాముఖి ద్వారా ఎంపిక చేసి రుణం మంజూరు చేశామని ఎంపీడీఓ శ్రీలక్ష్మి తెలిపారు. ఈ ఇంటర్వ్యూల ద్వారా మండలంలో అన్ని పంచాయతీలకుగాను మైనార్టీలకు 24, బీసీలకు 116, ఎస్సీలకు 68, ఎస్టీలకు 3, కాపులకు 12 రుణాలను మంజూరు చేయడం జరిగిందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు సుబ్రహ్మమ్మ, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, జడ్పీటీసీ సభ్యులు పాల్గొన్నట్లు ఆమె తెలిపారు.

మూతపడ్డ హెల్ప్ డెస్క్



హెల్ప్‌డెస్క్‌ను మూసేసిన దృశ్యం

హిందూపురం టౌన్ : ప్రజలు కార్యాల యం చుట్టూ తిరగనీయకుండా రెవెన్యూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిం చేందుకు స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద హెల్ప్‌డెస్క్‌ను 2014సెప్టెంబర్ 13న ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ చేతుల మీదుగా ప్రారంభించా. కొంతకాలం ఇక్కడే ఒక అధికారి ఉంటూ సమస్యలపై వచ్చిన వారికి తగిన సలహాలు, సూచనలు అందజే సేవారు. అయితే ఇటీవల రెవెన్యూ అధికా రులకు ప్రజాసాధికారిక సర్వే, రైతుసేవలో రెవెన్యూశాఖ, ఈక్రాప్ బుకింగ్ ఇలా పనిభారం అధికమై హెల్ప్‌డెస్క్‌ను మూసివేశారు. దీనిపై తహసీల్దార్ విశ్వనాథ్‌ను వివరణ కోరగా ... హెల్ప్‌డెస్క్ కోసం వీఆర్‌ఓను నియమించాము కానీ... ప్రభుత్వం ఒకదానిపై ఒకటి కార్యక్రమాలు ప్రారంభిస్తుండటంతో సిబ్బంది కొరతతో మూసివేశామన్నారు. అయితే కార్యాలయంలోనే వచ్చిన వారికి సలహాలు అందజేస్తున్నామని తెలిపారు.

ఆంధ్రజ్యోతి
4
కదిరి
గురువారం 24, ఆగస్టు 2017
● కదిరి ● తలుపుల ● తనకల్లు ● నల్లచెరువు ● నంబులపూలకుంట ● గాండ్లపెంట

డాక్టర్ దురుసుగా ప్రవర్తించాడని ఆరోపణ

నల్లచెరువు : మండలంలోని స్థానిక నివాసం ఉండే బీ అంజనేయులు చదువుకొని ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నాడు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కోసం స్థానిక ప్రాథమిక వైద్యశాలకు బుధవారం వెళ్లి అక్కడ పనిచేస్తున్న డాక్టర్ గణేనాయక్‌ను సంప్రదించగా... ఆయన నీవు ఎవరంటూ తనపై దురుసుగా ప్రవర్తించారని ఆంజనేయులు తెలిపాడు. ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, టీసీ అన్నీ చూపించినా డాక్టర్ తనపై దురుసుగా ప్రవర్తించి, ఆసుపత్రి నుంచి బయటకు గెంటి వేశారన్నారు. ఈ విషయంపై ఆంధ్రజ్యోతి డాక్టర్ గణేనాయక్‌ను వివరణ కోరగా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కోసం కదిరి ప్రభుత్వ వైద్యశాలకు పొమ్మన్నాను కానీ... అతడి పై దురుసుగా ప్రవర్తించలేదన్నారు.

వర్షాభావంతో నష్టపోయిన రైతు

- అదును దాటిపోవడంతో వేరుశనగ విత్తనాలు అమ్ముకుంటున్న వైనం
- సగం ధర కూడా రావడం లేదని ఆవేదన



దుకాణంలో విత్తనాలు విక్రయిస్తున్న దృశ్యం

తలుపుల : మండలంలోని రైతన్నలు ప్రస్తుత ఖరీఫ్‌లో వర్షాభావం వల్ల సాగుచేయలేక ఇళ్లలో నిల్వ ఉంచుకున్న వేరుశనగ విత్తనాలను మండీలు, వాణిజ్య దుకాణాల్లో అయిన కాడికి అమ్ముకుంటున్నారు. జూన్ నెలలో వేరుశనగ కాయలు అత్యధిక ధరలకు కొనుగోలు చేసి, విత్తనాలుగా మార్చారు. కిలో విత్తనాలకు రూ. 100 వరకు వెచ్చించారు. ఖరీఫ్‌లో వేరుశనగ సాగుకు అనుకూలమైన పునర్వసు, పుష్యమి, ఆశ్లేషా కార్తెల్లో వర్షాలు పడలేదు. మగకార్తెలో కొద్దిపాటిగా కురిశాయి. మండల వ్యాప్తంగా 25400 ఎకరాల్లో సాగు చేయాల్సి ఉండగా..గత సంవత్సరం 9430 ఎకరాల్లో సాగు అయినట్లు రెవెన్యూ రికార్డులు తెలుపుతున్నాయి. ఈ యేడు అలాగే ప్రభుత్వం అందించిన సబ్సిడీ కాయలను, మనవిత్తనం ద్వారా మొత్తం 4437 మంది రైతులు 17075 బ్యాగుల కాయలు కొనుగోలు చేశారు. కానీ తీవ్ర వర్షాభావం వల్ల చాలామంది సాగు చేయలేక పోయారు. కేవలం 5688 ఎకరాల్లో వేరుశనగ సాగుచేసినట్లు రికార్డులు తెలుపుతున్నాయి. అయితే ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ప్రత్యామ్నాయ విత్తనాల వైపు రైతులు మొగ్గుచూపుతున్నారు. గతంలో ఇళ్లలోని నగలు, పశువులను అమ్మి అధిక ధరలకు వేరుశనగ కాయలు కొనుగోలు చేసి, విధిలేని పరిస్థితుల్లో ప్రస్తుతం విత్తనాలను సగం ధరలకు విక్రయిస్తున్నామని రైతులు కంటతడి పెడుతున్నారు. ప్రభుత్వం స్పందించి తమ వద్ద ఉన్న విత్తనాలను తాము కొనుగోలు చేసిన ధరలకే తిరిగి కొనుగోలు చేస్తే రైతులను ఆదుకున్నట్లు ఉంటుందని పలువురు రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

సగం లెక్క కూడా రాలేదు



నాకు 20 ఎకరాలు భూమి ఉంది. అయితే శక్తి చాలక ఐదు ఎకరాల్లో సాగు చేయడానికి ధైర్యం చేశా. ప్రభుత్వం అందించిన సబ్సిడీ వేరుశనగ కాయలు ఎనిమిది బ్యాగులను కొనుగోలు చేయడానికి రూ. 12 వేలు, వాటిని విత్తనాలు చేయడానికి రూ. 2,500 ఖర్చు అయింది. భూమి దుక్కి చేయడానికి మరో రూ. 15 వేలు వెచ్చించా. అయితే వాన దేవుడు కరుణించక పోవడంతో ఇంటిలోనే విత్తనాలు నిల్వ ఉంచుకున్నాం. వాటిని చూడలేక తలుపులకు తీసుకెళ్ళి అంగట్లో అమ్మితే సగం లెక్క కూడా రాలేదు.

- పీ నాగిరెడ్డి, ఎం రెడ్డివారిపల్లి

విత్తనాలు అమ్ముకున్నాం



మా ఊరిలో ఈ సారి అందరూ వేరు శనగవేస్తుంటే నేను అప్పులు చేసి ఆరెకరాల్లో సాగు చేయడానికి సిద్ధమయ్యాను. ప్రభుత్వం అందించిన కాయలు కొనుగోలు చేశాను. భూమి దున్ని, దుక్కిచేయడానికి, విత్తనాలకు రూ. 40 వేలు ఖర్చు వచ్చింది. వాన రాకపోవడంతో మా ఊర్లో అందరూ కలసి విత్తనాలను కదిరికి తీసుకెళ్ళి అమ్ముకున్నాం. విత్తన కాయల ధర ఎక్కువ పడింది. కిలో రూ. 60తో అమ్ముకున్నా. నాకు రూ. 20 వేలు అప్పులు మిగిలాయి. ఎలా తీర్చుకోవాలో మరి.

- ఎస్ రెడ్డిబాషా , వేపమానిపేట

లోకల్ గైడ్

localguide

కదిరి మార్కెట్‌లో కూరగాయల ధరలు



వంకాయ కిలో రూ.20, టమోటా 50, బెండ 30, బీరకాయ 30, కాకరకాయ 40, క్యారెట్ 60, బీట్‌రూట్ 60, బీన్స్ 65, ముల్లంగి 40, పచ్చిమిర్చి 30, ఉర్లగడ్డ 22, కోసుగడ్డ 30, మునగ 50, క్యాప్సికమ్ 60, ఉల్లిపాయలు 40

కదిరి సినిమాలు

సంగం - లై, రాధిక - నేనే రాజు నేనే మంత్రి
వేమల - ఆనందో బ్రహ్మ, మౌనిక - జయ జానకి నాయక

ఎమ్మెల్యే డైరీ

కదిరి టౌన్ : ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా గురువారం నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండరు.

ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు : ఆర్డీఓ

కదిరిటౌన్ : జిల్లాలో 57 ఇసుక రీచ్‌లను గుర్తించామని, వాటి నుంచి ఇసుకను పక్క జిల్లాలకు అక్రమంగా తరలిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ వెంకటేశు పేర్కొన్నారు. కదిరి డివిజన్‌లోని ముదిగుబ్బ, తనకల్లు, తలుపుల, కదిరి , ముత్యాలచెరువు, విరలరాయునిచెరువు, నల్లమాడ, ఓబుళదేవరచెరువులో ఇసుక రీచ్‌లు ఉన్నట్లు గుర్తించామన్నారు. ఇసుక కావాల్సిన వారు వాహనాల ద్వారా తరలించుకోవచ్చన్నారు. అయితే పక్క జిల్లాలకు విక్రయిస్తే వారిపై చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇసుక రీచ్ 55 కిలోమీటర్ల దూరం లోపు ఉన్నట్లయితే ట్రాక్టర్‌కు మూడు క్యూ.మీ.కు రూ. 2 వేలు, టిప్పర్ అయితే రూ. 4 వేలు ప్రభుత్వానికి చెల్లించాలన్నారు. 55 కిలోమీటర్లు దాటితే రూ. 36 లు అదనంగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఇసుక తరలింపుపై పోలీసు, మైనింగ్, పంచాయతీ అధికారులకు బాధ్యత ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ, డీఏఓ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

'ఆలయాన్ని కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలి'

నంబులపూలకుంట : దళితుల కాలనీలో దేవాలయాన్ని కూల్చి , భూమిని కబ్జా చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకొనేంత వరకు పోరాటం ఆగదని, కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా నాయకులు నల్లప్ప, రైతు సంఘం మండల నాయకులు నాగిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఎర్రవంకలవారిపల్లికి చెందిన దళితులు తహసీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన రిలే దీక్ష బుధవారం మూడో రోజుకు చేరుకుంది. ఎంతో కాలంగా గ్రామానికి సమీపంలోనే ఆలయం ఏర్పాటు చేసుకుని, పూజలు నిర్వహించేవారమన్నారు. దౌర్జన్యంగా దేవాలయాన్ని కూల్చివేసి కబ్జాచేశారని ఆరోపించారు. కాలనీ వాసులు చనిపోతే ఖననం చేయడానికి శ్మశానం లేదన్నారు. ఈ కార్యక్రమంలో దళితులు అనీల్‌కుమార్, రామాంజులు, రమణయ్య, గంగులమ్మ, గంగోజమ్మ, వెంకటలక్ష్మమ్మ, నాగరాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ చైతన్య పాఠశాలలో ఎన్‌సీఎస్‌టీసీ బస్సు



పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎన్‌సీఎస్‌టీసీ బస్సు

తనకల్లు : మండల పరిధిలోని కొక్కంటిక్రాస్‌లో ఉన్న శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడి యం పాఠశాలలో విద్యార్థులకు సైన్స్ పట్ల అవగాహన కల్పించడానికి సైన్స్ బస్‌ను ఏర్పాటు చేశారు. ఎన్‌సీఎస్‌టీసీ ఢిల్లీ వారి సహకారంతో సైన్స్ ఆన్ విల్స్ మొబైల్స్ ఎగ్జిబిషన్ బస్‌ను కొక్కంటి క్రాస్‌లో ఉన్న పాఠశాలకు తీసుకొచ్చినట్లు రూరల్ అగ్రికల్చర్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు మదన్‌మోహన్ తెలిపారు. అలాగే పాఠశాలలో విద్యార్థులకు 'నీరు - చెట్టు' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ర్యాడ్స్ ప్రతినిధి కళ్యాణ్, మేనేజర్ బాబా, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పవన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చౌడేశ్వరి సమాఖ్య ఆధ్వర్యంలో అవెన్యూ ప్లాంటేషన్

తనకల్లు : స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న పెట్రోల్ బంక్ నుంచి కస్తూర్బా విద్యాలయం వరకు రోడ్డుకు ఇరు వైపులా బుధవారం చౌడేశ్వరి మండల సమాఖ్య ఆధ్వర్యంలో అవెన్యూ ప్లాంటేషన్ కార్యక్రమం చేపట్టారు. నాటిన ప్రతి మొక్కను కాపాడటానికి చౌడేశ్వరి సమాఖ్య కృషి చేస్తుందని ఏపీఎం సూర్యనారాయణ తెలిపారు. మొక్కలు నాటే కార్యక్రమంలో ఏఎస్ఐ బాలరాజు, మండల సమాఖ్యకు చెందిన వరప్రసాద్, చంద్రారెడ్డి, ఏసీ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేడు రైతు సేవలో రెవెన్యూశాఖ

నల్లచెరువు : మండలంలోని తవళంమర్రి గ్రామ పంచాయతీలో సర్పంచు జింకా శివయ్య అధ్యక్షతన రైతు సేవలో రెవెన్యూశాఖ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఏ కళావతి పేర్కొన్నారు. భూ సమస్యలు ఉంటే అర్జీలు ఇవ్వాలన్నారు.

ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేసిన ఎంఈఓ

గాండ్లపెంట : మండలంలోని రెక్కమాను, పచ్చార్లమేకలతండా, గాజులవారిపల్లితండా, నల్లగుట్లతండాలోని ప్రాథమిక పాఠశాలలను బుధవారం ఎంఈఓ బీ క్రిష్ణానాయక్ తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు శాతం, మధ్యాహ్న భోజన బిల్లులు, రికార్డులను పరిశీలించారు. మెనూ ప్రకారం మధ్యాహ్నం భోజనం అందించాలన్నారు.

హెచ్ఎంపై నల్లచెరువు ఎంఈఓ ఆగ్రహం

నల్లచెరువు : మండలంలోని అల్లుగుండు ప్రాథమిక పాఠశాలను బుధవారం ఎంఈఓ తిరుపాల్‌నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించగా మధ్యాహ్న భోజన ఏజన్సీ వివరాలు 3 వ తేది నుంచి నమోదు చేయక పోవడంపై ప్రధానోపాధ్యాయుడు చంద్రమౌళిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటివి పునరావృతమైతే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఎంఈఓ విద్యార్థులను ప్రశ్నలు వేశారు. వారు సరైన సమాధానాలు చెప్పక పోవడం పై అసహనం వ్యక్తం చేశారు. అనంతరం రాట్నాలపల్లి ప్రాథమిక పాఠశాల నిర్మాణం పనులు పరిశీలించారు.

మూర్తిపల్లిలో ప్రబలుతున్న డెంగీ



జ్వరంతో బాధపడుతున్న జయమ్మ, రామన్న, కొండమ్మ

కదిరిటౌన్ : కదిరి ప్రాంతంలో ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలి ప్రజలను వణికిస్తున్నాయి. చాలా మంది విషజ్వరాలతో అల్లాడి పోతున్నారు. అలాగే కదిరికి కూత వేటుదూరంలో ఉన్న మూర్తిపల్లిలో ఆరుగురికి డెంగీ జ్వరాలు ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. వీరు కదిరి ప్రభుత్వాసుపత్రిలో చేరి చికిత్సలు పొందారు. వైద్యులు రక్తనమూనాలు సేకరించి డెంగీ జ్వరంగా నిర్ధారించారు. వారు బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రి, బెంగళూరు, తిరుపతిలో చికిత్సలు పొందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అలాగే పాముల గుట్ట, పిల్లవంకకాలనీ, మున్సిపల్ పరిధిలోని ఆర్ఎస్ రోడ్డు, కుటాగుళ్ళ, కదిరి క్వార్టర్స్‌లో చిన్నారులు సైతం జ్వరాలతో బాధపడుతున్నారు. వైద్యాధి కారులు, పాలకులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్కువగా చిన్నారులు డెంగీతో బాధపడుతున్నట్లు సమాచారం. పాముల‌గుట్ట వీధిలో రోడ్డు పొడవునా మురుగునీరు ప్రవహించడం, మూర్తిపల్లిలో శానిటేషన్ పర్కర్లు లేక పోవడంతో అపరిశుభ్రత పేరుకుపోయి దోమలు పెరిగాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైద్య శిబిరాలు ఏర్పాటుచేయాలని కోరుతున్నారు.

తెలుగుభాష, సంస్కృతిపై సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ ఖాసింఖాన్

తనకల్లు : అనంతమహిళా మండలి ఆధ్వర్యంలో 'తెలుగు భాష, సంస్కృతి వైభవం పరిరక్షణ' అనే అంశంపై మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. అన ంతమహిళా మండలి అధ్యక్షురాలు తోట సరోజమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా ఎంఈఓ ఖాసింఖాన్ హాజరై ప్రసంగించారు. ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాల్, వక్తలు విజయ కుమార్, శ్రీనివాసులనాయక్, రిసోర్స్ పర్సన్ డాక్టర్ పీఎస్ రెడ్డి, కోఆర్డినేటర్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

'కరువు రైతుకు రూ. 5 వేలు పింఛన్ ఇవ్వాలి'

తనకల్లు : కరువు రక్కసి చేతుల్లో బాధలు పడుతున్న అనంత రైతులను గుర్తించి నెలకు రూ. 5 వేలు చొప్పించి పింఛన్ మంజూరు చేయాలని రైతు సంఘం నాయకుడు సుబ్బిరెడ్డి పేర్కొన్నారు. తనకల్లు సమీపంలోని అంగన్‌వాడీ కేంద్ర మైదానంలో ఆయన బుధవారం మండలంలోని రైతులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బిరెడ్డి మాట్లాడుతూ ఈ నెల 31వ తేదీన రైతు సమస్యలపై తహసీల్దార్ కార్యాలయాల ముట్టడి చేపడతామన్నారు. రైతులు అందరూ స్వచ్ఛందంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్ర మంలో రైతు సంఘం నాయకులు రమణ, శివన్న, వెంకటరమణ, కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ పారేసు తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలచెరువులోనే వినాయక నిమజ్జనం



నీరు లేక ఎండిపోయిన కరావుల కుంటను పరిశీలిస్తున్న అధికారులు

కదిరిరూరల్ : పట్టణంలో ప్రతిష్ఠించే గణనాథుని ప్రతిమలను కదిరిరూరల్ మండలంలోని ముత్యాలచెరువులోనే నిమజ్జనం చేయాలని అధికారులు నిర్ణయించారు. ఇందుకోసం బుధవారం కదిరి తహసీల్దార్ పీవీ రమణ , మున్సిపల్ కమిషనర్ భవానీ ప్రసాద్, మున్సిపల్ ఇంజనీర్ వెంకటరమణ, టీడీపీ నాయకులు బాబ్‌జాన్ తదితరుల బృందం కదిరి సమీపంలోని కరావుల కుంటను పరిశీలించారు. అయితే అక్కడ తగినన్ని నీళ్లు లేక పోవడంతో ముత్యాలచెరువు వద్దకు వెళ్లారు. అక్కడ కూడా నీరు కొంతే ఉన్నా విగ్రహాలు మునగడానికి సరిపోతుందని నిర్ణయించారు. ఇదే విషయాన్ని కదిరి ఆర్డీఓ , డీఎస్పీల దృష్టికి తీసుకెళ్లి తదుపరి నిర్ణయాన్ని వినాయక విగ్రహాల నిర్వాహకులకు తెలుపుతామన్నారు. వినాయక నిమజ్జనం తలపెట్టిన 29 వ తేదీ లోగా భారీ వర్షాలు కురిసి చెరువు నిండితే పునరాలోచిస్తామని వారు తెలిపారు.

పండగను సంతోషంగా జరుపుకుందాం : డీఎస్పీ

కదిరిటౌన్ : వినాయక చవితి పండుగను సంతోషంగా జరుపుకొందామని ఇన్‌చార్జి డీఎస్పీ వెంకటరమణ సూచించారు. అలాగే కదిరి పట్టణం, మండలాల్లో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసుకొనే వారు తప్పని సరిగా స్థానిక పోలీసుస్టేషన్‌లో అనుమతులు పొందాలని పేర్కొన్నారు. బుధవారం నిజాంవలి కాలనీలో శాంతికమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి డీఎస్పీతో పాటు సీఐ శ్రీనివాసులు హాజరై మాట్లాడారు. వినాయక విగ్రహాలకు తప్పని సరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. వినాయక చవితి పండుగను అందరూ కలసి సంతోషంగా జరుపుకుందామన్నారు. ఈ నెల 29 వ తేదీన నిమజ్జన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిమజ్జనానికి విగ్రహాలను తరలించేందుకు కమిటీలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విగ్రహాలను మసీదులు, చర్చిలు ఉన్న ప్రాంతాల్లో ఎక్కువ సేపు శబ్ధాలు చేయకూడదన్నారు. నిమజ్జన కార్యక్రమంలో పాల్గొనే వారు మద్యం తాగరాదన్నారు. విగ్రహాలు తరలించే వాహనాల్లో పిల్లలను వెంట తీసుకువెళ్ల కూడదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు మధుసూదన్ రెడ్డి, గోపాలుడు పాల్గొన్నారు.

మరుగుదొడ్లను వెంటనే నిర్మించుకోండి

తనకల్లు : వ్యక్తిగత మరుగుదొడ్లను వెంటనే నిర్మించుకోవాలని తహసీల్దార్ లక్ష్మేనాయక్, ఎంపీడీఓ రమేష్‌బాబు, ఈఓఆర్‌డీ ఆదినారాయణ లబ్ధిదారులను కోరారు. మండలంలోని గేమేనాయక్‌తండా, బాల సముద్రం గ్రామ పంచాయతీల్లో బుధవారం వారు పర్యటించారు. ప్రభుత్వం విధించిన లక్ష్యాలను పూర్తి చేయడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తి చేసుకుంటే , బిల్లులు వెంటనే మంజూరు చేస్తామని తెలిపారు.

తలుపులలో..

మండలంలోని గుండువారిపల్లి, పెద్దన్నవారిపల్లి, ఓబుళరెడ్డిపల్లి, బండ్లపల్లి, బట్రేపల్లి, కుర్లి గ్రామ పంచాయతీల్లో మంజూరైన వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మా ణాల కోసం ప్రత్యేక సిబ్బందిని నియమించినట్లు ఎంపీడీఓ కే పోలప్ప తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ రామ క్రిష్ణ, ఏపీఓ పీవీ మోహన్, టీఏ రాజేంద్ర పాల్గొన్నారు.

నల్లచెరువు :

మండలంలోని జోగన్నపేట, మారిశెట్టిపల్లి, చెరువువాం డ్లపల్లి, కుమ్మరవాండ్లపల్లి, బోనేపల్లి, మల్లిరెడ్డిపల్లి , ఓరువాయి గ్రామాల్లో బుధవారం ఎంపీడీఓ మక్బుల్‌బాష పర్యటించారు. వ్యక్తిగత మరుగుదొడ్ల లబ్ధిదారులతో మాట్లాడుతూ సకాలంలో మరుగుదొడ్లు నిర్మాణాలు పూర్తి చేసుకోవాలన్నారు. నిర్మాణాలు పూర్తి అయిన వెంటనే మీ ఖాతాల్లో రూ. 15 వేలు బిల్లులు జమ అవుతాయన్నారు. పీ కొత్తపల్లిలో వెలుగు ఇన్‌చార్జ్ ఏసీ సీ రవీంద్ర వ్యక్తిగత మరుగుదొడ్ల లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు.

కదిరిలో వినాయక చవితి సందడి



దుస్తులను కొనుగోలు చేస్తున్న ప్రజలు



తోపుడు బండిపై అమ్మకానికి సిద్ధంగా వినాయక విగ్రహాలు



చెరుకు గడలు, మొక్కజొన్న కంకులు, పండ్లు

కదిరిటౌన్ : వినాయక చవితి పండుగ సందర్భంగా కదిరి పట్టణంలో కిరాణా షాపులు, వస్త్రాలు, కొబ్బరికాయల దుకాణాలు, కుంకుమలు, పూల అంగళ్లు బుధవారం కొనుగోలు దారులతో కిటకిటలాడాయి. ఈ నెల 25వ తేదీన వినాయక చవితి పండుగ రోజున ఆడబిడ్డలకు పసుపు, కుంకుమ, బట్టలు ఇవ్వడం సంప్రదాయంగా వస్తోంది. రాయలసీమ సర్కిల్, జీవిమాను సర్కిల్, వేమారెడ్డిసర్కిల్, ఇందిరాగాంధీ సర్కిల్, చౌక్‌బజారు, కోనేరు సర్కిల్‌లో ఉన్న దుకాణాల్లో కొనుగోలు దారులతో కిటకిటలాడాయి. అలాగే వినాయక విగ్రహాల వద్ద పూజా కార్యక్రమాలకు సంబంధించిన చెరుకు గడలు, వెలక్కాయలు, పండ్లు కొనుగోలు చేశారు. మండీల వద్ద మహిళలు అధిక సంఖ్యలో పూలు కొనుగోలు చేశారు. కొనుగోలు చేసిన వినాయక విగ్రహాలను యువకులు ఉత్సాహంగా వాహనాల్లో వారి గ్రామాలకు తరలిస్తున్నారు. కదిరిలో పండుగ సరుకులకు వచ్చిన కొనుగోలు దారులతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

ఆదాయం లేకనే బస్సులు ఆపేశాం : డీఎం

నల్లచెరువు : మండలంలోని ఉబిచెర్ల, ఓరువాయి, తవళంమర్రి తదితర రూట్‌లలో బస్సులు ఆపివేయడానికి కారణం ఆదాయం లేక పోగా భరించలేని నష్టాలు రావడమేనని కదిరి ఆర్టీసీ డిపోమేనేజర్ సూర్యనారాయణ తెలిపారు. బుధవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'బస్సులు లేక అవస్థలు' అన్న కథనంపై ఆయన స్పందించారు. కిలోమీటర్‌కు రూ. 30 ఆదాయం వస్తున్న రూట్‌లలో బస్సులు నడుపుతున్నామని , కొన్ని రూట్‌లలో రూ. 15 వచ్చినా కొనసాగిస్తున్నామని తెలిపారు. ఉబిచెర్ల, ఓరువాయి, తవళంమర్రి రూట్‌లలో ప్రైవేటు వాహనాలు , ఆటోలను నియంత్రించాలని గ్రామస్తులను కోరినా వారు స్పందించలేదన్నారు. ఇక ఆదర్శ పాఠశాలకు వెళ్లడానికి ప్రతి 15 నిమిషాలకు పల్లె వెలుగు బస్సులు కదిరి, మదనపల్లి డిపోల నుంచి అందుబాటులో ఉన్నాయన్నారు.

ఇంటింటా మరుగుదొడ్డి నిర్మించుకోండి

నంబులపూలకుంట : లబ్ధిదారులందరూ మరుగుదొడ్లు నిర్మించుకోవాలని తహసీల్దార్ నాగరాజు పేర్కొన్నారు. మండలంలోని మరికొమ్మదిన్నె గ్రామంలో అధికారులు రేషన్‌కార్డు ఆధారంగా ఇంటింటిని సందర్శించి అవగాహన కల్పించారు. ఇప్పటి వరకు గ్రామంలో 90 మంది మరుగుదొడ్లు నిర్మించుకున్నారని తెలిపారు.

ఘనంగా టంగుటూరి ప్రకాశం జయంతి



ప్రకాశం పంతులు చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళి అర్పిస్తున్న ఆర్డీఓ వెంకటేశు , సిబ్బంది

కదిరిటౌన్ : పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో టంగుటూరి ప్రకాశం పంతులు 145వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆర్డీఓ ఏ వెంకటేశు బుధవారం టంగుటూరి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొట్టమొదట ఆంధ్రరాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేశారన్నారు. స్వాతంత్ర్యం కోసం బ్రిటీష్‌ని ఎదిరించి, అనేక పోరాటలు చేశారన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని జరుపుకోవాలని ప్రభుత్వం 113 జీవో విడుదల చేసిందన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ పీవీ రమణ టంగుటూరి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆంధ్రరాష్ట్ర ప్రజల కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో డీఏఓ శంకర్, డిప్యూటీ తహసీల్దార్‌లు కరుణాకర్, కాటంబాబు, క్రిష్ణమూర్తి, సీనియర్ అసిస్టెంట్ బాబురావు, సిబ్బంది, వీఆర్‌ఓలు చంద్రశేఖర్, విజయ్‌కుమార్, నాగరాజు, మనూల్లాల్, యశోద, సిబ్బంది పాల్గొన్నారు.

తనకల్లులో..

స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఆంధ్రకేశరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటాన్ని ఉంచి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆయన ఆశ యాలను కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మేనాయక్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంటలో..

స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి తహసీల్దార్ శ్రీనివాసులు, కార్యాలయ సిబ్బంది పూలమాలలు వేసి, కొబ్బరి కాయ కొట్టి, ఘన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రఘురామిరెడ్డి, వీఆర్‌ఓ క్రిష్ణమోహన్‌రెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయకులు సికిందర్, హుస్సేన్ పీరా, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నల్లచెరువులో..

స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం టంగుటూరు ప్రకాశం పంతులు చిత్ర పటానికి తహసీల్దార్ ఏ కళావతి, సిబ్బంది పూల మాలలు వేసి నివాళి అర్పించారు. తహసీల్దార్ మాట్లాడుతూ... ఆంధ్రరాష్ట్ర ప్రజలకు ప్రకాశం చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐలు దివ్య, సూరన్న, మల్లికార్జున, నారాయణరెడ్డి, రఘునాథ్, వీఆర్ఏలు పతి, రవి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి క్రికెట్ టోర్నమెంట్

రొళ్ల: మండలంలోని పిల్లిగుండ్ల గ్రామంలో ఈనెల 25 నుంచి 27వరకు యూత్ అసోసియేషన్ సభ్యులు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. నియోజకవర్గంలోని ఐదుమండలాల ఆసక్తిగల క్రీడా కారులు టోర్నమెంటులో ఆడేందుకు పేర్లు నమోదుచేసుకోవాలన్నారు. గెలుపొందిన వారికి జడ్పీటీసీ వీఏం పాండురంగప్ప, వైసీపీ సీనియర్ నాయకుడు అనంతరాజు ఆధ్వర్యంలో మొదటి బహుమతి రూ.10వేలు, రెండవ బహుమతి హులీకుంట ఆర్.రంగనాథ్ రూ.5వేలు అందించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాల కోసం ఫోన్: 8500593276, 8328197583కు సంప్రదించాలని కోరారు.

ఎంపీపీ పదవికి రాజీనామా

రొళ్ల: రొళ్ల మండల అధ్యక్షుడు జీవీఎస్ పాండురంగప్ప బుధవారం తన ఎంపీపీ పదవీకి రాజీనామా చేశారు. మండలంలోని గుడ్డగురికి ఎంపీటీసీగా ఉన్న ఈయన ఏడాది క్రితం పదవిని చేపట్టారు. ఏడాది పదవీ కాలం ముగియడంతో బుధవారం అనంతపురంలో తన రాజీనామా పత్రాన్ని సీఈఓ సూర్యనారాయణకు అందజేశారు. మరో ఇద్దరికి చెరో ఏడాది కాలం ఎంపీపీ పదవీ దక్కే అవకాశమున్నట్లు రాజకీయ వర్గాల సమాచారం.

30న ఇంటర్వ్యూలు

రొళ్ల: కాపు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ కార్పొరేషన్ రుణాల కోసం ఈ నెల 20న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సరస్వతీ బుధవారం తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు. ఉదయం 11 గంటలకు హాజరు కావాలని కోరారు.

రోడ్డు ప్రమాదాల నివారణే ధ్యేయం

అగళి: రోడ్డు ప్రమాదాల నివారణే ధ్యేయంగా అహర్నిశలు శ్రమించాలని సీఐ శుభకుమార్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని కేజీవీ గుప్త కళాశాలలో బుధవారం రోడ్డు ప్రమాదాల నివారణపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీ నారాయణ అధ్యక్షతన ర్యాలీ నిర్వహించి నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ రాంబాబు, ఏఎస్ఐ రాజకుమార్, పరిటాల శ్రీరామ్ యువసేనా నాయకుడు ఉమేష్, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ

అగళి: పిల్లలకు చదువులే తరగని ఆస్తులని, ప్రతి తల్లిదండ్రులు విద్యార్థులను బాగా చదివించాలని మాజీ ఎంపీపీ రామక్రిష్టప్ప పేర్కొన్నారు. పీ.బ్యాడిగెర ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు దుస్తుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ప్రధానోపాధ్యాయుడు ఆర్.వెంకటేశులు ఆధ్వర్యంలో 60 మంది విద్యార్థినీ, విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ సర్పంచులు మంజునాథ్, ఉపాధ్యాయులు ఈరన్న, నాగేష్, స్కూల్ కమిటీ చైర్మన్ లోకేష్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తల్లిపాలతోనే బిడ్డ ఆరోగ్యం

గుడిబండ: తల్లిపాలతోనే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని సర్పంచు చంద్రశేఖర్, ఎంపీటీసీ ప్రకాష్ పేర్కొన్నారు. మండలంలోని ఎంఎస్ తాండా గ్రామంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవ కార్యక్రమాన్ని బుధవారం ఐసీడీఎస్ అధికారులు నిర్వహించారు. అనంతరం గర్భిణులకు సీమంత కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ లీలావతి, కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్హులకే కార్పొరేషన్ రుణాలు

గుడిబండ: అర్హులైన లబ్దిదారులకే కార్పొరేషన్ రుణాలు అందించనున్నట్లు జడ్పీటీసీ శ్రీనివాసమూర్తి,ఎంపీపీ సన్నీరప్ప, ఎంపీడీఓ ఎం.శివయ్యలు పేర్కొన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో కార్పొరేషన్ రుణాల కోసం అర్హులైన లబ్దిదారులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్లు, పంచాయతీ కార్యదర్శులు, లబ్దిదారులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఈరన్న

సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే ఈరన్న

అమరాపురం: ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ప్రతి ఒక్కరికి అందించేందుకు కృషిచేస్తున్నామని ఎమ్మెల్యే మద్దనకుంట ఈరన్న పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ఎంపీపీ నాగవేణి రామలింగేశ్వరప్ప అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని పురస్కరించుకుని ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రి ప్రకాశం పంతులు రాష్ట్రాభివృద్ధి చేసిన సేవలను కొనియాడారు. అనంతరం ఏఓ శివన్న మాట్లాడుతూ మండలానికి 7654 మంది రైతులకు గాను రూ.11.78 కోట్ల నిధులు రైతుల ఖాతాల్లోకి జమా అయ్యిందన్నారు. ఇంకా 3330 మంది రైతులకు గాను రూ.7.78 కోట్లు రైతుల ఖాతాల్లోకి జమా కావాల్సి ఉందన్నారు. సభ్యులు కలుగ చేసుకుని రెండు నెలలుగా రైతుల ఖాతాల్లోకి పంటనష్టపరిహారం జమా చేయకుండా నిర్లక్ష్యంచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధి హామీ ఏపీఓ శివన్న, ట్రాన్స్‌కో ఏఈ సిద్దేశ్వర మాట్లాడారు. పంచాయతీలలో ఎల్ఈడీ బల్బులతో వీధి లైట్లు వేయనున్నట్లు ఏఈ తెలిపారు. ఎన్టీఆర్ గృహాల కోసం అదనంగా రూ.25వేలు మంజూరు చేయడం జరిగిందని ఎన్టీఆర్ గృహాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తహసీల్దార్ రామశేఖర్ మాట్లాడుతుండగా సభ్యులుకలుగ చేసుకుని రెవెన్యూసేవలు సక్రమంగా అందేలా చొరవ చూపాలన్నారు. సక్రమంగా పనిచేయని వారిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు సభ్యులు రత్నమ్మ నరసింహమూర్తి తెలిపారు. సమావేశంలో జడ్పీటీసీ రత్నమ్మ నరసింహమూర్తి, ఎంపీడీఓ రామారావు, తహసీల్దార్ రామశేఖర్, ఈఓఆర్డీ చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ గోవిందరాయ, ఎంఈఓ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్ఓలు, సర్పంచులు, కోఆప్షన్ మెంబరు తదితరులు పాల్గొన్నారు.

సేవలతోనే అధికారులకు గుర్తింపు


ఈఓఆర్డీని సన్మానిస్తున్న ఎమ్మెల్యే మద్దనకుంట ఈరన్న

అమరాపురం: సేవలందించడంతోనే అధికారులు మంచి గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే మద్దనకుంట ఈరన్న పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో బదిలీపైవెళ్లిన ఈఓ ఆర్ డీ సుబ్రహ్మణ్యశర్మ సన్మాన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు.పూలమాలలు, శాలువాలతో సత్కరించారు.

సర్పంచులకు సన్మానం : పంచాయతీ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని తమ్మడేపల్లి సర్పంచు కరియమ్మ నాగప్ప, బసవనపల్లి సర్పంచు శివలింగమ్మ, వలస సర్పంచు రాధాచంద్రశేఖర్, అదేవిధంగా కార్యదర్శులు ప్రకాష్, వేణుగోపాల్, సురేష్‌బాబులను ఎమ్మెల్యే పూలమాలలు, శాలువాలతో ఘనసన్మానించారు.

పిల్లల చదువులే తల్లిదండ్రులకు తరగని ఆస్తులు : ఎమ్మెల్సీ


ప్లేట్లు గ్లాసులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ గుండుమల

మడకశిర అర్బన్: పిల్లల చదువులే తల్లిదండ్రులకు తరగని ఆస్తులని ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పేర్కొన్నారు. తల్లిదండ్రులు పిల్లలను బాగా చదివించి విద్యావంతులను చేయాలన్నారు. బుధవారం పట్టణంలోని 16 వార్డు కోటబడి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. పిల్లలకు ఆస్తులు, అంతస్తుల కన్నా విలువైన విద్యను అందించాలన్నారు. అప్పుడే వారి భవిష్యత్ బంగారమవుతుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు విమలాక్షి వేణు గోపాల్, రమేష్, ఫయాజ్, గోవిందరాజు, మాజీ సర్పంచు మాదవరాజు, బలరాం, భక్తర్, ఏపీటీఎఫ్ నాయకులు రామకృష్ణలత, ప్రధానోపాధ్యాయులు చంద్రకళావతి, ఉపాధ్యాయులు అలుఅంకన, విద్యార్థులు పాల్గొన్నారు.

మడకశిర టౌన్: సరస్వతీ విద్యామందిరం క్రమశిక్షణకే మారుపేరని, సరస్వతీ విద్యామందిరంలో చదివే విద్యార్థులు ఎంతగానో క్రమశిక్షణ కలిగి ఉంటారని ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి అన్నారు. బుధవారం గాంధీబజార్‌లోని ప్రాథమిక పాఠశాల నూతన భవనాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సరస్వతీ విద్యామందిర జిల్లా అధ్యక్షులు గోపాలకృష్ణ, గంగాధరేంద్ర స్వామీజీ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు టంగుటూరి ప్రకాశం పంతులు

మడకశిర టౌన్: ఆదర్శప్రాయుడు టంగుటూరి ప్రకాశం పంతులని తన ఆస్తిని జాతీయ ఉద్యమానికి దానం చేసిన గొప్ప ఆదర్శప్రాయుడని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సత్యవరప్రసాద్ అన్నారు. కళాశాలలో బుధవారం టంగుటూరి ప్రకాశం పంతులు 146వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆంధ్రకేసరి అడుగుజాడల్లో యువత నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్‌పీఓ మంజునాథ్, అధ్యాపకులు తదితరులుపాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో : మడకశిర ఎస్వైటీఆర్ ప్రభుత్వం డిగ్రీ కళాశాలలో టంగుటూరి ప్రకాశం పంతులు 146వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రవి కుమార్ మాట్లాడుతూ టంగుటూరి ప్రకాశం పంతులు ఆదర్శవంతుడని, ఆయన జీవిత విశేషాలను వివరించారు. కార్యక్రమంలో హిస్టరీ అధ్యాపకులు ప్రతాప్ తదితరులుపాల్గొన్నారు.

అగళి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని బుధవారం ఘనంగా జరుపుకున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్‌గౌడు, ఆర్ఐలు, వీఆర్ఓలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

ఈ క్రాప్ బుకింగ్ రైతులకు తప్పని సరి

మడకశిర రూరల్: రైతులు సాగుచేసిన వేరుశనగ పంటకు ఈ క్రాప్ బుక్కింగ్ చేయించుకోవాలని ఏఓ ముస్తాక్‌అహ్మద్, ఎంపీఈఓ రాజేష్‌బాబు తెలిపారు.బుధవారం ఆర్.అనంతపురం, హరేసముద్రం గ్రామాలలో పర్యటించి క్రాప్ బుక్కింగ్ చేశారు. పంటలు సాగుచేసిన రైతులు తప్పని సరిగా క్రాప్ బుకింగ్ చేయించుకుంటేనే ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీలు రైతులకు అందుతాయన్నారు. రైతులు క్రాప్ బుకింగ్ చేయించుకోవాలన్నారు.


హరేసముద్రం వద్ద వేరుశనగ పొలంలో క్రాప్‌బుకింగ్ చేస్తున్న అధికారులు

విద్యార్థులకు అభినందన

మడకశిర అర్బన్: మడకశిర డాక్టర్ వైఎస్ఆర్ విశ్వ విద్యాలయ ఎస్ఎన్‌పీజీ విశ్వ ఉద్యానవిద్యాలయం ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి హార్టిసెట్‌లో కళాశాల విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారు. కళాశాలకు చెందిన 12 మంది విద్యార్థులకు బుధవారం అభినందన సభ ఏర్పాటుచేసి కళాశాల ప్రిన్సిపాల్ డీ.రమణ, కళాశాల సిబ్బంది అభినందలు తెలిపారు.

ఓవర్‌లోడు వేస్తే కఠిన చర్యలు

మడకశిర రూరల్: ఆటోలు, వాహనాలు, టెంపోల్లో ఓవర్‌లోడువేస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్ఐ లింగన్న తెలిపారు. బుధవారం స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. అందులో భాగంగా కదిరేపల్లి క్రాస్ వద్ద ఓవర్‌లోడుతో వెళ్తున్న ఆటోలు, టెంపులను ఆపి వారికి రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు.

భద్ర నీటి కోసం రైతు సంఘం ర్యాలీ

పావగడ: కర్ణాటక రక్షణ వేదిక, ఆజాద్ యూత్ సంఘం ఆధ్వర్యంలో బుధవారం రైతు సంఘం ధర్నాకు ర్యాలీచేసి మద్దతు తెలిపాయి. గత 16 రోజుల నుంచి భద్రనీటి కోసం రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టిన విషయం విదితమే. 70కి పైగా స్వచ్ఛంద సేవా సంస్థలు, యువక సంఘాలు మద్దతు తెలిపారు. రోజురోజుకు రైతు సంఘానికి బలం చేరుకూరుతోందని రైతు సంఘం అధ్యక్షుడు నరసింహారెడ్డి తెలిపారు.

బాల్య వివాహాలను అరికట్టండి


విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్

అమరాపురం: బాల్యవివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరు కృషిచేయాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ రామశేఖర్, ఎస్ఐ వెంకటస్వామి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని హలుకూరు గ్రామ సమీపంలోని ఆదర్శ పాఠశాలలో ఏర్పాటుచేసి బాల్యవివాహాలపై అవగాహన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. బాల్యవివాహాలు ఎక్కడైనా జరుగుతుంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. బాలికలను బాగా చదివించి ఉన్నతస్థాయికి తీసుకురావాలన్నారు. ఎక్కడైనా ఆటోలు, బస్సులలో వెళ్తున్న బాలికలను ఈవ్‌టీజింగ్‌కు పాల్పడేవారి సమాచారాన్ని తమకు అందించాలని ఆొంటివారి పై చర్యలు తీసుకొనున్నట్లు తెలిపారు. బాలికలు బాగా చదువుకోవాలన్నారు. త్వరలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఫిర్యాదుల బాక్సును ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు. ఫిర్యాదులను అందులో వేస్తే పరిశీలించి చర్యలుచేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మంజునాథ్, ఉపాధ్యాయులు ఉన్నారు.

జీరిగేపల్లిలో పట్టపగలే చోరీ

రొళ్ల: మండలంలోని జీరిగేపల్లిలో బుధవారం రైతు సిద్దప్ప ఇంటిలో పట్టపగలే చోరీ జరిగింది. బాధితుడు సిద్దప్పఅందించిన వివరాలు ఇలా ఉన్నాయి. రోజు వెళ్లే విధంగా బుధవారం ఉదయాన్నే కుటుంబ సభ్యులంతా పొలం పనులకు వెళ్లారని తెలిపాడు. దీనిని అదునుగా భావించి ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళం పగలగొట్టి బీరువాలోని బంగారు ఆభరణాలను దొంగలించుకుని వెళ్లారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. బోరువేసేందుకు బీరువాలో ఉంచిన నగదును కూడా దోచుకునివెళ్లినట్లు బాధితరైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ విషయమై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదుచేయనున్నట్లు తెలిపారు.

ఎంపవర్ ఇండియాపై అవగాహన ర్యాలీ

అనంతపురం అర్బన్ : కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఎంపవర్ ఇండియా - మేక్ ఇండియా కార్యక్రమంపై శ్రీచైతన్య విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. బుధవారం రుద్రంపేట శ్రీచైతన్య బ్రాంచ్ విద్యార్థులు రామ్‌నగర్, క్లాక్‌టవర్ వరకు ర్యాలీ కొనసాగించారు.

విద్యార్థులచే మట్టి వినాయకుల తయారీ

గోరంట్ల రూరల్ : పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణకు తనవంతు కర్తవ్యంగా టీచర్ రాధా నడుంబిగించారు. గోరంట్ల మం డలం కోరే వాండ్లపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో రాధ, ఉపా. ద్యాయురాలుగా విధులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులచే బంకమట్టితో వినాయక విగ్ర హాలు తయా రు చేయడంలో శిక్షణ ఇస్తున్నారు. టీచర్ రాధా, సేవా కా ర్యక్రమాలతోపాటు పర్యావరణ పరిరక్షణకు దోహ దపడేవిధంగా పని చేస్తుండటంతో పలువురు ఆమెను అభినందించారు.

సర్వర్ల మొరాయింపు..!

- ప్రత్యామ్నాయ విత్తనాల పంపిణీలో రైతులకు ఇక్కట్లు
- అధికారులతో వాగ్వాదం



ఇబ్బందులు పడుతున్న మహిళా రైతులు

పెనుకొండ : ప్రత్యామ్నాయ పంటలు సాగుచేయడానికి విత్త నాలు తీసుకోవడానికి మండల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి రైతులు పెనుకొండకు రావడం, సర్వర్ మొరాయించడంతో పంపిణీ చేయకపోవ డంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. బుధ వారం విత్తనాలు తీసుకోవడానికి ఉదయం నుంచే వందలాది మంది రైతులు బారులు తీరారు. కానీ ఉదయం నుంచి సాయంత్రం వరకు సర్వర్‌లు పనిచేయక పోవడంతో విత్తనాలు పంపిణీ చేయలేకపోయారు. దీంతో ఆగ్రహానికి గురైన రైతులు అధికారులతో కాసేపు వాగ్వాదానికి దిగారు. వారికి సర్దిచెప్పడానికి అధికారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

రొద్దంలో : ఉచితంగా అందిస్తున్న ప్రత్యామ్నాయ విత్తనాల కోసం మండలంలోని వివిధ గ్రామాల నుంచి విచ్చేసిన మహిళా రైతులు సైతం మండుటెండలో ఇబ్బందులు పడ్డారు. ఉదయం 10 గంటల నుంచి 11గంటల వరకు మాత్రమే సర్వర్ పనిచేసి అనం తరం పనిచేయకపోవడంతో వ్యవసాయ శాఖ సిబ్బంది పంపిణీ నిలిపివేశారు.

దీంతో వరుసలో బారులు తీరిన వృద్ధులు, మహి ళలు వెనుతిర గాల్సి వచ్చింది. కాగా గురువారం పంపిణీ చేయాల్సిన ఎం.కొత్త పల్లి, నారనాగేపల్లి, బూచర్ల, లోచర్ల, తాడంగిపల్లి రైతులకు సోమ వారం పంపిణీ చేస్తామని ఏఓ శుభకర్ తెలిపారు.

నేడు ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో మట్టి విగ్రహాల పంపిణీ



మట్టి వినాయకులను చూపుతున్న టీడీపీ నాయకురాలు సవిత

పెనుకొండ టౌన్: వినాయక చవితి పండుగను పురస్కరించుకుని ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో పెనుకొండలో గురువారం మట్టివినాయక విగ్రహాలను పంపిణీ కార్యక్రమం చేప ట్టనున్నారు. ఈ కార్యక్ర మానికి పెనుకొండ తెలుగు దేశం మహిళా నాయకు రా లు సవిత వెంకటేశు స్పాన్స ర్స్‌గా వ్యవహరిస్తున్నారు. స్థానిక పెట్రోల్‌బంక్ వద్ద ఉద యం 10గంటలకు మట్ట వినాయక విగ్రహాలు పంపిణీ చేయడం జరుగుతుం దన్నారు. మట్టి వినాయకులను పూజించి పర్యావరణ పరిరక్షణ, నీటి కాలుష్యం నివారణ చర్యల్లో భాగంగా ఉచిత వినాయక విగ్రహాల పంపిణీ చేపడుతున్నాం.

దుర్వినియోగం చేస్తే చర్యలు తప్పవు : ఏఓ

పెనుకొండ : ప్రత్యామ్నాయ విత్తనాలు పంటలు నమోదు కానీ రైతులకే ఇస్తామని, విత్తనాలు పొందిన రైతులు వాటిని సద్విని యోగం చేసు కోవాలని ఏఓ సోమశేఖర్ బుధవారం తెలిపారు. దుర్వినియోగం చేస్తే అలాంటి రైతుల నుంచి రాయితీ సొమ్ము వెనక్కు రాబట్టడమే కాక భవిష్యత్తులో రా యితీలు పొందడానికి అన ర్హులుగా ప్రకటి స్తామన్నారు. ఉలవలు, అల సందలు, రెండు న్నర్ర ఎకరాల లోపున్న రైతు లకే ఇస్తామ న్నారు. 24న మావటూరు, ఎర్ర మంచి, మునిమడుగు, 26న గుట్టూరు, నాగ లూరు, దుద్దేబండ, 28 రాంపురం, శెట్టిపల్లి, కొండం పల్లి, 29 అడదా కులపల్లి, పెనుకొండ, గోని పేట రైతులకు పంపిణీ చేస్తామన్నారు.

నేటి నుంచి నవరాత్రి ఉత్సవాలు

గోరంట్ల రూరల్ : వినాయక చవితి సందర్భంగా గోరంట్లలోని శ్రీ వరసిద్ది వినా యక దేవాలయంలో గురువారం నుంచి నవరాత్రి ఉత్సవాలను దేవాదాయశాఖ ఆధ్వ ర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 24నుంచి సెప్టెంబర్ 1వరకు 9రోజులవరకు 59వ నవరాత్రోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహి స్తున్నట్లు అర్చకులు ఉదయ్ తెలిపారు.

వినాయక మండప ఏర్పాట్లకు అనుమతి తప్పనిసరి

సోమందేపల్లి : వినాయక చవితి సం దర్భంగా మండల వ్యాప్తం గా వివిధ గ్రామా ల్లో ఏర్పాటు చేయనున్న మండపాలకు తప్పని సరిగా అనుమతులు తీసుకోవాలని ఎస్‌ఐ ప్రసాద్ సూచించారు. ఇందుకోసం ప్ర త్యేక దరఖాస్తు ఫారాలను పోలీసు సిబ్బం దికి అందించాలని సూచించారు.

ఆంధ్రకేసరి అడుగుజాడల్లో నడవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌ఓ ప్రతాప్

పెనుకొండ : ఆర్డీఓ కార్యాలయంలో జయంతి వేడుకలు ఘనం గా నిర్వహించారు. ఆర్డీఓ రామ్మూర్తి, డీఏఓ వేణుగోపాల్, డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లు, తదితరులు ఆంధ్రకేసరి చిత్రపటానికి పూలమాల లువేసి నివాళులు అర్పించారు. స్వాతంత్ర్య సమర యోధుడు బ్రిటీష్ పాలకులను గడగడలాడించిన ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రి ఆంధ్రకేసరి టంగు టూరి వీరేశలింగం పంతులు అ డుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని సత్యసాయి కళాశాల ఎస్‌ఓ డా.ప్రతాప్ పేర్కొన్నారు. బుధవారం సత్యసాయి కళాశాలలో టంగు టూరి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ కేశవయ్య, శ్రీరా ములు, విద్యార్థులు పాల్గొన్నారు.

సోమందేపల్లి : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని అధికారులు ఆయనకు ఘననివాళిని అర్పించారు. చిత్రపటానికి ఇన్‌చార్జ్ తహసీల్దార్ జయరాములు, ఎంఈఓ ఆంజనేయులునా యక్, పూలమాలలువేసి నివాళులుఅ ర్పించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ రెడ్డిశేఖర్, వీఆర్‌ఓలు రామాంజినే యులు, ఆంజనేయులు, చలపతి, తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంపై విద్యార్థులకు అవగాహన



అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

సోమందేపల్లి : మండలంలోని క్రీస్తుజ్యోతి పాఠశా లలో అగ్ని ప్రమాదాల నివారణపై బుధవారం విద్యా ర్థులకు అవగాహ న కార్యక్రమాన్ని నిర్వహించారు. పెను కొండ ఫైర్ స్టేషన్ అధికారుల ఆధ్వర్యంలో ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మంటలు ఆర్పడం, గ్యాస్ సిలెండర్లు లీక్ అయినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది, ఉపాధ్యా యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణం వేగవంతం చేయండి



గోరంట్లలో మరుగుదొడ్ల పనులు పరిశీలిస్తున్న స్పెషల్ ఆఫీసర్ అంజినప్ప



పెనుకొండ ఎస్సీ కాలనీలో భూమిపూజ చేస్తున్న దృశ్యం

గోరంట్ల రూరల్ : మండలంలో మరుగుదొడ్ల నిర్మాణం వేగ వంతం చేయడానికి బుధవారం అధికారులు చర్యలు చేపట్టారు. గోరంట్ల మండలంలో పులేరు గ్రామానికి 245మరుగుదొడ్లు, వెం కటరమణపల్లికి 314, కొండాపురంకు 318 రెండో విడతగా మంజూ రయ్యాయి. పులేరులో ఆర్‌డబ్ల్యుఎస్ పనులు చేపట్టగా స్పెషల్ ఆఫీ సర్ ఈఓఆర్డీ బుధవారం గ్రామానికి వెళ్లి పనులను పర్యవేక్షించారు. 245కుగాను 70పూర్తి అయ్యాయని బిల్లులు చెల్లించాల్సిందిగా పరి శీలనలో తేలిందన్నారు.

44నిర్మాణం పనులకు అధికారులు మార్కింగ్ ఇస్తూ త్వరిత గతిన నిర్మించుకోవాలని ఆయన లబ్ధిదారులను కోరారు. కార్యక్ర మంలో సర్పంచ్ నరేష్‌ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ ఓబులేసు, గ్రామ కార్యదర్శి గౌసియాబాను పాల్గొన్నారు.

పెనుకొండ : స్వచ్ఛభారత్, స్వచ్ఛఆంధ్రప్రదేశ్, స్వచ్ఛ పెనుకొం డలో భాగంగా ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకో వాలని సర్పంచ్ అశ్వర్థనారాయణ, దేశం నాయకులు మాధవనాయుడు పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎస్‌సీ కాలనీలో మ రుగుదొడ్ల నిర్మాణంకు భూమిపూజ కార్యక్రమం చేపట్టారు. ము ఖ్య అతిథులుగా హాజరైన సర్పంచ్, నాయకులు మాధవనా యుడు, త్రివేంద్ర, చేతులమీదుగా భూమిపూజ చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా ప్రతిఒక్కరూ తప్పనిసరిగా వ్యక్తిగతమ రుగు దొడ్లు నిర్మించుకో వాలని కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రూ.15 వేలు నిధులు అందజే స్తున్నామన్నారు. పెనుకొండ పట్టణానికి 1517 మ రుగుదొడ్లు మంజూరయ్యాయన్నారు. వీటిని రైతు కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్మాణం పనులు చేపట్టామన్నారు. అందులో సద్విని యోగం చేసుకోవాలని కోరారు.

రాజీవ్‌కాలనీని సందర్శించిన వైద్యాధికారులు

గోరంట్ల రూరల్ : స్థానిక రాజీవ్ కాలనీలో విషజ్వరాలు ప్రబల డంతో పెనుకొండ డిప్యూటీ డీఎం హెచ్‌ఓ వెంకటేశ్వర్‌రావు బుధవారం కాలనీని సం ద ర్శించారు. డాక్టర్ స్థానిక వైద్య ఆరోగ్య సిబ్బంది చేపడు తున్న చర్యలపై పర్యవేక్షించారు. కార్యక్రమంలో డా.బండి రాజా, డా.ప్రతాప్, సూపర్‌వైజర్ సురేష్, తదితరులు వైద్య సేవలు అందించారు.

పెనుకొండలో పండగ సందడి



అమ్మకానికి సిద్ధంగా విగ్రహాలు

పెనుకొండ : గౌరమ్మ వినాయక చవి తిని పురస్కరించుకుని పండగకు అవస ర మైన విగ్రహాలు, పూలు, పండ్లు కొనడానికి గ్రామీణ ప్రాంతాల నుంచే వచ్చిన ప్రజలతో వీధుల్లో సందడి నెలకొంది. గురువారం గౌరమ్మ పండగ, శుక్రవారం వినాయక చవితి పండగకు అవసరమైన విగ్రహాలు, అరటి, చెరుకుగడలు, పూలు, పండ్లు, పత్రి, పూజా సామాగ్రి, పండగ సరుకులు కొన డా నికి గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రజలు కొను గోలు చేయడానికి పెనుకొండకు రావడంతో శ్రీకృష్ణదేవరాయ, మార్కెట్ సర్కిల్ కొనుగోల ుదారులతో కిటకిటలాడాయి.

బస్సు సౌకర్యం కల్పించండి



డీఎంకు వినతిపత్రం అందిస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

పెనుకొండ : గ్రామీణ ప్రాంతాల నుంచి వందలాది మంది విద్యా ర్థు లు ప్రతి రోజూ చదువుకోవడానికి పెనుకొండకు వస్తున్నారని, సమ యా నికి అనుకూలంగా బస్సులు నడపడం లేదని బస్సు సౌకర్యం కల్పిం చాలని కోరుతూ ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డిపో మేనేజర్‌కు వినతిపత్రం అం దించారు. బుధవారం ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు చిరంజీవి, శ్రీకాంత్, మధు, అనీల్‌కుమార్, నవీన్‌కుమార్, ఫణికుమార్, శ్రీరాములు తదితరులు విన తిని అందిస్తూ అడదాకులపల్లి, సానిపల్లి గ్రామాల నుంచి పెనుకొం డకు పాఠశాల వేళకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు.

విద్యాభివృద్ధికి టీడీపీ కృషి

పెనుకొండ : విద్యారంగ అభివృద్ధికి తెలుగుదేశం ప్రభుత్వం నిర్విరామ కృషి చేస్తుందని సర్పంచ్ అశ్వర్థనా రాయణ పేర్కొన్నారు. బుధవారం స్థానిక బోయపేట ప్రా థమిక పాఠశాలలో విద్యార్థులకు యూనిఫాం దు స్తులు పంపిణీ చేపట్టారు. ముఖ్య అతిథులుగా హాజరైన సర్పం చ్ అశ్వర్థ నారాయణ, దేశం నాయకులు మాధవ నా యుడు, త్రివేంద్ర, అభివృద్ధి కమిటీ చైర్మన్ జయశం కర్, హాజరై విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుధాకర్, ఉపాధ్యా యులు శేషగిరి, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



దుస్తులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ తదితరులు

ప్రత్యామ్నాయ విత్తనాల కోసం రైతుల పడిగాపులు

ఓబుళదేవరచెరువు : రైతులకు వందశాతం సబ్సిడీ తో అందిస్తున్న ప్రత్యామ్నాయ విత్తనాల పంపిణీ కార్యక్రమం తొలిరోజే సర్వర్ మొరాయించింది. దీంతో బుధవారం రైతులు ప్రత్యామ్నాయ విత్తనాల కోసం ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. తొలిరోజు ఎంపీపీ ఇస్మాయిల్, జడ్పీటీసీ ఓబుళరెడ్డి పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అయితే మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం వరకు సర్వర్ పనిచేయక పోవడంతో కేవలం ఐదు మంది రైతులకు 125 కిలోల ఉలవలు, 20 కిలోల అలసంద మాత్రమే పంపిణీ చేసినట్లు ఏఈఓ రామవేంద్రనాయక్ తెలిపారు.

అర్హులందరికీ సబ్సిడీ రుణాలు

పుట్టపర్తి: నగరపంచాయతీ పరిధిలో అర్హులందరికీ సబ్సిడీ రుణాలు అందేలా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్మన్ బెస్త చలపతి, వైస్ చైర్మన్ కడియాల రాము పేర్కొన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ నగర పంచాయతీ పరిధిలో 248 యూనిట్లు మంజూరయ్యాయన్నారు. ఎస్సీలకు 91, ఎస్టీలకు 7, ముస్లింలకు 22, క్రిస్టియన్‌లకు 3, బీసీలకు 50, కాపులకు 75 యూనిట్లు మంజూరయ్యాయని, ఈనెల 29, 30 తేదీల్లో రుణాల మంజూరుకు సంబంధించి బ్యాంకు అధికారులతో సమావేశం నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చింతా దామోదర్, రాజప్ప, సత్యనారాయణ, ఆదినారాయణ, గంగాద్రి, రాము తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభివృద్ధి కోసం ...

తెలుగుదేశం ప్రభుత్వం అన్ని వర్గాల అభివృద్ధి కోసం ప్రత్యేకంగా కృషి చేస్తోందని, ఇందులో సబ్సిడీ రుణాలు ఆర్థిక అభివృద్ధికి ఉపయోగపడుతున్నాయని సర్పంచ్ నాగరాణి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఆదినారాయణరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని వెంగమ్మ చెరువు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో 37 మంది లబ్ధిదారులకు రూ.50 లక్షల సబ్సిడీ రుణాలను బుధవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ మంత్రి, ఎమ్మెల్యే పల్లె రఘునాథరెడ్డి సహకారంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు కార్పొరేషన్ల ద్వారా బ్యాంకుల నుంచి రుణాలు అందిస్తున్నామన్నారు. బీసీ కార్పొరేషన్ ద్వారా 20 మందికి, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 5 మందికి, కాపు కార్పొరేషన్ ద్వారా 12 మందికి 50 శాతం సబ్సిడీతో రుణాల చెక్కులను పంపిణీ చేశారు. ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. ఈకార్యక్రమంలో మేనేజర్ రవికుమార్‌రెడ్డి, శ్రీరామిరెడ్డి, వేమన్న, దేవానందరెడ్డి, గంగిరెడ్డి, గంగన్న, సుధీర్‌రెడ్డి, పీసీ.చంద్ర, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సబ్సిడీ రుణాలు అందిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

అందరికీ ఇళ్లు పథకానికి స్థల పరిశీలన

పుట్టపర్తి: అందరికీ ఇళ్ల పథకానికి ఈనెల 26న మాజీ మంత్రి, ఎమ్మెల్యే పల్లె రఘునాథరెడ్డి భూమిపూజ చేస్తున్నందున మున్సిపల్ చైర్మన్ బి.చలపతి స్థల పరిశీలన చేశారు. బుధవారం కమిషనర్ విజయ భాస్కర్‌రెడ్డితో కలిసి ఆయన కర్ణాటక నాగేపల్లి సమీపంలో స్థలాన్ని పరిశీలించారు. ఈ పథకం కింద నిర్మించే అపార్ట్‌మెంట్‌లలో నగరపంచాయతీ పరిధిలోని 1243 మంది లబ్ధి పొందనున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కడియాల రాము, టీడీపీ నాయకులు రాజప్ప, గంగాద్రి, పోతన్న, టీపీఓ వెంకటేశు తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ స్టౌ, సిలిండర్ వితరణ

పుట్టపర్తిరూరల్: కళావిహీనంగా ఉన్న బ్రాహ్మణపల్లి ప్రాథమిక పాఠశాలకు రంగులు వేయించడంతో పాటు మధ్యాహ్న భోజన పథకానికి దాతలు గ్యాస్‌స్టౌ, సిలిండర్‌ను వితరణ చేశారు. బ్రాహ్మణపల్లి ప్రాథమిక పాఠశాలకు మున్సిపల్ మాజీ చైర్మన్ పీసీ.గంగన్న, మనీ చేంజర్ రాము ఆధ్వర్యంలో ఈ పాఠశాలకు రంగులు వేయించారు. అలాగే మధ్యాహ్న భోజన పథకానికి అవసరమైన గ్యాస్‌స్టౌవ్, సిలిండర్‌ను బుధవారం సమకూర్చారు. 60 మంది చిన్నారులకు నోట్‌పుస్తకాలు, పెన్సిళ్లు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు శ్రీరాంనాయక్, షకీల, ఎస్ఎంసీ చైర్మన్ రమణ, గ్రామపెద్దలు ఈడిగ రామచంద్ర, నబీరసూల్, గంగాద్రి పాల్గొన్నారు.

బాల్య వివాహంపై కౌన్సెలింగ్

ఓబుళదేవరచెరువు : మండలంలోని సున్నంపల్లి గ్రామానికి చెందిన మైనర్ బాలిక వివాహాన్ని స్థానిక ఎస్ఐ సత్యనారాయణ, పోలీసు సిబ్బంది అడ్డుకున్నారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు సున్నంపల్లి గ్రామానికి చెందిన పదోతరగతి విద్యార్థిని రెండు రోజుల క్రితం తనకు ఇష్టం లేని పెళ్లి చేస్తున్నారంటూ దృష్టికి తెచ్చింది. బాలిక తల్లిదండ్రులను, పెళ్లి కొడుకు తండ్రిని బుధవారం పోలీసుస్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. ఈ నెల 30 వ తేదిన వివాహం జరగాల్సి ఉండగా.. బాలిక తండ్రి రమణప్ప, తల్లి నిడి మామిడమ్మ , పెళ్లి కొడుకు తండ్రి కదిరి బత్తలపల్లికి చెందిన ఓబులేసును పిలిపించి 18 సంవత్సరాలు నిండిన తర్వాత వివాహం చేస్తామని పెద్దమనుషుల సమక్షంలో అంగీకార పత్రాన్ని రాయించుకున్నారు. ఎస్ఐతో పాటు పోలీసుసిబ్బంది సురేష్, ప్రతాప్, ఈశ్వర్, వేమనారాయణ, వేణు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌ను నియంత్రించిన పోలీసులు

ఓబుళదేవరచెరువు : మండల కేంద్రంలో శనివారం ఎస్ఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో ట్రాఫిక్‌ను నియంత్రించారు. అందులో భాగంగా ప్రధాన రహదారిపై నిర్వహిస్తున్న వారపు మార్కెట్‌తో తరచూ ప్రమాదాలు పెరుగుతుండటంతో వాటిని నివారించాలని వారపు మార్కెట్‌ను పాత పోలీసుక్వార్టర్స్ వద్దకు మార్పు చేశారు. తద్వారా ప్రమాదాలు నివారించవచ్చని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడవచ్చని పేర్కొన్నారు.

చిరుధాన్యాల పంపిణీ

నల్లమాడ : మండలంలోని కురుమాల, పులగంపల్లి పంచాయతీ పరిధిలో రైతులకు చిరుధాన్యాలు బుధవారం వ్యవసాయ కార్యాలయంలో పంపిణీ చేసినట్లు ఏఓ ఓబిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న చిరుదాన్యాలు రైతులకు పంపిణీ చేస్తున్నామన్నారు. కావాల్సిన రైతులకు అందరూ ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకంను తీసుకు వస్తే సబ్సిడీతో ఉలవలు, అలసందలు, కొర్రలు పంపిణీ చేస్తున్నామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏఓ ఓబిరెడ్డి, ఏఈఓలు శిరీషా, ఎంపీఈఓలు పాల్గొన్నారు.

రైతు సేవలో రెవెన్యూశాఖ

మండలంలోని పులగంపల్లి పంచాయతీ పరిధిలోని గ్రామాల రైతుల కోసం పులగంపల్లి పంచాయతీ కార్యాలయంలో బుధవారం రెవెన్యూసదస్సులు తహసీల్దార్ అబ్దుల్‌హమీద్ నిర్వహించారు. రైతులు పట్టాదారు పాసు పుస్తకాల కోసం దరఖాస్తులు చేసుకొన్నారు.

పోటీ పరీక్షలకు ఉచిత కోచింగ్

పుట్టపర్తి: జిల్లాలో పోటీపరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు గ్రంథాలయ సంస్థ ద్వారా ఉచిత కోచింగ్ కోసం ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ గౌస్‌మొద్దీన్ పేర్కొన్నారు. బుధవారం ఆయన స్థానిక గ్రంథాలయాన్ని తనిఖీ చేశారు. గ్రంథాలయం కోసం నూతనంగా నిర్మించే భవనం కోసం స్థలాన్ని పరిశీలించారు. స్థలాన్ని కేటాయిస్తే త్వరలో భవనాన్ని నిర్మిస్తామన్నారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో రూ.35 లక్షలతో ఆడిటోరియం నిర్మించనున్నట్లు తెలిపారు. 800 మంది విద్యార్థులకు భోజన ఏర్పాట్లతో పోటీపరీక్షలకు ఉచిత కోచింగ్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కోచింగ్ ఉంటుందని, అదేవిధంగా టీ, స్నాక్స్, భోజనం అందించడం జరుగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా రూ.2.3 కోట్ల పన్నుబకాయిలు రావాల్సి ఉందన్నారు. ఇటీవల అనంతపురంలో రూ.1 లక్ష వరకు బకాయిలు వసూలు చేశామన్నారు. జిల్లా కేంద్రంలో రూ.1.3 కోట్లతో డిజిటల్ లైబ్రరీని త్వరలో ప్రారంభిస్తామన్నారు. జిల్లాలో మొత్తం 79 లైబ్రరీలు ఉండగా, 54 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బెస్త చలపతి, వైస్ చైర్మన్ కడియాల రాము, కమిషనర్ విజయ భాస్కర్‌రెడ్డి, బీవీ.ప్రసాద్, డీపీఓ వెంకటేశు తదితరులు పాల్గొన్నారు.


స్థలాన్ని పరిశీలిస్తున్న చైర్మన్ గౌస్‌మొద్దీన్ తదితరులు

ఘనంగా టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి


చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న చైర్మన్ బి.చలపతి, సిబ్బంది

పుట్టపర్తిరూరల్: స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్య మంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు 145వ జయంతి సందర్భంగా తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీఓ సుబహాన్, సిబ్బంది మన నివాళులర్పించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుబహాన్, ఆర్ఐలు, ఏపీఓ సూర్యనారాయణ, వీఆర్ఓలు, మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పుట్టపర్తిలో: దేశస్వాతంత్ర్యం కోసం బ్రిటీష్ వారికి ఎదురొడ్డి నిలిచిన మహనీయుడు టంగుటూరి ప్రకాశంపంతులు అని మున్సిపల్ చైర్మన్ బెస్త చలపతి కొనియాడారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో టంగుటూరి జయంతి వేడుకలు జరిపారు. మొదట చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఓబుళదేవరచెరువు : టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బీసీ బాలుర వసతి గృహంలో వార్డెన్ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో అల్లాపల్లి, సున్నంపల్లిలో గ్రామ కార్యదర్శులు ఎంబీ ప్రసాద్, ఎల్‌వీ ప్రసాద్‌ల ఆధ్వర్యంలో వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా టంగుటూరి చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సర్పంచు రమణారెడ్డి, మండల కోఆర్డినేటర్ రమణానాయక్, పాఠశాల సిబ్బంది శ్రీరాములు, లక్ష్మేనాయక్ తదితరులు పాల్గొన్నారు.

అమడగూరు తహసీల్దార్‌గా సుబ్బలక్ష్మమ్మ

అమడగూరు : మండల తహసీల్దార్‌గా సుబ్బలక్ష్మమ్మ బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఆమె మాట్లాడుతూ మండలంలో అందరికి అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. తాడిమర్రి నుంచి డిప్యుటేషన్‌పై అమడగూరు తహసీల్దార్‌గా వచ్చినట్లు తెలిపారు.



నేడు రైతుసేవలో రెవెనూశాఖ :

మండలంలోని శీకిరేవులపల్లి గ్రామ పంచాయతీలో గురువారం రైతు సేవలో రెవెన్యూశాఖ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సుబ్బలక్ష్మమ్మ తెలిపారు.

గణేష్ నిమజ్జన స్థలాల పరిశీలన

అనంతపురం కార్పొరేషన్ : వినాయక చవితి నేపథ్యంలో నగరంలో నీరు అందుబాటులో లేకపోవడంతో గణేష్ నిమజ్జనానికి అవసరమైన స్థలాలను మేయర్ స్వరూప, నగపాలక సంస్థ అధికారులు, రెవెన్యూ అధికారులు, పోలీసు అధికారులు పరిశీలించారు. హెచ్చెల్సీ కెనాల్‌లో నీరు లేకపోవడంతో మేయర్ బుధవారం అధికారులతో కలసి శింగనమల చెరువును పరిశీలించారు. స్థానికంగా ఎక్కడెక్కడ నిమజ్జనానికి అనువైన స్థలాలున్నాయో చూశారు.

ఘనంగా నారాయణసేవ

కొత్తచెరువు: భగవాన్ సత్యసాయిబాబా ఆశయాలను ఆచరణలోకి తీసుకురావాలని పలువురు సత్యసాయి భక్తులు పేర్కొన్నారు. స్థానిక సత్యసాయి భజనమండలిలో నారాయణసేవను బుధవారం ఘనంగా నిర్వహించారు. సత్యసాయిబాబా చిత్రపటానికి పూలమాలలు వేసి.. బాబా చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈసందర్భంగా సత్యసాయి బాబా భజనలు చేశారు. అనంతరం అన్నదానం చేపట్టారు. ఈకార్యక్రమాల్లో సత్యసాయి భజనమండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

యూనిఫాం పంపిణీ


విద్యార్థులకు యూనిఫాంలు అందిస్తున్న ఎస్ఎంసీ చైర్మన్ నాగరాజు

బుక్కపట్నం: స్థానిక బాలుర ఉన్నతపాఠశాలలోని విద్యార్థులకు బుధవారం యూనిఫాం దుస్తులను ఎస్ఎంసీ చైర్మన్ నాగరాజు పంపిణీ చేశారు. పాఠశాలలోని విద్యార్థులందరికీ రెండురెండు జతల చొప్పున దుస్తులను అందజేశారు. యూనిఫాం ధరించడం వల్ల విద్యార్థుల్లో సమానత్వం నెలకొంటుందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం నూర్జహాన్, సిబ్బంది పాల్గొంది.

ఓబుళదేవరచెరువు : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థిని, విద్యార్థులకు జడ్పీటీసీ పిట్లా ఓబుళరెడ్డి, ఎంఈఓ లలితమ్మలు ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. పాఠశాలలో చదువుతున్న 254 మంది విద్యార్థులకు రెండు జతలు చొప్పున దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. మండలంలోని అన్ని పాఠశాలలకు ఏకరూప దుస్తులు పంపిణీ చేసినట్లు ఎంఈఓ లలితమ్మ తెలిపారు.

నగదు రహితాన్ని ప్రోత్సహించాలి

బుక్కపట్నం: ప్రతిఒక్కరు నగదురహిత లావాదేవీలను ప్రోత్సహించాలని బుక్కపట్నం సహకారసంఘం అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక సొసైటీ కార్యాలయంలో నగదురహిత లావాదేవీల పై ఖాతాదారులకు ఏపీజీబీ అధికారులు అవగాహన కల్పించారు.ఖాతాదారుడు ఏటీఎం ఉపయోగించాలని, నగదును బ్యాంకు నుంచి ఏటీఎం ద్వారా ఇతరుల ఖాతాల్లో జమ చేయడం నేర్చుకోవాలన్నారు.

'విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి'

చెన్నేకొత్తపల్లి: వినాయక చవితిని పురస్కరించుకుని గ్రామాల్లో ఏర్పాటు చేసుకునే విగ్రహాలకు పోలీసుల అనుమతి తప్పకుండా తీసుకోవాలని రామగిరి సీఐ యుగంధర్, ఎస్‌ఐ మహ్మద్‌రఫీ పేర్కొన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఉత్సవ కమిటీ సభ్యులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ...పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మూడురోజుల్లో ఉత్సవాలను ముగించాలన్నారు.

రైతు సదస్సును జయప్రదం చేయండి : సీపీఐ

రాప్తాడు: పీఏబీఆర్ కుడి కాలువ ద్వారా చెరువులకు 5 టీఎంసీలు నీరు అందించేందుకు ఈనెల 28న పంగల్‌రోడ్డు సమీపాన నిర్వహించే రైతు సదస్సును జయప్రదం చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి రామకృష్ణ తెలిపారు. రైతు సదస్సు జయప్రదం చేయాలని కోరుతూ... బుధవారం రాప్తాడు ,అయ్యవారిపల్లి గ్రామాల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గత 3 సంవత్సరాలుగా హంద్రీనీవ కాలువ నిర్మాణం పూర్తి కానందు వలనజీడిపల్లికి చేరిన హంద్రీనీవ నీటిని పీఏబీఆర్ కుడి కాలువ ద్వారా చెరువులకు నీరందించారు. ప్రస్తుతం హంద్రీనీవా కాలువ పూర్తయ్యాయి. జీడిపల్లి నుంచి హంద్రీనీవా నీటిని గొల్లపల్లి, చెర్లోపల్లి రిజర్వాయర్‌కు సరఫరా చేస్తారు. దీంతో కుడికాలువకు నీరు ప్రశ్నార్థంగా మారిందన్నారు. ఈ పరిస్థితుల్లో 5 టీఎంసీల హంద్రీనీవా నీటిని అధికారికంగా పీఏబీఆర్ కుడికాలువ కింద ఉన్న చెరువులకు విడుదల చేయాలని ప్రభుత్వం పై ఒత్తిడి తెస్తున్నామన్నారు. సదస్సుకు సీపీఐ నాయకులు, రైతులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి నాగరాజు, నాయకులు చలపతి, మౌలాళి, రమేష్, దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ సమస్యలు పరిష్కరిస్తాం

రాప్తాడు: కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల(కేజీబీవీ)లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని జిల్లా సర్పంచుల సంఘం గౌరవాధ్యక్షుడు ఆకుల వెంకటరాముడు తెలిపారు. బుధవారం పంగల్‌రోడ్డు సమీపాన గల కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను ఆయన పరిశీలించారు. పాఠశాల వెనుకవైపు నిల్వ ఉన్న మురికి నీరు దుర్వాసన వస్తోందని నిర్వాహకులు ముత్యాలమ్మ తెలిపారు. పాఠశాలకు ప్రహరీగోడ నిర్మాణానికి మంత్రి పరిటాల సునీతచే మాట్లాడి నిధులు మంజూరు చేయిస్తామన్నారు.

అంగన్‌వాడీల పనితీరు పరిశీలన

రామగిరి: మండలంలోని రామగిరి, నసనకోట పంచాయతీల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో వాటి పనితీరుపై బుధవారం ప్రత్యేకంగా పరిశీలించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన అన్న అమృతహస్తం పథకాన్ని ప్రత్యేకాధికారిణి, సూపర్‌వైజర్ జయంతి పరిశీలించారు. హాజరైన లబ్ధిదారులతో మాట్లాడి, ఈ పథకం ఏ విధంగా అమలవుతోందని ఆరా తీశారు. గుడ్డు, పాలు సరిగా అందుతున్నాయా అని తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల రికార్డులన్నీ క్షుణ్ణంగా తనిఖీ చేశారు. తనిఖీ సమయంలో ఎంపీపీ ఆంజనేయులు, నాయకులు కొండన్న, రామ్మూర్తినాయుడు ఉన్నారు.

'చంద్రన్న బీమా పేదలకు వరం'

రాప్తాడు: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మంగా చేపట్టిన చంద్రన్న బీమా పథకం పేదలకు వరమని ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం రాప్తాడుకు చెందిన భారతికి రూ.30 వేలు చెక్కును అందజేశారు. భారతి భర్త నాగేంద్ర కొన్నాళ్ళకిందట అనారోగ్యంతో మరణించారు. దీంతో ఆయన కుటుంబ సభ్యులకు ప్రభుత్వం చంద్రన్న బీమా కింద రూ.30 వేలు మంజూరుచేసింది. ఆ చెక్కును సర్పంచ్ ఆకుల వెంకటరాముడు, వెలుగు ఏపీఎం గోపాల్ బాధిత కుటుంబ సభ్యుల ఇంటివద్దకు వెళ్ళి చెక్కు అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నారాయణస్వామి, డీలర్ క్రిష్ణా తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో: మండల పరిధిలోని ముట్టాల గ్రామంలో బుధవారం ఓబులమ్మ అనే మహిళకు తక్షణ సాయంగా రూ.5వేలు చంద్రన్న బీమాను టీడీపీ మండల కన్వీనర్ సూరి చేతులమీదుగా పంపిణీ చేశారు. ఆమె భర్త అనారోగ్యంతో మృతి చెందడంతో ప్రభుత్వం చంద్రన్న బీమా ద్వారా ఆర్థికసాయం అందజేయనున్నట్లు తెలిపారు. తక్షణ సాయం కింద రూ.5వేలు పంపిణీ చేసి మిగిలిన మొత్తాన్ని కుటుంబ సభ్యులకు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల నాయకులు లింగన్న, ఆనంద్, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలను విస్తరిస్తాం

ఎస్కేయూ: ఎస్కేయూ అనుబంధ కళాశాలల్లో జాతీయ సేవా పథకం కార్యక్రమాలను విస్తృతం చేస్తామని ఎస్కేయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆచార్య విజయకుమారి పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ కార్యాలయంలో బుధవారం ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్‌గా ఆచార్య విజయకుమారి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..... కళాశాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. విస్తృతంగా మొక్కలు పెంపకం చేపడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పూర్వ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ జి వెంకటరమణ, గంజి రామ్మోహన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయంలోనూ తప్పని తిప్పలు

రోజంతా మొరాయించిన సర్వర్.. నిరాశతో వెనుదిరిగిన రైతులు

చెన్నేకొత్తపల్లి: రైతుకు ప్రత్యామ్నాయ విత్తనాలు పొందడంలోనూ తిప్పలు తప్పడం లేదు. కనీసం ఈ వర్షాలకైనా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవడానికి ఆసక్తి చూపుతున్న రైతన్నకు నిరాశే మిగిలుతోంది. విత్తనం కోసం వ్యవసాయాధికారి కార్యాలయం వద్దకు వస్తే అక్కడ సర్వర్ మొరాయించడం, వారిని తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది. స్థానిక ఏఓ కార్యాలయంలో కౌంటర్లను ఏర్పాటు చేసి ప్రత్యామ్నాయ విత్తనాలను పంపిణీ చేస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం కూడా విత్తనం కోసం రైతులు పెద్దఎత్తున అక్కడికి చేరుకున్నారు. ఉదయం కొద్దిసేపు మాత్రం సర్వర్ పనిచేసింది. ఆ తరువాత సాయంత్రం వరకు సర్వర్ పూర్తిగా మొరాయించడంతో రైతులు అక్కడే పడిగాపులు కాశారు. చివరికి ఇక సర్వర్ పనిచేయలేదని అధికారులు తెలపడంతో నిరాశతో వెనుదిరిగారు. అరకొరగా కురిసిన వర్షానికి కొర్ర, జొన్న, ఉలవ తదితర పంటలను సాగు చేసుకుందామని విత్తనం కోసం వస్తే రోజంతా కాసుకుని కూర్చోవడానికి సరిపోయిందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలానికి పెసర 15 క్వింటాళ్లు, సజ్జ 1.20 క్వింటాళ్లు, జొన్న 2 క్వింటాళ్లు వచ్చినట్లు తెలుస్తోంది.


కౌంటర్ వద్ద వేచివున్న రైతులు

అనంతపురం సప్తగిరిసర్కిల్: రూరల్ మండల పరిధిలోని గ్రామాలకు ప్రత్యామ్నాయ విత్తనాలు పంపిణీ నిలిచిపోయింది. సర్వర్ సతాయించడంతోనే పంపిణీ నిలిచిపోయినట్లు అధికారులు వెల్లడించారు. బుధవారం మండలం పరిధిలోని కురుగుంట, కామారుపల్లి, సజ్జలకాలువ, కందుకూరు, జంగాలపల్లి, గొళ్లపల్లి గ్రామ రైతులకు ప్రత్యామ్నాయ విత్తనాలు పంపిణీ నిర్వహించారు. ఈ నేపథ్యంలో రైతులు ఉదయం 9 గంటల కల్లా విత్తనాలు పంపిణీ జరుగుతున్న జిల్లా కేంద్రంలోని డీసీఎంస్ కార్యాలయానికి చేరుకున్నారు. అధికారులు విత్తనాలు పంపిణీ చేపట్టగా అనంతరం సర్వర్ నిలిచిపోయింది. చాలాసేపు ప్రయత్నించినా ప్రయోజనం లేకపోవడంతో రైతులు వెనక్కి పంపించారు. మొత్తం 66 మంది రైతులకు మాత్రమే విత్తనాలు పంపిణీ చేసినట్లు ఏఓ వాసుప్రకాశ్ తెలిపారు.

నేడు పంపిణీ చేసే గ్రామాలు ఇవే.. రూరల్ మండల పరిధిలోని ఉప్పరపల్లి, ఇటుకలపల్లి, చియ్యేడు, మన్నీల గ్రామాల రైతులకు గురువారం ప్రత్యామ్నాయ విత్తనాలు పంపిణీ చేపడ్తామని ఏఓ వాసుప్రకాశ్ తెలిపారు. పంట వేయని రైతులకు మాత్రమే విత్తనాలు పంపిణీ చేస్తామన్నారు.

'దళిత మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి'

రామగిరి: ప్రభుత్వం దళిత మహిళల ఆర్థికాభివృద్ధికి ఎంతో కృషి చేస్తోందని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ముత్యాలంపల్లి, వెంకటాపురం, కొత్తగాదిగకుంట గ్రామాల్లో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో సూడిగేదెల పంపిణీ పథకంలో వచ్చిన గేదెలను సరఫరా చేశారు. ఈసందర్భంగా టీడీపీ నాయకులు, మంత్రి తండ్రి కొండన్న, మాజీ జడ్పీటీసీ రామ్మూర్తి నాయుడు, ఎంపీపీ బడగొర్ల ఆంజనేయులు, మండల ఉపాధ్యక్షుడు పరంధామయాదవ్ తదితరులు మాట్లాడుతూ...ప్రభుత్వం దళితుల అభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తోందన్నారు. ప్రత్యేక రుణాలు, పిల్లల విద్యాభివృద్ధికి కృషి చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో పశువైద్యురాలు రమాదేవి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


గేదెలను పంపిణీ చేస్తున్న దృశ్యం

జ్ఞాన స్వరూపుడు గణపతి

ఎరా ఇంటర్నేషనల్ స్కూల్లో చవితి వేడుకలు

అనంతపురం సప్తగిరిసర్కిల్: జ్ఞాన స్వరూపుడు గణపతి అని ఎరా ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ అరుణ్‌కుమార్‌రెడ్డి, డీన్ నరసింహారావు పేర్కొన్నారు. బుధవారం పాఠశాలలో వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులు ఏక దంతుని స్తుతిస్తూ గీతాలాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..... వినాయకుడు బుద్ధికి, సిద్ధికి ప్రతిరూపమన్నారు. విజ్ఞానం, పట్టుదల కలవారని వివరించారు. ఇలాంటి లక్షణాలు వినాయకుడి నుంచి విద్యార్థులు గ్రహించాలని సూచించారు. కార్యక్రమంలో రీజనల్ ఇన్‌చార్జ్ విశ్వనాథ్‌రెడ్డి, ఆపరేషన్ హెడ్ కుశల్‌కుమార్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ టీచర్ మిలింద్‌ఆక్రే పాల్గొన్నారు.


గణనాథున్ని పూజిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

రుణాల మంజూరుకు ఇంటర్వ్యూలు

అనంతపురం సప్తగిరిసర్కిల్: రూరల్ మండలంలో ఎస్సీఎస్టీ, మైనార్టీ(క్రిష్టియన్ కార్పొరేషన్‌ల ద్వారా రుణాల మంజూరు కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మండల అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అధికారులు ఇంటర్వ్యూలకు హాజరైన అభ్యర్థుల వివరాలు, సర్టిఫికెట్లను పరిశీలించారు. దరఖాస్తు చేసుకున్న యూనిట్లలో అభ్యర్థులకు ఉన్న అనుభవాలు తదితర విషయాలను ఆరా తీశారు. మొత్తం 253 మంది ఇంటర్వ్యూలకు హాజరైనట్లు ఈఓఆర్‌డీ లక్ష్మీనరసింహ తెలిపారు. గురువారం ఇంటర్వ్యూలు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో బ్యాంకు అధికారులు విజయరాఘవన్, శ్రీనివాసులు, వినాయక్ పాల్గొన్నారు.

రాప్తాడులో: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సబ్సిడీ రుణాల ఇంటర్వ్యూలకు అనూహ్యస్పందన లభించింది. రాప్తాడు, హంపాపురం, గొందిరెడ్డిపల్లి కెనరా బ్యాంక్ పరిధిలో సబ్సిడీ రుణాలకోసం దరఖాస్తు చేసుకున్న ఎస్సీ, ఎస్టీ, బీ సీ, మైనార్టీ అభ్యర్థులు 200 మందికి పైగా హాజరయ్యారు. అర్హుల ను ఎంపిక చేసి రుణాలు మంజూరు చేస్తామని ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్లు పామిలేటయ్య, జగదీష్ పాల్గొన్నారు.

రామగిరిలో: మండలంలో వివిధ కార్పొరేషన్ల ద్వారా మంజూరైన యూనిట్లకు లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు బుధ వారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపీపీ బడగొర్ల ఆంజనేయులు, ఎంపీడీఓ పూలనరసింహులు, బ్యాంకర్లు, సర్పంచ్‌ల సమక్షంలో లబ్ధిదారుల ఎంపిక చేపట్టారు. బీసీలకు 70, కాపులకు 60, ఎస్సీలకు 44, ఎస్టీలకు 5, మైనార్టీలకు 6, గ్రూపులకు 4 యూనిట్లు మంజూరు కాగా, వీటన్నింటికీ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూలకు సుమారు 280 మంది అభ్యర్థులు హాజయ్యారు. ప్రభుత్వం సబ్సిడీ రుణాలందించి ఆర్థిక అభివృద్ధి సాధించడానికి కృషి చేస్తోందని లబ్ధిదారులు పేర్కొన్నారు.

కనగానపల్లిలో: రాయితీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో కనగానపల్లి స్టేట్‌బ్యాంకు, నూతిమడుగు, పేరూరు ఏపీజీబీశాఖల పరిధిలోని అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. స్టేట్‌బ్యాంకు మేనేజర్ నాగేశ్వరరావు, ఈఓఆర్‌డీ మమతాదేవి దరఖాస్తులను పరిశీలించి ఇంటర్వ్యూలు చేశారు. ఈకార్యక్రమంలో సూపరింటెండెంట్ నాగేంద్ర, సర్పంచ్‌లు బాలయ్య, బంగి మల్లేశు, నారాయణలు పాల్గొన్నారు.

ఘనంగా ప్రకాశం పంతులు జయంతి

ఆత్మకూరు: మండల తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను మండల అధికారులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎంతో మంది ఆయనను స్ఫూర్తిగా తీసుకుని ఉన్నతస్థాయికి ఎదిగారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆదినారాయణ, తహసీల్దార్ భూషణం ఇతర మండల అధికారులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడికి సన్మానం

కనగానపల్లి: సమాజంలో ఉపాధ్యాయవృత్తి గౌరవప్రదమని సర్పంచ్ సూర్యశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. ముక్తాపురం ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్లిన ప్రధానోపాధ్యాయుడు పుల్లన్నను బుధవారం ఘనంగా సన్మానించారు. గ్రామస్థులు, సర్పంచ్ ఆయనకు శాలువాలు, పూలమాలలు వేసి సన్మానించారు. కార్యక్రమంలో నూతన హెచ్ఎం రాధమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

కనగానపల్లి: మండల ఏపీటీఎఫ్ నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మామిళ్లపల్లి జిల్లాపరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర కౌన్సిలర్ బాలరాజు, ఉపాధ్యక్షుడు బీకే ముత్యాలప్ప కమిటీని ఎన్నుకున్నారు. మండల గౌరవాధ్యక్షుడిగా పోలా శ్రీరంగనాయకులు, అధ్యక్షుడిగా మహ్మద్‌రఫీ, ప్రధానకార్యదర్శిగా ఆంజనేయులు, ఉపాధ్యక్షుడిగా లింగన్న, కిష్టయ్యలతో పాటు పదిమంది సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు రవికుమార్, చంద్రకళ, వన్నూరప్ప తదితరులు పాల్గొన్నారు.

1న ఎస్కేయూ నాన్‌టీచింగ్ ఎన్నికలు

ఎస్కేయూ: ఎస్కేయూ నాన్‌టీచింగ్ ఎన్నికల నగారా మోగింది. 24న నామినేషన్ల పర్వం ప్రారంభం కానుంది. సెప్టెంబర్ 1న ఎన్నికలు జరగనున్నాయి. పోటీపడుతున్న అభ్యర్థులు తమ ప్రచారాన్ని ప్రారంభించారు. అధ్యక్షులుగా రామకృష్ణ, వెంకట్రాముడు, ఉపాధ్యక్షులుగా నాగయ్య, రామ్మోహన్‌రెడ్డి, సెక్రటరీగా కేశవరెడ్డి, నాగప్రసాద్ పోటీపడుతున్నారు.

ఆంధ్రజ్యోతి శింగనమల
గురువారం 24, ఆగస్టు 2017
13
|శింగనమల |నార్పల |బుక్కరాయసముద్రం |గార్లదిన్నె |యల్లనూరు |పుట్లూరు|

సయోధ్య కుదిరే వరకు భూముల్లోకి వెళ్లకండి : తహసీల్దార్

శింగనమల: అన్నదమ్ముల మధ్య సయోధ్య కుదిరే వరకు సమస్యగా ఉన్న భూమిలో వెళ్లవద్దని తహసీల్దార్ నాగేంద్ర సూచించారు. మదిరేపల్లి గ్రామంలో అన్నదమ్ములైన రైతులు ఆరుగురిలో ఒకరు భూ సమస్యపై సోమవారం సెల్‌టవర్‌ఎక్కి నిరసన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆరుగురు అన్నదమ్ముళ్లను పిలిపించి తహసీల్దార్ చర్చించారు. అందరికీ సమానంగా భూమిని పంచుతామని ఆయన తెలిపారు. లేనిపక్షంలో ఈ భూమిని ఎవరూ చేసుకోరాదన్నారు. ఇక్కడ 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఎవరైనా చట్టానికి వ్యతిరేకంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

పైరు కళకళ...రైతు విలవిల!

● నాసిరకం విత్తనాలతో తగ్గిన దిగుబడి ● ఆందోళనలో అన్నదాత

గార్లదిన్నె: ఎన్నో ఆశాలతో ఆరుగాలం శ్రమించి పంటను సాగుచేసిన రైతులకు నిరాశే మిగిలింది. మండలంలోని ఓబుళాపురం గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ అనే రైతు తనకున్న భూమిలో రెండెకరాల్లో బెండ సాగుచేశాడు. అనంతపురంలోని శ్రీ సాయి బాలజీ ట్రేడర్స్ షాపులో బేర్ కంపెనీకి సంబంధించిన స్మామ్రాట్ రకం విత్తనాలు రూ.7950 వెచ్చించి కొనుగోలు చేశాడు. విత్తనాలు నాటి ఎప్పటి కప్పుడు రసాయనిక మందులు వేస్తూ పంటను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చాడు. బెండ పైరు ఏపుగా పెరుగింది. పంట కళకళలాడుతోందని, దిగుబడి రాకపోవడంతో రైతు విలవిలలాడిపోయాడు. బెండ పంట సాగుచేసి ఇప్పటికి 50 రోజులు పూర్తయ్యిందన్నారు. ఇప్పటికి నాలుగు కోతలు చేశామన్నారు. కోతకు కేవలం 50, 60 కేజీల దిగుబడి వచ్చిందన్నారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని రైతు కోరుతున్నాడు.


ఏపుగా పెరిగిన బెండ

వైద్య శిబిరానికి స్పందన



రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

గార్లదిన్నె: మండల పరిధిలోని కృష్ణాపురంలో బుధవారం ప్రాథమిక వైద్యాధికారి అన్వర్ బాషా ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. 71 మందికి వైద్య పరీక్షలు చేయగా 5 మందికి జ్వరం ఉన్నట్లు గుర్తించి రక్త పరీక్షలు చేసి మందులు పంపిణీ చేసినట్లు వైద్యాధికారి తెలిపారు. క్యార్యక్రమంలో సీహెచ్ఓ నాగరాజు, సూపర్ వైజర్లు తులశమ్మ, హెల్త్ అసిస్టెంట్లు ధనుంజయ, శివానంద, సరోజమ్మ, జయంతి, నాగలక్ష్మి, లీలావతి, అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

సమయపాలన పాటించకపోతే చర్యలు తప్పవ్

గార్లదిన్నె: ఉపాధ్యాయులు సమయపాలన పాటించకపోతే శాఖాపరమైన చర్యలు తప్పవని ఎంఈఓ చంద్రానాయక్ హెచ్చరించారు. మండలంలోని తిమ్మంపేట ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలో రిజిస్టర్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమయపాలన పాటించకపోతే చర్యలు తప్పవని అన్నారు.

31న తలనీలాల వేలం

నార్పల: మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన గూగూడు కుళ్లాయిస్వామి ఆలయంలో తలనీలాల వేలాన్ని 31వ తేదీన నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వహణాధికారి మోహన్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ రాజన్న తెలిపారు. వారు మాట్లాడుతూ వేలం పాల్గొనేవారు రూ.50 వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు.

తపాలా ఉద్యోగుల సమ్మె విరమణ

శింగనమల: తపాలా శాఖ గ్రామీణ ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారానికి చేపట్టిన సమ్మెను బుధవారం విరమించారు. తమ విధుల్లోకి వెళ్తున్నట్లు ఉద్యోగులు గురుస్వామి, సుబ్బారెడ్డి, సత్యమూర్తి, రాజు, కుళ్లాయప్ప, భాగ్యలక్ష్మి, బాలకృష్ణ తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు అధిష్ఠానం నిర్ణయించడంపై వారు హర్షం వ్యక్తం చేశారు.

వాహనాల తనిఖీ

యల్లనూరు : మండలంలో దంతలపల్లి క్రాస్ వద్ద బుధవారం నిర్వహించిన వాహనాల తనిఖీలో 20 వాహనాలకు రూ.8,400 జరిమానా విధించినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. రికార్డులు సరిగాలేని వాహనాలకు, లైసెన్సులు లేనివారికి జరిమానా విధించామన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు : మండలంలోని నీర్జాంపల్లి సమీపంలో పేకాడుతున్న ఏడుగురుని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.6,800 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నార్పలలో : మండల కేంద్రంలోని నార్పల క్రాసింగ్ వద్ద బుధవారం లైసెన్స్‌లేని వాహనాలకు రూ.3,200 జరిమానా విధించినట్లు ఎస్ఐ రామచంద్రారెడ్డి తెలిపారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెంట్ తప్పక ధరించాలని సూచించారు.

పుట్లూరు : మండలంలోని ఏ కొండాపురం వద్ద బుధవారం 8 మంది పేకాటరాళ్లను అరెస్టు చేసినట్లు ఎస్ఐ సురేష్‌బాబు తెలిపారు. వారినుంచి రూ.6,220 స్వాధీనం చేసుకున్నారు.

శింగనమల చెరువు పరిశీలన

శింగనమల: జిల్లాలో అతిపెద్ద చెరువైన శింగనమల చెరువులో వినాయక నిమజ్జనం చేసేందుకు బుధవారం డీఎస్పీ మల్లికార్జున, అనంతపురం నగర మేయర్ స్వరూప బుధవారం సాయంత్రం పరిశీలించారు. అనంతపురం చుట్టుపక్కల గ్రామాల్లో ఎక్కడా నీరులేకపోవడంతో శింగనమల చెరువులో నిమర్జనం చేసేందుకు వారు చెరువును పరిశీలించారు.

చెన్నంపల్లిలో స్వైన్‌ఫ్లూ కేసు

బుక్కరాయసముద్రం: మండల పరిధిలోని చెన్నంపల్లి గ్రామంలో 22 ఏళ్ల యువకుడుకి స్వైన్‌ఫ్లూ జ్వరం సోకింది. రెండు రోజుల క్రితం మల్లిఖార్జున రెడ్డి కుమారుడుకి జ్వరం వచ్చింది. చికిత్స కోసం అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడి వైద్యులు స్వైన్‌ఫ్లూ లక్షణాలు ఉన్నాయని మెరగైన వైద్యం కోసం బెంగుళూరు తరలించాలని సూచించారు.


శింగనమలలో విత్తనాల కోసం వేచి ఉన్న రైతులు

ప్రత్యామ్నాయ విత్తనాల పంపిణీ

నార్పల: వందశాతం సబ్సిడీతో ప్రత్యామ్నాయ విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు ఏఓ వెంకట్‌కుమార్ తెలిపారు. బుధవారం చామలూరు రైతులకు విత్తనాలను అందజేశామన్నారు. 24న సిద్దరాచెర్ల, దుర్గం, 26న సోదనపల్లి, 28న బండ్లపల్లి, 29 బీ పప్పూరు, 30న గూగూడు, 31న నార్పల, సెప్టెంబర్ 1న నడిమిదొడ్డిపల్లి, 2న వెంకటాంపల్లి, దిగుమర్రి, 4న బొందలవాడ గ్రామాల రైతులకు ఉలవలు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఈఓ వీరాంజి, ఎంపీఈఓలు పాల్గొన్నారు.

శింగనమలలో : ప్రత్యామ్నాయ విత్తనాల పంపిణీలో సర్వర్‌డౌన్‌కావడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయం విత్తనాలకోసం రైతులు క్యూలో నిలబడ్డారు. సర్వర్ సమస్యతో పంపిణీ ఆలస్యమైంది. అనంతరం సమస్య పరిష్కారం కావడంతో విత్తనాలు పంపిణీ సాఫీగా సాగింది. కార్యక్రమంలో ఏఓ సత్యనారాయణ, ఏఈఓ శైలజ, ఎంపీఈఓలు పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాల మంజూరుకు ఇంటర్వ్యూలు

శింగనమల: మండలంలోని నాలుగు బ్యాంకుల పరిధిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు రుణాలకోసం బుధవారం నిర్వహించిన ఇంటర్వ్యూలు వందలాది అభ్యర్థులు హాజరయ్యారు. ఎంపీపీ అమృత, ఎంపీడీఓ ఆర్ జయరాములు, బ్యాంక్ మేనేజర్లు బాలాజి నాయక్, పురుషోత్తం ఆధ్వర్యంలో ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. సలకం చెరువు, కల్లూరు స్టేట్ బ్యాంక్, తరిమెల, గార్లెదిన్నె అనంత ప్రగతి గ్రామీణ బ్యాంక్ పరిధిలోని గ్రామాల్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి ఇంటర్వ్యూలు చేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఉమాదేవి, మల్లికార్జున, రమాదేవి, రవి, కార్యదర్శులు బాలముని, రఫీ, మహబూబ్‌బీ, మసూద్ వలి, రాజశేఖర్ పాల్గొన్నారు.

నేడు రుణమేళా : మండలంలోని రెండు బ్యాంకుల పరిధిలో గురువారం రుణమేళా నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఆర్ జయరాములు తెలిపారు. శింగనమల, వెంకటాంపల్లి సిండికేట్ బ్యాంక్ పరిధిలోని గ్రామాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కాపురుణాల లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారందరూ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు.

గార్లదిన్నెలో : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన రుణాల ఇంటర్వ్యూలకు మంచి స్పందన లభించింది. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన యువకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపు, మైనార్టీ కార్పొరేషన్ ద్వారా రాయితీ రుణాలను మంజూరు చేసింది. గార్లదిన్నె మండలానికి 200 యూనిట్లు మంజూరు కాగా, 1100 మంది అభ్యర్థులు దరఖాస్తు చేస్తున్నారు. వీరందరికీ ఇంటర్వ్యూలు నిర్వహించగా 1100 అభ్యర్థులకు 750 మంది హాజరైనట్లు తెలిపారు. అభ్యర్థుల సర్టిఫికేట్లు పరిశీలించి అర్హులైన వారిని ఎంపిక చేస్తామని అధికారులు తెలిపారు.

పుట్లూరులో : మండలకేంద్రంలో బుధవారం పలు కార్పొరేషన్లకు సంబంధించి రుణాల మంజూరు కోసం అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 829మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోగా 467మంది హాజరయ్యారు. 42 ఎస్సీ యూనిట్లకు 408 మంది, 70 బీసీ యూనిట్లకు 284 మంది, 60 కాపు యూనిట్లకు 127 మంది, 5 మైనార్టీ యూనిట్లకు 10 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇంటర్వ్యూల్లో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రమేష్‌బాబు, ఈఓఆర్డీ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.



శింగనమల, గార్లదిన్నెలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న బ్యాంకు అధికారులు

వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి

నార్పల: మండలంలో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసేవారు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఏఎస్ఐ రామచంద్రారెడ్డి కోరారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ వినాయక విగ్రహాలు మూడు రోజుల పాటు పెట్టుకుని ప్రశాంతంగా నిమజ్జనం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

గార్లదిన్నెలో: వినాయక చవితి పండుగను పురస్కరించుకుని మండలంలో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసేవారు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఐ ప్రదీప్‌కుమార్ సూచించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎక్కడైన విగ్రహాలు ఏర్పాటు చేసేవారు ఐదుగురు కమిటీ సభ్యులుగా ఏర్పడాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

అడంగల్‌కు డబ్బు డిమాండ్ చేస్తున్నారు

కలెక్టర్‌కు రైతుల ఫిర్యాదు


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతు

బుక్కరాయసముద్రం : సార్ నాకున్న 87 సెంట్లు భూమిని ఆన్‌లైన్‌లో ఎక్కించడానికి రెవెన్యూ అధికారులు డబ్బులు డిమాండ్ చేస్తున్నారని జిల్లా కలెక్టర్‌కు జంతులూరు రైతులు ఫిర్యాదు చేశారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చిన కలెక్టర్ వీరపాండ్యన్‌కు రైతులు జింకలసుబ్బరాయుడు, ఎర్రెప్ప కలెక్టర్‌ను కలిసి తమ గోడు వెళ్లబుచ్చారు. స్పందించిన కలెక్టర్ ఆర్డీఓ మల్లోలాకు సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు.

ఘనంగా భైరవేశ్వరస్వామి జయంతి


ప్రత్యేక అలంకరణలో స్వామివారు

నార్పల: మండలంలోని బొమ్మకుంటపల్లి గ్రామ సమీపంలో బుధవారం భైరవేశ్వర స్వామి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే దిగుమర్రి గ్రామానికి రెడ్డి కులస్తులు స్వామివారికి ఆకుపూజ, నిమ్మకాయల హారాలు అలంకరించి పూజలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కార్యక్రమంలో ఆలయ పూజారులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే టీడీపీ ధ్యేయం


విత్తనాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

బుక్కరాయసముద్రం : రైతు సంక్షేమమే టీడీపీ ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ మండల కన్వీనర్ అశోక్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుకు 100 శాతం సబ్సిడీతో మంజూరు చేసినట విత్తనాలను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఓ చిన్నమ్మ , సర్పంచ్‌గుర్రప్ప, జిల్లా టీడీపీ నేతలు పొడరాళ్ల రవీంద్రా, జొన్నారామయ్య, మల్లేష్, లోక్‌నాథ్ రెడ్డి, ఆదెప్ప పాల్గొన్నారు.

ఘనంగా ప్రకాశం పంతులు జయంతి

పెద్దవడుగూరు : మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని రెవెన్యూ అధికారులు ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ విష్ణువర్ధన్‌రెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ముఖ్యమంత్రిగా ప్రకాశంపంతులు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ రజాక్ వలి, వీఆర్వోలు రమేష్‌రెడ్డి, దామోదర్‌నాయుడు, లక్ష్మీపతి, రంగస్వామి, రంగయ్య, జయచంద్రారెడ్డి, సుంకన్న, శంకర పాల్గొన్నారు.




ఉత్సవ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న సీఐ, తాడిపత్రిలో మట్టివినాయకులను అందజేస్తున్న విద్యార్థులు

వినాయక నిమజ్జనాన్ని ప్రశాంతంగా నిర్వహించండి

యాడికి : వినాయకుని నిమజ్జనం ఎలాంటి ఘర్షణలు పడకుండా ప్రశాంతంగా నిర్వహించాలని సీఐ నరేంద్రరెడ్డి, ఎస్‌ఐ కత్తిశ్రీనివాసులు తెలిపారు. వినాయకచవితి పండుగ సందర్భంగా వినాయకుల విగ్రహాలు ఏర్పాటుచేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులతో బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ ఉత్సవ కమిటీ నిర్వాహకులు వినాయకుని మంటపం వద్ద ఎలాంటి చట్టవిరుద్ధమైన పనులు చేయరాదని, రికార్డింగ్ డ్యాన్సులు పెట్టరాదని తెలిపారు. చుట్టుప్రక్కల ప్రజలకు ఇబ్బంది కలిగేలా ఎక్కువ సౌండుతో పాటలు పెట్టరాదని సూచించారు. నిమజ్జనం సందర్భంగా ఊరేగింపులో రంగులు చల్లుకొని రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసుకొని ఘర్షణలకు తావివ్వకుండా ప్రశాంతంగా ఊరేగింపు నిర్వహించాలన్నారు. వినాయకుని నిమజ్జనం చేసే చెరువులు, కుంటల వద్దకు చిన్నపిల్లలను తీసుకెళ్లరాదని సూచించారు. ఈ సమావేశంలో శాంతికమిటీ సభ్యులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తాడిపత్రిటౌన్‌లో : స్థానిక కాల్వగడ్డవీధిలో ఉన్న శ్రీ చైతన్య పాఠశాలలో బుధవారం యాజమాన్యం విద్యార్థుల తల్లిదండ్రులకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేసింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఏజీఎం సుబ్బారెడ్డి మాట్లాడుతూ పర్యావరణానికి హాని కలిగించే రసాయనాలతో చేసిన విగ్రహాలను ప్రోత్సహించరాదన్నారు. మట్టితో తయారుచేసిన విగ్రహాలను ఉపయోగించి పర్యావరణాన్ని కాపాడవలసిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, డీన్ మురళీధర్‌రావు, ఏఓ నాగేశ్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిన్నారుల్లో సృజనాత్మకతను వెలికితీయాలి

తాడిపత్రి : చిన్నారుల్లో సృజనాత్మకత పెంచడంలో భాగంగా ఎల్లో బ్లూమ్ కార్యక్రమాన్ని ఏర్పాటుచేశామని సీడీపీఓ శశికళ తెలిపారు. పట్టణంలోని వైఎస్సార్ ఫంక్షన్ హాలులో బుధవారం ఎల్లో బ్లూమ్ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీల్లో కార్పొరేట్ స్థాయి విద్యను అందించడంలో భాగంగా చిన్నారులకు వివిధ రంగులపై అవగాహన పెంచేందుకే ఈ కార్యక్రమం ఉద్దేశమన్నారు. ప్రతి నెలా ఒక రంగుపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఆయా రంగులకు సంబంధించిన పూలు, పండ్లు, కూరగాయల గురించి చిన్నారులకు టీచర్లతో పాటు తల్లిదండ్రులు వివరించాలన్నారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ ధనలక్ష్మి, కోఆర్డినేటర్ యుగంధర్, అసిస్టెంట్ కోఆర్డినేటర్ పల్లవి, సూపర్‌వైజర్లు రామలక్ష్మి, సరోజ, పార్వతి, సువర్ణదేవి పాల్గొన్నారు.

తాడిపత్రిలో నాకాబందీ



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ

తాడిపత్రిటౌన్ : పట్టణంలోని 5వ వార్డులో బుధవారం సీఐ భాస్కర్‌రెడ్డి, ఎస్‌ఐ ఆంజనేయులు స్పెషల్‌పార్టీ పోలీసులతో కలిసి నాకాబందీ నిర్వహించారు. రౌడీషీటర్లు, గతంలో మట్కా రాసినవారి ఇళ్లలో సోదాలు చేశారు. అనంతరం రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని సీఐ వారికి హెచ్చరించారు. అనంతరం నెంబర్లు లేని వాహనాలను తనిఖీ చేశారు.

అర్హులైన వారికి సంక్షేమ పథకాలు మంజూరు చేయండి

పెద్దవడుగూరు : అర్హులైన వారికి సంక్షేమ పథకాలు మంజూరు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి నారాయణ, లింగన్న, తహసీల్దార్ విష్ణువర్ధన్‌రెడ్డికి కోరారు. సీపీఐ ఇంటింటి ప్రచారంలో భాగంగా అర్హులైన ప్రజలకు సంక్షేమ పథకాలను అందలేదని, వారి జాబితాను తహసీల్దార్ విష్ణువర్ధన్‌రెడ్డికి అందచేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో సూర్యనారాయణరెడ్డి, వెంకటరాముడుయాదవ్, రంగస్వామి, అల్లాబకాష్ పాల్గొన్నారు.

ఆరోగ్య ఉపకేంద్రాన్ని పరిశీలించిన ఏడీ

పెద్దవడుగూరు : మండలంలోని అప్పేచర్ల గ్రామంలో ఉన్న ఆరోగ్య ఉపకేంద్రాన్ని ఆరోగ్యశాఖ అడిషనల్ డైరెక్టర్ గీతాప్రసాదని, అడిషనల్ డీఎం అండ్‌హెచ్‌ఓ అనిల్‌కుమార్‌లు పరిశీలించారు. ప్రస్తుతమున్న ఆరోగ్య ఉపకేంద్రాన్ని మరింత మెరుగ్గా మార్చేందుకు పరిశీలించడానికి వచ్చినట్లు వారు తెలిపారు. మారుమూల ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్యం అందించడంలో భాగంగా ఈ చర్యలు చేపట్టినట్లు వారు తెలిపారు. అనంతరం రికార్డులు పరిశీలించి ఆరోగ్య ఉపకేంద్రానికి వచ్చే రోగులకు ఎలాంటి వైద్యసేవలు అందుతున్నాయి, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉన్నారా అని ప్రజలను ఆరాతీశారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం ప్రోగ్రాం అధికారి కిశోర్, డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



ఆరోగ్య ఉపకేంద్రాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ డైరెక్టర్

సీవీ రామన్ కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే

తాడిపత్రిరూరల్ : మండలంలోని రావివెంకటాంపల్లి గ్రామ సమీపంలో ఉన్న సీవీ రామన్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం ఫ్రెషర్స్‌డేను ఘనంగా నిర్వహించారు. ఇందులోభాగంగా కళాశాలలో మొదటి సంవత్సరంలో చేరు విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు ఘనస్వాగతం పలుకుతూ ఫ్రెషర్స్‌డే నిర్వహించారు. అనంతరం అన్ని బ్రాంచ్‌ల విద్యార్థులు పరిచయ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆట పాటలతో కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. అంతకు ముందు కళాశాల చైర్మన్ భాస్కర్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర శ్రమ ఉంటే ఎంతటి లక్ష్యాన్నయినా సాధించవచ్చన్నారు. ఇంజనీరింగ్ విద్యలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సద్వినియోగపరుచుకొని జీవిత లక్ష్యాలను సాధించి తల్లిదండ్రులకు, విద్యాసంస్థకు మంచి పేరు తేవాలని ఆయన కోరారు. ప్రిన్సిపల్ ఇందూధర్‌రెడ్డి మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యలో మొదటి సంవత్సరం నుంచే మంచి మార్కులు సాధించడంతో పాటు జీవితంలో ఒక నిర్దేశిత లక్ష్యాన్ని ఉంచుకొని ముందుకెళ్లాల న్నారు. కార్యక్రమంలో అన్ని విభాగాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ భాస్కర్‌రెడ్డి, స్టెప్పులు వేస్తున్న విద్యార్థినులు

లోకల్ గైడ్

localguide



తాడిపత్రి మార్కెట్‌లో కూరగాయల ధరలు

పచ్చి మిరపకాయలు-రూ.30, టమోట-30, ఉల్లిగడ్డలు-40, ఉర్లగడ్డలు-15, అంకుర వంకాయలు- 30, ముల్లంకాయలు: 40, చిక్కుడుకాయలు-30, మొటిక్కాయలు- 24, బెండకాయలు-24, బీరకాయలు-20, కాకరకాయలు-24, క్యారెట్-40, క్యాబేజీ-20, క్యాలీఫ్లవర్-35, బీట్ రూట్- 25, దోసకాయలు:20, ముల్లంగి : 20, బీన్సు - రూ.50.

తాడిపత్రి సినిమాలు

బీహెచ్ మహల్ : ఆనందో బ్రహ్మ (సెల్ ఫోన్ :08558222772), లక్ష్మీనారాయణ : జయ జానకీ నాయక (సెల్‌ఫోన్: 9848957005), విజయలక్ష్మి: లై (సెల్‌ఫోన్: 08558-223078), వరలక్ష్మి: నేనే రాజు నేనే మంత్రి (సెల్‌ఫోన్:08558-223078), జయలక్ష్మి: ఫిదా (సెల్‌ఫోన్: 08558- 223078), సాయితేజ: గౌతమ్‌నందా (సెల్‌ఫోన్: 08558 -221100), దాదా: వివేకం

యాడికి: లక్ష్మీప్రియ: నక్షత్రం (సెల్‌ఫోన్: 90592 90284)

మాంసం ధరలు

చికెన్ (కేజీ) : రూ.140, స్కిన్‌లెస్ చికెన్ : 160, మటన్ : 440, చేప: 120, గుడ్లు (100) : రూ.410

గ్యాస్ సమాచారం

అందుబాటులో ఉన్న సిలిండర్లు
ఇండియన్ : 350 హెచ్‌పీ గ్యాస్ : 335

ఎమ్మెల్యే డైరీ

తాడిపత్రి : ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి గురువారం ప్రజలకు అందుబాటులో ఉంటారు.

నేటి నుంచి విత్తనాల పంపిణీ

యాడికి : స్థానిక వ్యవసాయ కార్యాలయంలో గురువారం నుంచి వందశాతం సబ్సిడీతో ప్రత్యామ్నాయ విత్తనాలు అలసందలు, ఉలవలు పంపిణీ చేయనున్నట్లు వ్యవసాయాధికారిణి లీనా వసుంధర తెలిపారు. 24న తిమ్మాపురం, వేములపాడు, ఓబుళాపురం, కోనుప్పలపాడు రెవెన్యూ గ్రామ రైతులకు, 26న నగరూరు, చందన, రాయలచెరువు, తూట్రాళ్లపల్లి రెవెన్యూ గ్రామా రైతులకు, 28న యాడికి, పుప్పాల రెవెన్యూ గ్రామాల రైతులకు, 29న కమలపాడు, నిట్టూరు రెవెన్యూ గ్రామాలకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఇంతవరకు పొలంలో ఏ రకమైన పంటలు సాగు చేయకుండా ఉండడంతో పాటు ఈ-క్రాప్ బుకింగ్‌లో పంటల వివరాలు నమోదు చేయని రైతులకు మాత్రమే ఈ విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ విత్తనాలు తీసుకొని రైతులు దుర్వినియోగం చేస్తే రైతుల నుంచి విత్తనాల ధరను రికవరీ చేస్తామని హెచ్చరించారు. పాసుబుక్కులోని రైతు ఆధార్‌కార్డు జిరాక్స్‌ను తీసుకొనివచ్చి విత్తనాలు పొందాలని తెలిపారు.

పెద్దపప్పూరులో : మండలంలోని రైతులకు ప్రత్యామ్నాయ విత్తన పంపిణీని గురువారం నుంచి నిర్వహిస్తున్నట్లు వ్యవసాయాధికారిణి దేవీ పద్మలత తెలిపారు. ఇందులో భాగంగా సజ్జలు, కొర్రలు వందశాతం సబ్సిడీతో పంపిణీ చేస్తున్నామన్నారు. గ్రామాలవారిగా విత్తన పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఇందులోభాగంగా 24న జూటూరు, అమ్మళ్లదిన్నె, ముచ్చుకోట, 26న దేవునుప్పలపాడు, చిన్నఎక్కలూరు, 28న నరసాపురం, జోడిధర్మాపురం, పెండేకల్లు, 29న కుమ్మెత, అత్తిరాళ్లదిన్నె, పసలూరు, 30న పెద్దఎక్కలూరు, పెద్దపప్పూరు, ధర్మాపురం, 31న గార్లదిన్నె, తబ్జుల గ్రామాలకు విత్తన పంపిణీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే జొన్నలు కేజీ రూ.50ల చొప్పున ఇవ్వడం జరుగుతుందని ఆమె అన్నారు. కావలసిన రైతులు పట్టాదారు పాసుపుస్తకంతో పాటు ఆధార్‌కార్డు వెంట తెచ్చుకోవాలని ఆయన తెలిపారు.

తాడిపత్రిరూరల్‌లో : ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు, వికలాంగులకు రుణాల మంజూరు కోసం ఈనెల 29నుంచి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ చలపతి తెలి పారు. 29న చిన్నపొలమడ, పెద్దపొలమడ, కోమలి, రావి వెంకటాంపల్లి, తేరన్నపల్లి, యర్రగుంటపల్లి, దిగువపల్లి, చు క్కలూరు, గంగాదేవిపల్లి, ఇగుడూరు, సజ్జలదిన్నె, వెంకటరెడ్డి పల్లి, కావేటిసముద్రం, భోగసముద్రం, ఊరుచింతల, గన్నెవారి పల్లి, బ్రాహ్మణపల్లి, 30న చల్లవారిపల్లి, బొందలదిన్నె, వం గనూరు, కొండేపల్లి, హుసేనాపురం, వీరాపురం, ఆలూరు, వెల మకూరు, బోడాయిపల్లి గ్రామపంచాయతీలకు ఇంటర్వ్యూలు జరుగుతాయని తెలిపారు.

నేడు ఈఎస్ఐసీపై అవగాహన సదస్సు

తాడిపత్రిరూరల్ : మండలంలోని ఆల్ట్రాటెక్ సిమెంటు ఫ్యాక్టరీలో ఈఎస్ఐసీ అధికారులచే ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సురెన్స్ కార్పొరేషన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఈఎస్ఐసీ స్టేట్ రీజనల్ డైరెక్టర్ దాస్, స్టేట్ మెడికల్ కమీషనర్ ఎస్కే పాల్, హసీన్, ఈఎస్ఐసీ ఏరియా మేనేజర్‌ల ఆధ్వర్యంలో ఈ అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఇందులో తాడిపత్రి పరిసర ప్రాంతంలోని సిమెంటు, స్టీల్ పరిశ్రమలకు 2017 మార్చి నుంచి ఈఎస్ఐసీ పరిధిలోకి వచ్చాయన్నారు. దీనిపై పరిశ్రమల యజమానులకు, సిబ్బందికి ఈఎస్ఐసీ వల్ల ఉపయోగాల గురించి తెలియచేయడానికి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వారన్నారు.

29 నుంచి రుణాలకు ఇంటర్వ్యూలు

తాడిపత్రిరూరల్ : ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు, వికలాంగులకు రుణాల మంజూరు కోసం ఈనెల 29నుంచి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ చలపతి తెలిపారు. 29న చిన్నపొలమడ, పెద్దపొలమడ, కోమలి, రావివెంకటాంపల్లి, తేరన్నపల్లి, యర్రగుంటపల్లి, దిగువపల్లి, చుక్కలూరు, గంగాదేవిపల్లి, ఇగుడూరు, సజ్జలదిన్నె, వెంకటరెడ్డిపల్లి, కావేటిసముద్రం, భోగసముద్రం, ఊరుచింతల, గన్నెవారిపల్లి, బ్రాహ్మణపల్లి, 30న చల్లవారిపల్లి, బొందలదిన్నె, వంగనూరు, కొండేపల్లి, హుసేనాపురం, వీరాపురం, ఆలూరు, వెలమకూరు, బోడాయిపల్లి గ్రామపంచాయతీలకు ఇంటర్వ్యూలు జరుగుతాయని తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు జరుగుతాయని, అభ్యర్థులు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, మీసేవా కేంద్రం నందు పొందిన కులధృవీకరణపత్రం, ఆదాయ ధృవీకరణపత్రాలతో హాజరుకావాలని తెలిపారు. ఎస్సీలకు 74యూనిట్లు, బీసీలకు 80, కాపులకు 80, మైనార్టీలకు 13, ఎస్సీటలకు 9యూనిట్లు మంజూరయ్యాయని తెలిపారు.

పనులను పరిశీలించిన ఈఈ

యల్లనూరు : మండలంలో జరుగుతున్న ఎత్తిపోతల పథకం పనులను బుధవారం గాలేరు నగరి పథకం ఈఈ రవీంద్రారెడ్డి పరిశీలించారు. యల్లనూరు, గడ్డంవారిపల్లి చెరువులను ఆయన పరిశీలించారు. యల్లనూరు వద్ద జరుగుతున్న రాతి, డ్రైన్‌క్రాస్, కోడిముర్తి వద్ద లైనింగ్ పనులను పరిశీలించారు. సిమెంటు పనుల్లో నాణ్యమైన కంకరను వాడాలని కాంట్రాక్టర్లకు సూచించారు. ఈయనవెంట డీఈలు ఆనంద్, చిన్నక్రిష్ణయ్య, జేఈలు శ్రీనివాసులు, మదన్ ఉన్నారు.

ఇంటిపట్టాలు సిద్ధంగా ఉంచుకోండి

యల్లనూరు : మండలంలో ఎన్టీఆర్ గృహాలు మంజూరైన లబ్ధిదారులు ఇళ్లపట్టాలను సిద్ధంగా ఉంచుకోవాలని హౌసింగ్ ఏఈ రాజశేఖర్‌రెడ్డి సూచించారు. రెండో విడతలో మంజూరైన వారు ఆయా గ్రామాల్లోని వీఆర్వోల వద్దకు ఆధార్‌కార్డు, రేషన్ కార్డులతో పాటు ఫొటోలు, బ్యాంకు అకౌంటు పుస్తకం తీసుకు వెళ్లాలని సూచించారు.

ఘనంగా టంగుటూరి జయంతి

పుట్లూరు : ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని బుధవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ పుల్లన్నతో పాటు పలువురు నాయకులు, అధికారులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రకాశం పంతులు రాష్ట్రానికి చేసిన సేవలను కొనియాడారు. ప్రతిఒక్కరూ ఆయన్ను స్ఫూర్తిగా తీసుకోవాలని తెలిపారు.

శింగనమలలో : టంగుటూరి ప్రకాశంపంతులు 146వ జయంతిని ఘనంగా నిర్వహించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళలర్పించారు. కార్యక్రమంలో ఉమాదేవి, మల్లికార్జున, రవి, అనీల్‌కుమార్, బాలముని, బాలన్న, సాదిక్, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



టంగుటూరికి నివాళులర్పిస్తున్న ఉద్యోగులు

విద్యార్థులకు రక్త పరీక్షలు

తాడిపత్రిరూరల్ : మండలంలోని వంగనూరు ఎంపీపీ పాఠశాలలో బుధవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో 18 మంది విద్యార్థులకు రక్తపరీక్షలు నిర్వహించినట్లు అధ్యక్షుడు హరినాథరెడ్డి తెలిపారు. పాఠశాలలో విద్యార్థులకు రక్తహీనత ఉండడం వల్ల పరీక్షలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. అనంతరం విద్యార్థులకు నోటుపుస్తకాలు, అట్టలు, పలకలు, పెన్ను బాక్సులు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో సెక్రెటరీ మైనుద్దీన్, కోశాధికారి బాషాజాన్, సభ్యులు నాగేశ్వరరెడ్డి, కిశోర్, గడ్డం జ్యోతి, శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు గోమతి, లక్ష్మీకర్‌రెడ్డి పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

ఉచిత దంత వైద్యశిబిరం



దంత పరీక్షలు చేస్తున్న వైద్యులు

యాడికి : స్థానిక మండల పరిషత్ సమావేశపు హాలులో బుధవారం ఆర్డీటీ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్యశిబిరం నిర్వహించారు. 200 మందికి స్పెయిన్ నుంచి వచ్చిన వైద్యులు ఉచితంగా దంత పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రంగయ్య, ఆర్డీటీ ఏటీయల్ రఘురాముడు, సీఓ ఆదినారాయణ పాల్గొన్నారు.

గ్యాస్ నిక్షేపాల కోసం అన్వేషణ

పెద్దవడుగూరు : మండలంలోని చిత్రచేడు, రాంపురం గ్రామాల్లో ఓన్‌జీసీ బృందం సభ్యులు గ్యాస్ నిక్షేపాల కోసం అన్వేషించారు. రాంపురం గ్రామ రైతుల పొలాల్లో సాంకేతిక పనిముట్ల సహాయంతో నిక్షేపాలు గుర్తించేందుకు పనులు చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు గ్యాస్ నిక్షేపాలను గుర్తించేందుకు ఈ చర్యలు చేపట్టినట్లు తహసీల్దార్ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

తాడిపత్రిటౌన్ : పట్టణంలోని శ్రీకృష్ణ వృద్ధాశ్రమంలో బుధవారం వృద్ధులకు అన్నదానం జరిగినట్లు ఆశ్రమ నిర్వాహకుడు రాజశేఖర్ తెలిపారు. స్థానిక అపార్ట్‌మెంట్స్‌లో ఉన్న మద్దన ఈశ్వరమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె కుమారుడు, కోడలు విశ్వనాథ్‌రెడ్డి, వాణిలు వృద్ధులకు అన్నదానం నిర్వహించారన్నారు.

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత



మెటీరియల్‌ను పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయుడు

పెద్దవడుగూరు : మండలంలోని లక్షుంపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు అదే పాఠశాలకు చెందిన చంద్రమౌళి అనే జీవశాస్త్ర ఉపాధ్యాయుడు స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా పంపిణీ చేశారు. విద్యార్థుల మేధస్సును పెంపొందించేందుకు ఆయనే స్టడీ మెటీరియల్‌ను తయారుచేసి మొత్తం 45మంది విద్యార్థులకు అందచేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మదుసూదన్‌రెడ్డి తెలిపారు.

విద్యార్థులకు యూనిఫాం పంపిణీ

యాడికి : స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం 6, 7, 8తరగతుల విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తున్న యూనిఫాంలను సద్వినియోగం చేసుకోవాలని ప్రధానోపాధ్యాయురాలు విజయమ్మ సూచించారు. గైర్హాజరయిన విద్యార్థులకు మరోసారి అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ నిర్మల, ఉపాధ్యాయురాళ్లు లక్ష్మీదేవి, మాధవి, కళ్యాణిదేవి పాల్గొన్నారు.



యూనిఫాంలు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

నెలాఖరు లోపు అన్ని పన్నులు చెల్లించాలి

తాడిపత్రిటౌన్ : 2017-18 సంవత్సరానికి సంబంధించి బకాయి ఉన్న ఇంటి పన్నులు, నీటి పన్నులు, ఇతర పన్నులను నెలాఖరు లోపు చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ శివరామక్రిష్ణ సూచించారు. చెల్లించని పక్షంలో మున్సిపల్ చట్టాన్ని అనుసరించి కొళాయి కనెక్షన్ తొలగిస్తామన్నారు. పన్నులను మున్సిపల్ కార్యాలయం కౌంటర్, ఈసేవా కేంద్రాలు, వార్డులకు చెందిన బిల్‌కలెక్టర్ల వద్ద చెల్లించాలని తెలిపారు.

మహిళా డాక్టర్ నియామకం

పెద్దవడుగూరు : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నూతనంగా మహిళా డాక్టర్ ప్రసన్న నియమాకమైనట్లు డాక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. గత నెలరోజుల క్రితం డాక్టర్ ఖుష్బూ నియమితులు అయిన తర్వాత లీవ్‌పై వెళ్లిపోవడంతో ఈమె నియామకమైనట్లు తెలిపారు. ప్రస్తుతం నియామకమైన మహిళా డాక్టర్ మహిళలకు అందుబాటులో ఉంటుందా, మరో ప్రాంతానికి బదిలీపై వెళుతుందా అని ప్రజలు చర్చించుకుంటున్నారు.



డాక్టర్ ప్రసన్న

టీడీపీ సీనియర్ నాయకున్ని కలసిన మంత్రి



నారాయణరెడ్డితో మాట్లాడుతున్న మంత్రి కాలవ శ్రీనివాసులు

తాడిపత్రి: మండలంలోని యర్రగుంటపల్లి గ్రామంలో టీడీపీ సీనియర్ నాయకుడు సింహం నారాయణరెడ్డిని బుధవారం రాత్రి మంత్రి కాల్వశ్రీనివాసులు కలిశారు. నంద్యాల ఉప ఎన్నికలను ముగించుకొని అనంతపురానికి వెళుతూ మార్గమధ్యలోని యర్రగుంటపల్లి గ్రామానికి వెళ్లారు. ఈ సందర్భంగా సింహం నారాయణరెడ్డితో సమావేశమై అల్పాహారం తీసుకొన్నారు. మంత్రి వెంట మునిసిపల్ వైస్ చైర్మెన్ జిలాన్‌బాషా, సూర్యముని, సర్పంచు చింబిలి వెంకటరమణ, జగన్నాత్‌రెడ్డి, డీవీ కుమార్ ఉన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

తాడిపత్రిరూరల్: మండలంలోని తలారిచెరువు గ్రామ కొండల్లో బుధవారం పేకాట ఆడుతున్న 12మందిని అరెస్ట్‌చేసినట్లు ఎస్ఐ రామక్రిష్ణారెడ్డి తెలిపారు. అందిన సమాచారం మేరకు దాడులు జరిపి వారినుంచి రూ.17వేలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

'కార్యకర్తలకు అండగా ఉంటా'



సమావేశంలో మాట్లాడుతున్న పెద్దారెడ్డి

తాడిపత్రిరూరల్: కార్యకర్తలకు అన్ని విధాలా అండగా వుంటానని వైసీపీ సమన్వయకర్త పెద్దారెడ్డి అన్నారు. పట్టణసమీపంలోని రఘుపంక్షన్ హాల్లో బుధవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తాడిపత్రి నియోజకవర్గంలో ప్రతికార్యకర్త సమస్యలను తన దృష్టికి తీసుకురావాలన్నారు. పట్టణ, గ్రామాల్లో వైసీపీ అభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలన్నారు. ప్రజావ్యతిరేకతను ప్రజల్లోకి తీసుకువెళ్ళాలని తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందన్నారు. ప్రభుత్వ నిధులు అధికారపార్టీ నాయకుల జేబులు నింపుతున్నాయని ఆరోపించారు. వైసీపీ చేపట్టిన నవరత్నాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించాలన్నారు. సమావేశంలో పట్టణ అద్యక్షుడు కంచం రామ్మోహన్‌రెడ్డి, మండల కన్వీనర్‌లు బొంబాయి రమేష్, సూర్యనారాయణరెడ్డి, రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

నేడు గూళ్యపాళ్యం, వజ్రకరూరులో గ్రామసభ

వజ్రకరూరు: మండలంలోని గూళ్యపాళ్యం, వజ్రకరూరు మండలాల్లో రైతు సేవలో రెవెన్యూశాఖ గ్రామసభను నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు ఆదిలింగయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 2 గంటల వరకు గూళ్యపాళ్యం గ్రామంలో, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం వరకు వజ్రకరూరులో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

టంగుటూరి ఆశయ సాధనకు కృషి : జేసీ


టంగుటూరి చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న జేసీ


ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ఎంపీపీ సుంకురత్నమ్మ


ప్రకాశం చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న సర్పంచ్ సుజాత

ఉరవకొండ: టంగుటూరి ప్రకాశం పంతులు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ రమామణి పిలుపునిచ్చారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో బుధవారం జరిగిన టంగుటూరి జయంతి వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆర్డీఓ మలోల, తహసీల్దారు అనిల్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

అలాగే ఎంపీడీఓ, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరు ప్రకాశం పంతులు జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ సుంకురత్నమ్మ, ఎంపీడీఓ శివకుమార్ టంగుటూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళర్పించారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచు సర్రా సుజాత ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు చంద్రశేఖర్, కో-ఆప్షన్‌సభ్యుడు ఆసిఫ్, టీడీపీ నాయకులు నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్ట్స్ కళాశాల తెలుగు వి భాగం అధ్యాపకుడు శ్రీధర్‌నాయుడు హాజర య్యారు. యువత టంగుటూరి అడుగు జాడల్లో విద్యార్థులంతా నడవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామచంద్రమూర్తి, అధ్యాపకులు పరమేశ్, కోదండరాముడు, రాధిక పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలే ముద్దు

బెళుగుప్ప : వాతావరణం కాలుష్యం కాకుండా పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలే ముద్దు అంటూ బెళుగుప్పలోని సన్‌రైజర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు విగ్రహాలను తయారు చేశారు. పాఠశాల ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రతియేటా 500విగ్రహాలను మట్టితో తయారు చేసి ప్రజలకు ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. గత ఐదేళ్ల నుంచి ఈ కార్యక్రమం జరుగుతోంది. మట్టి విగ్రహాలతో పాటు ఓ మొక్కను కూడా ఉచితంగా అందిస్తున్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలతో వాతావరణ కాలుష్యంతో పాటు జలాశయంలోని జీవరాశుల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందన్నారు. దీంతో పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలను తయారు చేసి ఉచితంగా పంపిణీ చేస్తున్నామని పాఠశాల కరస్పాండెంట్ మారెన్న తెలిపారు. ఇకనైనా మట్టి విగ్రహాలతో వినాయక ఉత్సవాలను నిర్వహించాలంటూ కోరారు.


మట్టితో విగ్రహాలను తయారు చేస్తున్న సన్‌రైజర్ పాఠశాల విద్యార్థులు

పంపిణీకి భూములను పరిశీలించిన జేసీ

విడపనకల్లు: మండలంలోని ఎస్సీలకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా పంపిణీ చేయనున్న భూములను జాయింట్ కలెక్టర్ రమామణి, ఆర్డీఓ మలోల, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ విజయ నాయక్ బుధవారం పరిశీలించారు. ముందుగా మాళాపురం, వీ కొత్తకోట, హావళిగి, విడపనకల్లు గ్రామాల్లో ఎస్సీలకు పంపిణీ చేసే భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీలకు భూములను కొని పంపిణీ చేసేందుకు రూ. 27 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఇందులో భాగంగానే మండలంలోని 216 మంది రైతులకు 334 ఎకరాలను ఎస్సీ కార్పొరేషన్ ద్వారా కొనుగోలు చేస్తున్నామన్నారు. ఈ భూ పంపిణీలో ప్రభుత్వం 75 శాతం ఇవ్వగా 25 శాతం లబ్ధిదారుడు చెల్లించాల్సి ఉంటుందన్నారు. లబ్ధిదారులు ప్రస్తుతం 25 శాతం ఎవ్వరూ చెల్లించాల్సిన అవసరం లేదని, వంద శాతం ప్రభుత్వమే పెట్టుబడి పెట్టి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా కొనుగోలు చేసి పంపిణీ చేస్తుందన్నారు. పంపిణీ అనంతరం 25 శాతాన్ని వాయిదాల ద్వారా చెల్లించాల్సి ఉంటుందన్నారు. త్వరలో భూములను పంపిణీ చేసేందుకు రికార్డులను సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ భూముల్లో బోర్లను వేయించి విద్యుత్ సౌకర్యం కల్పించి పంటలు పండించుకునే ఏర్పాట్లు చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు హనుమంతు, మాజీ సర్పంచు రామాంజినేయులు, రాజు, వెంకటస్వామి, టీ రామాంజినేయులు, జయరాములు, వీఆర్వోలు పాల్గొన్నారు.


భూములను పరిశీలిస్తున్న జేసీ రమామణి

వీఆర్వోలపై చర్యలు తీసుకోవాలి

హావళిగి వీఆర్వోలు పాసు పుస్తకాలకు సంబంధించి ఏ చిన్న పని చేయాలన్న వేలాది రూపాయాలను డి మాండ్ చేస్తున్నారని వీరిపై చర్యలు తీసుకోవాలని దండోరా నాయకులు జేసీని కోరారు.

దేవాలయ భూముల్లో గుంతల తవ్వకాన్ని ఆపించండి

గడేకల్లు గ్రామంలోని భీమలింగేశ్వరస్వామి దేవాలయ భూముల్లో కొంత మంది పక్క రైతులు నీటి నిల్వల కోసం జేసీబీలతో గుంతలు తవ్విస్తున్నారని వాటిని వెంటనే ఆపించాలని ఆలయ అర్చకులు జేసీ రమామణికి వినతి పత్రాన్ని అందజేశారు. దేవాలయ భూములు రెవెన్యూ రికార్డుల్లో ఉంటే ఆ భూముల్లో తవ్వుతున్న గుంతలను వెంటనే ఆపివేసేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దారు శంకరయ్యను జేసీ ఆదేశించారు.

నష్ట పరిహారం ఇప్పించాలంటూ వినతి

67వ జాతీయ రహదారికి ఇళ్ల స్థలాలు, ఇళ్లను కోల్పోయిన వారికి నష్ట పరిహారం అందలేదని, నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని జేసీని కోరారు. రైతులకు రికార్డుల పరంగా అన్ని హక్కులు ఉంటే వారి ఖాతాల్లోకి నష్టపరిహారం జమ చేయించాలని తహసీల్దారును జేసీ ఆదేశించారు.

28న రుణమేళా

ఉరవకొండ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 28వ తేదీన వివిధ కార్పొరేషన్‌లకు సంబంధించి రుణమేళానిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శంకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1,323 మంది అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారన్నారు. మండలానికి 274 యూనిట్లు మంజూరయ్యాయన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు, అభ్యర్థులు ఇంటర్వ్యూలు హాజరు కావాలన్నారు. కులం, రేషన్, ఆధార్, స్టడీ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

బెళుగుప్ప: మండలంలోని శీర్పి గ్రామానికి చెందిన ఆరుగురు పేకాట రాయుళ్లను బుధవారం అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ నాగస్వామి తెలిపారు. గ్రామ శివార్లలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించామన్నారు. వారి నుంచి రూ. 4,850 లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

కరెంట్ తీగ తెగి పడి యువకుడికి తీవ్ర గాయాలు

కూడేరు: మండలంలోని పి నాగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన లింగరాజు అనే యువకుడిపై బుధవారం రాత్రి కరెంట్ తీగ తెగి పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్తుండగా గ్రామ నడిబొడ్డున విద్యుత్ తీగ తెగి లింగరాజుపై పడింది. ఆ సమయంలో విద్యుత్ సరఫరా అవుతుండటంతో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడిని 108లో అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి

కూడేరు: గ్రామాల్లో వినాయక విగ్రహాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్‌ఐ రాజు తెలిపాడు. ఎక్కడైనా అనుమతులు లేకుండా విగ్రహాలు ఏర్పాటు చేసి, గొడవలు జరిగితే కఠిన చర్యలు తప్పవన్నారు.

సర్వర్‌డౌన్‌తో విత్తన పంపిణీకి ఆటంకం

కూడేరు: అంతర పంటలు సాగుచేయడానికి అవసరమైన విత్తనాల పంపిణీకి సర్వర్ సమస్య తలెత్తింది. బుధవారం మండలంలోని గొట్కూరు, బ్రాహ్మణపల్లి గ్రామాల రైతులకు ఉచితంగా ఉలవలు, పెసలు, అలసందలు పంపిణీ చేస్తామని అధికారులు ప్రకటించారు. అయితే సర్వర్ సమస్యల తలెత్తడంతో రైతులు నిరాశగా వెనుతిరిగారు. ఇద్దరికి మాత్రమే పంపిణీ చేశారు.

గర్భిణులకు సామూహిక సీమంతాలు

విడపనకల్లు: మండల కేంద్రంలోని 3, 6, 8వ అంగన్‌వాడీ కేంద్రాల్లో సామూహిక సీమంతాలు, అన్నప్రాసన కార్యక్రమాలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ శ్రీదేవి మాట్లాడుతూ గర్భవతులు తగిన జాగ్రత్తలు పా టించాలన్నారు. పౌష్టికాహారాన్ని తీసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. చిన్న పి ల్లలకు అన్నప్రాసన కార్యక్రమంలో పౌ ష్ఠికాహారాన్ని అందించి వారి ఆరోగ్యాన్ని కాపాడేందుకు తల్లులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

కష్టపడితేనే విజయం

ఉరవకొండ: కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చునని మహాత్మా కళాశాలల కరస్పాండెంట్ గౌస్ మొహిద్దీన్ పేర్కొన్నారు. స్థానిక మహాత్మా జూనియర్ కళాశాలలో బుధవారం ఫ్రెషర్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమ శిక్షణతో కూడిన విద్య ఎంతో అవసరమన్నారు. సీనియర్స్, జూనియర్స్ విద్యార్థులు స్నేహపూర్వకంగా కలిసి ఉండాలన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆ కళాశాల గౌరవ సలహాదారుడు షావలి, ప్రిన్సిపాల్ ప్రసాద్, జయప్రకాశ్, బసవరాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

అనుమతులు లేని స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి

ఉరవకొండ: అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని వైఎస్ఆర్ఎస్‌యూ విద్యార్థి సంఘాల నాయకుడు జిలాన్ డిమాండ్ చేశారు. ఒకే రిజిస్ట్రేషన్ పేరుతో రెండు పాఠశాలలను అక్రమంగా నిర్వహిస్తున్నారని జిలాన్ విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఎంఈఓ చౌడేశ్వరి కాలనీలోని ఆ పాఠశాలలను సందర్శించి వెంటనే మూసివేయాలని కరస్పాండెంట్‌ను ఆదేశించారు.

దోమ తెరలు వాడాలి

కూడేరు: రాత్రి సమయంలో దోమతెరలు ఖచ్చితంగా వాడాలని సూపర్‌వైజర్ నాగేంద్ర ప్రసాద్ ప్రజలకు తెలిపారు. బుధవారం మండలంలోని కొర్రకోడు గ్రామంలో వైద్య సేవలు కొనసాగాయి. డెంగీ లక్షణాలతో ఆసుపత్రిపాలైన గణేష్ అనే యువకుడితోపాటు విషజ్వరాల బారిన పడ్డ రోగుల ఇళ్లవద్దకు వెళ్లి చుట్టుపక్కల పరిశీలించి శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వీధుల్లో మురుగు నీటి నిల్లలపై ఆయిల్ బాల్స్ వేశారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. సూపర్‌వైజర్ శాంతమ్మ, గ్రామ కార్యదర్శి శివరాజుని, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.